
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 344

గురువారం 6-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బుల్.. బౌన్స్‌బ్యాక్!

సెన్సెక్స్ 740 పాయింట్లు అప్..
నిఫ్టీ 255 పాయింట్ల హైజంప్.. -17లో



దుబాయ్‌కి న్యూజిలాండ్

రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై గెలుపు.
9న భారత్‌తో కివీస్ ఫైనల్ పోరు -16లో



ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు

భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడం ఎంతోదూరంలో లేదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

- వివరాలు 6లో▶



ఏ యుద్ధానికైనా మేం సిద్ధం

'అమెరికా కోరుకునేది యుద్ధమే అయితే, ఎలాంటి యుద్ధమైనా మేం తుది వరకు పోరాడేందుకు సిద్ధం' అని చైనా పేర్కొంది.

- వివరాలు 6లో▶



ఐఏఎస్‌లది ఆధిపత్య ధోరణి

ఐఏఎస్‌లు ఎప్పుడూ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తారని సుప్రీం జడ్జి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు.

- వివరాలు 6లో▶



లోక్‌సభ సీట్లపై కేంద్రం కుట్ర

జనాభా ప్రాతిపదికన దక్షిణాది లోక్‌సభ స్థానాలను తగ్గించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు.

- వివరాలు 6లో▶



పొలం ఎండి.. గుండె మండి

వరి పంటంతా పశువుల పాలు..

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం గ్రామానికి చెందిన రైతు గుండె మైసాలు ఎకరం వేరుశనగ, మరో ఎకరం వరిసాగు చేశారు. ఆరు తడి పంట కావడంతో వేరుశనగ చేతికి వచ్చింది. కానీ బావిలో నీళ్లు అడుగంటి సాగునీరు లేక వరి ఎండిపోయింది. దీనితో దిక్కుతోచని మైసాలు.. పొలాన్ని వదిలేయగా బుధవారం పశువులు, గొర్రెల మందలు మేస్తున్నాయి. పంట పెట్టుబడి, రెక్కల కష్టం అంతా వృథా అయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. - మరిపెడ రూరల్

సాగునీరు లేక పశువులకు మేతగా పంటలను వదిలేస్తున్న రైతన్నలు

- గోదావరి ప్రాజెక్టుల పరిధిలో సాగునీటికి తీవ్ర సమస్య
- కాళేశ్వరం నుంచి మిడ్‌మానేరు వరకు కనిపించని నీటి జాడ.... ఎల్లంపల్లి జలాలు హైదరాబాద్ తాగునీటికే సరిపోని పరిస్థితి
- ఎస్సారెస్పీ, లోయర్ మానేరు నీటితో కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కొంతమేర మాత్రమే సరఫరా
- ఎండిపోతున్న సూర్యాపేట.. దేవాదుల నీరు రాక జనగాంలో కరువు పరిస్థితి
- కృష్ణా ప్రాజెక్టుల పరిధిలోనూ నీటి కష్టాలు
- నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు.. ఆదుకోవాలంటూ అన్నదాతల వేడుకోలు

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: రాష్ట్రంలో పంటలకు కష్టకాలం వచ్చింది. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. యాసంగిలో సాగుచేసిన వరి, మొక్కజొన్న తదితర పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. గోదావరి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల విషయంలో అధికార యంత్రాంగంలో అయోమయం నెలకొంటే... కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో పంటలకు సరిపడా నీళ్లు లేక బిక్కమొహం వేసే పరిస్థితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే వానలు మెరుగ్గానే ఉన్నా, పలు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలున్నా కూడా పంటలకు అందడం లేదు. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతుండటంతో పశువుల మేత కోసం వదిలేస్తున్న దుస్థితి కనిపిస్తోంది.

కాళేశ్వరం ఎత్తిపోతలు నిలిచిపోవడంతో..

గోదావరి నదిపై ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలను నిలిపివేయడంతో.. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీళ్లు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి. దీనితో మిడ్‌మానేరులో ఉన్న నీటిని అవసరానికి అనుగుణంగా లోయర్ మానేర్, మల్లన్నసాగర్‌కు వదులుతున్నారు. మల్లన్నసాగర్‌లోని నిల్వలు మరో 20 రోజులకు మించి సాగునీటి అవసరాలు తీర్చలేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని చెరువుల్లో నిల్వ ఉన్న నీళ్లు కూడా కనీసం మిగతా 5వ పేజీలో ▶

బీజేపీకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి విజయ సంకేతం చూపుతున్న అంజిరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిపై గెలిచిన అంజిరెడ్డి

- రెండో ప్రాధాన్యతతో కలిపి అంజిరెడ్డికి వచ్చిన ఓట్లు 98,637
- కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి వచ్చిన ఓట్లు 93,531...
- మూడో ప్రాధాన్యత ఓట్లు లెక్కించాలంటూ నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి
- ఈసీని సంప్రదించి 5,106 ఓట్ల మెజార్టీతో బీజేపీ గెలిచినట్టు ప్రకటించిన ఆర్వో

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. నువ్వా..నేనా అన్నట్టుగా మూడురోజులపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ముక్కోణపు పోరులో చివరకు బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి అత్యధిక ఓట్లతో విజయం సాధించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి కౌంటింగ్ నిర్విరామంగా కొనసాగింది. ఉదయం 8.30 గంటలకల్లా.. మొదటి ప్రాధాన్యత ఓట్లకు సంబంధించిన 11 రౌండ్లు పూర్తయ్యాయి. మొత్తంవ్యాలిడ్ ఓట్లు 2,23,343 కాగా, అందులో 28,686 ఓట్లు చెల్లనివి ఉన్నాయి. అధికారులు 1,11,672 ఓట్లను గెలుపు కోటాగా నిర్ధారించారు.

మొదటి ప్రాధాన్యతలో 7 రౌండ్లు బీజేపీ... 4 రౌండ్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం

మొదటి ప్రాధాన్యత ఓట్లకు సంబంధించి కౌంటింగ్ జరిగిన 11 రౌండ్‌లలో మొదటి నుంచీ బీజేపీ ఆధిక్యం కనబర్చగా, మధ్యలో 6,7,8,9 రౌండ్‌లలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఆధిక్యం వచ్చింది. చివరి రెండు రౌండ్‌లలో తిరిగి బీజేపీ మెజారిటీ సాధించింది. మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు పూర్తయ్యాక బీజేపీ అభ్యర్థికి 75,675 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 70,565 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థికి 60,419 ఓట్లు వచ్చాయి. ఏ అభ్యర్థికీ గెలుపు టార్గెట్ కోటా అయిన 1,11,672 ఓట్లు రాలేదు. గెలుపు కోటాను చేరుకోవడానికి అంజిరెడ్డికి 35,997 ఓట్లు, నరేందర్‌రెడ్డికి 41,107 ఓట్లు, ప్రసన్న హరికృష్ణకు 51,253 ఓట్లు అవసరం అయ్యాయి. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిపై బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి కేవలం 5,110 ఓట్ల ఆధిక్యం సాధించారు. గెలుపు కోటాకు కావాల్సిన ఓట్లకు ఎవరూ చేరుకోకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల కోసం తక్కువ ఓట్లు వచ్చిన మిగతా 12వ పేజీలో ▶

- వైద్యరంగ రథసారథులు

నిర్వహణలోనూ రాణిస్తాం!



వైద్యశాస్త్రం చదివి మహిళా వైద్యులుగా పేరుపొందినవాళ్లు చాలామందే ఉన్నారు. కానీ హాస్పిటల్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్లుగా, ఆరోగ్యరంగ సారథులుగా ఉంటూ సారథ్యం వహిస్తున్న వారు కాస్త తక్కువే. కానీ ఇప్పుడు వారి సంఖ్యా పెరుగుతోంది. ఇలా వైస్ ప్రెసిడెంట్లుగా, సీవోవోలుగా, కీలకమైన స్థానాల్లో ఉండి రాష్ట్రానికీ, హాస్పిటళ్లకూ దిశానిర్దేశం చేస్తున్న మహిళా వైద్యులపై ప్రత్యేక కథనం. 15లో

కృష్ణమ్మను చేరిన గోదారి



సీతారామ ప్రాజెక్టులోని మూడు పంపు హౌస్‌ల నుంచి 100 కి.మీ. మేర ప్రయాణించిన గోదావరి జలాలు బుధవారం రాత్రి ఏన్కూరు మండలం అక్కినాపురం తండా 52వ కి.మీ. వద్ద ఎన్ఎస్‌పీ కాల్వకు చేరాయి. ఈ సందర్భంగా జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి.. పుష్పాభిషేకం చేశారు. 5లో

రాసిన పరీక్ష గురించి అతిగా ఆలోచించొద్దు

ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. అయితే తొలిరోజు పరీక్ష అనుభవం మిగతా పరీక్షలకు మార్గదర్శకంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పరీక్ష ఎలా రాశాం? సన్నద్ధత సరిపోయిందా? అనేది ఒక్కసారి పైపైన సరి చూసుకోవాలే గానీ..దాని గురించి పెద్దగా ఆలోచించకూడదని స్పష్టం చేస్తున్నారు. ప్రతి ప్రశ్న లోతుల్లోకి వెళ్లొద్దని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. 3లో

అమెరికాలో కాల్పులు.. కేశంపేట యువకుడి మృతి

- వివరాలు 5లో

మహిళా సాధికారతకు డ్రోన్ల దన్ను



ఎస్‌హెచ్‌జీలకు సబ్సిడీపై అందజేతకు ప్రణాళికలు

- సంఘాల ద్వారా రైతులకు సహాయ సహకారాలు
- ఎరువులు, పురుగు మందులు చల్లించేందుకు వినియోగించే యోచన
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రతిపాదనలు
- ప్రయోగాత్మకంగా ఒక్కో మండలంలో ఒక్కో గ్రూపు ఎంపిక
- ఒక్కో డ్రోన్‌కు రూ.10 లక్షల వ్యయం.. ఇందులో రూ.8 లక్షలు సబ్సిడీ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇప్పటికే వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వాలు..తాజాగా డ్రోన్ల ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని నిర్ణయించాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో స్వయం సహాయక సంఘాలను (ఎస్‌హెచ్‌జీ) ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా..వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగంలో వీరికి అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. వ్యవసాయ రంగానికి, రైతులకు మిగతా 5వ పేజీలో ▶



అమెరికా ఈజ్ బ్యాక్

కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్

- 'అమెరికా స్వర్ణయుగం' ఇప్పుడే మొదలైంది
- మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించే దేశాలను వదిలిపెట్టం... వచ్చే నెల 2 నుంచి ఆయా దేశాలపై టారిఫ్‌ల మోత తప్పదు
- 100 నిమిషాలపాటు ప్రసంగించి రికార్డు

6లో

ఇదండీ జగత్



- బాబు 'ష్యూరిటీ'.. 'మోసం' గ్యారంటీ

సూపర్ 6కు గుండు సున్నా

చంద్రబాబు సర్కారు మోసాలు, బడ్జెట్ కేటాయింపులపై వైఎస్ జగన్ ధ్వజం

రెండు బడ్జెట్లు పెట్టినా హామీలను ఒక్కటైనా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నావా?



- నిరుద్యోగులకు ఏడాదికి రూ.36 వేల చొప్పున భృతి.. ఆడబిడ్డ నిధి కింద ఏడాదికి రూ.18 వేలు చొప్పున.. ఉచిత బస్సు హామీలను పూర్తిగా ఎగ్గొట్టావ్
- తల్లికి వందనం.. అన్నదాత సుఖీభవ.. దీపం పథకాలకు కోతలు.. అరకొర కేటాయింపులే
- సూపర్ సిక్స్ హామీలకు ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరం.. బడ్జెట్‌లో ఇచ్చింది రూ.17,179 కోట్లే
- "వైఎస్సార్‌సీపీ వాళ్లకు ఏ పథకాలూ ఇవ్వొద్దు.. ఏ పనులూ చేయొద్దు..'' అని ఎలా చెబుతారు? ఇలాంటి వ్యక్తిని సీఎం స్థానంలో కొనసాగించడం ధర్మమేనా?
- బాబు వ్యాఖ్యలపై గవర్నర్, జడ్జీలు ఆలోచించాలి


13లో


A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
NEW PACK
PAN BAHAR PRODUCTS (P) LTD.
PAN BAHAR
THE HERITAGE ELAICHI
PAN BAHAR
THE HERITAGE ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

రాసిన పరీక్ష గురించి అతిగా ఆలోచించొద్దు

రాయబోయే పరీక్షపైనే దృష్టి పెట్టాలి

- ప్రతి ప్రశ్నను సమీక్షించుకుంటే సున్నిత కణజాలంపై ఒత్తిడి
- లండన్‌కు చెందిన మానసిక శాస్త్రవేత్తల పరిశోధన వెల్లడి
- మంచి మార్కులు వస్తాయనుకున్న ప్రశ్నలను మననం చేసుకుంటే మేలు
- సానుకూల దృక్పథంతో సన్నద్ధత ముఖ్యం
- పరీక్షలు పూర్తయ్యే వరకు ఇదే కొనసాగించాలి



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం తొలిరోజు పరీక్ష ముగిసింది. సెకండియర్ ఇంటర్ విద్యార్థులకు గురువారం తొలి పరీక్ష ముగుస్తుంది. మధ్యలో విరామం తర్వాత తదుపరి పరీక్షలు కొనసాగుతాయి. అయితే తొలిరోజు పరీక్ష అనుభవం మిగతా పరీక్షలకు మార్గదర్శకంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే పరీక్ష ఎలా రాశాం? సన్నద్ధత సరిపోయిందా? అనేది ఒక్కసారి పైపైన సరి చూసుకోవాలే గానీ..దాని గురించి పెద్దగా ఆలోచించ కూడదని స్పష్టం చేస్తున్నారు. ప్రతి ప్రశ్న లోతుల్లోకి వెళ్లొద్దని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల మెదడులోకి జ్ఞాపక శక్తిని ప్రేరేపించే సున్నితమైన కణజాలం ఒత్తిడికి గురవుతుందని లండన్‌కు చెందిన మానసిక శాస్త్రవేత్తల పరిశోధన పేర్కొంటోంది. పరీక్షల సమయంలో ఒత్తిడి కల్గించే కణజాలంపై వారు ప్రత్యేక పరిశోధన చేశారు. ఈ పరిశోధనతో పాటు ప్రస్తుత కీలక సమయంలో విద్యార్థుల ప్రిపరేషన్ ఎలా ఉండాలి? ఎలాంటి మానసిక ధోరణిని అలవాటు చేసుకోవాలి? అనే అంశాలపై మరికొన్ని ఇతర పరిశోధనలు, నిపుణుల సూచనలు, అధ్యాపకుల అనుభవాలను 'సాక్షి' క్రోడీకరించింది.

పాజిటివ్ థింకింగ్ కొనసాగించాలి

రాసిన పరీక్ష ఎలా ఉన్నా చెయ్యగలిగిందేమీ లేదు. కాబట్టి విద్యార్థులు బాగా రాశాం అన్న పాజిటివ్ థింకింగ్‌తో ఉండాలి. ఇది పరీక్షలు పూర్తయ్యే వరకూ కొనసాగించాలి. రాసిన పరీక్షలో బాగా మార్కులు వస్తాయనుకున్న ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చూసుకోవాలని మానసిక వైద్య నిపుణులు సంధ్య తెలిపారు. ఇది మెదడులోని కణాలకు సానుకూల సంకేతాలను పంపుతుందని ఆమె చెప్పారు. మున్ముందు రాసే పరీక్ష స్వభావం తేలికగా ఉంటుందనే భావన విద్యార్థిని ఉత్తేజపరుస్తుందని లండన్ సైన్స్ కాలేజీ ప్రొఫెసర్ జాన్ ఉల్లేకర్ వివిధ పరిశోధనల పరిశీలన అనంతరం తెలిపారు. ముఖ్యంగా రాసిన పరీక్ష గురించి స్నేహితులతో పదేపదే సంభాషించకూడదు. దీనికి బదులు రాయబోయే పరీక్ష గురించి చర్చించుకోవడం మంచిది. అలాగే జరిగిన పరీక్షకు సంబంధించి అధ్యాపకుడితో ఎక్కువసేపు చర్చించే కన్నా.. జరగాల్సిన పరీక్షకు సంబంధించి సంభాషించడం వల్ల సానుకూల దృక్పథం పెరుగుతుందని ముంబైకి చెందిన మానసిక శాస్త్ర నిపుణులు నీలమ్ ద్వివేది ఇటీవల ఐఐటీ ముంబై విద్యార్థులను ఉద్దేశించి హితబోధ చేశారు.

నిన్నటి అంశాలను మరిచిపోవాలి

కొన్ని రంగులు కలిస్తే మరో కొత్త రంగు ఏర్పడుతుంది. అదే విధంగా గత పరీక్షకు సీరియస్‌గా అయిన ప్రిపరేషన్.. తర్వాత పరీక్షకు సన్నద్ధతలో జ్ఞప్తికి వస్తుంది. ఇలాంటి సందర్భంలో ప్రిపరేషన్‌కు కొన్ని నిమిషాలు విరామం ఇవ్వాలని, అప్పుడే మంచి సన్నద్ధత అలవడుతుందని ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థులపై పరిశోధన చేసిన శాస్త్రవేత్త అనిల్ పాండే తెలిపారు. రాసిన పరీక్షలో చివరి ప్రశ్నలు.. వాటి సమాధానాల తీరు మెదడులో నిక్షిప్తమై జ్ఞప్తికి వస్తుంటుంది. కాబట్టి తదుపరి పరీక్షకు పూర్తి వ్యతిరేక కోణంలో స్టడీ చేయాలని ఆయన సూచించారు. అంటే నిన్నటి పరీక్షకు చిన్నచిన్న ప్రశ్నలతో సన్నద్ధత మొదలుపెడితే.. రేపటి పరీక్షకు పెద్ద ప్రశ్నలతో ప్రిపరేషన్ మొదలు పెట్టాలి. రాయడం, వినడం, చదవడం, గ్రూప్ డిస్కషన్ లాంటివన్నీ ముందు రోజుకన్నా భిన్నంగా ఉండాలి. నిన్నటి అంశాలను పూర్తిగా మరిచిపోవడానికి కొంతసేపు రేపటి పరీక్ష సబ్జెక్టును, కాలేజీలో బోధకుడు చెప్పిన అంశాలతో పాటు సరదాగా సాగిన గతాన్ని చర్చించుకోవాలి. అప్పుడే ప్రిపరేషన్‌కు పూర్తి స్థాయి ప్రణాళికను అనుసరించే వీలుంటుందని కెనడాలో పరీక్షలపై జరిగిన పరిశోధన సారాంశం తెలియజేస్తోంది.

సందేహాలు నివృత్తి చేసుకోవాలి.. టెన్షన్ వద్దు

ఇంటర్‌లో రెండోరోజు రాసే పరీక్ష ఇంగ్లిష్. ఆర్టికల్స్, పాసివ్ వాయిస్, ప్యాసేజ్ క్వశ్చన్స్, మిస్సింగ్ లెటర్స్.. ఇలాంటివి బట్టీ పడితే రావు. వివిధ మార్గాల్లో ప్రిపేర్ అవ్వాలి. ఉదాహరణకు టెన్సెస్ (కాలాలు..భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు) గురించి ప్రిపేర్ అవ్వాలంటే అనేక సందేహాలొస్తాయి. వాటికి కచ్చితమైన సమాధానాలు పుస్తకాల్లో ఉండవు. ఇలాంటి సందర్భాల్లో మెదడును అధికంగా ఒత్తిడికి గురిచేయవద్దని నిపుణులు చెబుతున్నారు. ఏ టెన్స్‌ను ఏ సందర్భంలో ఉపయోగించాలనే సందేహం ఉంటే అధ్యాపకుడిని ఫోన్ ద్వారా సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ప్యాసేజ్, పొయిట్రీ విషయంలో చేసే ప్రిపరేషన్ సరైందనే భావనతో ఉండాలి. క్రాస్ చెక్ పేరుతో సమయం వృథా చేయకూడదు. అనవసర భయాన్ని మెదడులోకి తీసుకెళ్లొద్దు.

జస్ట్ ప్రాక్టీస్.. అంతే



ఇంటర్ ద్వితీయ పరీక్ష ఇంగ్లిష్. విద్యార్థులు తర్వాత రాసేది ఇదే. సాధారణంగా గ్రామర్ విషయంలోనే కొంత తికమక ఉంటుంది. మిస్సింగ్ లెటర్స్, ఆర్టికల్స్, ప్యాసేజీ వంటివి జడ్జి చేయడం ఇబ్బందే. అందువల్ల ఆఖరి నిమిషంలో కొంతమేర వీటిని ప్రాక్టీస్ చేస్తే సరిపోతుంది. గ్రామర్ పాయింట్స్‌కు పాఠ్య పుస్తకాలు ఫాలో అవ్వాలి. దీనివల్ల ఆఖరి నిమిషంలో కీలకమైన అంశాలు గుర్తించే వీలుంది. ఇది పాజిటివ్ మైండ్ సెట్‌కు దోహద పడుతుంది.

– దాసరి సైదులు (ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆంగ్ల అధ్యాపకుడు, అమ్రాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లా)

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు

ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. విధుల్లో ని ర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆశ వర్కర్ మొదలు.. బోధనాస్పత్రుల్లోని ప్రిన్సిపాళ్ల వరకు ప్రతి ఒక్కరూ సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. బుధవారం ఆయన ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన, అవయవదానం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అన్ని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో అటెండెన్స్ మానిటరింగ్‌పై మరింత శ్రద్ధ పెట్టాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను మంత్రి ఆదేశించారు. గాంధీ ఆస్పత్రిలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ పనులను త్వరగా పూర్తిచేయాలని, మెడికల్ కార్పొరేషన్ ఎండీ హేమంత్‌ను మంత్రి ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభం అయ్యేనాటికి నూతన మెడికల్ కాలేజీలు సిద్ధం కావాలని సూచించారు.

ప్రజాభవన్‌లో అతిథి గృహం ప్రారంభం నేడు

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్ ఆవరణలో ప్రభుత్వ అతిథి గృహాన్ని గురువారం రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారు. గతంలో సీఎంలు, మంత్రులు నివసిస్తున్న ఈ భవనాన్ని అతిథి గృహంగా ప్రభుత్వం మార్చింది. రాష్ట్ర పర్యటనకు వచ్చే ముఖ్య అతిథులకు ఇక్కడ బస ఏర్పాట్లు చేయనుంది.

క్లుప్తంగా...

ఆ ఫ్యాన్‌ను తొలగించారు

సాక్షి కథనానికి స్పందన



కారేపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో అసౌకర్యాలపై 'సాక్షి' ప్రధాన సంచికలో బుధవారం 'ఇబ్బందుల మధ్యే ఇంటర్ పరీక్షలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఖమ్మం జిల్లా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఓ గదిలో ఫ్యాన్ పాడై, రెక్కలు వంగిపోవడం, ఎప్పుడైనా విద్యార్థులపై పడే ప్రమాదముందని ఇందులో ప్రస్తావించగా అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం పరీక్ష ప్రారంభానికి ముందే సిబ్బందితో రెక్కలు వంగిపోయిన ఫ్యాన్‌ను తీయించారు. మరమ్మతు పూర్తయ్యాక తిరిగి బిగిస్తామని తెలిపారు.

ఫుట్‌వేర్ డిజైనింగ్‌లో కొత్త మెళకువలు

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫుట్‌వేర్ డిజైనింగ్‌లో ఆధునిక సాంకేతికత తీసుకొచ్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ ఎస్.తేజ్‌లోహిత్ రెడ్డి బుధవారం మండలి కార్యాలయంలో బాలకిష్టారెడ్డితో చర్చించారు. స్కూల్, కాలేజీ స్థాయిలో సరికొత్త డిజైన్ల తయారీకి తమ సంస్థ తోడ్పాటునిస్తోందని లోహిత్ రెడ్డి తెలిపారు. యువతకు మంచి ఉపాధి అవకాశాలు కల్పించే ఈ కోర్సులను విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలని ఉన్నత విద్యా మండలిని కోరారు.

మహా కుంభాభిషేకం నిర్వహణ భేష్

మంత్రి సురేఖకు.. సోనియా లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ప్రశంసించారు. ఈ మేరకు ఆమె సురేఖకు లేఖ రాశారు. ప్రత్యేక చొరవ తీసుకొని 42 ఏళ్ల తర్వాత మహా కుంభాభిషేకం నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. త్రివేణి సంగమం జలాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, ఆ పవిత్ర జలాలను, ప్రసాదాన్ని తనకు పంపించినందుకు కొండా సురేఖకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి స్థల విశిష్టతను తెలియజేసినందుకు అభినందించారు.

రేపు ఎస్‌ఆర్‌టీఆర్‌ఐలో జాబ్‌మేళా

భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్‌ఆర్‌టీఆర్‌ఐ)లో ఈనెల 7న బ్లూ ఓషన్, ఎస్‌ఆర్‌టీఆర్‌ఐ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీలకైతే హైదరాబాద్‌లోని ఆదిభట్ల, కొంగరకలాన్‌లోని ప్రముఖ మొబైల్ కంపెనీల్లో, పురుషులకు తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. పదో తరగతి, ఆపై చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన స్త్రీ, పురుషులకు రూ.14,500 నుంచి రూ.16,500 జీతం, ఉచిత బస్సు, భోజన సదుపాయం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాలని సూచించారు.

తొలి రోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతం

పరీక్ష రాసిన విద్యార్థులు 5.14 లక్షలు

- 17 వేల మంది గైర్హాజరు
- విద్యార్థులకు ఉక్కపోత.. పలుచోట్ల తాగునీటి సమస్య

సాక్షి, హైదరాబాద్: చిన్నచిన్న సమస్యలు ఎదురైనప్పటికీ ఇంటర్మీడియట్ తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఫస్టియర్ ద్వితీయ భాష పరీక్షకు 5,14,184 మంది హాజరుకావాల్సి ఉండగా, 4,96,899 మంది హాజరయ్యారు. మొత్తంగా 17,010 (3.41 శాతం) మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. హైదరాబాద్‌లో అత్యధికంగా 244 పరీక్ష కేంద్రాల్లో 87,523 మంది ఫస్టియర్ పరీక్ష రాశారు. వరంగల్, హన్మకొండలో రెండు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. పరీక్షల తీరును అధికారులు ప్రతిక్షణం పరిశీలించినట్టు ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్ వెల్లడించారు. ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య హైదరాబాద్ నారాయణగూడలోని రత్నా, జాహ్నవి, శ్రీచైతన్య కాలేజీలకు వెళ్లి పరీక్షల తీరును పరిశీలించారు. ఇతర అధికారులు కూడా నగరంలోని పలు కాలేజీలను పరిశీలించారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలోని 33 స్క్రీన్లను ప్రత్యేక సిబ్బంది పరీక్షలు పూర్తయ్యే వరకూ గమనించారు. పరీక్షకు సకాలంలో రావాలని ఇంటర్ బోర్డ్ పదేపదే సూచించినా కొన్నిచోట్ల విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో 162 మంది 9 గంటల తర్వాత పరీక్షకు హాజరయ్యారు. అయితే ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో వారిని పరీక్షకు అనుమతించారు. ఖమ్మంలోని కొన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల లింక్ ఆలస్యమవడంతో ప్రశ్నపత్రాల బండిల్ తెరవడం ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు పావుగంట నష్టపోవాల్సి వచ్చింది. చాలాచోట్ల కమాండ్ కంట్రోల్ రూంనుంచి సకాలంలో సీసీ కెమెరాలు లింక్ అవ్వలేదన్న ఫిర్యాదులు అధికారులకు వచ్చాయి. మారుమూల ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. వరంగల్, ములుగు, భద్రాచలం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని విద్యార్థులు తెలిపారు. తాగునీటి కోసం ఏర్పాట్లు చేసినా, ఆఖరి అరగంటలో 26 పరీక్ష కేంద్రాల్లో తాగునీరు అందక విద్యార్థులు సమస్యలు ఎదుర్కొన్నారు.



ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న నిర్మల్‌లోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన జుబేర్ (17) కొన్నేళ్లుగా నరాలకు సంబంధించిన అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. అయినప్పటికీ ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షలకు హాజరు కావాలనే లక్ష్యంతో బుధవారం కుటుంబ సభ్యుల సహాయంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రానికి హాజరయ్యాడు. స్క్రైబ్(సహాయకుడి) సహాయంతో పరీక్ష రాశాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పుట్టెడు దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని..

తండ్రి మృతి చెందినా పరీక్ష రాసిన కుమార్తె



వర్గల్ (గజ్వేల్): తండ్రి మృతి చెందిన బాధలోనూ కుమార్తె ఇంటర్ పరీక్ష రాసిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. వర్గల్‌కు చెందిన పసుల లింగం (50)కు భార్య యాదమ్మ, సాయికుమార్, తేజశ్రీ సంతానం. మంగళవారం రాత్రి కారులో లింగం తూప్రాన్ వెళ్లి తిరిగొస్తుండగా నాచారం సమీపంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లింగం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందడం.. బుధవారం రోజే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో.. పుట్టెడు దుఃఖంతోనూ తేజశ్రీ పరీక్షకు హాజరైంది.

'సాక్షి'పై ఏపీ సర్కారు అక్కసు

- వ్యక్తిగత గోప్యత హక్కు కోసం నినదిస్తే చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు
- పత్రికపై కేసు నమోదు చేయాలని ఆర్టీజీఎస్‌కు ఆదేశం
- కేసు వేసేందుకు పీపీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం నినదిస్తున్న 'సాక్షి' పత్రికపై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు కొనసాగిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిలదీస్తున్న 'సాక్షి' పత్రికపై అక్రమ కేసులకు తెగబడుతోంది. రెడ్‌బుక్ కుట్రలో తాజా అంకంగా.. కేసు నమోదు చేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)ను ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 'వాట్సాప్ గవర్నెన్స్' విధానం పేరుతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'మన మిత్ర' యాప్ ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగించేదిగా ఉందని పలువురు నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని పలువురు ప్రశ్నించారు కూడా. ఈ నేపథ్యంలో.. ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కు పరిరక్షణకు బాధ్యతాయుతమైన మీడియా సంస్థగా సాక్షి కూడా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ స్పందించింది. 'మన మిత్ర.. మరో మారీచుడు' శీర్షికన గతనెల 3న ఓ కథనాన్ని ప్రచురించింది. గతంలో 2014–19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో డేటా చోరీ అంశాలను కూడా ఇందులో ప్రస్తావించింది. ఆ కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇప్పటికే అమాంతంగా పెరిగిపోతున్న సోషల్ మీడియా వేధింపులు, సైబర్ నేరాలు బెంబేలెత్తిస్తున్న నేపథ్యంలో తమ వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం వాటిల్లే పరిస్థితి తలెత్తడం అందర్నీ ఆందోళనపరిచింది. కానీ, ఆ కథనం ప్రభుత్వ పెద్దలకు కంటగింపుగా మారింది. దీంతో 'సాక్షి' పత్రికపై కేసు నమోదు చేయడం ద్వారా వేధింపులకు పాల్పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంలో కేసు వేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

బురద తొలగింపునకు వాటర్ జెట్లు

- సొరంగంలో పరిస్థితిని పరిశీలించిన ఎన్వీ రొబోటిక్స్ బృందం
- కన్వేయర్ బెల్ట్ పొడిగింపునకు ప్రయత్నాలు



సొరంగంలోకి వాటర్ జెట్ మెషీన్‌ను తరలిస్తున్న సహాయక బృందాలు

సాక్షి, నాగర్ కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న కార్మికులను వెలికితీసేందుకు గత 12 రోజులుగా సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. ప్రమాదస్థలంలో బురద తొలగింపునకు వాటర్ జెట్ మెషీన్లను బుధవారం ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక శాఖ, ఎస్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వాటర్ జెట్ మెషీన్లతో ప్రమాద స్థలంలోని బురదను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. తర్వాత నీటిని వేగంగా డీవాటరింగ్ చేయడం ద్వారా సహాయక చర్యలను వేగవంతం చేయనున్నారు.

రొబోల వినియోగంపై పరిశీలన

ప్రమాద స్థలంలో సుమారు 18 ఫీట్ల ఎత్తులో ఉన్న మట్టిపై ఉన్న రెండుమూడు సిమెంట్ సెగ్మెంట్లు కూలే అవకాశం ఉందని గుర్తించారు. దీనివల్ల రెస్క్యూ బృందాలకు ప్రమాదం పొంచి ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా రొబోలను వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఎన్వీ రొబోటిక్స్ సంస్థ నిపుణులు ప్రమాద స్థలాన్ని సందర్శించి, రొబోలతో సహాయక చర్యలు చేపట్టే అవకాశాలను పరిశీలించారు. నేడో రేపో రొబోలను తీసుకొచ్చి ప్రయోగం చేయనున్నారు.

కన్వేయర్ బెల్టు పొడిగింపునకు ప్రయత్నాలు

ప్రమాద స్థలంలో టీబీఎంతో అనుసంధానమై ఉన్న కన్వేయర్ బెల్టు ధ్వంసమై బురదలో కూరుకుపోయింది. సింగరేణి రెస్క్యూ బృందాలు బెల్టును అందుబాటులోకి తెచ్చారు. అయితే 13.5 కి.మీ అవతల ప్రమాద స్థలంలోని శిథిలాలు, మట్టిని తొలగించాలంటే కన్వేయర్ బెల్టును అక్కడి వరకు పొడిగించాల్సి ఉంది. బుధవారం టన్నెల్ లోపల సహాయక చర్యలను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్ పరిశీలించారు.

భూములు అమ్మితే కానీ సర్కారు నడవని పరిస్థితి

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- రూ.30 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు పన్నాగం
- నిధుల సమీకరణ పేరుతో చవకగా భూముల అమ్మకం



సాక్షి, హైదరాబాద్: భూములు అమ్మితే కాని ప్రభుత్వాన్ని నడపలేని స్థితికి తెలంగాణ వచ్చిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైడ్రా, మూసీ వెంట ఇళ్ల కూల్చివేతలు.. వంటి తలాతోకలేని విధానాలతో రాష్ట్ర ఆదాయం తగ్గి ప్రభుత్వ భూములను అమ్ముకుంటే కాని ఆదాయం సమకూర్చుకోలేని స్థాయికి రేవంత్ సర్కార్ దిగజారిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

రూ.30 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం తాజాగా హైదరాబాద్‌లోని విలువైన భూములను చవకగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగపల్లి మండలం కంచ గచ్చిబౌలి పరిధిలో ఉన్న 400 ఎకరాల భూములను అమ్మడం లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాట మార్చారన్నారు. అసెంబ్లీని మోసం చేసిన రేవంత్, ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పులు చేసినప్పటికీ, ఎన్నో సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులు, పేదలను ఆదుకున్నామన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు, రూ.28 వేల కోట్ల రుణ మాఫీ, రూ.6 వేల కోట్లతో రైతు బీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. అలాగే, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు, 45 వేల చెరువుల పునరుద్ధరణ, 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి పథకాల అమలు, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్ కాలేజీలను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేవలం 15 నెలల పాలనలోనే రూ. 1.65 లక్షల కోట్ల పైచిలుకు అప్పు చేశారని ఆరోపించారు. అవగాహన రాహిత్యంతో శ్రీశైలం సొరంగాన్ని కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం రేవంత్‌ది అన్నారు.

'విజయ' పాల ధరల సవరణ!

గేదె, ఆవుపాలు లీటరుకు రూ.3 వరకు పెంపు యోచన

- ప్రతిపాదనలు రూపొందించిన విజయ డెయిరీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: పాడిరైతును ప్రోత్సహించేందుకు విజయ డెయిరీ ప్రస్తుతం రైతులకు ఇస్తున్న ధరలను సవరించాలని నిర్ణయించింది. ఒక్కో లీటరు పాలపై రూ.3 వరకు పెంచాలని భావిస్తోంది. ఇప్పటికే మూడుసార్లు పాల ధరలను సవరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మార్కెట్‌లో లీటరు ఆవుపాల ధర ఇతర ప్రైవేట్, సహకార డెయిరీలతో పోలిస్తే విజయ డెయిరీ దాదాపు రూ.8 నుంచి రూ.9 ఎక్కువగా చెల్లిస్తోంది. రైతులను మరింత ప్రోత్సహించే దిశగా ఆవు పాలు లీటరుపై గరిష్టంగా రూ.3 వరకు పెంచేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో లీటరు ఆవు పాల ధర రూ.42.24, గేదె పాలధర కూడా రూ.51.00 ఉండేలా అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ప్రస్తుతం ఈ పెంపు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దకు చేరినట్టు సమాచారం.

రోజుకు 2.8 లక్షల లీటర్లు...

పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అతి తక్కువ ధరకు పాలు తెలంగాణకు దిగుమతి అవుతున్నాయి. కొన్ని ప్రైవేట్ డెయిరీలు, కోఆపరేటివ్ రంగంలోని డెయిరీలు పక్క రాష్ట్రాల నుంచి లీటర్‌కు రూ. 27 నుంచి రూ.32 చొప్పున ఆవుపాలను సేకరించి, మార్కెటింగ్ కమీషన్లను పెంచి మన రాష్ట్రంలో అమ్మకాలను పెంచుకుంటున్నాయి. దీని ప్రభావం విజయ డెయిరీ అమ్మకాలపై పడుతోంది. వీటితోపాటు విజయ పేరుతో కొన్ని డెయిరీలు అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నాయి. ఈ సిబ్లింగ్ విజయ బ్రాండ్ల ద్వారా విజయ తెలంగాణ డెయిరీ పాల అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం రోజుకు విజయ బ్రాండ్ పాలు 2.8లక్షల లీటర్లు అమ్ముడు పోతున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మకాలు పెంచే దిశగా కసరత్తు చేస్తున్న విజయ డెయిరీ.. పాడి రైతులందరికీ పాల బిల్లుల చెల్లింపులను వేగవంతం చేయడంతో పాటు ప్రోత్సహించే దిశగా ఈ మేరకు చర్యలు చేపడుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా విజయ డెయిరీ యంత్రాంగం సమావేశమై మూడు ప్రతిపాదనలు రూపొందించినట్టు సమాచారం. దాదాపు రూ.50 కోట్ల పాత బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా 5 నుంచి 20వ తేదీ మధ్య పాల బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర బీసీ కమిషన్ క్షేత్ర పర్యటనలు

తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ కమిషన్ మళ్లీ క్షేత్ర స్థాయి పర్యటనలు చేపట్టాలని నిర్ణయించింది. మండలి ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొంత కాలంగా ఈ పర్యటనలు నిలిచిపోయాయి. తాజాగా వీటిని ప్రారంభించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నిర్ణయించారు. బుధవారం కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, సభ్యకార్యదర్శి బాల మాయాదేవితో ఆయన సమావేశం నిర్వహించారు.

ప్రాసెసింగ్ హైబ్రిడ్ టమాటాకు అధిక డిమాండ్

హార్టికల్చర్ వర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం మార్కెట్‌లో ప్రాసెసింగ్ హైబ్రిడ్ టమాటా రకానికి అధిక డిమాండ్ ఉందని కొండాలక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ దండా రాజిరెడ్డి చెప్పారు. టమాటాలో నూతన వంగడాలపై బుధవారం వర్సిటీలో అంతర్జాతీయ వర్క్‌షాప్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ దండా రాజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ మార్పులు, వైరస్ తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే గుణంతోపాటు అధిక దిగుబడి, నాణ్యతనిచ్చే నూతన టమాటా రకాలను వివరించారు. తెలంగాణలో టమాటా సాగు చేస్తున్న రైతులు వైరస్ తెగుళ్లు, టమాటో సూది పురుగు, ఆకుమాడు తెగులు సమస్యలతో దిగుబడి నాణ్యతను కోల్పోతున్నారని తైవాన్‌కు చెందిన టమాటా బ్రీడింగ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అసఫ్ ఐబిసీజ్ తెలిపారు. దేశా నికి లాభసాటి సాగులో కావాల్సిన టమాట వంగడాలు, ఇప్పటివరకు సాధించిన పరిశోధన ఫలితాలను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పిడిగం సైదయ్య ఈ వర్క్‌షాప్‌లో ప్రజెంట్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, అంతర్జాతీయ ప్రోగ్రా మ్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.



ధైర్యం ఒక్కటే జీవితపు ఏకైక కొలత.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 6 మార్చి 2025

నిద్రలేచిన 'బోఫోర్స్ స్కాం'

నలభైయేళ్ల క్రితం పుట్టుకొచ్చి, పుష్కరకాలం క్రితం శాశ్వత సమాధి అయిందనుకున్న బోఫోర్స్ కుంభకోణం మళ్లీ ఆవులిస్తోంది. దాన్ని సమాధి చేసేవరకూ ఇంచుమించు ప్రతియేటా ఏదో ఒక కొత్త సంగతితో బయటికొస్తూ, వచ్చినప్పుడల్లా పెను సంచలనానికీ, దుమారానికీ కారణమైన బోఫోర్స్ ఆ రకంగా 'ఎవర్ గ్రీన్'. ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన అభ్యర్థన పత్రంతో కొన్ని రోజుల క్రితం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, అమెరికా న్యాయ విభాగాన్ని సంప్రదించటంతో అది మరోసారి పతాక శీర్షికలకు ఎక్కబోతున్నదని భావించవచ్చు. అప్పట్లో బోఫోర్స్ స్కాంపై దర్యాప్తు చేశామని చెప్పిన అమెరికన్ ప్రైవేటు డిటెక్టివ్ సంస్థ 'ఫెయిర్ ఫాక్స్' నుంచి సమాచారం సేకరించాలన్నది సీబీఐ ప్రధాన ధ్యేయం. వాస్తవానికి ఈ అభ్యర్థన పత్రాన్ని జారీ చేయాల్సిందిగా నిరుడు అక్టోబర్‌లోనే ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించిందని చెబుతున్నారు. ఇప్పటికీ ఎవరూ అధిగమించలేని స్థాయిలో 1984 లోక్‌సభ ఎన్నికల్లో తన నేతృత్వంలోని కాంగ్రెస్‌కు 404 స్థానాలు సాధించిపెట్టిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని... ఆ తర్వాత మరో మూడేళ్లకు బయటపడిన ఈ కుంభకోణం ఊపిరాడనీయకుండా చేసింది. ఇందులో తనకు లేదా తన కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రమేయమూ లేదని రాజీవ్ చెప్పిన మాటల్ని జనం విశ్వసించలేదు. 1989 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ సగానికిపైగా స్థానాలు కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమైంది. వీపీ సింగ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం 1990లో ఆదేశించే వరకూ నిందితులపై కేసుల్లేవు. దర్యాప్తు లేదు. అంతవరకూ మన దేశంలో ఎవరికీ పెద్దగా తెలియని స్వీడన్ రేడియో 1987లో బోఫోర్స్ శతఘ్నుల కొనుగోళ్లలో ముడుపులు చేతులు మారాయని తొలిసారి వెల్లడించినప్పుడు మన దేశంలో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. అటు స్వీడన్‌లోనూ పెను సంచలనం కలిగించాయి. ఈ స్కాంలో మన రాజకీయ నాయకులు, రక్షణ అధికారులతోపాటు కొందరు విదేశీయులు పీకల్లోతు మునిగారని వెల్లడైంది. స్వీడన్ ఆయుధాల సంస్థ ఏబీ బోఫోర్స్ నుంచి నాలుగు వందల 155 ఎంఎం శతఘ్నులు కొనుగోలు చేయటానికి రూ. 1,437 కోట్లతో ఒప్పందం కుదరగా, అందులో రూ. 64 కోట్లు చేతులు మారాయన్నది ప్రధాన ఆరోపణ. ఇందులో ఇటలీ వ్యాపారవేత్త అటావియో క్వత్రోచి, బోఫోర్స్‌కు ఏజెంట్‌గా వ్యవహరించిన విన్‌చద్దా, పారిశ్రామికవేత్తలు హిందూజా సోదరుల పేర్లు వెల్లడయ్యాయి. 'ది హిందూ' దినపత్రిక జర్నలిస్టు చిత్రా సుబ్రహ్మణ్యం ఈ కుంభకోణంపై వరసబెట్టి రాసిన కథనాల పరంపరతో కాంగ్రెస్ ఇరకాటంలో పడింది. దీనికి తోడు బోఫోర్స్ సంస్థ ఎండీ మార్టిన్ ఆర్డ్‌బో రాసుకున్న డైరీలోని అంశాలు సైతం బట్టబయలయ్యాయి.

దాదాపు పదిహేనేళ్లపాటు దర్యాప్తు పేరుతో సీబీఐ సాగించిందంతా ఒక ప్రహసనం. ఆ తంతు సాగుతుండగానే 1993లో క్వత్రోచి మన దేశం నుంచి చల్లగా జారుకున్నాడు. అతని బ్యాంకు ఖాతాల విషయమై సమాచారం కావాలంటూ భారత్ నుంచి వచ్చిన అభ్యర్థనను పట్టించుకోవాల్సిన పని లేదంటూ స్విట్జర్లాండ్ విదేశాంగ మంత్రికి అంతకు ఏడాదిముందు... అంటే 1992లో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా ఉన్న మాధవ్‌సిన్హ్ సోలంకీ ఉత్తరం అందజేశారు. ఇక 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఏలుబడి మొదలయ్యాక దర్యాప్తు పూర్తిగా పడకేసింది. ఈ కేసుకు సంబంధించి కొత్త పాత్రధారులు తెరపైకొస్తున్నా, సరికొత్త వివరాలు వెల్లడవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఈలోగా నిందితుల్లో కొందరు మరణించారు. కనీసం బతికున్న క్వత్రోచి పైన అయినా దర్యాప్తు కొనసాగించమని 2005లో ఢిల్లీ హైకోర్టు చెప్పినా సీబీఐ ముందుకు కదలనే లేదు. వాస్తవానికి అంతకుముందు 2003లో మలేసియాలోనూ, ఆ తర్వాత 2007లో అర్జెంటీనాలోనూ క్వత్రోచి కదలికలు కనబడినా అరెస్టుకు ప్రయత్నించలేదు. సరిగదా... లండన్‌లోని క్వత్రోచి ఖాతాలకూ, ముడుపులకూ సంబంధం లేదంటూ ఆ ఖాతాల స్తంభనను రద్దు చేయించి, 2009లో 'వాంటెడ్' జాబితా నుంచి అతని పేరు తొలగింపజేయటంలో సీబీఐ అత్యుత్సాహం ప్రదర్శించింది. నిందితులుగా ఉన్న క్వత్రోచి, విన్ చద్దాలకు రూ. 41 కోట్లు అందాయని ఆదాయపన్ను విభాగం అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ధారించి వారిద్దరూ ఆ ఆదాయంపై పన్ను కట్టాల్సిందేనని 2011లో తేల్చి చెప్పింది. వీరిద్దరికీ ఏఈ సర్వీసెస్ నుంచీ, స్వెన్‌స్కా అనే సంస్థ నుంచీ సొమ్ములు బదిలీ అయ్యాయని తెలిపింది. ఆ తర్వాతైనా సీబీఐ చేయాల్సింది చేయలేదు. ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చిన మర్నాడే క్వత్రోచిని పట్టుకోవటం మావల్ల కాదని కోర్టులో ఆ సంస్థ చేతులెత్తేసింది. నిందితులందరిపై కేసుల ఉపసంహరణకు అనుమతించమని అది దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు అంగీకరించింది. కీలక నిందితుడు క్వత్రోచి 2013లో మరణించాడు. దీన్ని తిరగదోడేందుకు అనుమతించాలన్న సీబీఐ వినతిని సుప్రీంకోర్టు తీవ్ర జాప్యం చోటుచేసుకుందన్న కారణాన్ని చూపి 2018లో తోసిపుచ్చింది.

రాజీవ్ గాంధీకి ఈ ముడుపుల వ్యవహారంతో సంబంధం లేదని 2004లో ఢిల్లీ హైకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చింది. కానీ ఆ తర్వాత కాలంలో దర్యాప్తు ఎందుకు నత్తనడకన సాగింది? ఎవరిని కాపాడటానికి ఆ సంస్థ తాపత్రయపడింది? ఒక స్విస్ బ్యాంక్‌లో 'మాంట్ బ్లాంక్' పేరిట ఉన్న ఖాతాలో బోఫోర్స్ ముడుపులున్నాయని తాము కనుగొన్నప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఆగ్రహోదగ్రుడయ్యారని 'ఫెయిర్ ఫాక్స్' సారథి మైకేల్ హెర్ష్‌మాన్ 2017లో చెప్పిన మాటల్లో వాస్తవం ఎంత? ఇందులో వెలికితీయాల్సిన చేదు నిజాలు చాలానే ఉన్నాయని ఈ పరిణామాలు చూస్తే అర్థమవుతుంది. ఈసారైనా ఆ పని జరుగుతుందా అనేది వేచిచూడాలి.

అమెరికా ఇక ఎందులో గొప్ప?

అభిప్రాయం



బర్ఖా దత్

డోనాల్డ్ ట్రంప్ తీరు చూసి నోరు వెళ్లబెడుతున్నారా? బహుశా లెక్క పెట్టలేనన్ని సార్లు అయ్యుంటుంది. నాది మాత్రం అదే పరిస్థితి. మీరు అమెరికా అధ్యక్షుడి అభిమాని కావచ్చు, కాకపోవచ్చు; అది సమస్య కాదు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద రాజకీయాలు సంక్షోభంలో పడిపోయాయి, ఉన్నత వర్గాల చర్మం మొద్దుబారింది, మితవాదం జనాదరణ పొందుతోంది... ఎందుకిలా జరుగుతుందో తేల్చడానికి చర్చోపచర్చలు నడుస్తున్నాయి. వాటినీ పక్కన పెడదాం. ట్రంప్ పదవిని అలంకరించి కొన్ని వారాలు గడచిపోయాయి. ఈ స్వల్ప సమయంలోనే అమెరికా బండారం బయటపడింది. అమెరికా అసామాన్యత (అమెరికన్ ఎక్సెప్షనలిజం) అనేది ఒక కట్టుకథ అని తేలిపోయింది. అమెరికన్ ఎక్సెప్షనలిజం అంటే? 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా' నిర్వచనం ప్రకారం, 'చారిత్రక, సైద్ధాంతిక, మత కారణాల రీత్యా అమెరికా ప్రత్యేకమైనది, నైతికంగా ఒక ఉన్నతమైన దేశం అనే భావన.'

అమెరికా ప్రతి చర్యలోనూ... కపటమైన సైనిక జోక్యాల్లో, అధికార పీఠాలను కూలదోసే కుట్రల్లో, ఆఖరికి పత్రికా వ్యాసాల్లోనూ ఈ అహంభావపూరితమైన ఆధిక్యతా భావన కనబడుతుంది. రష్యా – ఉక్రెయిన్ యుద్ధ కాలంలో మాటిమాటికీ 'విలువల ఆధారిత వ్యవస్థ' అంటూ అరిగిపోయిన పదాలతో ఊదరగొట్టిన వారు, భారత్ దౌత్య విధానానికి వంక పెట్టిన వారు, ఆ తర్వాత ఏం చేశారు? అదే అమెరికా ఐక్యరాజ్య సమితి తీర్మానంపై ఊహకే అందని విధంగా రష్యాతో చేయి కలిపింది. ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా ఓటేసింది. యుద్ధ సమయంలోనూ ఆచితూచి వ్యవహరించినభారత్ ఓటింగ్‌కు హాజరు కాకుండా తటస్థ వైఖరి అవలంబించింది.

హక్కుల గురించి మీరా మాట్లాడేది?

విదేశీ దేశీ విధానాలను తలకిందులు చేస్తున్న ట్రంప్ విన్యాసాలు వినోదం కలిగిస్తున్నప్పటికీ, అవి ప్రమాదభరితమైనవి. ఏమైనా, అమెరికా విలువలు, అమెరికా ప్రజాస్వామ్యం, అమెరికా మీడియా, లేదంటే అమెరికా సంపన్నస్వామ్యం (అలిగార్కీ)... ఇవన్నీ ప్రభుత్వ వ్యవస్థల ప్రమేయం లేకుండా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో కంటే స్వేచ్ఛగా, ఆరోగ్యదాయకంగా ఉంటాయన్న కట్టుకథ తిరుగులేనివిధంగా పటాపంచలైంది. అమెరికా మేధావులు ఇకమీదట ఎప్పుడన్నా భారత ప్రజాస్వామ్యాన్ని శల్యపరీక్షకు పెడితే నేనేం చేస్తానో తెలుసా? పడిపడి కాకున్నా ముసిముసిగా నవ్వుకుంటాను! యూఎస్ ప్రభుత్వం భారత్‌లో మానవ హక్కుల మీద నివేదిక వెలువరించినా అంతే చేస్తా.

భారతీయ అక్రమ వలసదారులను మీరెలా ట్రీట్ చేశారు? వారిని 40 గంటల పాటు ఉక్కు సంకెళ్లు వేసి స్వదేశానికి పంపించడమే కాకుండా ఆ మెటల్ శబ్దాల మ్యూజిక్‌తో వీడియోలు రూపొందిస్తారా? జన్మలో ఇక మీరు మానవ హక్కులంటూ భారతీయులకు ఉపన్యాసాలు ఇవ్వలేరు. ఈ క్షణాన యూఎస్ ప్రభుత్వాన్ని నడుపుతున్న టెస్లా, ఎక్స్ సంస్థల అధిపతి ఎలాన్ మస్క్ సహా అమెరికా కార్పొరేట్ టైటాన్లు ట్రంప్ ప్రమాణస్వీకార ఉత్సవంలో బారులు తీరడం మేము చూడలేదనుకుంటున్నారా? ఇక మీదట మీరు ఏ ముఖం పెట్టుకుని భారత్ మీడియాకు, వ్యాపార సామ్రాజ్యాలకు మధ్య సంబంధాలు ఉన్నాయంటూ విమర్శిస్తారు? ట్రంప్ గెలుపు ఖాయం అనుకోక ముందు నుంచే మస్క్ ఆయన పక్షం నిలిచి ఉన్నారు. కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. మరి మెటా/ఫేస్‌బుక్ అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ వాస్తవ నిర్ధారణ, రాజకీయాలు వంటి అంశాల మీద ఏళ్ల తరబడిగా అవలంబిస్తున్న విధానాలను వాషింగ్టన్ పెద్దలకు అనుకూల రీతిలో రాత్రికి రాత్రే రివర్స్ చేసుకున్నాడంటే ఏమనుకోవాలి?



ఇన్‌ఫ్లుయెన్సర్లకు పీట

ఒకప్పుడు ఎంతో గౌరవప్రదమైన 'ద వాషింగ్టన్ పోస్ట్' సంగతేంటి? నేను కూడా చాలా సంవత్సరాల పాటు ఆ వార్తాపత్రికలో కాలమ్ రాశాను. ఆ పత్రికలో ఇప్పుడేం జరుగుతోందో చూడండి. సంక్షోభాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. సంపాదకీయ నాయకత్వంలో వరసగా అనేక ఆకస్మిక మార్పులు చేశారు. యజమాని అయిన 'అమెజాన్' అధిపతి జెఫ్ బెజోస్ గందరగోళంగా ఆ పత్రిక దిశను మార్చడంతో అదిప్పుడు అనిశ్చితిలో పడింది. 'ఒపీనియన్ పేజీ' ఎడిటర్ డేవిడ్ షిప్లీ ఈ మార్పులకు నిరసనగా వైదొలిగారు. 'స్వేచ్ఛా విపణులు, వ్యక్తిగత స్వాతంత్ర్యం' ఆదర్శాన్ని పత్రిక ఎలా అనుసరించాలో నిర్దేశిస్తూ బెజోస్ 'ట్విట్టర్' వేదికగా చేసిన ప్రకటన (బహుశా మస్క్, ట్రంప్‌ల అనుమతి కోసం) ప్రమోటర్‌కు, ఎడిటర్‌కు మధ్య ఒక గోడ ఉంటుందన్న భ్రమను ఈ ఆదేశం బద్దలు కొట్టింది.

దీనికి తోడు, లబ్ధ ప్రతిష్ఠులైన జర్నలిస్టుల స్థానంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను వైట్‌హౌస్ నియమిస్తోంది. వీరు పత్రికా సమావేశాల్లో ప్రభుత్వ అనుకూలురుగా ఉంటారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మీడియా స్వేచ్ఛకు ఈ చర్య అశనిపాతం.

- 'చారిత్రక, సైద్ధాంతిక, మత కారణాల రీత్యా అమెరికా ప్రత్యేకమైనది, నైతికంగా ఒక ఉన్నతమైన దేశం అనే భావన' (అమెరికన్ ఎక్సెప్షనలిజం) ఒక కట్టుకథ అని తేలిపోయింది.
- 'విలువల ఆధారిత వ్యవస్థ' అంటూ ఊదరగొట్టి, భారత్ దౌత్యవిధానానికి వంక పెట్టిన అమెరికా... ఐక్య రాజ్య సమితి తీర్మానంపై ఊహకే అందనివిధంగా ఉక్రెయిన్‌ను కాదని రష్యాతో చేయి కలిపింది.
- భారతీయ అక్రమ వలసదారులను 40 గంటల పాటు ఉక్కు సంకెళ్లు వేసి స్వదేశానికి పంపించారు. జన్మలో ఇక మీరు మానవ హక్కులంటూ భారతీయులకు ఉపన్యాసాలు ఇవ్వలేరు.

అలిగార్క్‌లు చలాయించే అహంకారపూరిత అధికారం, పత్రికా స్వేచ్ఛకు సవాళ్లు, సమాచారం కోసం సంబంధిత సంస్థలను సంప్రదించే వీలు తగ్గిపోతూ ఉండటం... ఇవన్నీ సీరియస్ అంశాలు. ప్రపంచంలోని ప్రతిచోటా ఉన్నట్లే భారత్ లోనూ ఈ సమస్యలు ఉంటాయి. కానీ అంత సమర్థంగా వీటిపై పోరాడలేక పోవచ్చు. అయితే, ఈసారి ఏదైనా అమెరికా వార్తాపత్రిక... మసకబారుతున్న ఇండియా మీడియా గురించి సంపాదకీయం రాసినప్పుడు మనం వారిని వేలెత్తి చూపించగలం.

అత్యంత హేయమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న 'టేట్ బ్రదర్స్' రొమేనియా నుంచి అమెరికాలో ప్రత్యక్షం కావడం ఈవారం కొసమెరుపు. ఆండ్రూ టేట్, ట్రిస్టాన్ టేట్ సోదరులు అత్యాచారం, సెక్సువల్ ట్రాఫికింగ్ కేసుల్లో ఇరుక్కున్నారు. మహిళలందరూ సెక్స్ వర్కర్లనీ, అత్యాచారాలకు వారే బాధ్యత వహించాలనీ... ఇంకా ఇలాంటి దుర్మార్గమైన, అసహ్యకర వ్యాఖ్యలు చేసిన ఈ అన్నదమ్ములు ట్రంప్ ఫాన్స్! వీరు స్వదేశం తిరిగి వచ్చేందుకు అనుమతించాలంటూ ట్రంప్ ప్రభుత్వం రొమేనియాను సంప్రదించినట్లు 'ద ఫైనాన్షియల్ టైమ్స్' కథనం ప్రచురించింది. చివరకు, అతివాద రిపబ్లికన్ నేతలు సైతం వారిని ఏవగించుకుంటున్నారు.

ట్రంప్ రాజకీయంగా మరింత బలపడవచ్చు. కానీ అమెరికా పతనమౌతోంది. ప్రభుత్వ గందరగోళ విధానాల నేపథ్యంలో అమెరికా అసామాన్యత (అసలు అలాంటిది ఎప్పుడూ లేదని నేనంటాను) చావుదెబ్బ తినబోతోంది!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

యాక్షన్ ప్లాన్ ఏమిటి?



మోదీకి స్నేహితుడని చెప్పే ట్రంప్ ఏప్రిల్ 2 నుండి ఇండియా మీద ప్రతీకార సుంకాలను విధిస్తున్నారు. చైనా, కెనడా, మెక్సికో లాంటి దేశాలు దాన్ని ప్రతి–సుంకాలతో ఎదుర్కొంటుండగా, మోదీ మాత్రం ఒక ప్రైవేట్ జూ కోసం ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారు. ఏ చర్యా కనబడటం లేదు.

– షమా మహమ్మద్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి

అర్థం లేని ప్రచారం



తమిళం అంటే ప్రేమ ఉండటమంటే, హిందీని పడగొట్టడం, సంస్కృతాన్ని నిషేధించడమా? తమిళనాడులో డీఎంకే చేస్తున్న అర్థరహిత ద్విభాషా ప్రచారాన్ని ఆపాలి. ముఖ్యమంత్రి హేతుబద్ధ పరిధిని దాటి దీన్ని ముందుకు తెస్తున్నారు. తమిళనాడు ఈ దేశంలో భాగం. సంస్కృతం మన ఘన వారసత్వంలో భాగం. త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ ప్రచారం రాజకీయ ప్రేరితం, ప్రమాదకరమైన తిరోగమనశీలం అని గుర్తించాలి.

– మాలినీ పార్థసారథి, పూర్వ సంపాదకురాలు

అవి సొంతమే!



ఫతావే అల్‌మగిరి, మజ్‌మూఏ కవనీనే ఇస్లామీ, బహిశతీ జేవర్, ఫతావే రిజ్‌వియా లాంటి భారత్‌లో రాసిన ఇస్లాం స్మృతుల్లో జాత్యహంకారం, కులతత్వానికి అనుకూలంగా కనబడే రిఫరెన్సులన్నీ అరబ్/ఇరాన్ పుస్తకాల్లోవి. ఒకవేళ మనుస్మృతి ఉటంకింపులుంటే గనక, ఈ జనాలు జాత్యహంకారం, కులతత్వం హిందూ/బ్రాహ్మణుల నుంచి నేర్చుకున్నారని అనేవాళ్లు.

– ఫైయాజ్ అహ్మద్ ఫైజీ, పస్మాందా యాక్టివిస్ట్

పచ్చదనమే సాంత్వన



చెట్లు, పచ్చదనం... నివసించే పరిసరాలకు తాజాదనాన్నీ, స్వచ్ఛతనూ తెస్తాయి. ఆరోగ్య లాభాలు, భౌతిక ప్రయోజనాలను పక్కనపెడితే అవి కళాత్మకంగా మనోహరం. ఆకుపచ్చ పరిసరాలు ఆత్మకు సాంత్వన. అడవులను నాశనం చేయడం, వ్యవసాయ భూములను ఇతర అవసరాల కోసం వాడటం ఆపాలి.

– సయ్యద్ అలీ ఖమేనీ, ఇరాన్ సుప్రీంలీడర్

వాటికి ఉత్సవమా?



నీలిచిత్రాలు, వ్యభిచారం... ఉత్సవాలు జరుపుకోవాల్సినవి కావు– అవి అంతం కావాల్సిన సామాజిక క్యాన్సర్లు. వాటికి ఆస్కార్లు ఇచ్చి గౌరవించకూడదు. ('అనోరా'కు ఆస్కార్ ఉత్తమ చిత్రం వచ్చిన నేపథ్యంలో.)

– లైలా రోజ్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

స్వజనులకు అక్షర భిక్ష

తాను వెలుగుతూ చుట్టూరా కమ్మిన చీకట్లను తరిమేయడమే దీపం సుగుణం. అలాంటివారే మారూ మాస్టారు. ఆదివాసీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన చైతన్యాన్ని వారిలో నింపారు. 1925 ఫిబ్రవరిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గడల్ పల్లి ఏజెన్సీ గూడెంలో జన్మించిన సిడాం మారూ 1962లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తొలి ఆదివాసీ. రాజ్ గోండ్ తెగకు చెందిన ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తమ జాతిలో వెనుకబాటుతనాన్ని పోగొట్టాలంటే కనీస అక్షర జ్ఞానం నింపాలని భావించారు. దీనికితోడు అప్పటి నైజాం ప్రభుత్వంలో గిరిజన జాతులపై పరిశోధన చేస్తున్న ఆంత్రొపాలజిస్ట్ ప్రొ. హైమండార్ఫ్ ప్రోత్సహించడంతో ఉపాధ్యాయ వృత్తి స్వీకరించారు.



సిడాం మారూ మాస్టారు

బాహ్య ప్రపంచమే తెలియని ఆదిమ తెగలైన రాజ్ గోండ్, పర్ధాన్, నాయకపోడు, తోటి, కోయ గిరిజనులను చేరదీసి మాతృభాషలో బోధించేవారు. 1940లో నిజాం సాయుధ దళాలతో జరిగిన జోడె ఘాట్ పోరాటంలో క్షతగాత్రులైన తమ వారిని దాచిపెట్టి, అవసరమైన సపర్యలు చేసిన మానవీయుడు, దయామయుడు.

1983లో ఉపాధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ పొందిన మారూ మాస్టారు వెనువెంటనే ఉట్నూరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) తరఫున ఆదివాసీ అభివృద్ధి నిర్వాహకుడిగా నియమితులయ్యారు. ఐటీడీఏ ప్రవేశ పెట్టిన పలు పథకాలను, ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని గిరిజనులందరూ అభివృద్ధి చెందాలని చైతన్యం కలిగించిన ఘనత ఆయనకే దక్కుతుంది.

గిరిజనులకు అండగా నిలబడి గిరిజనాభివృద్ధిలో ఆదివాసులను భాగస్వాములుగా చేస్తూ హైమండార్ఫ్ స్థాపించిన 'రాయ్ సెంటర్ల'ను పునఃప్రారంభించడానికి తగు కృషి చేశారు మారూ మాస్టారు. తుదకు 2000, మార్చి 6న ప్రకృతి ఒడిలోకి చేరారు. ఆదివాసీల మదిలో మారూ జ్ఞాపకం మరువలేనిది.

– గుమ్మడి లక్ష్మీనారాయణ, సామాజిక రచయిత
(నేడు మారూ మాస్టారు వర్ధంతి)

భూ వాస్తవాల విస్మరణే ప్రమాదానికి కారణం

సందర్భం



సైనాల గోవర్ధన్

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ సొరంగ కాలువ (ఎస్ఎల్‌బీసీ) నిర్మాణం పూర్తయితే... దేవరకొండ, నకిరేకల్, నల్లగొండ, నార్కెట్‌పల్లి మండలాల్లోని 4 లక్షల ఎకరాలకు సాగునీరొస్తుంది. 500కు పైగా ఫ్లోరోసిస్ పీడిత గ్రామాలకు తాగునీరు వస్తుంది. అందుకే ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును చేపట్టాయి. అయితే గత నాలుగేళ్లకు పైగా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రూఫ్ (పై స్లాబ్) నుండి భారీ నీటి జలలు (ఊటలు) వస్తున్నాయి. ఈ జల ప్రవాహాన్ని శాస్త్రీయంగా అరికట్టడంలో జరిగిన తీవ్రమైన వైఫల్యమే ఈ ఘోర విపత్తుకు కారణం.

ప్రమాదాన్ని అంచనా వేయడంలో రాబిన్‌సన్, జేపీ కంపెనీలు; తెలంగాణ నీటిపారుదల శాఖ విఫలమయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ గత పదేళ్ల పాలనలో 11 కిలోమీటర్లు దాటి సొరంగం తవ్వలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సొరంగ నిర్మాణం కోసం భారీ ఎత్తున వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చింది. కానీ పొంచి ఉన్న భారీ విపత్తును గుర్తించడంలో విఫలమైంది. సొరంగం పైకప్పు నిమిషానికి 5 నుండి 8 వేల లీటర్ల నీటినీ, బురదనూ కుమ్మరిస్తోంది. ప్రభుత్వానికి నీటి ఊటను శాశ్వతంగా పరిష్కరించే ఆలోచనే లేదు.

ప్రకృతి నియమాలను అర్థం చేసుకోని, ప్రకృతి నియమాలకు అనుగుణంగా నిర్మించని నిర్మాణాలు ఎంత గొప్పవైనా... ప్రకృతి వాటిని ధ్వంసం చేస్తుంది. ఇందుకు ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదం ఒక తాజా ఉదాహరణ మాత్రమే. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినందునే, అన్నారం– సుందిళ్ళ బ్యారేజీలలో భారీ లీకేజీ, సీపేజీలు కొనసాగుతున్నాయి. ప్రకృతి నియమాలను అర్థం చేసుకొని నిర్మించిన నిర్మాణాలనే ప్రకృతి పరిరక్షిస్తుంది. తద్విరుద్ధమైన ఎంతటి ఆధునాతన నిర్మాణాలైనా ప్రకృతి ధ్వంసం చేస్తుంది. కాళేశ్వరం (మేడిగడ్డ) నిర్మించిన నాలుగేళ్లకే అది ఐదు అడుగుల మేర భూగర్భంలోకి ఎందుకు కుంగిపోయింది? ఎందుకు నిట్ట నిలువునా మూడున్నర అడుగుల వెడల్పుతో చెక్కలై, పునాది నుండి చీలిపోయింది? ఏడో బ్లాక్‌లోని 11 గేట్లు కూల్చి మళ్లీ నిర్మించాలని, ఇటీవలే విడుదలైన ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఎందుకు పేర్కొంది? బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల పునాదుల్లోంచి సిమెంట్, కెమికల్ గ్రౌటింగ్ చేసినా... భారీనీటి లీకేజీ, సీపేజీ ఎందుకు ఆగకుండా జరుగుతోంది? 14 పంపుల్లో సగం పంపులు ఎందుకు బద్దలైపోయాయి? డైమండ్ డ్రిల్లింగ్‌తో, నియమానుసారం భూగర్భ మట్టి పరీక్షలు ఎందుకు జరుపలేదు? బలహీన ఇసుక పునాదుల పైన బ్యారేజీలు ఎందుకు నిర్మించారు? డిజైన్, ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణలకు చెందిన ఏ ప్రకృతి నియమాన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. 'కేసీఆర్ మమ్మల్ని డమ్మీలు చేశార'ని ఇంజనీర్లు ముక్తకంఠంతో పీసీ ఘోష్ కమిషన్ ముందు సాక్ష్యమిచ్చారు. కాళేశ్వరం బ్యారేజీల విపత్తు తలెత్తిందే అందువల్ల.



ప్రమాదం జరిగిన ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు

ఏపీలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 లోపు పూర్తి చేయాలని చంద్రబాబు ప్రభుత్వం ఇంజినీర్లకు డెడ్ లైన్ విధించింది. ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం (మేడిగడ్డ) విపత్తులతో పోలవరం ప్రాజెక్టుకూ సారూప్యముంది. పోలవరంలో డెడ్ లైన్ల పేరుతో బడా రాజకీయ పెద్దల జోక్యం ఎక్కువైంది. నేటి విపత్తులకు కారణమైన కాళేశ్వరం, ఎస్ఎల్ బీసీలో ఏ తప్పులైతే చేశారో, పోలవరం స్పిల్‌వే (గేట్ల అడుగు భాగం) పునాది నిర్మాణంలో అవే తప్పులు గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగాయి. అప్పట్లో ప్రతి సోమవారం పోలవరం అంటూ మీడియా ఎదుట హంగామా చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికీ, స్థిరత్వానికీ తగిన సమయం ఇవ్వడం కన్నా ఈ హడావిడే ఎక్కువ. ఫలితంగా భారీ వరద తాకిడికి, భూగర్భంలో 460 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది.

ఎస్ఎల్‌బీసీ అత్యంత క్లిష్టమైన సొరంగంగా ఎందుకు మారింది? దేశంలో నిర్మించిన ఇతర రైల్వే, రోడ్డు తదితర సొరంగాలకు దీనికి మధ్య ఎలాంటి సారూప్యతలూ ఎందుకు లేవు? సొరంగంపై నుండి నాలుగేళ్లకు పైగా నీరు, బురద రావడం అతి సంక్లిష్టమైన వ్యవహారం. టీబీఎం తవ్వడం ప్రారంభించగానే, అప్పటికే నాలుగేళ్లుగా నిట్ట నిలువుగా కుమ్మరిస్తున్న భారీ నీటి ఊటతో షియర్ జోన్ భూ భౌగోళిక స్థితి... భారీ విపత్తుగా మారింది. అక్కడి మట్టి అంతా పూర్తిగా నీటిని నింపుకొని తేమగా మారి పెను విపత్తుకు దారితీసింది. ఏ చిన్న ఒత్తిడితో కూడిన కదలిక జరిగినా కుప్ప కూలడానికి సిద్ధమైంది. టీబీఎం మిషన్ పని ప్రారంభించడంతో, నీటి తాకిడికి గురవుతున్న ప్రాంతం భారీ కదలికలకు గురైంది. ఇది సొరంగం పైకప్పు కుప్పకూలడానికి తక్షణ ప్రేరకంగా పని చేసింది. 'టన్నెల్ సీస్మిక్ ప్రాడక్షన్ సిస్టమ్'తో రాబోయే భారీ విపత్తులను గుర్తించడంలో విఫలమవ్వడం విపత్తుకు మరొక కారణం.

నీటి ప్రవాహ తాకిడికి, నాలుగు వందల టన్నుల బరువున్న టన్నెల్ బోరింగ్ మిషన్ 80 మీటర్ల దూరం కొట్టుకుపోయింది. విపత్తు జరిగి పది రోజులైనా నీటి నిల్వను, ఊటను, బురదను అరికట్టేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. సొరంగం పైనుంచి కుమ్మరిస్తున్న ఊట నీరు, మరిన్ని భారీ విపత్తులకు నెలవుగా మారింది. ఇది రెస్క్యూ బృందాల సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. కుప్పకూలిన పైకప్పు భూభౌతిక స్థితి... షియర్ జోన్ స్వభావానికి చెందినది. ఈ ప్రాంతంలోని భూమి భారీ నీటిని తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. నీటి జలల ప్రవాహానికి ఇక్కడి మట్టి అత్యంత అనువుగా ఉంటుంది. సొరంగం కుప్పకూలిన ప్రాంతానికి ఎగువన ఉన్న భూమి ఉపరితలానికి, ఒక నిర్దిష్ట చదరపు ప్రాంతపు రిడ్జిని కలిగి ఉంటుంది. ఆ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షపు తీవ్రత బట్టి షియర్ జోన్‌లోకి చేరుకునే నీటి పరిమాణంలో హెచ్చు తగ్గులు ఆధారపడి ఉంటాయి. ఈ ప్రాంతంలోని మట్టి... వదులుగా, ఖాళీలు, సందులను కలిగి ఉంటుంది. మొత్తం మీద ఇక్కడి మట్టి తన గుండా వర్షపు తీవ్రతను బట్టి నీరు ప్రవహించడానికి అనువుగా ఉంటుంది.

ఫిబ్రవరి చివర – మార్చి మొదటి వారం మధ్య... కుప్పకూలిన సొరంగ మార్గంపై నుండి నిమిషానికి 5 వేల నుండి 8 వేల లీటర్ల నీరు సొరంగంలోకి ప్రవహిస్తూ ఉంది. ఆ నీరే సొరంగంలో వివిధ ప్రాంతాల్లో 1.5 అడుగుల నుండి 2.5 అడుగుల లోతు వరకూ ఉంది. జూలై నుంచి అక్టోబర్ వరకూ భారీ వర్షాలు కురుస్తాయి. అప్పుడు నిమిషానికి సొరంగంలోకి 20 వేల నుండి లక్ష 50 వేల లీటర్ల వరకూ నీరు చేరవచ్చు. ఆ పైన భారీ నీరు నిట్ట నిలువునా సొరంగంలోకి జలపాతంలో దూకవచ్చు. ఇంత భారీ జల ప్రవాహాన్ని తెలంగాణ నీటిపారుదల శాఖ ఎలా అరికడుతుంది? వందల మీటర్ల ఎత్తు నుండి భూగర్భం గుండా మహాశక్తితో సొరంగం పైకప్పుపై విరుచుకుపడే జలపాతమది. ఇక, ఎస్ఎల్‌బీసీలో ఉత్తర భారతానికి చెందిన చౌక వలస కూలీలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందికీ తెలంగాణ ప్రభుత్వం 2–3 కోట్ల రూపాయల వరకూ పరిహారం ఇవ్వాలి. టీబీఎంతో సొరంగం తవ్వే ఉత్తర భారత కార్మికులను... కాంట్రాక్టర్లు, కంపెనీలు కడు హీనంగా చూస్తున్నాయని అక్కడ పనిచేస్తున్నవారి ఆవేదన వెల్లడించింది. ప్రాణహాని ఉన్న ఈ పనికి రోజుకు 800 రూపాయల కూలీ మాత్రమే ఇస్తున్నారు. వారికి ఎలాంటి ప్రమాద బీమాలు లేవు. రక్షణలూ, చట్టబద్ధమైన పరిహారాలూ లేవు. అనేక మంది కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. ఇది అడ్డూ అదుపూ లేని దోపిడీ. అతి దుర్మార్గం. తెలంగాణ ప్రభుత్వం ఇలాంటి కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టబద్ధమైన హక్కులన్నీ వారికి కల్పించాలి.

వ్యాసకర్త నీటిపారుదల ప్రాజెక్టుల విశ్లేషకులు
మొబైల్ : 97013 81799

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి ప.3.40 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** రోహిణి తె.4.35 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.9.01 నుండి 10.31 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.1.32 నుండి 3.02 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.20, **సూర్యాస్తమయం:** 6.03.

దివ్యాంగులకు ఉచిత భోజనం

• ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రారంభం



దివ్యాంగులకు కూరలు వడ్డిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణితో పాటు ఇతర రోజుల్లో పలు పనులపై ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులకు ఇకపై ఉచిత భోజనం అందనుంది. రాష్ట్రంలోనే తొలిసారి ఈ పథకాన్ని ఇక్కడ అమలు చేస్తుండగా బుధవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్ క్యాంటీన్‌లో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల ప్రజావాణిలో వచ్చిన అభ్యర్థన మేరకు దివ్యాంగులను అతిథులుగా భావిస్తూ ఉచిత భోజనం సమకూర్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు ఆధారంగా టోకెన్ తీసుకోవచ్చని, ఒక్కో భోజనానికి రూ.80 చొప్పున క్యాంటీన్ నిర్వాహకులకు చెల్లిస్తామని తెలిపారు. తొలిరోజు 300 మందికి పైగా దివ్యాంగులు భోజనం చేయగా, అన్నం, పప్పు, సాంబార్, కాకరకాయ ఫ్రై, టమాటా కూర, క్యాలీఫ్లవర్ చట్నీతో భోజనం వడ్డించారు.

పొలం ఎండి.. గుండె మండి

▶ మొదటి పేజీ తరువాయి

20రోజుల పాటు అయినా పంటలకు అందే స్థాయిలో లేవు.

- రాష్ట్రంలో ఎల్లంపల్లి దిగువన ఉన్న మిడ్‌మానేరును ఆనుకొని ఉన్న సిరిసిల్ల జిల్లా తీవ్రమైన సాగునీటి కష్టాలను ఎదుర్కుంటోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి లోయర్ మానేరు, వరంగల్ మీదుగా సూర్యాపేట వరకు సాగునీటిని 'వార బందీ (వారానికి ఒకసారి మాత్రమే సాగునీటిని వదలడం)' కింద ఇస్తుండటంతో తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. పెద్దపల్లి జిల్లాలో కూడా ఎస్సారెస్పీ నీటి విడుదలను వారబందీ పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు.
- మరోవైపు దేవాదుల నుంచి జనగామ జిల్లాలోని చెరువులకు ఇటీవలే సాగునీటిని వదిలినా.. ఆ నీటితో చెరువులు నింపేలోపు పొలాలన్నీ ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మెదక్ జిల్లాలోని పొలాలకు నీళ్లు అందించేందుకు సాగునీటి ప్రాజెక్టులు లేవు. దీనితో 95శాతం మంది రైతులు బోరుబావుల ఆధారంగా పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పుడు భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.
- రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, మహబూబ్‌నగర్, భూపాలపల్లి సహా చాలా జిల్లాల్లో సాగునీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చాయి.

కృష్ణా నది పరిధిలోనూ అదే పరిస్థితి..

దక్షిణ తెలంగాణలో కృష్ణా నది పరిధిలోని ప్రాజెక్టుల కింద పరిస్థితి విభిన్నంగా ఉంది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో చివరి ఆయకట్టుకు, మొక్కజొన్న పంటకు నీరు అందడం లేదు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు లేక, భూగర్భ జలాలు ఇంకిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు. గద్వాల ప్రాజెక్టు పరిధిలోని పొలాలకు సాగునీటితోపాటు భూగర్భ జలాలు కొంత ఆశాజనకంగా ఉన్నా... కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్‌ల కింద పొలాలకు నీరు అందడం లేదు. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సాగయ్యే వేరుశనగకు వారానికో తడి నీరు కూడా లేక, భూగర్భ జలాలు ఎండిపోవడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు.

బాగా పెరిగిన వరి సాగుతో..

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం.. యాసంగి సీజన్‌కు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరు వరకు రాష్ట్రంలో 69.22 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేపట్టారు. ఇందులో 53.24 లక్షల ఎకరాలు వరి పంటే. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 5 లక్షల ఎకరాలు అధికం కూడా. వరి తర్వాత మొక్కజొన్న 7.50 లక్షల ఎకరాల్లో సాగయింది. మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో కలిపి 2.35లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట వేశారు. రెండేసి లక్షల ఎకరాల్లో కందులు, జొన్నలు సాగయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుండటంతో ఈ సారి వరిసాగు భారీగా పెరిగింది. అయితే వరి సాగుకు నీటి వినియోగం ఎక్కువ. అందులోనూ వరి పొట్ట కొచ్చే సమయంలో నీళ్లు కీలకం. ఇలాంటి సమయంలో సాగునీరు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ కింద కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాలకు నీళ్లు అందుతుండగా.. అక్కడ కూడా వారబందీ విధానం పెట్టే ఆలోచనలో నీటిపారుదల శాఖ ఉంది. ఎస్సారెస్పీ నీటితో రెండు మూడేళ్లుగా యాసంగిలో సూర్యాపేట పొలాలకు నీరు అందగా.. ఈసారి ఎస్సారెస్పీ నీరు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో సాగునీటి సమస్యతో చాలా పొలాలు ఎండిపోయాయని, వాటిలో పశువులను మేపుతున్నామని రైతులు వాపోతున్నారు.

మొక్కజొన్న, వేరుశనగకు కూడా సమస్య..

రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో సాగైన మొక్కజొన్న, వేరుశనగ పంటలకు వారానికోసారి కూడా సాగునీళ్లు అందని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల్లో వేరుశనగ.. మెదక్, నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లో మొక్కజొన్న పంట ఎండిపోతోంది. నీటి విడుదల విషయంలో అధికారులకు సరైన అవగాహన లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని రైతులు అంటున్నారు.



జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన రైతు ఉప్పుల శ్రీను రెండెకరాల్లో వరి సాగు చేశారు. ఆయన తన పొలంలోని బోరు ఆధారంగానే ఏటా రెండు పంటలు సాగు చేసేవారు. కానీ బోరు ఎండిపోవడంతోపాటు చెరువుల్లోకి దేవాదుల రిజర్వాయర్ నీరు కూడా రాలేదు. దీనితో వరి ఎండిపోయింది. పంట చేతికి వచ్చే అవకాశం లేకపోవడంతో పొలాన్ని మూగజీవాలకు వదిలేశారు.



ఈ చిత్రంలోని వ్యక్తి మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లికి చెందిన బర్తపురం కొమిరెల్లి. ఆకేరు వాగు పక్కనే ఉన్న రెండున్నర ఎకరాల్లో యాసంగి వరిసాగు చేశారు. గతేడాది భారీ వర్షాలతో చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడంతో నీటి నిల్వ తగ్గింది. ఇప్పుడు పూర్తిగా ఎండిపోయింది. దీనితో పదిహేను రోజులుగా పొలానికి నీళ్లు లేక నెర్రెలు బారింది. లక్ష రూపాయల దాకా పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు పశువులను మేపడానికి తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఉందని కొమిరెల్లి కన్నీరు పెడుతున్నారు. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

12 ఎకరాల పొలం ఎండిపోతోంది

గోదావరి నీళ్ల మీద ఆశతో 12 ఎకరాల్లో వరి వేసిన. ఈసారి నీళ్లు తక్కువ వచ్చాయని పొలాలకు సరిగా వదలలేదు. వారబందీ పేరుతో రావలసిన నీళ్లను కూడా మూడు రోజులుగా ఇవ్వడం లేదు. రూ.మూడు లక్షలకుపైగా పెట్టుబడి పెట్టా. నీళ్లు సక్రమంగా విడుదల చేయక పంట ఎండిపోతోంది. కొన్నేళ్లుగా ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు. నీళ్లు బాగుంటే మరో 45 రోజుల్లో పంట చేతికి వచ్చేది. ఇట్లాగయితే ఎలా?

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం, జాజిరెడ్డిగూడెం మండలం, సూర్యాపేట జిల్లా

మహిళా సాధికారతకు డ్రోన్ల దన్ను

▶ మొదటి పేజీ తరువాయి

సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా, సబ్సిడీ రేట్లపై ఈ సంఘాలకు డ్రోన్ల అందజేతకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముందుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ ప్రాజెక్టు సాధించే విజయాలు, మహిళా సాధికారతకు డ్రోన్ల అందజేత ఏ మేరకు దోహదపడుతుందనే అంశాన్ని పరిశీలించిన తర్వాత మిగతా జిల్లాలకు విస్తరించాలనే ఆలోచనతో ఉన్నారు.

ఒక్కో మండలంలో ఒక్కో ఎస్‌హెచ్‌జీకి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మండలానికి చెందిన ఒక గ్రూపును ఎంపిక చేసి జాతీయ పథకం కింద ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలుస్తోంది. ఎస్‌హెచ్‌జీల్లోని మహిళా సభ్యులకు ఉపాధి అవకాశాల కల్పన ద్వారా ఆర్థిక స్వావలంబనతో పాటు రైతులకు తోడ్పాటును అందించాలనేది ఈ పథకం ముఖ్యోద్దేశం. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాంకేతికత వినియోగానికి కేంద్రం ప్రాచుర్యం కల్పిస్తున్న నేపథ్యంలో ఎస్‌హెచ్‌జీలకు 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను అందజేయనున్నారు. కేంద్రం ఒక్కో డ్రోన్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయిస్తుండగా...అందులో 80 శాతం అంటే రూ.8 లక్షలు సబ్సిడీగా కవర్ కానుంది. మిగతా రూ.2 లక్షలు మండల మహిళా సంఘాలు భరించాల్సి ఉంటుంది. డ్రోన్లను సరైన పద్ధతుల్లో ఉపయోగించేలా ఎస్‌హెచ్‌జీలకు శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. డ్రోన్లు కేటాయించిన తర్వాత మహిళా సంఘాలు వీటిని రైతులకు అద్దెకు అందుబాటులో ఉంచుతాయి. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి విధివిధానాలు ఖరారు కావాల్సి ఉంది.

కూలీల సమస్యకు చెక్

డ్రోన్లతో వరి, మామిడి, పత్తి, ఇతర పంటలకు ఎరువులు, పురుగు మందులు చల్లించడం ద్వారా రైతులకు కూలీల సమస్య ఏర్పడకుండా ఉంటుంది. ఇతర కార్యక్రమాలకు కూడా ఉపయోగిస్తారు. గతేడాది ఓ ప్రైవేట్ ఎన్జీవో సంస్థ...నిర్మల్ జిల్లాలోని కుబీర్ మండలానికి చెందిన ఇద్దరు మహిళలకు డ్రోన్లను అందజేయగా.. వాటిని వారు విజయవంతంగా నిర్వహిస్తూ రాబడిని పెంచుకున్న ఉదంతాన్ని ఓ అధికారి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌హెచ్‌జీలకు డ్రోన్లను అందజేయడం వల్ల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మహిళా సాధికారతకు అవకాశాలు మెండుగా ఉంటాయని అంచనా వేస్తున్నారు.

కృష్ణమ్మను చేరిన గోదారి

- రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా ఎన్‌ఎస్‌పీ కాల్వలోకి గోదావరి జలాలు
- 100 కి.మీ. ప్రయాణించి ఖమ్మం జిల్లాకు చేరిన నీరు
- గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ



బుధవారం రాత్రి రాజీవ్‌కెనాల్‌లో పారుతున్న గోదావరి జలాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఒక కీలకఘట్టం సాకారమైంది. ప్రాజెక్టులోని మూడు పంపుహౌస్‌ల నుంచి 100 కి.మీ. మేర ప్రయాణించిన గోదావరి జలాలు బుధవారం రాత్రి ఏన్కూరు మండలం అక్కినాపురం తండా 52వ కి.మీ. వద్ద ఎన్‌ఎస్‌పీ (నాగార్జునసాగర్ ప్రాజెక్టు) కాల్వకు చేరాయి. ఈ సందర్భంగా జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి.. పుష్పాభిషేకం చేశారు.

సాగర్ ఆయకట్టు స్థిరీకరణ: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని నాగార్జునసాగర్ ఆయకట్టుకు అందించేందుకు ప్రభుత్వం ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) నిర్మాణం చేపట్టింది. 8.6 కి.మీ. పొడవైన ఈ కెనాల్‌కు రూ.97 కోట్లు కేటాయించారు. గత ఏడాది మే నెలలో ప్రారంభమైన పనులు పూర్తికావడంతో జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో 7,500 ఎకరాలు, వైరా ప్రాజెక్టు కింద 17 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు సత్తుపల్లి, మధిర నియోజకవర్గంలోని మిగతా ఆయకట్టుకు కూడా సీతారామ పనులు పూర్తికాగానే నీరు అందనుంది.

104 కి.మీ. మేర కాల్వల తవ్వకం

సీతారామ ప్రాజెక్టులో భాగంగా 104 కి.మీ. మేర కాల్వల తవ్వకం పూర్తయ్యింది. జూలూరుపాడు మండలం వరకు ప్రాజెక్టు పూర్తికాగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంతమేరకు పెండింగ్‌లో ఉంది. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద, కూసుమంచి మండలం పాలేరు వద్ద టన్నెల్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరికొన్ని చోట్ల భూసేకరణ సమస్యలతో జాప్యం జరుగుతోంది. పాలేరు వరకు ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తి కావడానికి సమయం పట్టనుండగా ఏన్కూరు వద్ద ఎన్నెస్పీ కాల్వకు గోదావరి జలాలు చేర్చేలా రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టారు. దీంతో వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు తొలుత గోదావరి జలాలు అందుతున్నాయి.

1,500 క్యూసెక్కుల నీరు విడుదల

తొలిదశలో ఒక పంపుహౌస్‌లో ఒక మోటార్ నడిపించడం ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గంటకు మూడు కిలోమీటర్లు చొప్పున ప్రవహించిన నీరు జూలూరుపాడు మండలం వినోబానగర్ వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌కు బుధవారం చేరింది. ఇక్కడ నుంచి పరవళ్లు తొక్కుతూ 8.6 కి.మీ. ప్రవహించి ఏన్కూరు మండలం అక్కినాపురం తండా వద్ద ఎన్నెస్పీ కాల్వలో బుధవారం రాత్రి కలిశాయి. ఆపై 12 కి.మీ. ప్రయాణించి 38వ కి.మీ. వద్ద యూటీ నుంచి వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుతాయి. మధిర, సత్తుపల్లి మండలాలకు కూడా నీరు చేరుతుంది.



• యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీస్వామి వారు శ్రీకృష్ణుడి (మురళీ కృష్ణుడి) అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రంపొన్న వాహన సేవలో తిరు మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు.

– యాదగిరిగుట్ట

బాబూ.. ఇదేనా సమన్యాయం?

- కాళేశ్వరం అనుమతులు రద్దు చేయాలని లేఖ రాసింది మీరే కదా?
- చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రం పక్షపాతంతో తెలంగాణకు అన్యాయం
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



సిద్దిపేట/సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తనకు రెండు కళ్లు అంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు మాటలు నిజమైతే, రెండు రాష్ట్రాలకు సమన్యాయం ఎందుకు జరగటం లేదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వను ఎండబెట్టి, కుడి కాల్వ నిండుగా నీళ్లు తీసుకెళ్లడం సమ న్యాయమా? అని ప్రశ్నించారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ పక్షపాత ధోరణి వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రాన్ని ఎదిరించే ధైర్యం, చంద్రబాబును ప్రశ్నించే దమ్ము లేదని ఎద్దేవా చేశారు. నాగార్జునసాగర్ నుంచి ఏపీ 512 టీఎంసీల నీరు మాత్రమే వాడుకోవాల్సి ఉండగా, ఇప్పటికే 657 టీఎంసీలు వాడుకుందని తెలిపారు. తెలంగాణకు 343 టీఎంసీల నీళ్లు రావాల్సి ఉండగా, 220 టీఎంసీలు మాత్రమే వచ్చాయని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా సముద్రంలో కలిసే నీటిని మాత్రమే వాడుకుంటున్నామని చంద్రబాబు చెబుతున్న మాటలు అబద్ధమని మండిపడ్డారు. గోదావరి నీటిని పెన్నాకు తీసుకెళ్లడానికే ఈ ప్రాజెక్టు అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులు రద్దుచేయాలని 2018 జూన్ 13న కేంద్రానికి లేఖ రాసింది చంద్రబాబేనని గుర్తుచేశారు. సమన్యాయం కోరుకుంటే తెలంగాణలోని ప్రాజెక్టులపై వెంటనే కేంద్రానికి నో అబ్జెక్షన్ లెటర్ రాయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చలవతోనే సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు ఈ ప్రాజెక్టును వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు గోదావరి జలాల వద్ద ఫొటోలకు పోజులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

సాగునీటి సమస్య బీఆర్‌ఎస్ పాపమే

• మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గోదావరి బేసిన్‌లో సాగునీటి సమస్య, బీఆర్‌ఎస్ సర్కార్ పాపమేనని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం రాత్రి ఆయన మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడుతూ, గోదావరి, కృష్ణా జలాల సమస్యను ప్రస్తావించారు. కమీషన్లపై కక్కుర్తితో కాళేశ్వరం పేరిట మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు కట్టారని, తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మించకపోవడం అత్యంత నష్టదాయకమని అన్నారు. మేడిగడ్డ దగ్గర రక్షణ చర్యలు చేపట్టకపోతే, ఊళ్లు కొట్టుకుపోతాయని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిందని తెలిపారు. వీటిని పక్కనబెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా హరీశ్‌రావు ఆరోపణలు మానుకోవాలని హితవు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో వాటాలపై బీఆర్‌ఎస్ చేసిన పొరపాటు వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏపీకి కృష్ణా నీటిని ధారాదత్తం చేసిందని ఆరోపించారు. ఖరీఫ్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే ఎక్కువ వరి తెలంగాణలో పండిందని చెప్పారు. రబీలో 56 లక్షల ఎకరాలకు పైగానే సాగు జరుగుతోందని వివరించారు. రబీ యాక్షన్ ప్లాన్ ప్రకటించామని, ముందు ఇచ్చిన సమాచారం ప్రకారమే నీళ్లు ఇస్తున్నామని వెల్లడించారు.

అమెరికాలో కాల్పులు.. కేశంపేట యువకుడి మృతి

- ఎంఎస్ సెకండియర్ చదువుతున్న ప్రవీణ్



ప్రవీణ్‌కుమార్

కేశంపేట: ఉన్నత ఆశయాలతో అమెరికా వెళ్లిన ఓ విద్యార్థి.. అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో మృతిచెందాడు. ఈ ఘటన తల్లిదండ్రులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల కేంద్రానికి చెందిన వ్యాపారి గంప రాఘవులు, రమాదేవి దంపతులకు ప్రవీణ్‌కుమార్ (27), గాయత్రి సంతానం. గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన ప్రవీణ్.. అనంతరం 2023 ఆగస్టులో అమెరికాలోని మిల్వాకీ పట్టణంలో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌లో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. అదే పట్టణంలోని ఓ మాల్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది డిసెంబర్ 18న ఇంటికి వచ్చిన ప్రవీణ్ జనవరి 20న తిరిగి అమెరికా వెళ్లాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 2.50 నిమిషాలకు ప్రవీణ్ తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. అయితే కుటుంబ సభ్యులు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. తిరిగి ఉదయాన్నే వాట్సాప్ కాల్ చేయమని మెసేజ్ పెట్టినా ప్రవీణ్ నుంచి రిప్లయ్ రాలేదు. దీంతో ఉదయం 7 గంటలకు కుమారుడి ఫోన్‌కు కాల్ చేశారు. ఫోన్ లిఫ్ట్ చేసిన అవతలి వ్యక్తులు ప్రవీణ్ వివరాలను అడగటంతో సైబర్ నేరగాళ్లు అనుకుని ఫోన్ కట్ చేశారు. మరోసారి ప్రవీణ్‌తో కలిసి రూంలో ఉండే అతని మిత్రులకు ఫోన్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వివరాలు తెలుసుకున్న వారు గుర్తుతెలియని వ్యక్తులు మాల్‌లో ప్రవీణ్‌ను గన్‌తో కాల్చారని, బుల్లెట్ గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడని చెప్పడంతో కుటుంబ సభ్యులు కుప్పకూలారు. ప్రవీణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రోదిస్తున్న మృతుడి తల్లి

అండగా ఉంటాం: డీకే అరుణ

అమెరికాలో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ప్రవీణ్ తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. అనంతరం ఎంపీతో ఫోన్‌లో మాట్లాడించారు. వివరాలను అందిస్తే మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెచ్చేందుకు కృషి చేస్తామని ఆమె వారికి హామీ ఇచ్చారు.

'శ్రీశైలం' భద్రతపై నేడు ఎన్డీఎస్‌ఏ సమీక్ష

- తెలంగాణ ఈఎన్‌సీ లేఖపై స్పందించిన ఎన్డీఎస్‌ఏ చైర్మన్
- ఏపీ, తెలంగాణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని.. తక్షణమే జోక్యం చేసుకోవాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ రాసిన లేఖపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) స్పందించింది. ఎన్డీఎస్‌ఏ చైర్మన్ గురువారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ, తెలంగాణ అధికారులతో సమావేశం నిర్వహించి శ్రీశైలం జలాశయానికి మరమ్మతుల నిర్వహణపై చర్చించనున్నారు. 2009లో వచ్చిన భారీ వరదలతో ప్రాజెక్టు స్పిల్‌వే దిగువన నీళ్లుపడే ప్రాంతంలో భారీ గుంత (ప్లంజ్ పూల్) ఏర్పడిందని గత నెలలో ఎన్డీఎస్‌ఏకి రాసిన లేఖలో అనిల్‌కుమార్ గుర్తుచేశారు. ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో.. క్రమంగా ప్లంజ్ పూల్ విస్తరిస్తూ, జలాశయానికి ముప్పుగా పరిణమించిందని ఆ లేఖలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయాన్ని 14 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా డిజైన్ చేయగా.. 2009లో ఏకంగా 25 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని వివరించారు. భారీగా నీటిని విడుదల చేయడంతో స్పిల్‌వేకు దిగువన భూమి కోతకు గురై భారీ గుంత ఏర్పడిందని తెలిపారు. శ్రీశైలం జలాశయానికి ప్రమాదం జరిగితే దిగువ ప్రాంతాలను భారీ వరద ముంచేస్తుందని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో తీవ్ర విపత్తును సృష్టిస్తుందని ఆ లేఖలో అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికా ఈజ్ బ్యాక్

కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

'అమెరికా స్వర్ణయుగం' ఇప్పుడే మొదలైంది

- మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించే దేశాలను వదిలిపెట్టం
- వచ్చే నెల 2 నుంచి ఆయా దేశాలపై టారిఫ్‌ల మోత తప్పదు
- పనామా కాలువ, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటాం
- శాంతిని కోరుకుంటున్నట్లు రష్యా నుంచి సంకేతాలు అందాయి
- శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నానని జెలెన్‌స్కీ లేఖ రాశారు
- మతిలేని యుద్ధాన్ని ఆపేయాల్సిన సమయం ఇదే..
- కాంగ్రెస్‌లో అమెరికా అధ్యక్షుడి 100 నిమిషాల రికార్డు ప్రసంగం



వాషింగ్టన్: 'అమెరికా స్వర్ణయుగం' ఇప్పుడే మొదలైందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. 'అమెరికా ఈజ్ బ్యాక్' అని ఉద్ఘాటించారు. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' కోసం తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా శ్రమిస్తోందని స్పష్టంచేశారు. అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మార్చబోతున్నామని చెప్పారు. అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మంగళవారం రాత్రి అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ట్రంప్ మొదటిసారిగా మాట్లాడారు. ఏకంగా ఒక గంట 40 నిమిషాలకుపైగా ప్రసంగించి సరికొత్త రికార్డు సృష్టించారు. తొలి జాయింట్ సెషన్ ఆఫ్ పార్లమెంట్‌లో గానీ, తొలి స్టేట్ ఆఫ్ ద యూనియన్ స్పీచ్‌లో గానీ అధ్యక్షుడు 100 నిమిషాలపాటు సుదీర్ఘంగా మాట్లాడడం అమెరికా చరిత్రలో ఇదే ప్రథమం. ఇప్పటిదాకా బిల్ క్లింటన్ పేరిట ఉన్న రికార్డును ట్రంప్ తిరగరాశారు. 2000 సంవత్సరంలో అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ స్టేట్ ఆఫ్ ద యూనియన్ స్పీచ్‌లో ఒక గంట 28 నిమిషాల 49 సెకండ్ల పాటు ప్రసంగించారు. డొనాల్డ్ ట్రంప్ తన తాజా ప్రసంగంలో పలు కీలక అంశాలపై స్పందించారు. సరిహద్దు భద్రత, టారిఫ్‌లు, రష్యా–ఉక్రెయిన్ శాంతి ఒప్పందం, ఇంధన భద్రత, ధరల పెరుగుదల, అక్రమ వలసలు తదితర అంశాలపై తన వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారు. పనామా కాలువను స్వాధీనం చేసుకుంటామని, గ్రీన్‌ల్యాండ్‌పై నియంత్రణ సాధిస్తామని తేల్చిచెప్పారు. ట్రంప్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

ప్రతి దేశం మమ్మల్ని దగా చేస్తోంది

''ఇండియాతోపాటు ఇతర దేశాలు అమెరికా ఉత్పత్తులపై అధికంగా సుంకాలు విధిస్తున్నాయి. ఇలా చేయడం ముమ్మాటికీ అన్యాయమే. యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, ఇండియా, మెక్సికో, కెనడా తదితర దేశాల టారిఫ్‌ల గురించి విన్నారా? ఇండియాలో అయితే ఆటో టారిఫ్‌లు 100 శాతానికిపైగా విధిస్తున్నారు. చాలాదేశాలు దశాబ్దాలుగా మా ఉత్పత్తులపై సుంకాల రూపంలో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు సుంకాల మోత మోగిస్తున్నాయి. ఈ భూగోళంపై ఉన్న దాదాపు ప్రతి దేశం మమ్మల్ని దగా చేస్తోంది. ఇకపై ఈ దోపిడీ సాగడానికి వీల్లేదు. ఇప్పుడు మా వంతు వచ్చింది. మా ఉత్పత్తులపై సుంకాలు విధించే దేశాల ఉత్పత్తులపై మేము కూడా అదే స్థాయిలో సుంకాలు వసూలు చేస్తాం. వచ్చే నెల 2వ తేదీ నుంచే ఇవి అమల్లోకి వస్తాయి. ఆయా దేశాలు వారి ఉత్పత్తులను అమెరికాలో తయారు చేయకపోతే టారిఫ్‌లు చెల్లించాల్సిందే. ట్రంప్ పాలనలో కొన్ని సందర్భాల్లో టారిఫ్‌లు చాలాచాలా అధికంగా ఉంటాయని గుర్తుంచుకోవాలి. ఎవరైనా వారి మార్కెట్లలోకి మమ్మల్ని రానివ్వకపోతే మేము కూడా అదే పనిచేస్తాం. మా మార్కెట్లలోకి వారిని అడుగు పెట్టనివ్వం.

జెలెన్‌స్కీ లేఖ ప్రశంసనీయం

ఉక్రెయిన్‌తో ఘర్షణకు ముగింపు పలికి, శాంతిని కోరుకుంటున్నట్లు రష్యా నుంచి నాకు బలమైన సంకేతాలు అందాయి. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ నుంచి నాకు ఈరోజే ఒక ముఖ్యమైన లేఖ అందింది. శాంతి సాధన కోసం సాధ్యమైనంత త్వరగా చర్చలు ప్రారంభం కావాలని ఆయన కోరుకుంటున్నారు. ఇప్పుడు ఉక్రెయిన్ ప్రజల కంటే మిన్నగా శాంతిని ఆకాంక్షిస్తున్నవారు ఎవరూ లేరని లేఖలో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇది నిశ్చయంగా శుభ పరిణామం. శాశ్వత శాంతి కోసం ట్రంప్ నాయకత్వంలో పని చేస్తామని జెలెన్‌స్కీ, ఆయన బృందం చెప్పారు. ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న సాయాన్ని మర్చిపోలేమని వారు తెలిపారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాన్ని అమెరికా కాపాడుతుందని వారు ఆశిస్తున్నారు. అదే సమయంలో అరుదైన ఖనిజాల సరఫరాతోపాటు ఉక్రెయిన్ భద్రత విషయంలో ఒప్పందంపై ఏ సమయంలోనైనా సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నామని జెలెన్‌స్కీ నా దృష్టికి తీసుకొచ్చారు. జెలెన్‌స్కీ రాసిన లేఖ ప్రశంసనీయం. క్రూరమైన యుద్ధం వల్ల ఉక్రెయిన్, రష్యాలో ఇప్పటికే లక్షలాది మంది అన్యాయంగా బలైపోయారు. చాలామంది క్షతగాత్రులుగా మారారు. ఈ మారణకాండ ఆగిపోవాల్సిందే. మతిలేని యుద్ధాన్ని ఆపేయాల్సిన సమయం ఇదే. ఉక్రెయిన్‌లో ఘర్షణకు తెరదించడానికి నేను ఎంతగానో కష్టపడుతున్నా. రష్యా ప్రతినిధులతో ఇటీవలే చర్చలు జరిపాం. శాంతి కోసం సిద్ధంగా ఉన్నట్లు వారు బలమైన సంకేతాలిచ్చారు. ఇది నిజంగా ఎంతో అద్భుతంగా ఉంది కదా.

కాశ్ పటేల్‌కు కృతజ్ఞతలు

2021 ఆగస్టులో అఫ్గానిస్తాన్ ఎయిర్‌పోర్టు వద్ద పేలుళ్లకు పాల్పడి 13 మంది అమెరికా సైనికులను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాది మహమ్మద్ షరీఫుల్లాను అరెస్టు చేశామని తెలియజేయడానికి సంతోషిస్తున్నా. పాకిస్తాన్ సాయంతో అతడిని బంధించాం. అమెరికాకు తరలిస్తున్నాం. సత్వరమే చట్టప్రకారం విచారణ చేపట్టి, అతడిని శిక్షిస్తాం. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. గతంలో అప్పటి పాలకులు న్యాయ వ్యవస్థను రాజకీయ ప్రత్యర్థులపై ఆయుధంగా వాడుకున్నారు. ఇప్పుడు న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని కాశ్ పటేల్ పునరుద్ధరించారు. కాశ్ పటేల్ ముందుముందు గొప్ప పనులు చేయబోతున్నారు. అలాగే లింగ మార్పిడి చర్యలకు మేము వ్యతిరేకమే. లింగ మార్పిడిని శాశ్వతంగా నిషేధిస్తూ, దాన్ని నేరంగా పరిగణించే బిల్లును ఆమోదించాలని కాంగ్రెస్‌ను కోరుతున్నా. చిన్నారుల్లో క్యాన్సర్, ఆటిజం కేసులను తగ్గించడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మన పర్యావరణం నుంచి విషకారకాలను, ఆహార పదార్థాల అన్ని రకాల విష రసాయనాలను తొలగించి, చిన్నారులను ఆరోగ్యంగా, బలంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.

డ్రిల్ బేబీ డ్రిల్

అమెరికాలో ఇప్పుడు ధరల పెరుగుదలతోపాటు అనేక సమస్యలకు గత జో బైడెన్ ప్రభుత్వమే కారణం. బైడెన్ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్రవ్యోల్బణ సమస్య వేధిస్తోంది. ఏ దేశానికీ లేని విధంగా మన కాళ్ల కింద ద్రవ రూపంలో బంగారం ఉంది. ముడి చమురు, సహజ వాయువును వెలికితీస్తే ద్రవ్యోల్బణ సమస్య పరిష్కారమవుతుంది. బైడెన్ పాలనలో వందకుపైగా విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు మూసివేశారు. వాటిని మళ్లీ తెరవబోతున్నాం. ఇంధన వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టాం. నేను అధికారంలోకి రాగానే జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితి విధించా. కాళ్ల కింద ఉన్న బంగారాన్ని తవ్వితీస్తే ఇంధన ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయి. ప్రజలకు మేలు జరుగుతుంది. దాన్ని డ్రిల్ బేబీ డ్రిల్ అంటారు. అమెరికా పౌరులందరికీ సామాజిక భద్రత కల్పించడమే మా ధ్యేయం. 300 ఏళ్ల వయసున్న వ్యక్తి కూడా ప్రభుత్వం నుంచి సాయం అందుకొనే విధానం తీసుకొస్తాం. అక్రమ వలసలపై మా వైఖరేమిటో ఇప్పటికే బయటపెట్టాం. అక్రమ వలసదార్లను బయటకు పంపిస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు. అక్రమ వలసను అరికట్టడానికి సరిహద్దులను దుర్భేద్యంగా మారుస్తాం'' అని డొనాల్డ్ ట్రంప్ వివరించారు.

సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌గా 13 ఏళ్ల బాలుడు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. టెక్సాస్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు, క్యాన్సర్ విజేత డీజే డేనియల్‌ను సీక్రెట్ సర్వీస్ గౌరవ ఏజెంట్‌గా నియమించారు. కాంగ్రెస్ తొలి సంయుక్త సమావేశంలో డీజే విజయగాథను ట్రంప్ పంచుకున్నారు. '2018లో డీజేకు అరుదైన కేన్సర్ నిర్ధారణ అయ్యింది. ఐదు నెలలే బతుకుతాడని డాక్టర్లు చెప్పారు. కానీ.. పోలీసు ఆఫీసర్ కావాలన్న లక్ష్యం ఆయనకు పోరాడే స్థైర్యాన్నిచ్చింది. కేన్సర్‌ను ఓడించిన డీజే తన కలను నిజం చేసుకోబోతున్నాడు. అతనికి పెద్ద గౌరవాన్ని ఇస్తున్నా. డీజేను యూఎస్ సీక్రెట్ సర్వీస్ గౌరవ ఏజెంట్‌గా చేయాలని డైరెక్టర్ సీన్ కరన్‌ను అడుగుతున్నా' అని ప్రకటించారు. దీంతో సభంతా చప్పట్లతో హోరెత్తింది. సభ మొత్తం 'డీజే... డీజే' అని హోరెత్తగా గ్యాలరీలో అతని తండ్రి డీజేను గాల్లోకి ఎత్తాడు. సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కరన్ ఆ బాలుడి దగ్గరకు వెళ్లి అధికారిక బ్యాడ్జీని అందజేశారు.

ఆ దేశాలకు రాయితీలు బంద్

''పొరుగు దేశాల నుంచి ఫెంటానిల్ వంటి ప్రాణాంతక మాదక ద్రవ్యాలు అమెరికాలోకి అక్రమంగా వచ్చి పడుతున్నాయి. డ్రగ్స్ కారణంగా వేలాది మంది అమెరికా పౌరులు అకాల మరణం చెందుతున్నారు. కుటుంబాలు కూలిపోతున్నాయి. యువతీ యువకులు ప్రాణాలు కోల్పోతుండడం బాధ కలిగిస్తోంది. ఇలాంటి విషాదం ఎప్పుడూ చూడలేదు. అమెరికా నుంచి వందల బిలియన్ డాలర్ల సబ్సిడీలు పొందుతున్న దేశాలు చేస్తున్న నిర్వాకమిది. కెనడా, మెక్సికో దేశాలకు ఎన్నో రాయితీలు ఇస్తున్నాం. వందల బిలియన్ల డాలర్ల సొమ్ము ఖర్చు చేస్తున్నాం. ఇకపై ఇలాంటి త్యాగాలకు మేము సిద్ధంగా లేము. మాకు నష్టం కలిగిస్తున్న దేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ రాయితీలిచ్చే ప్రసక్తే లేదు''.

గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగం కావాల్సిందే

''పనామా కాలువను మా అధీనంలోకి తీసుకోవడానికి మావద్ద ప్రణాళికలు ఉన్నాయి. మా జాతీయ భద్రతను మరింత పటిష్టం చేసుకోవడానికి పనామా కాలువను నియంత్రణలోకి తెచ్చుకోక తప్పదు. ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభమైంది. జిమ్మీ కార్టర్ ప్రభుత్వం కేవలం ఒక్క డాలర్‌కు పనామా కాలువను ఇతరులకు ఇచ్చేసింది. అప్పట్లో కుదిరిన ఒప్పందాలు పదేపదే ఉల్లంఘనకు గురవుతున్నాయి. ఇక మాది మేం తీసుకుంటాం. గ్రీన్‌లాండ్ సైతం అమెరికాలో భాగం కాక తప్పదు. ఒక మార్గంలో కాకపోతే మరో మార్గంలో గ్రీన్‌ల్యాడ్‌ను స్వాధీనం చేసుకుంటాం. సొంత భవిష్యత్తును నిర్ణయించుకొనే హక్కు గ్రీన్‌లాండ్ ప్రజలకు ఉంది. అమెరికా పౌరులుగా మారాలనుకుంటే సాదర స్వాగతం పలుకుతాం. గ్రీన్‌లాండ్ ప్రజలను భద్రంగా చూసుకుంటాం''.

మీరు కోరుకుంటే.. ఏ యుద్ధానికైనా రెడీ

ట్రంప్ టారిఫ్‌లకు చైనా ఘాటైన సమాధానం

వాషింగ్టన్: ఫెంటానిల్ అంశంపై ట్రంప్ ప్రభుత్వం తమ దేశంపై టారిఫ్‌లు విధించడంపై అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ఘాటుగా స్పందించింది. ఈ విషయంలో అమెరికా ప్రభుత్వం తమ దేశంతో ముందుగా సమానస్థాయిలో సంప్రదింపులు జరపాలని కోరింది. 'అమెరికా నిజంగా ఫెంటానిల్ సమస్యను పరిష్కరించాలనుకుంటే, చైనాను సమాన స్థాయిలో గుర్తిస్తూ సంప్రదింపులు జరపడం సరైన విధానం. ఒకవేళ అమెరికా కోరుకునేది యుద్ధమే అయితే, టారిఫ్ యుద్ధం, వాణిజ్యం యుద్ధం, మరెలాంటి యుద్ధమైనా మేం తుది వరకు పోరాడేందుకు సిద్ధం'అంటూ ఓ ప్రకటనలో సవాల్ విసిరింది. చైనా దిగుమతులపై టారిఫ్‌ల పెంపునకు ఫెంటానిల్ డ్రగ్ అంశాన్ని సాకుగా చూపడంపై చైనా విదేశాంగ శాఖ ఖండించింది. ఈ విషయంలో హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడం చైనా తీసుకుంటున్న చర్యలు అవసరమైనవి, న్యాయబద్ధమైనవి అని ఆ దేశ విదేశాంగ శాఖ సమర్థించుకుంది. 'అసలు ఫెంటానిల్ సమస్యకు అమెరికానే కారణం తప్ప, వేరొకరు కాదు. ఈ విషయంలో అమెరికాకు మేం ఎంతో సాయం చేశాం. మా ప్రయత్నాలను గుర్తించడానికి బదులుగా అమెరికా, మాపైనే నింద మోపుతోంది'అని చైనా దౌత్య కార్యాలయం ఆ ప్రకటనలో తెలిపింది.

పుతిన్‌ను బుజ్జగిస్తూ మాతో కయ్యమా: ట్రూడో

టొరంటో: కెనడాపై అమెరికా ప్రభుత్వం టారిఫ్‌లు విధించడాన్ని మూర్ఖత్వంగా ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో అభివర్ణించారు. కెనడాపై వాణిజ్య యుద్ధానికి తెరలేపిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను బుజ్జగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ట్రంప్ తాజాగా విధించిన 25 శాతం టారిఫ్‌లకు ప్రతీకారంగా అమెరికా వస్తువులపై 100 బిలియన్ డాలర్ల మేర టారిఫ్‌లు విధిస్తామని స్పష్టం చేశారు. 'అమెరికా తన అత్యంత ఆత్మీయ, మిత్ర దేశంపై వాణిజ్య యుద్ధాన్ని మొదలుపెట్టింది. అదే సమ యంలో, రష్యాకు అనుకూలంగా మాట్లాడుతోంది. ఒక అబద్ధాలకోరు, దుర్మార్గపు నియంత అయిన పుతిన్‌ను బుజ్జగించే పనులు చేస్తోంది'అని ట్రూడో నిప్పులు చెరిగారు. 'అమెరికాకు 51వ రాష్ట్రంగా కెనడాను ఎన్నటికీ కానివ్వం. డొనాల్డ్ అనే అమెరికన్‌కు నేరుగా ఈ విషయం స్పష్టం చేస్తున్నాను'అంటూ నేరుగా ట్రంప్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

రాహుల్‌కు రూ.200 జరిమానా

లక్నో కోర్టు ఆదేశం

లక్నో: కేసు వాయిదాకు హాజరు కాని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి లక్నోలోని కోర్టు రూ.200 జరిమానా విధించింది. 2022లో మహారాష్ట్రలో స్వాతంత్ర్య యోధుడు వీర్ సావర్కర్‌ను 'బ్రిటిష్ పాలకులకు సేవకుడు'అంటూ చేసిన వ్యాఖ్యల కేసులో రాహుల్ బుధవారం అదనపు చీఫ్ జ్యుడీషియల్ కోర్టులో హాజరు కావాల్సి ఉంది. బిజీగా ఉన్నందున రాహుల్ ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయారని, ఆయన్ను మినహాయించాలంటూ లాయర్ కోరారు. అయితే, రాహుల్‌కు రూ.200 జరిమానా విధిస్తూ ఆదేశాలిచ్చిన కోర్టు, ఆ మొత్తాన్ని ఫిర్యాదుదారు లాయర్‌కు అందజేయాలంది. ఏప్రిల్ 14న జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే తీవ్రంగా పరిగణించాల్సి వస్తుందని కోర్టు స్పష్టం చేసింది.

జూలై 3 నుంచి అమర్‌నాథ్ వార్షిక యాత్ర

జమ్మూ: హిమాలయాల్లో 3,880 మీటర్ల ఎత్తున నెలకొన్న పవిత్ర అమర్‌నాథ్ ఆలయ వార్షిక యాత్ర జూలై 3 నుంచి ప్రారంభం కానుంది. బుధవారం అమర్‌నాథ్ ఆలయ బోర్డు 48వ సమావేశం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన రాజ్ భవన్‌లో జరిగింది. జూలై 3న అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్, గండెర్‌బల్ జిల్లా బాల్టాల్ నుంచి ఏకకాలంలో మొదలుకానుందని, ఆగస్టు 9వ తేదీన రక్షాబంధన్‌తో ముగియనుందని అనంతరం రాజ్‌భవన్ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

రాకెట్ లాంచర్ కేంద్రం నిర్మాణ పనులు ఆరంభం

సేలం: తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్నంలో కొత్త రాకెట్ లాంచర్ కేంద్రం నిర్మాణ పనులు బుధవారం మొదలయ్యాయి. 2024 ఫిబ్రవరిలో ప్రధాని మోదీ రాకెట్ లాంచింగ్ కేంద్రానికి భూమి పూజ చేశారు. ఇందులో భాగంగా అధికారులు 2,233 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోనున్నారు. కులశేఖరపట్నంలో ఇస్రో డైరెక్టర్, అధికారులు భూమి పూజతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏడాది లోగా ఈ పనులు పూర్తవుతాయని చెబుతున్నారు.

నేడు ఉత్తరాఖండ్‌కు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఉత్తరాఖండ్‌లో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ముఖ్వాలో గంగా మాతకు పూజలు చేస్తారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం, ఆయన ట్రెక్, బైక్ ర్యాలీని ప్రారంభించనున్నారు. హర్సిల్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

త్వరలో మన ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- దేశంలో ఆర్థిక ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి
- ప్రజలపై, నూతన ఆవిష్కరణలపై భారీగా పెట్టుబడులు పెట్టాలి
- ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తుకు బ్లూప్రింట్



న్యూఢిల్లీ: భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు (రూ.435.17 లక్షల కోట్లు) చేరుకోవడం ఇక ఎంతోదూరంలో లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. దేశంలో ఆర్థిక ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై, నవీన ఆవిష్కరణలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని భాగస్వామ్యపక్షాలకు పిలుపునిచ్చారు. ఆర్థిక వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి పెట్టుబడులు అత్యంత కీలకమని వివరించారు. 'బడ్జెట్ అనంతరం ఉద్యోగాలు, ఉపాధి కల్పన'పై బుధవారం జరిగిన వెబినార్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. 2014 నుంచి తమ ప్రభుత్వం 3 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చిందని అన్నారు. దేశవ్యాప్తంగా 1,000 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని, ఐదు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లు నెలకొల్పాలని నిర్ణయించినట్లు తెలిపారు. 2015 నుంచి 2025 దాకా ఇండియా ఆర్థిక వ్యవస్థ 66 శాతం వృద్ధి చెందినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఐఎంఎఫ్ నివేదిక వెల్లడించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 3.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని హర్షం వ్యక్తంచేశారు. వెబినార్‌లో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

సరైన దిశలో సరైన పెట్టుబడులు

''ప్రపంచంలోని అత్యున్నత ఆర్థిక వ్యవస్థలను మనం అధిగమించాం. ఇండియా త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం తథ్యం. ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టాలంటే సరైన దిశలో సరైన పెట్టుబడులు పెట్టడం అత్యంత కీలకం. ఇందుకోసం కేంద్ర బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశాం. వాటిని అమలు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. భాగస్వామ్యపక్షాలన్నీ ఇందులో పాలు పంచుకోవాలి.

ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్లు

విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాం. ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తుకు బ్లూప్రింట్‌గా నిలుస్తుంది. మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, ప్రజలు, ఆర్థికం, నవీన ఆవిష్కరణలపై పెట్టుబడులకు సరిసమాన ప్రాధాన్యం ఇస్తున్నాం. యువతలో ప్రాక్టికల్ స్కిల్స్ పెంచడానికి, నూతన అవకాశాలు కల్పించడానికి 'పీఎం ఇంటర్న్‌షిప్ పథకం' ప్రవేశపెట్టాం. పరిశ్రమ వర్గాలు సైతం ఈ పథకంలో భాగస్వామిగా మారాలి. ఈ ఏడాది బడ్జెట్‌లో అదనంగా 10 వేల మెడికల్ సీట్లు ప్రకటించాం. రాబోయే ఐదేళ్లలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

గ్లోబల్ టూరిజం, వెల్‌నెస్ హబ్‌గా ఇండియా

పర్యాటక రంగంలో ఉద్యోగాల కల్పనకు ఎన్నో అవకాశాలున్నాయి. అందుకే ఈ రంగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టేటస్ కల్పించాలని నిర్ణయం తీసుకున్నాం. దేశ జీడీపీలో 10 శాతం సమకూర్చగల సత్తా పర్యాటక రంగానికి ఉంది. దేశంలో 50 ప్రాంతాలను అద్భుతమైన పర్యాటక క్షేత్రాలుగా అభివృద్ధి చేయబోతున్నాం. అక్కడి హోటళ్లకు ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తాం. దీనివల్ల టూరిజం అభివృద్ధి చెందడంతోపాటు స్థానిక యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

అర్బన్ చాలెంజ్ ఫండ్‌కు రూ.లక్ష కోట్లు

జనాభా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ చాలా కీలకం. ఇందులో భాగంగా అర్బన్ చాలెంజ్ ఫండ్‌కు రూ.లక్ష కోట్లు కేటాయించాలని నిర్ణయించాం. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ కోసం ప్రైవేట్ రంగం.. ప్రధానంగా రియల్ ఎస్టేట్ చొరవ తీసుకోవాలి. దేశ ఆర్థిక ప్రగతిలో కృత్రిమ మేధ పాత్ర ఎంతో కీలకం. అందుకే ఏఐ ఆధారిత విద్య, పరిశోధనల కోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాం. ఏఐ కెపాసిటీని అభివృద్ధి చేయడానికి నేషనల్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌ను ఏర్పాటు చేయబోతున్నాం'' అని ప్రధాని మోదీ వివరించారు.

ఐఏఎస్‌లది ఆధిపత్య ధోరణి

- ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై పెత్తనం చలాయించాలని చూస్తారు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: ఐఏఎస్ అధికారులు ఎప్పుడూ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై ఆధిపత్యం ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. అందుకే ఐఏఎస్‌ల మాట మేం ఎందుకు వినాలనే అసహనం, అసంతృప్తి ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల్లో గూడుకట్టుకుపోయిందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఒక కేసును జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. అటవీ అధికారులు తమ ఆదేశాలను పాటించాలని ఐఏఎస్ అధికారులు కోరడంపై ధర్మాసనం విస్తృతంగా చర్చించింది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్, ఇండియన్ పోలీస్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ అధికారుల మధ్య జరుగుతున్న ఈర్ష్య యుద్ధాన్ని ప్రస్తావిస్తూ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఏఎస్‌లకు ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు మధ్య బేధాభిప్రాయాలు లేవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనను జడ్జి తప్పుబట్టారు. ''నేను ప్రభుత్వ న్యాయవాదిగా మూడేళ్లు పనిచేశా. న్యాయమూర్తిగా 22 ఏళ్లుగా సేవలందిస్తున్నా. ఇన్నేళ్లలో నేను గమనించింది ఏంటంటే ఐఏఎస్‌లు ఎప్పుడూ ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లపై ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని చూస్తుంటారు. ఈ వివాదం అన్ని రాష్ట్రాల్లో ఉంది. అందరూ ఒకే అఖిల భారత సర్వీస్‌లకు సంబంధించిన ఉన్నతాధికారులమే అయినప్పుడు ఐఏఎస్‌ల మాటే ఎందుకు వినాలి? అనే అసంతృప్తి ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లలో ఉంది. ఈ విధానం మారాలి. ఈ విషయంలో అందర్నీ సమానంగా చూడాలని భావన ఐఏఎస్‌లలో కల్పించండి'' అని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు జస్టిస్ గవాయ్ సూచించారు. అధికారుల మధ్య ఉన్న అంతర్గత వివాదాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని కేంద్రం తరఫున తుషార్ కోర్టుకు తెలిపారు. జడ్జీలు కేసు తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదావేశారు.

కేదార్‌నాథ్, హేమకుండ్ సాహిబ్‌జీలకు రోప్‌వేలు

కేంద్ర కేబినెట్ ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు కొత్తగా రోప్‌వేలను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కేదార్‌నాథ్‌కు నడక దారి ద్వారా ప్రయాణం చేసే భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఇలా తీపి కబురు అందించింది. గౌరీకుండ్ నుంచి ట్రెక్కింగ్ చేస్తూ కేదార్‌నాథ్ ఆలయానికి చేరుకోవాలంటే ఇన్నాళ్లూ 8– 9 గంటల సమయం పట్టేది. ఈ రోప్‌వే అందుబాటులోకి వస్తే ఇందులో కేవలం 36 నిమిషాల్లో కేదర్‌నాథ్ చేరుకోవచ్చు. గౌరీకుండ్ నుంచి కేదర్‌నాథ్‌కు, కేదర్‌నాథ్ నుంచి గౌరీకుండ్‌కు అదే సమయం పడుతుందని కేంద్రం పేర్కొంది. నేషనల్ రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ అయిన పర్వతమాల పరియోజన పథకంలో భాగంగా సోన్‌ప్రయాగ్ నుంచి కేదర్‌నాథ్‌కు ఒక రోప్‌వే, గోవింద్‌ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్‌జీకు మరో రోప్‌వేను నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. సోన్‌ప్రయాగ్ నుంచి కేదర్‌నాథ్ వరకు 12.9 కిలోమీటర్ల పొడవైన రోప్‌వే నిర్మాణ ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది. ఈ రోప్‌వే ప్రాజెక్టుకు దాదాపు రూ.4,081 కోట్ల వ్యయం అవుతుంది. రూ.2,730.13 కోట్ల వ్యయంతో గోవింద్‌ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్‌జీ మధ్య 12.4 కి.మీ పొడవైన రోప్‌వే నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు మొత్తంగా రూ.6,811 కోట్ల వ్యయం కానుంది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ రోప్‌వేల నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

లోక్‌సభ సీట్లు తగ్గించేందుకు కేంద్రం కుట్ర: స్టాలిన్

దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో జేఏసీకి అఖిలపక్షం నిర్ణయం

సాక్షి, చెన్నై: జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన పేరిట దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. సమాఖ్య విధానానికి గొడ్డలిపెట్టుగా మారిన కేంద్ర ప్రభుత్వ చర్యలపై దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. బుధవారం చెన్నైలోని తమిళనాడు సచివాలయంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో స్టాలిన్ మాట్లాడారు. 1971 జనగణనను ప్రాతిపదికగా తీసుకుంటూ 2026 నుంచి మరో 30 ఏళ్లపాటు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టరాదని స్టాలిన్ చేసిన ప్రతిపాదనను అఖిలపక్షం ఆమోదించింది. 'జనాభా ప్రతిపదికన పునర్విభజన జరిగిన పక్షంలో తమిళనాడులోని 39 ఎంపీ స్థానాలు 31కి తగ్గే ప్రమాదం ఉంది. ఇదే పరిస్థితి ఇతర దక్షిణాది రాష్ట్రాలలోనూ ఎదురు కానుంది. ఇప్పుడే కేంద్రం చర్యలను అడ్డుకోవాలి. పోరాటాలతో హక్కులను సాధించుకోవాలి' అని అఖిపలపక్షం తీర్మానించింది. దీనికి తమిళనాడులోని అన్నాడీఎంకే, కాంగ్రెస్, పీఎంకే, తదితర సుమారు 50 పార్టీలు మద్దతు ప్రకటించాయి. కేంద్రం చర్యలకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

విదేశీ సాయాన్ని స్తంభింపజేయలేం

వేల కోట్ల నిధులను ఆపాలన్న ట్రంప్ సర్కార్ అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీం

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి అమెరికా దేశ సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. విదేశాలు, విదేశాల్లోని సంస్థలకు సాయం అందకుండా 'యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్)కు సంబంధించిన వేల కోట్ల రూపాయల నిధులను స్తంభింపజేయాలని ప్రభుత్వం కోరగా అందుకు సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. 5–4 మెజార్టీతో 9 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం ప్రభుత్వ వ్యతిరేక తీర్పును వెలువరించింది. విదేశీ సాయానికి సంబంధించిన ఎన్‌జీవోలు, కాంట్రాక్టర్లు ఇప్పటికే 2 బిలియన్ డాలర్ల విలువైన పనులు పూర్తిచేయగా అమెరికా ఆ మొత్తాలను చెల్లించాల్సి ఉంది. దీనికి ట్రంప్ ప్రభుత్వం ససేమిరా అనడంతో రెండు విదేశీసాయం సంస్థలు అక్కడి జిల్లా కోర్టులో గత నెలలో కేసు వేశాయి. 90 రోజులపాటు విదేశీసాయాన్ని ఆపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అవి సవాల్ చేశాయి. దీంతో జడ్జి అమీర్ అలీ సైతం ప్రభుత్వ చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఫిబ్రవరి 26 తేదీలోపు పూర్తిచేసిన పనులకు చెల్లింపులు జరపాలని తీర్పు చెప్పారు. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

ఉక్రెయిన్‌కు మరో షాక్

నిఘా సమాచారాన్ని నిలిపేసిన అమెరికా

వాషింగ్టన్: అమెరికా నుంచి ఆయుధాలతోపాటు నిఘా సాయం పొందుతున్న ఉక్రెయిన్‌కు అగ్రరాజ్యం భారీ షాక్ ఇచ్చింది. యుద్ధంలో రష్యాపై సాంకేతికంగా పైచేయి సాధించడంలో అక్కరకొచ్చే నిఘా సమాచారాన్ని ఇకపై మీకు ఇవ్వబోమని ఉక్రెయిన్‌కు అమెరికా స్పష్టంచేసింది. ఈ విషయాన్ని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు మైక్ వాల్జ్, సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(సీఐఏ) డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ బుధవారం ధృవీకరించారు. ''ఉక్రెయిన్‌తో నిఘా ఒప్పందాన్ని మేం ముందుకు సాగనివ్వబోం. ఆ దేశానికి ఇంటెలిజెన్స్ సేవలను నిలిపేశాం. ఈ అంశాన్ని అన్ని కోణాల్లో పునఃసమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం'' అని మైక్ వాల్జ్ అన్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 6 । మార్చి । 2025



మత్తిచ్చి మట్టుబెట్టారు..

చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో శిరీష హత్య కేసు మిస్టరీని పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ఆమె ఆడపడుచే (భర్త సోదరి) శిరీషను హతమార్చినట్లు గుర్తించారు. -8లో



వీ ఆర్ వీగన్స్

కొన్నేళ్లుగా వీగన్స్, వీగనిజంపై విస్తృతంగా అవగాహన పెరుగుతోంది. నగరంలో వీగనిజనకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.0/22.0

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 36, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
సా. 6.29 గం.	ఉ. 5.08 గం.



ప్రశాంతం..

తొలిరోజు 97 శాతం

ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలు



విజయనగర్ కాలనీలో పరీక్ష కేంద్రం వద్ద కలెక్టర్‌ను తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

కూకట్‌పల్లి శాంతినగర్‌లోని ఓ గల్లీలో పరీక్ష కేంద్రానికి పోటెత్తిన విద్యార్థులు



గ్రేటర్ పరిధిలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉరుకులు పరుగులతో అర్ధ గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల మార్గాల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిచాయి. తొలిరోజు సుమారు 97 శాతం హాజరు నమోదైంది. ఫస్టియర్‌లో.. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 90,351 విద్యార్థులకు 87,523 మంది హాజరు కాగా, జనరల్ కోర్సులకు సంబంధించి 85,564 మందికిగాను 83,017 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వృత్తి కోర్సులకు సంబంధించి మొత్తం 4,787 విద్యార్థులకు గాను 4,505 మంది హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 71,286 విద్యార్థులకు గాను 69,842 మంది హాజరయ్యారు. సాధారణ కోర్సులకు సంబంధించి 69,808 మంది విద్యార్థులకు గాను 68,483 మంది హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి 1,478 మంది విద్యార్థులకు గాను 1404 మంది హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 83,829 విద్యార్థులకు 81,966 మంది హాజరయ్యారు. విజయనగర్ కాలనీ జూనియర్ కామర్స్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ పోలీస్ కానిస్టేబుల్ ఆయనను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం గమనార్హం.

– సాక్షి, సిటీబ్యూరో

ఏనుగులకు ఎంచక్కా చల్లగా!

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు నగరంలోని జూ పార్కులో జంతువులకు అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండ వేడిమి నుంచి రక్షణగా జంతువులకు చలువ పందిళ్లు, కూలర్లు ఏర్పాటు చేయడంలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఏనుగుల ఎన్‌క్లోజర్ వద్ద స్ప్రింక్లర్లు పెట్టి నీటి తుంపర్లు వాటిపై పడేలా ఏర్పాటు చేశారు. దీంతో ఏనుగులు చల్ల చల్లగా జలకాలాడుతూ ఉపశమనం పొందుతున్నాయి.

– చార్మినార్



ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో ముంబై పోలీస్ మృతి



మృతుడి ఐడెంటిటీ కార్డు

శంషాబాద్: మహారాష్ట్రలోని ముంబైకి చెందిన చెందిన పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్ పోస్టు సీఐ జె.బాలరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంబై కమిషనరేట్ కాలాచౌకి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ అశోక్ శీతల్, హెడ్ కానిస్టేబుల్ మహేష్ రామారావు (49)తో పాటు మరో కానిస్టేబుల్ అశ్విని ఓ కేసు దర్యాప్తు కోసం ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌కు విమానంలో వెళ్తున్నారు. ట్రాన్సిట్ విమానం కావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఆగిన సమయంలో గేట్ 4 వద్దకు వచ్చిన హెడ్ కానిస్టేబుల్ మహేష్ రామారావుకు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఎయిర్‌పోర్టులో అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్తి ఫీజు చెల్లిస్తేనే ఎల్ఆర్ఎస్ రాయితీ

సందేహాల నివృత్తికి 180 0599 8838కి ఫోన్ చేయొచ్చు

- హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు పూర్తి ఫీజు చెల్లిస్తేనే 25 శాతం రాయితీ లభిస్తుందని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను కూడా చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. బుధవారం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో బీఆర్‌కే భవన్‌లో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ), ఆర్కిటెక్ట్‌లకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిషేధిత జాబితాలో లేని, బఫర్, ఎఫ్‌టీఎల్, చెరువులు, కుంటలు తదితర ప్రాంతాల్లో లేని ప్లాట్‌లకు ఆటోమేటిక్‌గా ఎల్ఆర్ఎస్‌కు అనుమతి లభిస్తుందని చెప్పారు. చెరువులు, నీటి వనరులు తదితర ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ఉన్న స్థలాలకు మాత్రం రెవెన్యూ, నీటిపారుదల శాఖ అనుమతులు తప్పనిసరి అని చెప్పారు. ఎల్ఆర్ఎస్ అర్హతలేని స్థలాలపై చెల్లించిన ఫీజులో 90 శాతం రీఫండ్ అవుతుందన్నారు. 10 శాతం మాత్రం ప్రాసెసింగ్ కోసం తీసుకుంటామని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌పై ఎలాంటి సందేహాలు ఉన్నా హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ 18005998838 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాల్ సెంటర్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌లు విద్యాధర్, రాజేంద్రప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు స్పోర్ట్స్ మీట్

- జీహెచ్ఎంసీ సిబ్బందికి సైతం
- వచ్చే నెల 7 నుంచి 10 వరకు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పాలకమండలి కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు 'స్పోర్ట్స్ మీట్' నిర్వహించనున్నట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో కొందరు సభ్యులు చేసిన విజ్ఞప్తి మేరకు జీహెచ్ఎంసీ ఇందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 7 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.3 వేల నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ఫైనల్స్‌లో గెలిచిన జట్లకు ఎక్సలెన్స్ అవార్డులు అందజేయనున్నారు. పది అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రస్తుత పాలకమండలికి చివరి సంవత్సరం కావడంతో కార్పొరేటర్ల వినతి మేరకు జీహెచ్ఎంసీ ఇందుకు సిద్ధమైంది.

ఊడ్చిన నిధులెన్నో?

రెండు నెలల్లోనే రూ.6 లక్షల పెనాల్టీలు

- బట్టబయలవుతున్న స్వీపింగ్ యంత్రాల పని తీరు
- ఏళ్ల తరబడి దోచుకున్న ప్రజా ధనమెంతో?



సాక్షి, సిటీబ్యూరో:

ప్రజల నుంచి వివిధ పన్నుల రూపాల్లో వసూలు చేస్తున్న సొమ్మును జీహెచ్ఎంసీ కొందరు బడా కాంట్రాక్టర్ల పాల్జేస్తున్న వైనమిది. ఏళ్ల తరబడి ఎన్ని కోట్లు వారికి ధారాదత్తం చేశారో కానీ.. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో సదరు కాంట్రాక్టర్లు నిర్వహిస్తున్న స్వీపింగ్ మెషీన్ల పనితీరు బట్టబయలవుతోంది. ప్రధాన రహదారులను శుభ్రపరిచేందుకు జీహెచ్ఎంసీ అద్దె ప్రాతిపదిక స్వీపింగ్ మెషీన్లను నిర్వహిస్తోంది. వాటి కాంట్రాక్టర్లు ఒప్పందం మేరకు ఊడ్చాల్సినంత దూరం ఊడ్చకుండానే, శుభ్రం చేయాల్సిన మేర రోడ్లను శుభ్రం చేయకుండానే ఏడెనిమిదేళ్ల క్రితం రూ.30 కోట్ల నుంచి మొదలు పెట్టి ప్రస్తుతం ఏటా దాదాపు రూ. 47 కోట్లు జీహెచ్ఎంసీ నుంచి పొందుతున్నారు. కానీ.. ఒప్పందం మేరకు పనులు చేయకుండా పైకి కనిపించేందుకు మాత్రమే రోడ్లపై స్వీపింగ్ మెషీన్ల వాహనాలను తిప్పుతూ తూతూమంత్రంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వాటి పని తీరుపై అనుమానం వచ్చిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సైతం తనిఖీలు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీలతో వాటి పనితీరు బట్టబయలవుతోంది.

2 నెలలు.. రూ.6 లక్షల పెనాల్టీలు

ఈ సంవత్సరం జనవరి నుంచి నిర్వహించిన తనిఖీల్లో రెండు నెలల్లోనే స్వీపింగ్ మెషీన్లు సరిగ్గా పని చేయకుండా నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.6 లక్షల పెనాల్టీలు విధించారు. పలు మార్లు హెచ్చరికల తర్వాత సైతం ఇంతటి ఉల్లంఘనలు జరిగాయంటే.. అంతకుముందు ఎలాంటి పట్టింపు లేని సమయంలో అసలు పనిచేశాయో, లేదో అంచనా వేసుకోవచ్చు. ఆ లెక్కన ఎన్ని కోట్లు కాంట్రాక్టర్ల పరమయ్యాయో ఊహించుకోవచ్చు. గత పాలక మండళ్లలోని కీలకస్థానాల్లో ఉన్న వారి వల్లే.. సదరు కాంట్రాక్టర్లకు ఆ పనుల దక్కాయనే ఆరోపణలు గుప్పుమన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వాటి పనితీరునూ పట్టించుకోలేదు.

తిలాపాపం.. తలా పిడికెడు

స్వీపింగ్ మెషీన్ల పని తీరు, తనిఖీలు, వాటి బిల్లుల చెల్లింపులు జోన్ల స్థాయిలో జరుగుతున్నాయి. సంబంధిత సర్కిళ్ల డీసీలు, ఏఎంఓహెచ్‌ల పాత్ర కూడా చెల్లింపుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. సరైన తనిఖీలు చేయకుండా, నిబంధనల ఉల్లంఘనలకు పెనాల్టీలు విధించకుండా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నిధులు చెల్లించారనే ఆరోపణలున్నాయి. కొన్ని సర్కిళ్లలో గత రెండునెలల్లోనూ ఎలాంటి పెనాల్టీలు లేకపోవడం విశేషం. అంటే.. ఆ సర్కిళ్లలో స్వీపింగ్ మెషీన్లు కచ్చితంగా పని చేస్తున్నాయో, లేక సంబంధిత తనిఖీల అధికారులు మిలాఖాత్ అయ్యారో వారికే తెలియాలి.

38 మెషీన్లు.. రూ.47 కోట్లు

ప్రస్తుతం 38 స్వీపింగ్ మెషీన్లకు ఏటా దాదాపు రూ.47 కోట్లు చెల్లిస్తున్నారు. అయినా రోడ్లపై చెత్త ఉంటోంది. స్వీపింగ్ మెషీన్లతో ఊడిస్తే రోడ్లపై ఎలాంటి చెత్త కనిపించరాదు. కానీ.. పని చేయని చీపుర్లతో ఊడ్చాల్సినంత దూరం ఊడ్చకుండా మమ అనిపిస్తున్నారు. పేరుకు జీపీఎస్ ట్రాకింగ్ అయినా సిస్టమ్ సరిగ్గా లేదని భావించిన కమిషనర్ వాహనాలకు ముందు, వెనుక సీసీ కెమెరాలు అమర్చి పరిశీలించాల్సిందిగా ఆదేశించడంతో కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం ఆ చర్యలు ప్రారంభించినట్లు సంబంధిత విభాగం పేర్కొంది.

రెండు నెలల్లో ఆయా సర్కిళ్లలో విధించిన జరిమానాలు

సర్కిల్	పెనాల్టీ (రూపాయలు)
శేరిలింగంపల్లి	3,80,000
మల్కాజిగిరి	64,000
రాజేంద్రనగర్	85,000
ఉప్పల్	25,000
కాప్రా	10,000
హయత్‌నగర్	10,000
ఫలక్‌నుమా	10,000
కార్వాన్	15,000
గోషామహల్	11,000
అల్వాల్	10,000

నీటి వృథాపై కొరడా!

జూబ్లీహిల్స్‌లో తాగునీటితో బైక్ వాషింగ్

- సదరు వ్యక్తికి నోటీసులు జారీ
- రూ.1,000 జరిమానా విధించిన జలమండలి



జూబ్లీహిల్స్‌లో ఇంటి ముందు తాగునీటితో బైక్‌ను వాష్ చేస్తున్న యువకుడు

సాక్షి, సిటీబ్యూరో: బెంగళూరు తరహాలో తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే మన జలమండలి కొరడా ఝుళిపించనుంది. బుధవారం ఇలా నగరంలో తొలిసారిగా జరిమానా విధించిన ఘటన జూబ్లీహిల్స్ చోటుచేసుకుంది. జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళ్తుండగా.. రోడ్ నెంబర్- 78లో నేలపై నీరు పారుతుండటాన్ని చూసి పైపులైన్ లీకయినట్లు భావించారు. ఈ విషయంపై ఆరా తీయాలంటూ స్థానిక జీఎంను ఆయన ఆదేశించారు. దీంతో డివిజన్ జీఎం హరిశంకర్ స్థానిక మేనేజర్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. రోడ్డు పక్కన ఉన్న ఇంటి ముందు ఓ యువకుడు తాగునీటితో బైక్ వాషింగ్ చేస్తుండగా గమనించారు. ఈ విషయం ఎండీ దృష్టి తీసుకెళ్లారు. దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, తక్షణమే సదరు వ్యక్తికి జరిమానా విధించాలని సంబంధిత జనరల్ మేనేజర్‌ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి తొలిసారి తప్పుగా భావించి రూ.1000 జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే బెంగళూర్‌లో తాగునీటిని వాహనాలను కడగడం, గార్డెనింగ్, నిర్మాణాలకు, వినోద కార్యక్రమాలకు వినియోగించడాన్ని నిషేధించింది. తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే తొలిసారి గుర్తిస్తే రూ.5 వేలు జరిమానా.. ఆ తర్వాత కూడా వృథా చేస్తుంటే రోజుకు అదనంగా మరింత జరిమానా విధిస్తోంది.

సుదూర ప్రాంతాల నుంచి..

మహా నగర తాగునీటి అవసరాల కోసం జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సుదూరు ప్రాంతాల నుంచి నీటి తరలించి శుద్ధి చేసి సరఫరా చేస్తోంది. తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. రానున్న మూడు నెలలు నీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రజలు తాగునీటిని వృథా చేయకూడదని సూచిస్తోంది.

బస్సు కండక్టర్ టికెట్ మెషీన్‌నే కొట్టేశాడు!

మలక్‌పేట: ప్లాట్‌ఫాంపై ఆగి ఉన్న బస్సులోని కండక్టర్ టికెట్ మెషీన్‌ను గుర్తు తెలియని వ్యక్తి కొట్టేశాడు. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో సూర్యాపేట డిపో బస్సు నగరానికి చేరుకుంది. తిరిగి సూర్యాపేటకు వెళ్లే క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లోని 2 నంబర్ ప్లాట్‌ఫాంపై డ్రైవర్ బస్సు ఆపాడు. కండక్టర్ కృష్ణవేణి టికెట్ మెషీన్ తన బ్యాగులో పెట్టి కంట్రోలర్ వద్ద వెళ్లి వచ్చి చూసేసరికి కన్పించలేదు. బ్యాగులో టికెట్ మెషీన్, సెల్‌ఫోన్, పాస్‌బుక్ ఉన్నట్లు పోలీసులకు కండక్టర్ ఫిర్యాదు చేశారు. కండక్టర్ బస్సు దిగిన తర్వాత డ్రైవర్ కార్గో కేంద్రానికి వెళ్లడంతో ఇదే అదనుగా భావించిన ఆగంతకుడు బ్యాగును అపహరించాడు. ఇదంతా మూడు నిమిషాల్లోనే జరిగిందని కండక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌లాల్ తెలిపారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సిటీ ఆర్టీసీ.. ఇక కొత్త కొత్తగా..

గ్రేటర్‌లో దశలవారీగా 2800 ఎలక్ట్రిక్ బస్సులు

- ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ కోసం కొత్తగా 10 డిపోలు
- ఒక్కో డిపోలో కనీసం 20 చార్జింగ్ స్టేషన్‌లు
- ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్‌ల నియామకానికి సన్నాహాలు
- క్రమంగా డీజిల్ బస్సుల ఉపసంహరణ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇప్పుడు ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. రానున్న మూడేళ్లలో 2800 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకనుగుణంగా నగరంలో డిపోల విస్తరణకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ప్రస్తుతం 28 డిపోలు ఉన్నాయి. ఒక్కో డిపోలో కనిష్టంగా 100 నుంచి 150 వరకు బస్సులు ఉన్నాయి. కొన్ని చోట్ల బస్సులను నిలిపేందుకు తగిన స్థలం లేకపోవడంతో డిపోల బయట పార్కింగ్ చేయాల్సి వస్తోంది. ఎలక్ట్రిక్ బస్సుల కోసం కొత్తగా మరో 10 డిపోలను ఏర్పాటు చేయాల్సి ఉంది. బస్సుల నిర్వహణ, చార్జింగ్ స్టేషన్‌ల కోసం అదనపు డిపోలు అవసరమని అధికారులు గుర్తించారు.

చార్జింగ్ సామర్థ్యం పెంచేలా...

కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం అద్దె ప్రాతిపదికన ఈ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. పీఎం ఈ డ్రైవ్ (ప్రధానమంత్రి ఎలక్ట్రిక్ డ్రైవ్) పథకంలో భాగంగా ఇవి రానున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చాలావరకు ప్రైవేట్ సంస్థల చేతుల్లోనే ఉంటుంది. కానీ వాటికి పార్కింగ్, విద్యుత్ చార్జింగ్ సదుపాయం కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉంది. ప్రస్తుతం ఒక్కో డిపోలో సామర్థ్యానికి మించిన బస్సులు ఉన్నాయి. వాటిని జిల్లాలకు తరలించి ఎలక్ట్రిక్ బస్సులతో డిపోలను భర్తీ చేస్తారు. డీజిల్ బస్సుల తరహాలో ఎలక్ట్రిక్ బస్సులను పార్కింగ్ చేయడం సాధ్యం కాదు. వాటికి తగినంత స్థలం ఉండాలి. అలాగే ఇప్పుడు ఒక బంక్ వద్ద అన్ని బస్సులకు కొద్ది గంటల్లోనే డీజిల్ నింపే అవకాశం ఉంది. కానీ ఎలక్ట్రిక్ బస్సులకు విద్యుత్ చార్జింగ్‌కు ఎక్కువ సమయం పడుతుంది. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఒకేసారి ఎక్కువ బస్సులకు చార్జింగ్ చేసే సదుపాయం ఉండాలి. ఇందుకోసం ప్రతి డిపోలో కనీసం 20 చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి ఆ తర్వాత అవసరానికనుగుణంగా విస్తరించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఒక్కో డిపోలో 75 నుంచి 80 బస్సులకు మాత్రమే పార్కింగ్, చార్జింగ్ సదుపాయం ఉండేవిధంగా కొత్త డిపోలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెప్పారు. ఇందుకోసం ఆర్టీసీకి ఉన్న సొంత స్థలాలతో పాటు ఔటర్‌రింగ్‌రోడ్డు చుట్టుపక్కల డిపోల కోసం ప్రభుత్వం నుంచి స్థలాలను కోరుతున్నట్లు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ల నియామకం

కొత్తగా రానున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఆయా సంస్థలే డ్రైవర్‌లను ఏర్పాటు చేస్తాయి. దీంతో ఆర్టీసీకి ప్రత్యేకంగా డ్రైవర్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ మేరకు ప్రస్తుతం పదవీ విరమణ చేస్తున్న డ్రైవర్‌ల స్థానంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొత్తవాళ్లను నియమించుకొనేందుకు సన్నాహాలు చేపట్టారు. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరిగిన కొద్దీ ఆర్టీసీ డ్రైవర్‌ల అవసరం తగ్గుముఖం పడుతుంది. దీంతో ఇంకా సర్వీసు ఉన్నవాళ్లను జిల్లాల్లోని డిపోలకు బదిలీ చేస్తారు. అదే సమయంలో పదవీకాలం ముగిసిన వాళ్ల స్థానంలో మాత్రం డీజిల్ బస్సుల కోసం తాత్కాలిక పద్ధతిపైన నియమిస్తారు. రానున్న రోజుల్లో ఆ డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టినప్పుడు ఈ తాత్కాలిక డ్రైవర్‌ల అవసరం కూడా ఉండదు. అలాగే ఆర్టీసీ డిపోల్లో మెకానిక్‌లు, శ్రామిక్‌ల నియామకాలు సైతం నిలిచిపోనున్నాయి. 'ఎలక్ట్రిక్ బస్సులను పెంచే క్రమంలో ఆర్టీసీ డ్రైవర్‌లను స్వచ్ఛంద పదవీ విరమణకు సైతం ప్రోత్సహించనున్నట్లు ఒక అధికారి పేర్కొన్నారు. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో 254 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సుల్లో ఆర్టీసీ కండక్టర్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆయా సంస్థలకు చెందిన డ్రైవర్లే బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) డిపోలో పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. దీంతో అక్కడ పని చేసే డ్రైవర్లు, మెకానిక్‌లు, శ్రామిక్‌లు తదితర సిబ్బందిని ఇతర డిపోల్లో సర్దుబాటు చేయాల్సి వచ్చింది. తాజాగా హయత్‌నగర్-2 డిపోలో కొత్తగా 45 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టారు. దశలవారీగా మరిన్ని రానున్నాయి.

ఆర్టీసీయే కొనుగోలు చేయాలి...

ఇలా ఉండగా, కేవలం ప్రైవేట్ సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు ఆర్టీసీని ప్రభుత్వం బలిపశువును చేస్తోందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆర్టీసీ రూట్లలో ప్రైవేట్ బస్సులను నడిపి భారీ మొత్తంలో వాటికి అద్దెలు చెల్లించడం చాలా కష్టమని, ఆర్టీసీయే సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసుకునేవిధంగా నిధులను అందజేయాలని వివిధ సంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సాక్షి గురువారం, 6, మార్చి, 2025

సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

విచారణను రేపటికి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : సీఎం రేవంతర్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో విచారణను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రజాప్రతినిధుల కోర్టు తెలిపింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతేడాది మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీపై అసత్య ఆరోపణలు చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీంతో సీఎం రేవంత్‌రెడ్డిపై సెక్షన్ 153, 171సీ, 171జీ, 499,505 ఐపీసీ కింద కేసులు నమోదైన విషయం తెలిసిందే.

సీఎం రేవంత్‌ను విమర్శిస్తే ఊరుకోం...

తీన్మార్ మల్లన్నకు గజ్జెల కాంతం వార్నింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

బంజారాహిల్స్: సీఎం రేవంత్‌రెడ్డిని ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తే చూస్తూ ఊరుకోవడానికి ఇది కేసీఆర్ జమానా కాదని, ఇక్కడున్నది పులిబిడ్డ రేవంత్ రెడ్డి అని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం హెచ్చరించారు. 'నువ్వు ఎవరెవరిని బెదిరించావో..ఎంతెంత సంపాదించావో..ఆ చిట్టా మొత్తం నా దగ్గర ఉంది' అని ఆయన పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. పదేళ్లుగా కేసీఆర్‌ను తిట్టి..ఇప్పుడు కేసీఆర్ మంచోడు ఎలా అయ్యాడని ప్రశ్నించారు. దమ్ముంటే ఎమ్మెల్సీ పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి..మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

ఉద్యోగమిస్తాం రారండి!

రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా) పేరుతో మోసం

- సీనియర్ ఆఫీసర్ అంటూ స్పెషల్ ఆఫీసర్ల 'ఎంపిక'
- కర్ణాటకకు చెందిన 39 మందిని ముంచిన వైనం
- ఇద్దరిని అరెస్టు చేసిన బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్
- హైదరాబాద్‌లోనూ కొందరు బాధితులు ఉన్నట్లు అనుమానం



నిందితులు అరవింద్, వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో రహస్య ఆపరేషన్లు చేసే అత్యున్నత భారత నిఘా విభాగం రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్ (రా) పేరు చెప్పిన ఓ ద్వయం కర్ణాటకలో భారీ స్కామ్‌కు పాల్పడింది. అందులో సీనియర్ అధికారినని చెప్పుకుంటూ స్పెషల్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ అధికారం ఉందంటూ ఎర వేశారు. హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ దళారి అరవింద్ నాయుడు ఈ స్కామ్‌కు సూత్రధారిగా ఉండగా...బెంగళూరులోని జయానగర్‌లో జిరాక్స్ సెంటర్ నడిపే బిహారీ వేణుగోపాల్ పాత్రధారిగా ఉన్నాడు. ఈ ద్వయాన్ని బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) అధికారులు బుధవారం అరెస్టు చేశారు. వీరి చేతిలో మోసపోయిన వారిలో 39 మంది కర్ణాటక వాసులు ఉన్నట్లు ఇప్పటికే గుర్తించారు. అరవింద్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన వారూ బాధితులుగా మారినట్లు సీసీబీ అనుమానిస్తోంది.

రియల్‌ఎస్టేట్ దందాతో పరిచయం...

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరవింద్ యాదవ్ హైదరాబాద్‌కు వలసవచ్చి రాంకోఠిలో నివసిస్తున్నాడు. ఇతడు వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ దళారి కావడంతో ఈ పనుల నిమిత్తం తరచు బెంగళూరుకు వెళ్లి వచ్చేవాడు. స్థిరాస్తి పత్రాలు జిరాక్స్ తీయించుకునే నేపథ్యంలో అక్కడి జయానగర్‌లో స్టేషనరీ దుకాణం, జిరాక్స్ సెంటర్ నిర్వహించే వేణుగోపాల్‌తో పరిచయం ఏర్పడింది. తేలిగ్గా డబ్బు సంపాదించాలని భావించిన ఈ ద్వయం ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేయడానికి సిద్ధమైంది. మామూలు ఉద్యోగాల పేరుతో కాకుండా యువతకు ఎంతో క్రేజ్ ఉండే 'రా'ను ఎంచుకుంది. కొన్నాళ్లుగా అరవింద్ ఆ విభాగం ఉన్నతాధికారిగా చెలామణి అవుతున్నాడు. బెంగళూరులోని గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న లాడ్జిలో షెల్టర్ ఏర్పాటు చేసుకున్నాడు. జయానగర్‌లోని వేణుగోపాల్ జిరాక్స్ సెంటర్ దగ్గరకు తరచు వస్తూ కొందరు యువకులను పరిచయం చేసుకున్నాడు.

ప్రత్యేక విధానంలో డైరెక్ట్ ఎంట్రీ అంటూ...

వేణుగోపాల్ సహాయంతోనే అతడి దుకాణంలోనే అరవింద్ కోసం 'రా' అధికారిగా నకిలీ గుర్తింపుకార్డు, నకిలీ లెటర్ హెడ్స్ రూపొందించారు. వీటిని అరవింద్ అక్కడి యువకులకు చూపిస్తూ తాను 'రా'లో స్పెషల్ ఆఫీసర్ అంటూ వారిని నమ్మించాడు. ఆయన కర్ణాటక బ్రాంచ్‌కు నేతృత్వం వహిస్తారని, ఆయనకు కొందరు యువకుల్ని స్పెషల్ ఆఫీసర్లుగా ప్రత్యేక విధానంలో డైరెక్ట్‌గా రిక్రూట్ చేసుకునే అవకాశం ఉందంటూ వేణుగోపాల్ ప్రచారం చేశాడు. అయితే ఆయన సిఫార్సులను అంగీకరించరని, సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినా పట్టించుకోరని చెప్పుకొచ్చాడు. దీంతో పూర్తిగా వీరి వల్లో పడిపోయిన ఆ యువకులు తమతో పాటు మరికొందరినీ వేణుగోపాల్ వద్దకు తీసుకువచ్చారు. ఇలా దాదాపు 39 మంది తమకు 'రా'లో పని చేసే అవకాశం ఇవ్వాలని వేణుగోపాల్ ద్వారా అరవింద్‌ను వేడుకున్నారు.

పరీక్షలు పెట్టి, నకిలీ ఉత్తర్వులు ఇచ్చి...

వీరిని విడతల వారీగా తన లాడ్జికి రప్పించిన అరవింద్ అక్కడ కొన్ని పరీక్షలు కూడా పెట్టాడు. ఆపై ఉద్యోగంలోకి ఎంపికైనట్లు చెప్పి, త్వరలోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఢిల్లీలోని హెడ్-ఆఫీస్ నుంచి వస్తాయని చెప్పాడు. ఆ సందర్భంలో తెరపైకి వచ్చిన వేణుగోపాల్ ఆ ప్రాసెస్ త్వరగా పూర్తికావాలంటే నిర్ణీత మొత్తం చెల్లించాలంటూ చెప్పి ఒక్కో అభ్యర్థి నుంచి గరిష్టంగా రూ.2 లక్షల వరకు వసూలు చేశాడు. ఆపై నకిలీ లెటర్ హెడ్స్‌పై అపాయింట్‌మెంట్ లెటర్లు కూడా రూపొందించి ఆ యువకులకు ఇచ్చారు. బెంగళూరులోని జేపీ నగర్‌కు చెందిన యువకుడు తనకు వచ్చిన అపాయింట్‌మెంట్ లెటర్ చూసి అనుమానించారు. ఆరా తీయగా అసలు విషయం తెలియడంతో గత నెల ఫిబ్రవరి 26న సీసీబీకి ఫిర్యాదు చేశారు.

బాధితులు ఇంకా ఉంటారని అనుమానం...

దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న సీసీబీ దర్యాప్తు చేపట్టింది. తొలుత వేణుగోపాల్‌కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. అతడు స్పందించకపోవడంతో జిరాక్స్ సెంటర్‌పై దాడి చేసి అరెస్టు చేసింది. అతడు ఇచ్చిన గాంధీనగర్‌లోని లాడ్జిపై దాడి చేసి పలు పత్రాలు, స్టాంపులు స్వాధీనం చేసుకుంది. మంగళవారం హైదరాబాద్ వచ్చిన ప్రత్యేక బృందం అరవింద్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లింది. ఇతగాడు 2021 నుంచి 'రా' అధికారిగా చెలామణి అవుతున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీంతో పాటు వీరి వద్ద లభించిన నకిలీ లెటర్ హెడ్స్ ఆధారంగా మోసపోయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన వాళ్లూ ఉంటారని భావిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్న సీసీబీ ఆధారాల కోసం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఈ ద్వయాన్ని కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించింది.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

నాంపల్లి: విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని నిరుపేదల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి..మోసం చేస్తున్న ఓ వ్యక్తిని నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శాంతి తెలిపిన వివరాల ప్రకారం..తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం పక్కన ఉండే ఓ వీధిలో బాలానగర్‌కు చెందిన షేక్ మహబూబ్ అలీ గైడ్ వన్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రకటనలు గుప్పించి నిరుద్యోగులను, నిరుపేదలను పెద్ద ఎత్తున మోసం చేశారు. దుబాయ్, సౌదీ అరేబియా, మలేషియా వంటి దేశాలకు పంపుతామని ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. డబ్బులు చెల్లించిన వ్యక్తులు ఏమైందంటూ నిలదీస్తే బెదిరించడం, కొట్టడం వంటివి చేస్తాడు. దీంతో చాలా మంది డబ్బులు అడగడం మానేశారు. కొందరు బాధితులు షేక్ మహబూబ్ అలీ చేస్తున్న మోసంపై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణలో షేక్ మహబూబ్ అలీ మోసాలకు పాల్పడుతున్నట్లు తేలడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



షేక్ మహబూబ్ అలీ (ఫైల్)

సోషల్ మీడియాలో పోస్టింగ్‌లపై వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

చైతన్యపురి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తులపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు బండారు వెంకటరమణ, నాయకులు మానుకొండ రవీందర్‌రెడ్డి, అక్కోలు శివకుమార్, భరత్‌లు బుధవారం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పవన్ స్టార్ మానియా అనే ఇన్‌స్టాగామ్ ఐడీ ద్వారా పెట్టిన పోస్టు తీవ్ర అభ్యంతరకరంగా ఉందని వారు ఆరోపించారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని వారు కోరారు. ఫిర్యాదు స్వీకరించామని, లీగల్ ఒపీనియన్ తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు వెంకటరమణ తదితరులు

10.3 కిలోల గంజాయి స్వాధీనం: పెడ్లర్ అరెస్ట్

అడ్డగుట్ట: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి నగరంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ఓ పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెల్పిన మేరకు... ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లాకు చెందిన భూషణ్ పళాయి అలియాస్ రాజు 2007లో నగరానికి వచ్చి ఇక్కడ వివిధ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవలి కాలంలో జేసీబీ డ్రైవర్‌గా కూడా పని చేసిన భూషణ్‌కు కన్‌స్ట్రక్షన్ సైట్‌లో కొందరు కూలీలు గంజాయి తీసుకోవడం గమనించాడు. ఈ క్రమంలో తన ఊరు నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడి కూలీలకు విక్రయించాలని అనుకున్నాడు. అందులో భాగంగా ఒడిశాలో తనకు పరిచయస్థుడైన రాహుల్ అనే సప్లయర్ నుంచి రూ.5 వేలకు కిలో గంజాయి చొప్పున కొనుగోలు చేసి హైద్రాబాద్‌లో అధిక డబ్బులకు విక్రయించేవాడు. చిన్న చిన్న శాచెట్ల నుంచి 100 గ్రాములు, 250 గ్రాముల వరకు గంజాయి విక్రయాలకు పాల్పడుతూ డబ్బులు సంపాదించేవాడు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న హైద్రాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, తుకారాంగేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఈ నెల 3న ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్ సమీపంలోని రైలుపట్టాల పక్కన ఖాళీ స్థలం వద్ద భూషణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దొరికిన 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం, దర్యాప్తులో భాగంగా భూషణ్ నివసించే కోకాపేటలోని ఇంటికి వెళ్లి అక్కడ నిలువ ఉంచిన సుమారు పది కిలోల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా నిందితుడి నుంచి 10.3 కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనం, వెయిట్ మెషిన్, సెల్‌ఫోన్, రూ.1,210 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎన్‌ఈడబ్ల్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్ డేనియల్, ఎస్‌ఐ వెంకటరాములు, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్

'దేశవ్యాప్తంగా బీజేపీకి అనుకూల వాతావరణం'

బడంగ్‌పేట్: కార్యకర్తల శ్రమతో బీజేపీకి దేశవ్యాప్తంగా అనుకూల వాతావరణం నెలకొందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు 1, 2 రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా దిమ్మె నిర్మాణానికి భూమి పూజ చేశారు. మహేశ్వరం ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి పార పట్టి మట్టి తీశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ మరింత పుంజుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం 23వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిశీలించారు.

మత్తిచ్చి మట్టుబెట్టారు..

- వీడిన గృహిణి శిరీష హత్య కేసు మిస్టరీ
- దిండుతో అదిమి చంపిన ఆడపడుచు
- కేసు తారుమారుకు యత్నించిన భర్త సహా ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో జరిగిన వివాహిత శిరీష హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. గుండెపోటుతో తన భార్య చనిపోయిందని చెప్పి ఆమె మృతదేహాన్ని తరలించడానికి భర్త చేసిన యత్నాన్ని భగ్నం చేసిన చాదర్‌ఘాట్ పోలీసులు..శిరీషను ఆమె ఆడపడుచు (భర్త సోదరి) హత్య చేసినట్లు గుర్తించారు. శిరీషను హత్య చేసిన ఆడపడుచు, సహకరించిన భర్త, అల్లుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ ఈ వివరాలు వెల్లడించారు. 2016లో శిరీష హయత్‌నగర్‌లోని ఓ హాస్పిటల్‌లో పనిచేసే సమయంలో సరిత అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ క్రమంలో సరిత తన సోదరుడు సింగం వినయ్‌కుమార్‌ను పెళ్లి చేసుకోవాలని కోరగా..అందుకు అంగీకరించి పెళ్లి చేసుకుంది. తరువాత శిరీష కాచిగూడలోని మరో హాస్పిటల్‌లోనూ పని చేసి అక్కడ కూడా రిజైన్ చేశారు. అనంతరం 2024 నవంబర్‌లో శిరీష హయత్‌నగర్‌లోని మరో హాస్పిటల్‌లో నర్సింగ్ సూపర్‌వైజర్‌గా చేరింది. అదే హాస్పిటల్‌లో సరిత కూడా అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా పనిచేస్తుంది. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 28న శిరీష తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఆ మరుసటి రోజు (మార్చి 1న) రాత్రి జమునా టవర్స్‌లోని నివాసానికి వచ్చిన సరిత ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశావని శిరీషతో గొడవ పడింది. ఈ క్రమంలో ఆమెను కొట్టి, కింద పడేసి అప్పటికే తన దగ్గర ఉన్న హైడోస్ మత్తు మందును బలవంతంగా శిరీషకు ఎక్కించింది. స్పృహ కోల్పోయిన శిరీష ముఖంపై దిండుతో అదిమి ఊపిరాడకుండా చేయడంతో శిరీష మృతి చెందింది.

అక్కను రక్షించాలని యత్నించి...

మరుసటి రోజు (మార్చి 2) ఉదయం శిరీష మృతి చెందిన విషయాన్ని సోదరుడు వినయ్, తన మరో సోదరి కుమారుడైన నిహాల్‌కు తెలిపింది. ముగ్గురూ కలిసి సాక్ష్యాధారాలను చెరిపేశారు. అక్కను కేసు నుంచి రక్షించాలని నిశ్చయించుకున్న తరువాత వినయ్ కుమార్ 108కి ఫోన్ చేసి తన భార్య శిరీషకు గుండె నొప్పి వచ్చిందని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయిందని వైద్యులు చెప్పడంతో మృతదేహాన్ని దహనం చేయడానికి వెంటనే అంబులెన్స్‌లో దోమలపెంటలోని సొంతూరుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న శిరీష మేనమామ మధుకర్ అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారి నాటకానికి తెర పడింది. పోలీసుల సూచనలతో అంబులెన్స్ డ్రైవర్ మృతదేహాన్ని తిరిగి నగరానికి తీసుకు వచ్చాడు. పోస్టుమార్టం రిపోర్టులోనూ అమె ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాంతో చాదర్‌ఘాట్ పోలీసులు శిరీషను హత్య చేసిన ఆడపడచు సరిత, భర్త వినయ్‌కుమార్, అల్లుడు నిహాల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుండి మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన దిండు, బెడ్‌షీట్, ఐరన్ క్రషర్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు, డీఐ భూపాల్‌గౌడ్, ఎస్‌ఐ డి.రవిరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీవాదమే విజేత

- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం

కాచిగూడ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీవాదం గెలుపొందిందని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు అన్నారు. తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై.. బీసీ సంఘాలు, బీసీ మేధావులతో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి చిరంజీవులు మాట్లాడారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీవాదంపై పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణకు 60 వేలకు పైగా ఓట్లు వచ్చాయన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు బలపరిచిన మల్క కొమురయ్య గెలుపొందారన్నారు. బీసీ సంఘాలన్నీ ఐక్యంగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీవాదంతో పోటీ చేసిన పూల రవీందర్, సుందర్ యాదవ్‌లు కూడా మెజార్టీ ఓట్లు సాధించారని చెప్పారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, దాసు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు తదితరులు

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై ప్రచారం చేయండి

- ఆస్తిపన్ను వసూలు టార్గెట్ చేరుకోవాలి
- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పహాడీషరీఫ్: ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ విషయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం ఆమె జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, టీపీఓ హబీబున్నీసాలతో పలువిషయాలపై చర్చించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎన్నిదరఖాస్తులు వచ్చాయని ప్రశ్నించారు. ఈ నెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వస్తుందనే విషయాన్ని అవగాహన కల్పించాలని చెప్పారు. ఆస్తిపన్ను వసూలుకు 25 రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో లక్ష్యాలను చేరుకునేలా బిల్‌కలెక్టర్లను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం 2025–26 సంవత్సరానికిగాను రూ.36 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ జ్యోతి, అకౌంటెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించారు. షాహీన్‌నగర్‌లోని ఓ.ఎస్.జూనియర్ కళాశాల, గ్లోరీ జూనియర్ కళాశాలలకు విచ్చేసిన ఆమె ఆయా కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని ఇన్విజిలేటర్లను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాల వద్ద వసతులు పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు సూచించారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు లేకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

స్కూటీ అదుపుతప్పి..

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ జగదీశ్వర్ తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన భువనగిరి శివకుమార్(55), జమ్మడ రాములుతో కలిసి స్కూటీపై ఉదయం ఇబ్రహీంపట్నం నుంచి కర్ణంగూడ మీదుగా చర్లపటేల్ గూడకు వెళ్తున్నారు. శ్మశాన వాటిక వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు ప్రక్కన చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా రాములు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కబ్జాలకు అడ్డుకట్ట వేయండి



కబ్జాలపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీ పర్వతాంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లోని కబ్జాలను వెంటనే కూల్చివేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిని ఆదేశించారు. బుధవారం వినాయకనగర్ బస్తీవాసులు ఎమ్మెల్యేను కలిసి అక్కడ జరుగుతున్న ఆక్రమణలపై వివరించారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులు వీఆర్‌ఓకు ఫిర్యాదు చేసినా స్పందించ కుండా ఆలయానికి ఏర్పాటు చేసిన గేటును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఫిలింనగర్‌లో పని చేస్తున్న వీఆర్‌ఓలపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులకు ఉందని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని సూచించారు.

ప్రజా సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే



మహత్మానగర్ బస్తీలో సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

రహమత్‌నగర్: ప్రజా సమస్యలపై సీపీఎం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో డివిజన్‌లో బుధవారం రహమత్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు శేషగిరిరావు, డివిజన్ కార్యదర్శి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవదాసు భాగ్యరాజ్,బాలయ్య,ఆర్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

ఉస్మానియా యూనివర్సిటీ: అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌కు పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం బుధవారం వినతి పత్రం అందజేసింది. యూనివర్సిటీ సమస్యలపై ప్రత్యేకంగా మాట్లాడాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాల భర్తీ, విద్యాశాఖ మంత్రి నియామకం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు, పెండింగ్ ఫీజు రీయింబర్స్ నిధుల విడుదల తదిర అంశాలపై చర్చించాలని విజ్ఞప్తి చేసినట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు.

ఉత్తమ రైతు, మహిళా రైతు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

లాలాపేట: ఉత్తమ రైతు, మహిళా రైతులకు అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రిటైర్డు అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమీకృత, సేంద్రీయ వ్యవసాయం, ఉద్యాన తదితర పంటల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న రైతులు, మహిళా రైతులను ప్రోత్సహించేందుకు పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. ఆసక్తి గల రైతులు ఫోన్ 8886861186, 9010498345 లలో సంప్రదించాలన్నారు. ఈ నెల 12 లోగా దరఖాస్తు ఫారాలను హైదరాబాద్ అశోక్ నగర్‌లోని వ్యవసాయ అధికారుల సంఘం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కన్హా శాంతివనం సౌజన్యంతో..

రూ.1.30 కోట్లతో జేవీఆర్ పార్కు సుందరీకరణ

- చెరువును మంచినీటితో నింపనున్న అధికారులు
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటు
- ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం



జేవీఆర్ పార్కులో చెరువు మరమ్మతులు చేపట్టిన అధికారులు..

బంజారాహిల్స్: స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములైతే ఏ ప్రాంతమైన సుందరీకరణకు, అభివృద్ధికి నోచుకుంటుంది. ముఖ్యంగా చెరువులు, కుంటలు, పార్కులు సీఎస్ఆర్ ప్రాజెక్టుల కింద సరికొత్తగా ఆధునిక హంగులతో ముస్తాబవుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని జీహెచ్ఎంసీ జలగం వెంగళరావు పార్కును సుందరీకరించేందుకు కన్హా శాంతివనం ముందుకు వచ్చింది. రూ.1.30 కోట్ల వ్యయంతో పార్కులోని చెరువుతో పాటు పచ్చదనం, పర్యావరణానికి పెద్ద పీట వేస్తూ ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని నిర్ణయించింది. కన్హా శాంతివనం సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద నిధులు మంజూరు చేయగా, ఐటీసీ నేతృత్వంలో పార్కు ముస్తాబు కానుంది. ఇప్పటికే పార్కులో ఉన్న చెరువులో మురుగునీటిని పూర్తిగా తోడేశారు. చెరువులోకి వస్తున్న మురుగునీటి పైప్‌లైన్ల వ్యవస్థను మళ్లించారు. రాబోయే వర్షాకాలంలో ప్రతి వర్షపు చుక్క ఇంకే విధంగా వర్షపు నీటితో చెరువు నిండేలా ప్రణాళికలు రూపొందించి ఇప్పటికే పనులు ప్రారంభించారు. ఈ చెరువులో పూర్తిగా మంచినీటితో కళకళలాడి పర్యావరణానికి మేలు చేసే విధంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందించారు. మరుగుదొడ్లను కూడా నిర్మించనున్నారు. రెండో దశలో చెరువులో భారీ ఫౌంటెన్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పచ్చదనం మరింత పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. రంగురంగుల పూల మొక్కలు నాటనున్నారు. చెరువు చుట్టూ ఆధునిక హంగులతో వాకింగ్ ట్రాక్‌ను తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించారు. పార్కులో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కుకు వచ్చేవారు స్వచ్ఛమైన గాలి పీల్చుకునే విధంగా ఆ మేరకు మొక్కల పెంపకం చేపడుతూ చుట్టూ గార్బేజ్, పారిశుద్ధ్య సమస్య లేకుండా, దుర్వాసనలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. నగరం నడిబొడ్డున ప్రధాన రహదారిని ఆనుకుని విశాలమైన స్థలంలో ఉన్న జలగం వెంగళరావు పార్కు చెరువు మురుగుతో నిండి, మొక్కలు ఎండిపోయి పచ్చదనం కరువై ఆహ్లాదం అటకెక్కి సందర్శకులు, వాకర్లు దుర్వాసనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కన్హా శాంతివనం ముందుకువచ్చి రూ. లక్షలు వెచ్చించి సుందరీకరణ పనులు చేపట్టడం పట్ల స్థానికులతో పాటు పర్యావరణ వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారంతో కేన్సర్ నియంత్రణ



మాట్లాడుతున్న పోషకాహార నిపుణురాలు అంజలీదేవి..

బంజారాహిల్స్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పోషకాహార నిపుణురాలు డాక్టర్ సి.అంజలీదేవి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'మహిళల క్రీడా వారోత్సవ' సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'పోషకాహారమే ఆరోగ్యం'పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార నిపుణురాలు డాక్టర్ సి.అంజలీదేవి పోషకాహారం వినియోగంపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రోటీన్స్, విటమిన్లు, ఖనిజాలు, లవణాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే 60 శాతం కేన్సర్ రాకుండా అడ్డుకోవచ్చన్నారు. యూజీసీ-డెబ్ డైరెక్టర్ పల్లవీకాబ్డే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహిళల కోసం క్రీడా వారంలో భాగంగా విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, మహిళా విద్యార్థులకు స్వీయ రక్షణ, మార్షల్ ఆర్ట్స్, మానసిక ఆరోగ్యం, యోగ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు, చివరి రోజున పింక్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మహిళా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ మేరీ సునంద, శ్రీదేవి, ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం..



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1/11లో ఉన్న తాజ్‌బంజారా లేక్ స్థలంలో మట్టి డంపింగ్ చేస్తూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1/11లో ఉన్న తాజ్‌బంజారా లేక్‌ను ఆనుకుని చెరువు స్థలంలో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఓ వ్యక్తి తన ఇంటి వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చదును చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

వాటర్ ట్యాంకర్ ఓనర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న వాటర్ ట్యాంకర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు

శ్రీనగర్‌కాలనీ: గ్రేటర్ హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్ల ఓనర్లు, డ్రైవర్లపై వాటర్‌వర్క్స్ అధికారులు కఠినంగా వ్యవహరించడం సమంజసం కాదని గ్రేటర్ హైదరాబాద్ వాటర్ ట్యాంకర్స్ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు జీవీజీ నాయుడు అన్నారు. బుధవారం ఎర్రగడ్డ వాటర్‌వర్క్స్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గ్రేటర్‌లో వాటర్ ట్యాంకర్ నిర్వాహకుల ఇబ్బందులపై వాటర్‌వర్క్స్ ఎండీ, హైదరాబాద్, రాచకొండ, హైదరాబాద్ ట్రాఫిక్ కమిషనర్లకు వినతి పత్రాలు అందించినట్లు తెలిపారురు. అసోషియేషన్ సభ్యులు మహ్మద్ జాఫర్ మాట్లాడుతూ వేసవిలో వినియోగదారులకు అందించే వాటర్ ట్యాంకర్లలో ఐదు డొమెస్టిక్, ఒక కమర్షియల్ ట్యాంకర్లను సప్లై చేయడం వల్ల తమకు భారంగా మారుతోందని, మూడు డొమెస్టిక్ ఒక కమర్షియల్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు. సంవత్సరంలో నాలుగు నెలలు మాత్రమే తమకు ఆదాయం ఉంటుందని, ఇలాంటి సమయంలో నిబంధనల పేరుతో వాటర్‌వర్క్స్ అధికారులు తమను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై వాటర్‌వర్క్స్ ఎండీ మరోసారి కలిసి తమ సమస్యలను విన్నవించుకుంటామని తెలిపారు. సమావేశంలో భవ్యచందు, మాధవరావు, ఆసిఫ్, కిరణ్, సాయి, ప్రశాంత్, భగవాన్, వెంకటేశ్వర్లు, మహబూబ్, సురేష్, జహంగీర్, ఫయాజ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం..

ఫిలింనగర్: కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు, ఫిలింనగర్ పోలీసులు ఓ కిరాణా దుకాణంపై సంయుక్తంగా దాడి చేసి పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాపారిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..మినీగుల్షన్ కాలనీలో ఎంఎఫ్‌బీ రైస్ ట్రేడర్స్ అండ్ జనరల్ స్టోర్‌లో రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో సివిల్ సప్లై అధికారి సంతోష్‌కుమార్, మెహిదీపట్నం ఏసీఎస్‌ఓ మోహన్‌సాయి, ఫిలింనగర్ ఎస్ఐ గణేష్‌గౌడ్ దుకాణంలో సోదా చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విక్రయిస్తున్న వ్యాపారి మహ్మద్ షఫీపై కేసు నమోదు చేశారు. టోలిచౌకి ప్రాంతంలో కార్డుదారుల నుంచి రూ.12లకు కిలో బియ్యం కొనుగోలు చేసి తమ దుకాణంలో రూ.16లకు కిలో విక్రయిస్తున్నట్లుగా అతను అంగీకరించాడు. నిందితుడిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానంలో గుర్తుతెలియని వ్యక్తుల దాడి

బంజారాహిల్స్: మద్యం తాగడానికి పంజగుట్ట శ్మశాన వాటికకు వెళ్లిన ముగ్గురు యువకులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఎస్సార్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్న సాయి దుర్గా ప్రసన్నమూర్తి తన స్నేహితులు చింతల సురేష్, సిరికొండ సైదులుతో మంగళవారం రాత్రి పంజగుట్ట శ్మశాన వాటికలో కూర్చుని మద్యం తాగుతున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన వికాస్‌బాబు అతడి వద్దకు వచ్చి ఇక్కడ మద్యం ఎందుకు తాగుతున్నారంటూ ప్రశ్నించి సాయిదుర్గాకు చెందిన బైక్ తాళం చెవులు లాక్కుని వెళ్లిపోతుండగా వారు ముగ్గురూ అతడిని పట్టుకునేందుకు యత్నించారు. దీంతో వికాస్‌బాబు మరో ఐదుగురితో కలిసి వారిపై దాడి చేశారు. బీరు బాటిల్‌తో కొట్టడంతో సురేష్, సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. తమ సెల్ ఫోన్లను కూడా ధ్వంసం చేశారని బాధితుడు ప్రసన్నమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు వికాస్‌బాబుతో పాటు సాహిల్‌బాబు, రౌనత్‌బాబులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహారాష్ట్రలో కొనుగోలు.. నగరంలో విక్రయం

- ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు..
- రెండు కిలోల గంజాయి స్వాధీనం..

బంజారాహిల్స్: మహారాష్ట్రలో గంజాయి కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ వద్ద కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఓ ప్లాట్‌పై దాడి చేసి ఐదుగురు గంజాయి విక్రేతలు, ముగ్గురు కొనుగోలుదారులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ ప్లాట్‌నెంబర్ 201లో గాదె సాయి తేజశ్వర్‌రెడ్డి అనే విద్యార్థితో పాటు జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సూపర్‌వైజర్ మద్దునూరి శివాజీ, సాయి కృష్ణ సదన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న విద్యార్థి గార్లపాటి హేమవంశీ, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్, ఎస్సార్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్న కాగితపల్లి హేమసుందర నాగరాజులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు మహారాష్ట్రలోని పర్లి రాజేంద్రనగర్ చౌక్‌లో అంజద్ అనే ప్రధాన గంజాయి విక్రేత నుంచి రెండు కిలోల గంజాయి తీసుకువచ్చి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఫిలింనగర్‌కు చెందిన జహంగీర్, కృష్ణానగర్‌లో ఉంటున్న కుంచాల ఉదయ్ వెంకట్, యాదగిరినగర్‌కు చెందిన దోమ రాకేష్ గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి



అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: వీధి దీపాల ఏర్పాటుపై కాలయాపన తగదని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె జీహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోనల్ స్ట్రీట్‌లైట్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన మహిళలు హాజరై తమ ప్రాంతంలోని సమస్యలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఏడాదిగా డివిజన్‌లో ఒక్క స్ట్రీట్‌లైట్ కూడా ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఎన్నిమార్లు అడిగినా కాలయాపన చేస్తున్నారన్నారు. అన్ని బస్తీలు, కాలనీల్లో కలిపి 500 వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు మధురానగర్ కాలనీ వాసులు కార్పొరేటర్‌కు, అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసి శేరిలింగంపల్లి జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లిఖార్జున్, డీఈ కవిత, ఈఈఎస్ఎల్ సంస్థ కోఆర్డినేటర్ నజీర్, మధురానగర్ సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, గంగారెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, శ్యాంరావు ముదిరాజ్, వేణు, ఆంజనేయులు యాదవ్, అర్జున్, శివకుమార్, సమద్, చాంద్, బాలు, యాదగిరి, జనార్ధన్, దశరథ్, అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాలను విజయవంతం చేయాలి



కేక్ కట్ చేస్తున్న పీడీ వెంకటకిషన్, హబీబా సుల్తానా

రహమత్‌నగర్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న వేడుకలను మహిళలు విజయవంతం చేయాలని యూసీడీ పీడీ వెంకటకిషన్ అన్నారు. ఈ మేరకు బుధవారం బోరబండ తుర్రెబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మహిళ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఐక్యతను చాటుకోవాలని కోరారు. నగర మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా మాట్లాడుతూ బోరబండ డివిజన్‌నుంచి భారీ ఎత్తున మహిళలను సభకు తరలించేందుకు ప్రణాళికలు రుపొందిస్తునట్లు తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ క ట్ చేసి ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, మహిళా పొదుపు సంఘాల సభ్యులు, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విజయా రెడ్డికి మాతా పురస్కార్ అవార్డు

ఖైరతాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ మాతా సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డిని మాతా పురస్కార్ అవార్డుతో సత్కరించారు.



విజయారెడ్డిని సత్కరిస్తున్న సమితి సభ్యులు

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కొఠారి కమిషన్ సిఫార్సు మేరకు విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్రం 10 శాతం, దేశ జీడీపీలో 6 శాతం నిధులను కేటాయించాలని ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.వేణుగోపాల్ అన్నారు. బుధవారం పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాలులో యూజీసి నూతన నింబంధనలను వ్యతిరేకంగా సదస్సు జరిగింది. కార్యక్రమానికి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ శ్రీకాంత్ అధ్యక్షత వహించగా వేణుగోపాల్, ఓయూ అధ్యాపకులు కొండనాగేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. యూజీసీ నూతన నిబంధనలు వర్సిటీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్నాయని కొండ నాగేశ్వర్ అన్నారు.

అక్రమ నిర్మాణదారులపై కేసు నమోదు

ఫిలింనగర్: చెరువు, నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..హకీంపేట సమీపంలోని తుమ్మలకుంట చెరువులో అదే ప్రాంతానికి మహ్మద్ ఒమర్ పాషా, అక్బర్ అనే వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని వీరిపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని హుస్సేన్‌సాగర్ లేక్ డివిజన్ డీఈ కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మట్టిని డంపింగ్ చేస్తూ నాలాను పూడ్చేస్తూ చెరువును కప్పేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని, ప్రహరీ నిర్మిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు స్థలం షేక్‌పేట మండలం హకీంపేట విలేజ్ తుమ్మలకుంట చెరువు పరిధి కిందకు వస్తుందని, ఇటీవల జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఈ స్థలాన్ని తనిఖీలు చేసి ఆక్రమణలను నిర్ధారించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం...

వెంగళరావునగర్: డ్యూటీకి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నరేష్ బంజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 3న ఉదయం అతను డ్యూటీకి వెళ్లాడు. అయితే అదే రోజు సాయంత్రం మేనేజర్ అరవింద్ నరేష్ సోదరుడికి ఫోన్ చేసి నరేష్ డ్యూటీకి రాలేదని సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడి నంబర్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. అతడి కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో నరేష్ తల్లి బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం..

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి మధురానగర్‌లో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగి గణేష్ ఈనెల 3న రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లేందుకు బయటికి రాగా తన బైక్ కనిపించలేదు. దీంతో అతను బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మట్టి డంపింగ్ చేస్తున్న లారీలు సీజ్..



పోలీసులు సీజ్ చేసిన లారీలు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1లోని తాజ్‌బంజారా చెరువులో అక్రమంగా మట్టి డంప్ చేస్తున్న రెండు లారీలను బంజారాహిల్స్ పోలీసులు సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..తాజ్ బంజారా చెరువులోకి వెళ్లేందుకు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-1 వైపు నుంచి యూబీడీ విభాగం నిర్వహణలో గేటు ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం ఉదయం నుంచి ఈ గేటు నుంచి వెళ్తున్న లారీలు చెరువులో మట్టి డంపింగ్ చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. మంగళవారం రాత్రి పోలీసులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రెండు లారీలను సీజ్ చేశారు. మట్టి డంపింగ్ చేసినందుకు ఒక్కో ట్రిప్పుకు రూ.1600 వసూలు చేస్తున్నట్లుగా తేలింది. అయితే ఈ డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారనే విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. సుమారుగా ఈ రెండు లారీల ద్వారా 32 ట్రిప్పుల మట్టిని చెరువులో డంప్ చేసినట్లుగా నిర్ధారణ అయ్యింది. రెండు లారీలను సీజ్ చేసిన పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు. మట్టిని డంపింగ్ చేయించుకుంటున్న గంధం ప్రవీణ్‌కుమార్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. గత కొంతకాలంగా కొందరు జీహెచ్ఎంసీ సిబ్బంది లారీల యజమానులతో కుమ్మక్కై చెరువులో మట్టిని డంపింగ్ చేయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పార్కు గేటు నుంచి చెరువులోకి వెళ్లి ప్రైవేటు వ్యక్తులు ఎలా డంపింగ్ చేస్తున్నారని, వారికి ఎవరు సహకారం అందిస్తున్నారన్న దానిపై విచారణ చేపట్టాలని జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని మేయర్ ఆదేశించారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవాన్ని కనులారా చూస్తే జన్మరాహిత్యం కలుగుతుందని శాస్త్రం చెబుతుందని అర్చకులు తెలిపారు. నగర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.




గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చాలి

పంజగుట్ట: లంబాడాలు మాట్లాడే గోర్ బోలిభాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) అధ్యక్షుడు ముడావత్ రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు భరత్ చవాన్, జాయింట్ సెక్రటరీ చందర్ నాయక్ మాట్లాడుతూ లంబాడాల వివాహాల్లో ప్రి వెడ్డింగ్ షూట్‌లు, హల్దీ ఫంక్షన్‌లు, వరకట్నం, డీజే సౌండ్‌లను నిషేధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎమ్మెల్యే కోటా శాసనమండలి ఎన్నికల్లో లంబాడాల నాయకుడు తేజావత్ బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించాలని కోరారు. లంబాడా జాతి ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జాతీయ పండుగగా గుర్తించి అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ నాయక్, నాగేశ్వర్ నాయక్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబల్ నాయక్



మోగుతున్న జన్యు ఘంటికలు

పదేళ్లలో 418% పెరుగుదల

- స్పష్టం చేస్తున్న నిమ్స్ నివేదికలు
- మేనరికం,, బంధుత్వ వివాహాలు కారణమంటున్న శాస్త్రవేత్తలు
- అత్యధిక మందిలో బీటా తలసేమియా, వెన్నెముక కండరాల క్షీణత లక్షణాలు

సాక్షి, సిటీ బ్యూరో: నగరంలో జన్యుపరమైన రోగాల సంఖ్య పెరుగుతోందనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. దశాబ్ద కాలంలో 418 శాతం కేసుల వృద్ధి కనిపించిందని నిమ్స్ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధానంగా మేనరికం, దగ్గర బంధువుల వివాహాలే కారణమని పేర్కొంటున్నారు. జన్యు సంబంధిత కేసుల్లో అత్యధిక శాతం బీటా తలసేమియా, వెన్నెముక కండరాల క్షీణత వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు తేలింది.

2021 నుంచి గణనీయంగా పెరుగుదల

నిమ్స్ ఆసుపత్రికి వచ్చే జన్యు పరమైన కేసుల్లో 2014 నుంచి నివేదికలను పరిశీలిస్తే 2020 వరకు సాధారణ పెరుగుదల కనిపించింది. 2021 నుంచి 2024 మధ్య గణనీయమైన రీతిలో కేసులు నమోదయ్యాయి. 2014లో 2453 కేసులు నమోదు కాగా, 2020 నాటికి వాటి సంఖ్య 3,735కి చేరింది. 2021లో 6,967 కేసులు నమోదు కాగా 2024 నాటికి కేసుల సంఖ్య 12,042 పెరగడం సాధారణ విషయం కాదని వైద్యులు పేర్కొంటున్నారు. గతంతో పోలిస్తే అవగాహన పెరగడం, మెరుగైన డయాగ్నోస్టిక్ సామర్థ్యాలు కేసులు పెరగడానికి ఒక కారణమంటూనే, మేనరిక వివాహాలు చేసుకున్న వారిలో జన్యు పరమైన రోగాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. గర్భధారణ తర్వాత డీఎన్ఏలో మార్పులు, కాలుష్యం, జీవనశైలి, ఇతర ఒత్తిళ్ల వంటి కారణాలు ఆంకోలాజికల్ రిఫరల్‌లకు కారణమయ్యాయి. భార్య, భర్తల్లో అండం, స్పెర్మ్ నాణ్యత పడిపోవడాన్ని గుర్తించారు. 25 మందిలో ఒకరు బీటా తలసేమియా వ్యాధి, 40 మందిలో ఒకరికి వెన్నెముక కండరాల క్షీణత ఉన్నట్లు వైద్యుల అధ్యయనంలో తేలింది.

క్యారియర్ స్క్రీనింగ్ ముఖ్యం

- గర్భధారణ ప్లాన్ చేసుకునే జంటలు జన్యు నిపుణులను సంప్రదించాలని నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబ చరిత్రలో జన్యుపరమైన రుగ్మతలు ఉన్నా, రక్తసంబంధమైన వివాహం అయినా భవిష్యత్ తరాలలో రుగ్మతల నివారణలో సహాయపడుతుందంటున్నారు.
- బీటా తలసేమియా, వెన్నెముక కండరాల క్షీణత కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని నిమ్స్ సీనియర్ జన్యు శాస్త్రవేత్త డా. ప్రజ్ఞా రంగనాథ్ అన్నారు, జన్యుపరమైన రుగ్మతల సంఖ్య పెరగడానికి ప్రజల్లో అవగాహన పెరగడమూ ఒక కారణమని తెలిపారు.
- అరుదైన సందర్భాల్లో గౌచర్, ఎంపీఎస్ (మ్యూకోపాలిసాకరిడో-సిస్), పాంపే వంటి ఇతర కేసులు కనిపిస్తున్నాయని సీనియర్ జన్యు శాస్త్రవేత్త డాక్టర్ షా-గస్ అగర్వాల్ అన్నారు. రేడియేషన్ ఎక్స్‌పోజర్, రసాయనాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లతో సహా వివిధ సోమాటిక్ ఆర్జిత ఉత్పరివర్తనాలు ప్రేరేపిస్తాయని ఆమె చెప్పారు.
- జన్యు ఆరోగ్య సంరక్షణకు నిమ్స్ పనిచేస్తోందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భీరప్ప నగరి అన్నారు. అరుదైన వ్యాధుల చికిత్సలకు ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ, అవసరమైన రోగులకు చికిత్సలతో పాటు విద్యుత్ వీల్‌చైర్‌లు కూడా ఉచితంగా అందిస్తామని ఆయన అన్నారు.

సం॥	2014	2015	2016	2017	2018	2019	2020	2021	2022	2023	2024
కేసుల సంఖ్య	2,453	3,122	3,665	3,788	3,765	3,801	3,735	6,967	9,408	10,388	12,042



8న నీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: బీహెచ్ఈఎల్ జంక్షన్ దగ్గర ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా 1,500 ఎంఎం డయా పైపులైన్‌ను మారుస్తున్నందున శనివారం ఉదయం 6 సాయంత్రం 6 గంటల వరకు కొన్నిచోట్ల నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి ఒక ప్రకటనలో తెలిపింది. ఎర్రగడ్డ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్ పేట్, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీ నగర్, బీరంగూడ, అమీన్ పూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించింది.

8న ఓబీసీ లీడర్‌షిప్ సమ్మిట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓబీసీ లీడర్ షిప్ సమ్మిట్-2025 విజయవంతం చేయాలని ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నేత గోళ్ల కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలోని సావిత్రిబాయిపూలే ఆడిటోరియంలో జరిగే విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమిట్ ద్వారా ఓబీసీలకు సమర్థవంతమైన నాయకత్వం అలవర్చుకుంటారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, రిజర్వేషన్ విధానాలు, నాయకత్వ వికాసం తదితర కీలక అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ నాయకులు వికాస్ యాదవ్, మురళీ యాదవ్, వినయ్, ప్రశాంత్, కళ్యాణ్, రాకేష్, శ్రీకాంత్, మణిదీప్, సాయిబాబా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి దిశగా బీఎఫ్ఎస్ఐ మైనర్ కోర్సు

ఘనంగా గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తద్వారా అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్ కళాశాల వేదికగా 28 వ వార్షిక దినోత్సవాలను సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ బీఎఫ్ఎస్ఐ మైనర్ కోర్సు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి దిశగా ఉంటుందని అన్నారు. ప్రతి ఏడాది ప్రథమంగా నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో లాజిక్ పర్సూట్ సీనియర్ మేనేజర్ శిరీష, కళాశాల డైరెక్టర్ జంధ్యాల నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జ్యాగ్గే, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల కార్పొరేట్ ఆసుపత్రి నిమ్స్

లక్డీకాపూల్: పేదల కార్పొరేట్ ఆసుపత్రి, తెలుగు ప్రజల సంజీవిని నిమ్స్ అని నిమ్స్ పారామెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు శాంత కుమారి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసుపత్రి వెంటిలేటర్‌పైకి వెళ్లిన ఎందరో రోగులకు ప్రాణభిక్ష పెట్టిందని, కేవలం తెలుగు రాష్ట్రాల ప్రజలకే కాకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాల ప్రజలకు వరప్రదాయిని. నిత్యం వేలాది రోగులు నిమ్స్‌ను సందర్శిస్తూ స్వస్థత పొందుతున్నారు. నిజాం ఆర్థోపెడిక్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా, స్వతంత్ర ప్రతిపత్తి గల ఆసుపత్రి గా ఏర్పాటు అయిన నాటి నుండి నేటి వరకు కొట్లాది ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా విలసిల్లుతుందన్నారు. రోబోటిక్ సర్జరీల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని, వందలాది కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందిస్తోందన్నారు. నిమ్స్ పై లేనిపోని అపోహలు సృష్టించి, అభాండాలు వేసి ఉద్యోగుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీయవద్దని, కార్పొరేట్ కుట్రలకు మమ్ము బలి చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

మహిళలకు సాధికారత అవసరం



సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తున్న నారాయణ

చందానగర్ : మహిళల ఆర్థిక సాధికారత చాలా అవసరమని సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ అన్నారు. బుధవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో మహిళా సంక్షేమ కేంద్రంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో స్థిరమైన అభివృద్ధిని నడిపించడంలో మహిళల ఆర్థిక సాధికారత కీలక పాత్ర, పోషిస్తుందని, చాలా అవసరమన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వృత్తి విద్య నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు అధిక నాణ్యత శిక్షణా కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. మహిళలకు ఆదాయ ఉత్పాదక అవకాశాలు కల్పించడం కోసం సీఆర్ ఫౌండేషన్ ఆవరణలోని యార్లగడ్డ భాగ్యవతి భవనంలో వివిధ వృత్తి విద్యాకోర్సులను 2004 సంవత్సరంలో ప్రారంభించామని, కంప్యూటర్, కుట్టు, బ్యూటీషియన్, డ్రెస్ మేకింగ్, మగ్గం, మిషన్ ఎంబ్రాయిడరీ కోర్సులలో యువతులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంగ్లీష్, సోషల్ అవేర్నెస్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 13 వేల మంది యువత శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్నారని ఆయన వివరించారు. డాక్టర్ డి.ప్రతిభ, మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యులు ప్రేమ్ పావని, డైరెక్టర్ జోష్యభట్ల కల్పన, డాక్టర్ డీఎన్ కుమార్, డాక్టర్ డి ప్రతిభ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కిషోర్ రెడ్డి, మహిళా సంక్షేమ కేంద్రం సలహాదారు ఉషారాణి, విజయలక్ష్మి, కృష్ణ కుమారి, లలిత, మమతా ఆరుట్ల, సంధ్యారాణి, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సకు అనుమతివ్వండి



సమావేశంలో పాల్గొన్న టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు

టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకట్ రెడ్డి

రాజేంద్రనగర్: పేదలకు ప్రాథమిక చికిత్స చేసేవిధంగా అనుమతి ఇవ్వాలని టీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పేద రోగులకు ప్రాథమిక చికిత్స మీరు చెయ్యరు.. మమ్మల్ని చెయ్యనీయరా..?'అని ప్రశ్నించారు. వాడవాడ, బస్తీ బస్తీలో ఇంటింటికి తిరిగి తక్కువ ధరలకు మీరిచ్చిన శిక్షణ అనుభవంతో ప్రాథమిక చికిత్స చేస్తున్న తమలాంటివారిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఇష్టానుసారంగా బిల్లులు వసూలు చేస్తున్న కార్పొరేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు నాలుగు వేల మంది ఆర్ఎంపీలు, పీఎంపీలు ఉన్నారని, అందులో పరిమితి మంచి హద్దు మీరు వైద్య చేసిన వారి పేర్లు, వివరాలు తమ వైద్య సిబ్బందికి తెలియజేస్తే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంఘం నియమ నిబంధనలను పాటించకుంటూ క్రమశిక్షణతో, పరిమితి లోబడి పని చేయాలని డాక్టర్ ఎస్వీర్ అన్నారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లును సంఘం తరపున ఘనంగా సన్మానించారు. సమావేశంలో టీఆర్‌పీఎస్ సంఘం, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు. ప్రభావతి, రాధిక, సునీత, నందిని, డాక్టర్ జాఫర్, మౌలాలి, బాబురావు, డాక్టర్ ఖాన్, డాక్టర్ శివ శంకర్, డాక్టర్ సదానందం, హరిబాబు పాల్గొన్నారు.

తెలంగాణ హోంగార్డులను వెనక్కి తీసుకురావాలి

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఏఐవైఎఫ్ బృందం వినతి

సాక్షి,సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ హోంగార్డులను స్వరాష్ట్రానికి తీసుకురావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తాకు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా తెలంగాణ స్థానికత ఉన్న హోంగార్డులు ఆంధ్రప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తుండగా, తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం వారంతా ఆంధ్రప్రదేశ్‌లో ఉండిపోయారని, అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను వారి స్థానికత ప్రకారం మార్చినప్పటికీ, హోంగార్డులను మార్చలేదన్నారు. హోంగార్డుల తల్లితండ్రులు వృద్ధాప్యంలో ఉండటం వల్ల వారి బాగోగులు చూసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కొంతమంది పిల్లలు ఆంధ్రప్రదేశ్‌లో విద్యను కొనసాగిస్తున్నారని, వారు భవిష్యత్తులో తెలంగాణ స్థానికతను కోల్పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన నుంచి దాదాపు '11'సంవత్సరాలుగా స్వరాష్ట్రాలకు వెళ్లాని ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వీరి న్యాయమైన సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ పాల్గొన్నారు.

వీసా గడువు ముగిసిన విదేశీయులు వెనక్కి

పంజగుట్ట: వీసా గడువు ముగిసినా భారతదేశంలో ఉంటూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు విదేశీయులను పంజగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని వారి స్వదేశాలకు పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లిబేరియా దేశస్థుడైన కర్మో మార్టిన్ 2019లో విద్యార్థి వీసాపై భారతదేశానికి వచ్చాడు. నిజాం కాలేజీలో 2020 నుంచి 2023 వరకు విద్యను అభ్యసించాడు. బ్యాక్‌లాగ్‌లు ఉన్నాయంటూ తప్పుడు క్లెయిమ్‌తో తన వీసాను పొడిగించుకుంటూ ఇక్కడే ఉంటున్నాడు. ఉగాండాకు చెందిన కబతుకు మేరీ 2024 డిసెంబర్ 17న జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు మెడికల్ వీసాపై భారతదేశానికి వచ్చింది. అయితే ఆమె ఎన్నడూ సదరు ఆసుపత్రికి వెళ్లలేదని పోలీసుల విచారణలో తేలింది. లిబేరియాకు చెందిన కోల్ జాన్సన్ ఏవీ కాలేజీలో చదువుకునేందుకు భారతదేశానికి 2022లో వచ్చింది. కానీ, విచారణలో ఆమె అసలు కాలేజీలో అడ్మిషన్ కూడా తీసుకోలేదని నిర్ధారించారు. వీరు ముగ్గురు పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బి.ఎస్ మక్తాలో నివసిస్తుండగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కబతుకు మేరీ, కోల్ జాన్సన్ వ్యభిచారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫారనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఆదేశాల మేరకు కర్మో మార్టిన్‌ను గత నెల 26న, కబతుకు మేరీని మంగళవారం, కోల్ జాన్సన్‌ను బుధవారం వారి స్వదేశాలకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో రూ.5.4 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

- బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలి నుంచి స్వాధీనం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో మహిళా ప్రయాణికురాలి వద్ద రూ.5.4 కోట్ల విలువ చేసే గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం బ్యాంకాక్ నుంచి వచ్చిన మహిళా ప్రయాణికురాలు గ్రీన్ చానల్ ద్వారా బయటకు వస్తుండగా..విశ్వసనీయ సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు ఆమెను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆమె బ్యాగుల్లో 5438 గ్రాముల గంజాయికి సంబంధించిన హైడ్రోపోనిక్ పౌడర్ లభించింది. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.5.4 కోట్లుగా ఉంటుందని అధికారులు గుర్తించారు. మహిళా ప్రయాణికురాలిపై ఎన్‌డీపీఎస్ ఆక్ట్ 95 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

– నలుగురికి అవయవ దానం



మియాపూర్: పాఠశాల భవనం ఆరంతస్తుల భవనం నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన ఓ విద్యార్థి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మియాపూర్ ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గోకుల్ ప్లాట్స్ వెంకటరమణ కాలనీలోని మల్లికార్జున టవర్స్ ప్లాట్ నంబర్-602లో నివాసముంటున్న జె.రవికుమార్, వాసంతి దంపతులకు కుమారుడు రాజనాగ వెంకట హరిశ్చంద్ర ప్రసాద్(14), కూతురు ఉన్నారు. హరిశ్చంద్ర ప్రసాద్ స్థానిక క్వాంటమ్ లీఫ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 3వ తేదీన ఉదయం పాఠశాలకు వెళ్లాడు. అయతే సాయంత్రం పాఠశాల భవనం ఆరో అంతస్తు పైనుంచి మొదటి అంతస్తులో ఉన్న రేకులపై కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే పాఠశాల సిబ్బంది సమీపంలోని యశోద ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు బాలుడి తల్లి వాసంతి మియాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. యాజమాన్యం, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించి తన కుమారుడు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది. అయితే రాజానాగవెంకట హరిశ్చంద్ర ప్రసాద్ చనిపోతూ నలుగురికి ప్రాణదానం చేశాడు. తల్లిదండ్రుల అనుమతితో ఆ బాలుడి అవయవాలను దానం చేశారు.



ఐఐటీ పోటీ పరీక్షల కోసం ఆకాష్ 'ఇన్విక్టస్'

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: ఐఐటీ ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ అందించే ప్రముఖ విద్యాసంస్థ ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) ఆకాష్ ఇన్విక్టస్ పేరిట పుస్తకాలను రూపొందించింది. ఈ బుక్స్‌ని బుధవారం బంజారాహిల్స్‌లోని హోటల్ హయత్ ప్లేస్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నిర్వాహకులు విడుదల చేశారు. దాదాపు లక్ష మంది విద్యార్థులు ఐఐటియన్‌లుగా మారడానికి మార్గదర్శకత్వం వహించిన అగ్రగామి ఫ్యాకల్టీలు ఈ పుస్తకాలను తీర్చిదిద్దారని సంస్థ ఎండీ దీపక్ మెహ్రోత్రా తెలిపారు. ఇది ఒక శిక్షణా కోర్సు మాత్రమే కాదని, టాప్ ఐఐటీ ర్యాంకులు అందుకోవడానికి మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమానికి నగరానికి చెందిన పలు విద్యాసంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

ఆతిథ్యరంగంలో మొదటి జీపీటీ

ఏప్రిల్ 24న కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ ఆవిష్కరణ



గచ్చిబౌలి: ఆతిథ్య రంగంలో ప్రపంచంలోనే మొట్టమొదటి జీపీటీని త్వరలోనే ఆవిష్కరించనున్నట్లు ఐఐహెచ్ఎం(ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్) వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సుబోర్నో బోస్ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో డాక్టర్ సుబోర్నో రచించిన 'హార్మోనైజింగ్ హ్యూమన్ టచ్ అండ్ ఏఐ టెరిజం హస్పిటాలిటీ'పుస్తకాన్ని స్కల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ఎస్ మోహన్, బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ ఆవిష్కరించారు. ప్రపంచ స్థాయిలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐఐహెచ్ఎం ప్రపంచంలోనే మొదటి సారి హస్పిటాలిటీ రంగంలో జీపీటీ(చాట్ జీపీటీ మాదిరిగా)ని త్వరలోనే ఆవిష్కరిస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఆల్ఫా టెస్టింగ్ మోడ్‌లో ఉందన్నారు. ఇంటర్నేషనల్ హస్పిటాలిటీ డేను పురస్కరించుకొని ఏప్రిల్ 24న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు ఆయన వివరించారు. ఇది హస్పిటాలిటీ రంగానికి గేమ్ చేంజర్‌గా మారనుందని చెప్పారు. నమస్తే ఐఐహెచ్ఎం జీపీటీ ఆతిథ్య రంగంలో ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ శక్తితో కూడిన నాలెడ్జ్ ఇంజన్ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఐపీఎస్ అధికారి అభిలాష్ బిస్త్, మంజీరా హస్పిటాలిటీ సీఓఓ ఎంవీ గణేష్, నొవాటెల్ జీఎం రాబిన్ చెరియన్, చెఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లంబా పాల్గొన్నారు.

న్యూరల్ ఏఐ గవర్నెన్స్‌కు రండి.. – పొన్నంకు ఆహ్వానం



బంజారాహిల్స్: ఈ నెల 8వ తేదీన ట్రిడెంట్ హోటల్‌లో జరిగే న్యూరల్ ఏఐ గవర్నెన్స్‌కు రావాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ అధినేత డాక్టర్ వినయ్‌కుమార్, న్యూరల్ ఏఐ అధినేత మోహన్‌కుమార్, న్యూరల్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సమన్వయకర్త జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామిఆహ్వానపత్రాన్ని అందజేశారు. బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసిన అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ ఏఐతో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని అన్నారు. ఆరోగ్య సంరక్షణ, రవాణా, రిటైల్, ఆర్థిక సేవలు, విద్య, ప్రజా భద్రతతో సహా దాదాపు అన్ని పరిశ్రమలలో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని అన్నారు. ఏఐ గవర్నెన్స్ గురించి అవగాహన కల్పించడానికి భారత్ లైట్ హౌస్ సంస్థ, జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ కీలక అడుగులు వేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీప్తి, రాధిక, రామారావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో తెలంగాణ పురోగతి



సాక్షి, సిటీబ్యూరో: ప్రమాదాలను తగ్గించడంలో తెలంగాణ పురోగతి సాధించిందని ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్టరీల శాఖ నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ సహకారంతో నగరంలోని రవీంద్రభారతిలో 54వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధానమంత్రి పిలుపునకు అనుగుణంగా.. ఫ్యాక్టరీల యాజమాన్యాలు, కార్మికులు, ప్రభుత్వ విభాగాలతోపాటు సమాజం కూడా తగిన కృషి చేయాలని కోరారు. పని ప్రదేశాలలో సురక్షితమైన పరిస్థితుల నిర్వహణకు అవసరమైన నియమ నిబంధనలు, విధానాలను సమీక్షించడానికి భద్రతా వారాన్ని కేటాయించాలని సదరు శాఖకు, ఫ్యాక్టరీల యాజమాన్యాలకు సూచించారు. భద్రతా సమస్యలపై ఫోన్ కాల్స్‌ను స్వీకరించడానికి ప్రత్యేక ఫోన్ నంబర్‌ను అందించాలని ఆయన అన్నారు. పని ప్రదేశాలలో భద్రత ప్రాముఖ్యత, ప్రమాదాలను నివారించడానికి ముందస్తు అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమైనదని తెలంగాణ ఫ్యాక్టరీల డైరెక్టర్, జాతీయ భద్రతా మండలి రాష్ట్ర చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాలరావు అభిప్రాయపడ్డారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం విషయంలో శాఖ కర్మాగారాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తోందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సరకా లాబొరేటరీస్ ఎమ్‌డీ, జాతీయ భద్రతా మండలి వైస్ చైర్మన్ పి. సత్యనారాయణ రెడ్డి, కర్మాగారాల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వై. మోహన్ బాబు, కర్మాగారాల శాఖ గౌరవ కార్యదర్శి వి.వి. శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





కొన్ని సంవత్సరాలుగా వీగన్స్, వీగనిజంపై విస్తృతంగా అవగాహన పెరుగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో వీగనిజంకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, ప్రాముఖ్యత తెలిపే సదస్సులు నిర్వహిస్తున్నారు. జంతు సంరక్షణ, మూగజీవాల హక్కుల కోసం పాటు పడటం వంటి అంశాలపై వీగన్లు, వీగన్ సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా నగరం వేదికగా మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీతార దక్ష నాగర్కర్ భాగస్వామ్యంతో మొక్కల-ఆధారిత ఆహార జీవనాన్ని ప్రోత్సహించే అవగాహన ప్రచారాన్ని ప్రారంభించారు. స్వతాహ వీగన్ అయిన దక్ష నాగర్కర్ వీగనిజం ప్రాముఖ్యత, జంతువులపై హింస వద్దంటూ ఈ ప్రచారం ద్వారా తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో వీగనిజం గురించి, ప్రస్తుత తరుణంలో దాని ప్రాధాన్యత.. తదితర అంశాల గురించి 'సాక్షి'తో పంచుకుంది.

- సాక్షి, సిటీబ్యూరో

- నగరంలో వీగనిజంపై అవగాహన ప్రచారం ప్రారంభం
- మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- వీగనిజం ప్రాముఖ్యత తెలియజేస్తున్న సినీతార దక్ష నాగర్కర్

వీ ఆర్ వీగన్స్





ప్రస్తుత మానవ జీవన విధానం జంతువులను అత్యంత హీనంగా హింసిస్తోంది. ముఖ్యంగా మాంసం కోసం 2, 3 నెలల జంతువులను కృత్రిమ విధానాలతో బలవంతంగా ఎక్కువ బరువు పెంచి సృష్టి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా డైరీ పామ్స్, పౌల్ట్రీ, పిగ్ పామ్స్‌లో కనీసం ఒక జంతువు స్వేచ్ఛగా తిరగకుండా కేజ్‌లలో బందించి వాటి ఉత్పత్తులను సేకరిస్తున్నారు. కొన్ని జంతువులైతే వాటి జీవిత కాలంలో సూర్యరశ్మికి కూడా చూడకుండా పెరుగుతున్నాయి. ఇది జీవవైవిధ్యానికి విరుద్ధం. దేశంలో జనాభా పెరిగిపోయింది, ఇంతమందికి సరిపడా జంతు ఉత్పత్తులు అందించలేక, బ్యాలెన్స్ చేయలేక అనైతిక బ్రీడింగ్‌తో హింసిస్తున్నారు. ఈ సందర్భంగా 'పవర్డ్ బై వెజ్జీస్' అంటూ కూరగాయలను మాత్రమే తినాలని ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఫ్యాక్టరీలు, వాహనాల కాలుష్యం కన్నా ఫ్యాక్టరీ ఫార్మమింగ్‌తో ఎక్కువ కాలుష్యం జరుగుతోంది. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం కోసం బాగా స్పందిస్తున్నారు. వారి జీవనంలో కొనసాగుతున్న ప్రాంతీయ వీగన్ వంటకాల విశిష్టతను తెలుసుకుంటున్నారు. కానీ నగరాల్లో మొక్కలకు కూడా ప్రాణం ఉంటుంది కదా అని వాదిస్తున్నారు. కానీ మొక్కల్లో స్టిమ్యులే మాత్రమే ఉంటుంది, జంతువుల్లో వలె నొప్పిని తెలియజేసే నాడీ వ్యవస్థ ఉండదని అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. వీగన్స్ అంటే మాంసాన్ని మాత్రమే కాదు.. పాలు, పెరుగు, గుడ్లు వంటి జంతు పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తులతో తయారు చేసిన బ్యాగ్‌లు, దుస్తులు ఏ ఇతర వస్తువులను వినియోగించరు. జంతువులకు వాటి స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు హింసకు దూరం చేయడం అవసరం. నేను నటించిన జాంబిరెడ్డి సినిమా షూటింగ్ సమయంలో మా దర్శకులు ఒక మేకను ఎంత జాగ్రత్తగా, సురక్షితంగా చూసుకున్నారో చూసి సంతోషపడ్డాను. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జంతువుల హింసించకూడదనే అంశంపై కొత్త చట్టాలను వెలువరించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం కూడా జంతు పెంపకాలపై దృష్టి సారిస్తూ నియమాలను పాటిస్తుంది. సినిమాల విషయానికొస్తే త్వరలో మరో 2 సినిమాలు చేస్తున్నాను. తెలుగు ప్రజలకు దగ్గరవ్వడం చాలా సంతోషంగా ఉంది. - దక్ష నాగర్కర్





జంతు సంరక్షణే లక్ష్యంగా 2016లో ప్రారంభించిన మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్ దేశవ్యాప్తంగా కృషి చేస్తోంది. సంస్థ పోరాటంలో భాగంగా దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో క్రూరంగా పందులను పెంచడం నిషేధించారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం కూడా ఉంది. శాఖాహారం, మాంసాహారం ఉన్నట్లుగానే వీగన్ ఫుడ్‌కు కూడా లేబుల్ ఉండేలా మార్పు తీసుకొచ్చాం. జాన్ అబ్రహం, సోనాక్షి సిన్హ, సాక్షి మల్లిక్ మాదిరిగానే హైదరాబాద్‌లో వీగనిజం కోసం దక్షా నాగర్కర్ క్యాంపెయిన్ చేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఒక జంతువును చంపితే రూ.50 ఫైన్ కట్టి హాయిగా తిరుగుతున్నారు. ఒక మనిషిని చంపితే ఎలాంటి చట్టం ఉంటుందో జంతు హత్యలపై కూడా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఉన్నత న్యాయస్థానాలకు విన్నవించాం.

- నికుంజ్ శర్మ, సీఈఓ, మెర్సీ ఫర్ యానిమల్స్ ఇండియా



9వ రన్ ఫర్ హర్

మాదాపూర్: మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విమైట్ సీఈవో రఘువీణసజ్జ తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో బుధవారం రన్ ఫర్ హర్ పేరిట పరుగు నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన రన్‌ఫర్ హర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని మంత్రి సీతక్క ప్రారంభిస్తారని తెలిపారు. ఈ రన్‌కు సంబంధించిన బ్రోచర్, టీషర్టు, మెడల్స్‌ను ఆవిష్కరించారు. ఇందులో 3కె, 5కె, 10కె విభాగంలో ఈ పరుగును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ పార్కు వద్ద పరుగును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 200 మందికి పైగా వైద్యులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మహిళలు, పురుషులు, చిన్నారులు పాల్గొననున్నట్లు తెలిపారు.



డబుల్స్ డైవ్ చాలెంజ్‌కు పదేళ్లు

సాక్షి, సిటీబ్యూరో: సింక్రోనీ ఆధ్వర్యంలో నిర్వహించే 'డబుల్స్ డైవ్ చాలెంజ్' పది సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సింక్రోనీ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుక నిర్వహించారు. నగరంలోని నోవోటెల్ హెచ్ఐసీసీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో సింక్రోనీ సంస్థకు చెందిన దాదాపు 500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. తమ 'డబుల్స్ డైవ్ ఛాలెంజ్'లో భాగంగా.. ఉద్యోగులు పేద విద్యార్థుల విద్యకు అవసరమైన వనరులను రూపొందించడంతో పాటు వారి సృజనాత్మకతకు సహకారం అందిస్తారని సింక్రోనీలో ఇ-చాట్ వైస్ ప్రెసిడెంట్, సెంట్రల్ రీజినల్ ఎంగేజ్‌మెంట్ హబ్ లీడర్ రాజ్ కోలా తెలిపారు. యూ అండ్ ఐ ట్రస్ట్ ప్రయత్నంలో భాగంగా హ్యాండ్‌మేడ్ బుక్‌మార్క్‌లు, ఆకర్షణీయమైన పద శోధన మెటీరియల్స్‌తో పాటు విజ్ఞాన అంశాలను పెంపొందించే చాట్‌బోర్డులు, పుస్తకాలను అందిస్తామన్నారు. నిర్మాణ్ సంస్థ సహకారంతో ప్రాణాలను రక్షించే నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తామని, ఇందులో సీపీఆర్, ప్రథమ చికిత్స శిక్షణ తదితర అంశాలున్నాయని పేర్కొన్నారు. ఈ విధంగా ఒక జట్టుగా పదేళ్ల పాటు కృషి చేయడం అభినందనీయమని వివరించారు.



మహిళామణుల ఆరోగ్యం కోసం..

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో మహిళా ఉద్యోగుల కోసం బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి, జలమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. వంద మందికిపైగా మహిళా ఉద్యోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వీరికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి చూపు, దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యురాలు డా.ఎం.మాధవి, ఫైనాన్స్ సీజీఎం కేదారేశ్వరి, జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ భాను తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ ఫర్ హోప్

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మార్పు కోసం కళను సాధనంగా మార్చాలనే సందేశంతో హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్ 'ఆర్ట్ ఫర్ హోప్' పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దీని ద్వారా 50 మంది ప్రతిభావంతులైన కళాకారులను ఎంపిక చేస్తున్నామని, వీరికి రూ.60 లక్షల మొత్తం గ్రాంట్‌గా అందిస్తున్నామన్నారు. ఎంపికైన చిత్రకారుల కోసం దేశ రాజధానిలో భారీ ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

హలో హలీమ్

చలో తినేద్దాం..

నగరంలో రంజాన్ మాసం అంటే ఆధ్యాత్మికతకు నెలవు. అయితే రుచుల ప్రియులకు అది హలీమ్‌కు కొలువు. రద్దీ బజార్ల నుంచి సందు గొందుల దాకా తినుబండారాల స్టాల్స్ నుంచి లగ్జరీ ఫైన్‌డైనింగ్ రెస్టారెంట్ల వరకు, ఎందెందు వెదకినా.. అందందే హలీమ్ ఘుమఘుమలు గుబాళిస్తూ ఉంటాయి. నగరవాసులకు మాత్రమే కాదు విదేశాలకు సైతం ఎగుమతి అయ్యే సిటీ హలీమ్‌ను అందించడంలో స్పెషల్‌గా నిలవాలని తయారీదారులు పోటీపడుతుంటారు. కొందరు తమ సంప్రదాయ తయారీ పద్ధతులకు కట్టుబడి ఉంటారు, మరికొందరు సమకాలీన రుచులతో ప్రయోగాలు చేస్తారు. పలువురు ఫుడ్ లవర్స్‌ను ఫ్యాన్స్‌గా మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో ఆదరణ పొందిన టాప్ 10 హలీమ్ స్పాట్స్ విశేషాలివి..

- సాక్షి, సిటీబ్యూరో







భలే 'సర్వీ'స్..

ప్రముఖ రెస్టారెంట్.. సర్వి గత కొంతకాలంగా అత్యంత ఆదరణ పొందుతున్న హలీమ్‌కు కేరాఫ్‌గా ఉంది. ఈసారి చికెన్ 65, ఉడికించిన గుడ్లు, జీడిపప్పు, క్రీమ్‌లతో కూడిన ప్రత్యేక ఇరానీ హలీమ్‌ను అందిస్తున్నారు. మాసాబ్‌ట్యాంక్, బంజారాహిల్స్, మాదాపూర్, సికింద్రాబాద్‌లలో సర్వి రెస్టారెంట్స్ ఉన్నాయి.

'వజ్రం'లా..

హోటల్ సిటీ డైమండ్ హలీమ్ ప్రియుల ఫేవరెట్ ప్లేస్‌గా పేరొందింది. నెయ్యితో తయారైన వీరి హలీమ్ సుగంధ మిశ్రమాన్ని కలిగి ఉంటుంది. దీనిని సంప్రదాయ భట్టిలో వండుతారు. మెహదీపట్నంలో సిటీ డైమండ్ ఉంది.

హుషార్.. పెషావర్..

ప్రత్యేక టాపింగ్స్ లేని హలీమ్‌ను ఇష్టపడే వ్యక్తులకు, పెషావర్ సరైన ప్లేస్. గత కొన్ని సంవత్సరాలుగా సువాసన గల హలీమ్‌తో హైదరాబాదీలను ఆకట్టుకుంటోన్న పెషావర్ లక్డీకాపూల్, మలక్‌పేట్‌లో ఉంది.

వహ్వా.. అని'పిస్తా'..

నగరవాసులు అత్యంత ఇష్టపడే పిస్తా హౌస్ ప్రస్తావన లేకుండా హైదరాబాద్ హలీమ్ పండుగ ఉండదు. ప్రతి ఏటా మాంసం, మసాలాతో కూడిన హలీమ్‌తో తనదైన రుచిని పిస్తా హౌస్ అందిస్తుంది. నగరంలో దాదాపు ప్రతీ ప్రధాన ఏరియాలో పిస్తా హౌస్‌లు ఉన్నాయి.

మది దోచే.. మందార్

అచ్చమైన సంప్రదాయ పద్ధతులను ఉపయోగించి వండే హలీమ్‌కు మందార్ పేరొందింది, కాసింత ఇంటిశైలి రుచిని ఇష్టపడేవారికి కరెక్ట్ ప్లేస్. ఈ హలీమ్‌ను రుచి చూడాలంటే టోలీచౌకిలోని మందార్‌ను సందర్శించాల్సిందే.

ట్రిపుల్ 'ఫై'న్..

ఫ్యూజన్ హలీమ్‌కు ప్రసిద్ధి చెందింది కేఫ్ 555.. చికెన్ 65, నల్లి ఘోష్త్, తలవా ఘోష్త్, ఉడికించిన గుడ్డు లేదా క్రీమ్ వంటి విభిన్న టాపింగ్స్‌తో వెరైటీ రుచులను అందిస్తుంది మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న ఈ కేఫ్.



సుభాన్.. మహాన్..

ఉస్మానియా బిస్కెట్‌ల సృష్టికర్త సుభాన్ బేకరీ రెండేళ్ల క్రితం హలీమ్ వ్యాపారంలో అడుగు పెట్టింది. స్వల్పకాలంలోనే నగరవాసుల మనసులను గెలుచుకుంది. నాంపల్లి, అత్తాపూర్ ప్రాంతాలలో ఈ బేకరీ ఉంది.

గ్రిల్.. భారీ థ్రిల్..

బాహుబలి హలీమ్‌తో ప్రత్యేకంగా గుర్తింపు పొందింది గ్రిల్(3 ప్లేట్ల హలీమ్, ఉడికించిన గుడ్లు, చికెన్ 65, పత్తర్ కా ఘోష్త్, నల్లి, వేయించిన ఉల్లిపాయలు, జీడిపప్పు, బాదం క్రీమ్)తో కూడిన హలీమ్‌లను వడ్డిస్తూ ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ హలీమ్ టేస్ట్ చేయాలంటే ఛలో సికింద్రాబాద్.

మటన్‌కా.. బాద్'షా'

షాగౌస్ పేరు తెలియని మాంసాహార ప్రియులు సిటీలో ఉండరేమో. ఆ క్రమంలోనే హలీమ్ లవర్స్‌నూ తనదైన శైలితో ఆకట్టుకుంటోంది. వినియోగించే మాంసపు రుచి పరంగా ఫ్యాన్స్‌ను దక్కించుకున్న ఈ రెస్టారెంట్ సిటీలోని లక్డికాపూల్, టోలిచౌకి, గచ్చిబౌలి షాలీబండాల్లో ఉంది.

ఆదాబ్.. షాదాబ్..

ఓల్డ్ సిటీ నడిబొడ్డున ఉన్న షాదాబ్ హోటల్ ప్రతి రంజాన్‌కు హలీమ్ ఆదరణలో అగ్రగామిగా ఉంటుంది. నాణ్యమైన ముడిదినుసులు సాంప్రదాయ వంట శైలిని ఉపయోగించడం వీరి ప్రత్యేకత. ఘాన్సీ బజార్‌లో షాదాబ్ ఉంది.



క్లుప్తంగా...

మాకు రెండు ఎమ్మెల్సీలు కావాలి

సీఎం రేవంత్‌ను కోరిన సీపీఐ నేతలు

సాక్షి, హైదరాబాద్: పొత్తు ధర్మంలో భాగంగా తమ పార్టీకి రెండు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సీపీఐ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో పార్టీ నాయకులు సీఎంను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కాంగ్రెస్, సీపీఐల మధ్య 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒప్పందం ప్రకారం తమకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇవ్వాలని కోరారు. సీఎం అధిష్టానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల గురించి చర్చించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిపాలన శూన్యత ఉంది

- ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం: ఎంపీ అర్వింద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిపాలనా శూన్యత ఏర్పడిందని, అందుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ అన్నారు. కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ ఓ గ్రహాంతరవాసి అని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ పార్టీ.. సీఎం పదవి నుంచి తొలగిస్తే రేవంత్‌రెడ్డి చూస్తూ ఊరుకుంటారా, తన స్థాయిలో ఏదో ఒకటి చేస్తారు కదా!'అని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలోకి వస్తానంటే రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తామని, అయితే ఆయనను పార్టీలోకి తీసుకుంటారా? లేదా అనేది మాత్రం తన చేతిలో లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నా.. మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని రేవంత్ అంటున్నారని, అసలు ఆయన ఎక్కడ అడ్డుపడ్డారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ప్రధాని మోదీ.. ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు ఇచ్చారన్నారు. తన నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల, నిజామాబాద్‌లలో ఒక్కోటి చొప్పున వచ్చాయన్నారు.

మీ సర్వే తప్పు.. అది నిరూపించడానికి ఎక్కడికైనా వస్తా

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సవాల్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే తప్పు అని..అది నిరూపించడానికి ఎక్కడికైనా వస్తానని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సవాల్ విసిరారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన తీన్మార్ మల్లన్న బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పంపించిన సస్పెన్షన్ ఆర్డర్ కాపీ అందిందని, దాన్ని గుర్తు పెట్టుకోవడానికి ఫ్రేమ్ కట్టించామన్నారు. మల్లన్న కాంగ్రెస్‌లో ఉంటే ప్రతిదానికి ప్రశ్నిస్తారని, దీన్ని తట్టుకోలేక సీఎం రేవంత్‌రెడ్డి చాలా రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని చూస్తున్నారన్నారు. బీసీలపై మాత్రమే చర్యలు తీసుకుంటామంటే... ఇక పోరాటమే చేస్తాం తప్ప..భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సస్పెండ్ చేయడానికి తాను చేసిన తప్పు ఏమిటో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని మల్లన్న డిమాండ్ చేశారు. తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదని, పార్టీ పెట్టాలని దృష్టి పెట్టలేదని చెప్పారు. బీసీ కోసం రేపటి నుంచి రోజుకో కార్యాచరణ తీసుకొని బీసీలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ నేతల ఫైర్

కౌంటర్ ఇచ్చిన మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. మంత్రి సీతక్క బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తల శ్రమతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కొందరు బీజేపీ, బీఆర్‌ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారని తీన్మార్ మల్లన్నను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కులగణన విషయంలో బీఆర్‌ఎస్ చేయలేనిది.. తాము చేస్తే అభినందించాల్సింది పోయి విమర్శలా అన్నారు. కులగణన అంశంలో తన పాత్ర లేదని.. తీన్మార్ మల్లన్న గాలి మాటలు మాట్లాడితే కుదరదని మాజీమంత్రి జానారెడ్డి అన్నారు. తన ఓటమికి సీఎం రేవంత్‌రెడ్డి కారణమంటూ మల్లన్న చేసిన వ్యాఖ్యలు కేవలం ఆయన ఉనికి కోసమేనని సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

సన్న ధాన్యం బోనస్

రూ.300 కోట్లకు పైగా పెండింగ్!

వానాకాలం సీజన్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించిన ప్రభుత్వం

- బోనస్ సొమ్ము ఆర్థిక శాఖ ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడి
- చెల్లించాల్సిన మొత్తం బోనస్ రూ.1,200 కోట్లు.. ఇప్పటివరకు రూ.900 కోట్ల లోపే జమ చేశారనే విమర్శలు
- పౌరసరఫరాల సంస్థ కార్యాలయాలను సంప్రదిస్తున్న రైతులు
- యాసంగిలోనూ పెద్ద మొత్తంలో సన్నాల సాగు.. ఈ పంటకు బోనస్‌పై సందేహాలు



సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్‌లో సన్న ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల్లో ఇంకా లక్షలాది మంది ప్రభుత్వం ఇచ్చే బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు చెల్లించిన మొత్తం పోగా ఇంకా రూ.300 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వానాకాలం సీజన్ నుంచి సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో సన్నధాన్యం పండించారు. గత వానాకాలం సీజన్‌లో ఏకంగా కోటి మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి రాగా, అందులో మెజారిటీ సన్న ధాన్యమే. అయితే సన్న ధాన్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ కలిపినా, అంతకుమించి అధిక ధర లభించిన చోట ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు రైతులు విక్రయించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 53 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యమే విక్రయించారు. ఇందులో 24 ఎల్‌ఎంటీల మేర సన్న ధాన్యం ఉంది. ఈ ధాన్యానికి ఎప్పటిలా రైతులకు డబ్బులు చెల్లించారు. అయితే బోనస్ మొత్తాన్ని పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థలతో సంబంధం లేకుండా ఆర్థిక శాఖ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. కానీ రాష్ట్రంలోని లక్షలాది మందికి ఇంకా బోనస్ జమ కాలేదనే విమర్శలు ఉన్నాయి. తమ ఖాతాల్లో బోనస్ డబ్బులు పడని రైతులు జిల్లాల్లో పౌరసరఫరాల సంస్థ కార్యాలయాలను సంప్రదిస్తున్నారు. అయితే అధికారులు తమకేం సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

ఇప్పటివరకు రూ.900 కోట్ల లోపే చెల్లింపు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన 24 ఎల్‌ఎంటీల సన్న ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్ మొత్తం రూ.1,200 కోట్లు. అయితే ఆర్థిక శాఖ జనవరి నాటికి సుమారు రూ.900 కోట్ల వరకు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలుస్తోంది. గత సంవత్సరం డిసెంబర్ 21 నాటికి 3,24,338 మంది రైతుల నుంచి 18 ఎల్‌ఎంటీల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేయగా, రూ.903 కోట్లు బోనస్‌గా చెల్లించాల్సి ఉంది. అందులో రూ.530 కోట్లు మాత్రమే అప్పటివరకు చెల్లించారు. ఆ తరువాత జనవరి నెలాఖరు వరకు మరో రూ.300 కోట్లు చెల్లించినట్లు అనధికారిక సమాచారం. అయితే అందులో కూడా స్పష్టత లేదు. కాగా పౌరసరఫరాల శాఖ ప్రతిరోజు విడుదల చేసే ధాన్యం సేకరణ రిపోర్టు నుంచి కూడా ఈ బోనస్ కాలంను డిసెంబర్ నుంచే తొలగించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా బోనస్‌ను ఆర్థిక శాఖ పరిధిలోనిదిగా చెపుతూ, వివరాలు ఇవ్వడం మానేశారు. అయితే మొత్తంగా రూ.900 కోట్ల లోపే బోనస్ చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూస్తే ఇంకా రూ.300 కోట్లకు పైగానే రైతులకు బోనస్ పెండింగ్‌లో ఉంది. బోనస్ బకాయిలు ఉండటాన్ని పౌరసరఫరాల ఉన్నతాధికారులు అంగీకరిస్తున్నప్పటికీ, వాటిని రైతుల ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారనే దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. అది ఆర్థిక శాఖ పరిధిలోని అంశంగా పేర్కొంటున్నారు.

ఈ యాసంగి మాటేమిటో..?

వానాకాలం మాదిరిగానే యాసంగిలో కూడా సన్నాలకు బోనస్ కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గత డిసెంబర్‌లోనే స్పష్టం చేశారు. దీంతో రైతులు పెద్ద ఎత్తున యాసంగిలో సన్నాలను సాగు చేశారు. ఇప్పటివరకు దాదాపు 53 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 70 శాతం వరకు సన్న ధాన్యం పంటనే అని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే వానాకాలం పంటకే ఇంకా రూ.300 కోట్లకు పైగా బోనస్ బకాయిలు ఉండడంతో యాసంగిలో పండే పంట పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సన్న ధాన్యానికి బోనస్ గురించి పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను సంప్రదించేందుకు 'సాక్షి' ఫోన్‌లో చేసిన ప్రయత్నం ఫలించలేదు. అయితే పౌరసఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాత్రం రైతులకు బోనస్ చెల్లింపులు ఆర్థిక శాఖ చూస్తుందని బదులివ్వడం గమనార్హం.

కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేదా?

- భూ సేకరణ కేసులో అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం
- స్పెషల్ సీఎస్ రామకృష్ణారావుకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: 'పేద రైతులకు పరిహారం చెల్లించడంలో ఇంత నిర్లక్ష్యమా.. తీర్పు ఇచ్చి ఏళ్లు దాటిపోయినా పరిహారం చెల్లించరా?'అని అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేకుండా వ్యవహరిస్తారా? అధికారం ఉంది కదా అని రైతుల నుంచి భూమి తీసుకుని పరిహారం చెల్లించరా.. ఇది ఎలా న్యాయమో చెప్పండి'అని ప్రశ్నించింది. 'భూమి కోల్పోయి రోడ్డున పడిన వారి పరిస్థితి గురించి ఆలోచించారా?'అని అసహనం వ్యక్తం చేసింది. తాము ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును హైకోర్టు ఆదేశించింది. ఆయనతో పాటు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, వనపర్తి కలెక్టర్ ఆదర్శ సురభి, వనపర్తి భూసేకరణ అధికారి సుబ్రహ్మణ్యంలకు ఫామ్–1 నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 28కి వాయిదా వేసింది. జూరాల ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువకు సమాంతర కాలువ తవ్వేందుకు 2009లో ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను చేపట్టింది. మెట్ట ప్రాంతంలోని భూమికి ఎకరాకు రూ. 61,500, నీటి సౌకర్యమున్న భూమికి రూ.74,500 మాగాణికి రూ. 89,500 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం అవార్డులో పేర్కొంది. పరిహారం పెంచాలని కోరుతూ రైతులు తొలుత జిల్లా కోర్టును, తర్వాత హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో చదరపు మీటరుకు రూ.700 పెంచాలని హైకోర్టు ఆదేశాలను జారీ చేసింది. దీనిపై సర్కార్ సుప్రీంకోర్టుకు వెళ్లినా అనుకూల ఉత్తర్వులు రాలేదు. అయినా పరిహారం చెల్లించకపోవడంతో ఆత్మకూర్‌కు చెందిన రైతు కె. జగదీశ్వర్‌తో పాటు మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. మూడు నెలల్లో పరిహారాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది.

భూమిని తీసుకుని పరిహారం ఇవ్వరా?

సెప్టెంబర్‌లో ఆదేశాలు ఇచ్చినా అధికారులు ఇంత వరకు పరిహారం డిపాజిట్ చేయలేదంటూ కె.జగదీశ్వర్‌తో పాటు మరో నలుగురు హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేయలేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రాజ్యాంగం కల్పించిన ఆస్తిహక్కు నిబంధనలను అధికారులు ఉల్లంఘించడమే కాకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈపీఎఫ్‌ఓ జోనల్ కార్యాలయం సిద్ధం

- నేడు కేంద్రమంత్రి మాండవీయ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- హాజరుకానున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) తెలంగాణ జోనల్ కార్యాలయం, బంజారాహిల్స్ ప్రాంతీయ కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు తాత్కాలిక భవనాల్లో కొనసాగిన ఈ కార్యాలయాలను ఇకపై బేగంపేటలో నిర్మించిన శాశ్వత భవన సముదాయంలోకి మారుస్తారు. నూతనంగా నిర్మించిన ఈ భవనాలను కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుక్ మాండవీయ గురువారం ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఈపీఎఫ్‌ఓ నరోడ ప్రాంతీయ కార్యాలయాన్ని మంత్రి ఇక్కడ్నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఆ తర్వాత గురుగ్రామ్‌లో ఈపీఎఫ్‌ఓ రెసిడెన్షియల్ ప్రాజెక్టుకు భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర కార్మిక శాఖ సహాయమంత్రి శోభ కరంద్లాజే, స్థానిక శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేశ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొననున్నారు.

బీజేపీకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులను వరుస క్రమంలో ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ కొనసాగించారు. ఈ క్రమంలో 53 మంది ఎలిమినేట్ అయ్యారు. అయినా ఎవరూ కోటా ఓట్లు సాధించలేదు.దీంతో చివరకు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను ఎలిమినేట్ చేసి, రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 98,637 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి 93,531 ఓట్లు వచ్చాయి. ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యతలో 60,419 ఓట్లు రాగా, 53 మంది అభ్యర్థులను ఎలిమినేషన్ చేసిన తర్వాత ఆయనకు వచ్చిన ఓట్ల సంఖ్య 63,972గా తేలింది.



కన్నీళ్లు పెడుతున్న నరేందర్‌రెడ్డి

అధిక ఓట్లు సాధించిన అంజిరెడ్డి

అయితే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు కోటా ఓట్లను చేరుకునే పరిస్థితి లేకపోవడంతో అధిక ఓట్లతో ఆధిక్యంలో ఉన్న బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని విజేతగా ప్రకటించాలనుకున్నారు. కానీ, దానిపై కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఇద్దరిలో ఎవరికీ గెలుపు కోటా ఓట్లు రానందున ఫలితాన్ని ప్రకటించొద్దని అవసరమైతే మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కించాలని రిటర్నింగ్ ఆఫీసర్‌ను కోరారు. దీంతో అధికారులు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. చివరకు మిగిలిన ఇద్దరిలో అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలన్న ఆదేశాల మేరకు బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని బుధవారం అర్ధరాత్రి విజేతగా ప్రకటించారు. దీంతో కౌంటింగ్ హాల్ నుంచి నరేందర్‌రెడ్డి బయటకు వచ్చారు. ఆయన్ను మీడియా చుట్టుముట్టగానే భావోద్వేగానికి గురై.. కన్నీటి పర్యంతమయ్యారు. ఏమీ మాట్లాడలేక పోయారు. గురువారం ఉదయం ప్రెస్‌మీట్ పెడతామని ఆయన అనుచరులు మీడియాకు చెప్పగా, నరేందర్‌రెడ్డి కారు ఎక్కి అంబేడ్కర్ స్టేడియం నుంచి వెళ్లిపోయారు.

ప్రొఫైల్


పేరు: చిన్నమైల్ అంజిరెడ్డి
పుట్టినతేదీ: 18-06-1966 రామచంద్రాపురం, సంగారెడ్డి
విద్యార్హత: ఎమ్మెస్సీ మ్యాథ్స్ (ఉస్మానియా)
సతీమణి: గోదావరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, సంగారెడ్డి
రాజకీయం: 2009 ప్రజారాజ్యం పార్టీతో ఆరంగ్రేటం
2014లో సంగారెడ్డి సెగ్మెంట్‌లో ఇండిపెండెంట్‌గా పరాజయం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు ఇలా....

పోలైన మొత్తం ఓట్లు	2,52,029
చెల్లిన ఓట్లు	2,23,343
చెల్లని ఓట్లు	28,686
గెలుపు కోటా నిర్ధారణ ఓట్లు	111,672
అభ్యర్థులకు వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లు	
అంజిరెడ్డి (బీజేపీ)	75,675
నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్)	70,565
ప్రసన్న హరికృష్ణ(బీఎస్పీ)	60,419
మిగతా 53 మందికి కలిపి	16,684
రెండో ప్రాధాన్యత ద్వారా వచ్చిన ఓట్లు	
అంజిరెడ్డి (బీజేపీ)	98,637
నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్)	93,531
బీజేపీ లీడ్	5,106

నా ఓటమికి పార్టీలు కుమ్మక్కు

బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీజేపీ చేతులు కలిపాయని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఆరోపించారు. ఆయన బుధవారం ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎలిమినేషన్ ప్రక్రియ సాగుతుండగానే విలేకరులతో మాట్లాడారు. ఏడు నెలలుగా తన విజయానికి నిర్విరామంగా కృషి చేసిన విద్యార్థులు, అనుచరులు, అభిమానులకు చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. ఇతరులు ఓటుకు రూ. 1000 నుంచి 3 వేల వరకు పంచి ప్రలోభపెట్టారని ఆరోపించారు. తాను రూపాయి పంచకుండా 60 వేలకుపైగా ఓట్లు సాధించానని చెప్పారు. తాను ప్రజల్లోనే ఉంటానని, తిరిగి ఉద్యోగానికి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ప్రజల్లో అసహనానికి ఎమ్మెల్సీ ఫలితాలే సాక్షి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిందనడానికి.. రెండు ఎమ్మెల్సీ సీట్లలో విజయం సాధించడం నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, అసత్య ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నం చేసినా.. రాష్ట్ర ప్రజలు బీజేపీ వెంటే నిలబడ్డారని తెలిపారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండుచోట్ల బీజేపీ గెలవడం, మరోచోట ఉపాధ్యాయ సంఘం విజయం సాధించడం.. ప్రభుత్వంపై పెరుగుతున్న అసహనానికి, బీజేపీపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమన్నారు. ఈ విజయం మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, బీజేపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



మీనాక్షి నటరాజన్‌కు మొక్కను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.

కాంగ్రెస్ కీలక భేటీ

- సీఎం రేవంత్ నివాసంలో సమావేశమైన మీనాక్షి, భట్టి, ఉత్తమ్, మహేశ్‌గౌడ్
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ
- 7న ఢిల్లీకి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేసే విషయమై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కీలకభేటీ జరిగింది. బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దాదాపు రెండు గంటలపాటు సమావేశమై ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో పాటించాల్సిన మార్గదర్శకాలపై చర్చించారు. మొత్తం నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఒకవేళ సీపీఐకి ఒక స్థానం ఇవ్వాలని అధిష్టానం నిర్ణయిస్తే అప్పుడు నిర్ణయం తీసుకుందామనే కోణంలో చర్చించారు. ఏ సామాజికవర్గానికి, ఏ జిల్లాకు ఎలాంటి పదవులు ఇవ్వాలి.. ఎమ్మెల్సీలుగా ఎవరిని పరిగణనలోకి తీసుకోవాలన్న అంశంపై ఓ అభిప్రాయానికి వచ్చారు. అయితే, ఎమ్మెల్సీలతో పాటు ఇతర అన్ని పదవుల భర్తీపై కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించేందుకుగాను ఈనెల 7వ తేదీన ఢిల్లీకి రాష్ట్ర నాయకత్వం వెళ్లనున్నట్టు సమాచారం.

ఇన్‌చార్జిగా ఇప్పుడు వచ్చాను... పనిలో ఎప్పటినుంచో ఉన్నాను

- పార్టీకి ఎవరేం చేస్తున్నారో అన్నీ తెలుసు... నటించడం మాని జెండా భుజాన మోయండి
- కాంగ్రెస్ అనుబంధ సంఘాల చైర్మన్‌లకు రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ క్లాస్
- ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమీక్ష

సాక్షి, హైదరాబాద్: తాను రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించినప్పటికీ చాలా కాలంగా తెలంగాణలో పార్టీ నేతల పనితీరును పరిశీలిస్తున్నానని, తనకు కబుర్లు చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వ్యాఖ్యానించారు. పార్టీ కోసం ఎవరు ఏం పనిచేస్తున్నారో తనకు తెలుసునని, తాను ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌ల నుంచి వచ్చిన నాయకురాలినని హెచ్చరించారు. పుట్టినరోజున కేక్‌లు కట్ చేసి, అన్నదానాలు, పండ్ల దానాలు చేసి పార్టీ కార్యక్రమం అని చెప్పుకుంటే ఇక మీదట కుదరదని ఆమె పార్టీ అనుబంధ సంఘాల చైర్మన్లకు క్లాస్ తీసుకున్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అనుబంధ సంఘాల చైర్మన్లతో మీనాక్షి సమావేశమయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ, పార్టీకి అనుబంధ సంఘాలే కీలకమని చెప్పారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టి చేతులు దులుపుకుంటే కుదరదని. గ్రామాలకు వెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఎవరు ఏం పనిచేస్తున్నారనే రిపోర్టులన్నీ తన దగ్గర ఉన్నాయని, నటించడం మానేసి పార్టీ జెండాను భుజాన మోయాలని మీనాక్షి హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అనుబంధ సంఘాలు కీలక పాత్ర పోషించాలన్నారు. గత ఎన్నికల్లో 65 స్థానాల్లో గెలిచామని, ఈసారి 100 స్థానాలు గెలిచేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కలిసికట్టుగా పనిచేయండి

అనంతరం ఆదిలాబాద్, పెద్దపల్లి నియోజకవర్గాల నేతలతో గాంధీభవన్‌లోనే మీనాక్షి విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలని, పార్టీ శ్రేయస్సే ప్రాధాన్యతగా అందరూ ముందుకెళ్లాలని కోరారు. ఆదిలాబాద్ సమీక్షలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ పార్టీ నేతల మధ్య సమన్వయలేమి అంశాన్ని మీనాక్షి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన మీనాక్షి.. ఆదిలాబాద్‌లో పార్టీ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని నియమించాలని, ఈ సమస్యను పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)కి సిఫారసు చేయాలని సూచించినట్టు సమాచారం. ఈ సమావేశాల్లో మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో...

ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటు సమీక్షల్లో భాగంగా మీనాక్షి కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను సెలెక్ట్ అండ్ ఎలక్ట్ పద్ధతిలో నియమించాలని నిర్ణయించారు. తొలుత ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, ఆ తర్వాత ఏఐసీసీ పరిశీలకులను పంపి, వారి నివేదికల ఆధారంగా నియామకాలు జరపాలని స్పష్టం చేశారు.

మండలి ఎన్నికల్లో మెరిసిన కమలం

- మూడు సీట్లలో రెండింటిని గెలిచి సత్తా చాటిన బీజేపీ
- ఒక టీచర్, మరో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కైవసం
- మొత్తం మూడుకు చేరిన బీజేపీ సభ్యుల సంఖ్య



సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. మూడు స్థానాలకు (రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్) జరిగిన ఎన్నికల్లో ఓ టీచర్, ఓ గ్రాడ్యుయేట్ సీట్లను గెలిచి కమలనాథులు సత్తా చాటారు. గతంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరఫున ఏవీఎస్‌రెడ్డి గెలుపొందారు. తాజాగా కరీంనగర్, ఇతర జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య, అదే నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీగా సి.అంజిరెడ్డి విజయం సాధించారు. దీంతో కౌన్సిల్‌లో బీజేపీ సభ్యుల సంఖ్య మూడుకు చేరింది.

కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంజయ్ తదితరుల కృషి

ఉత్తర తెలంగాణలో ఉన్న బలాన్ని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాల రూపంలో మరోసారి బీజేపీ నిరూపించుకుంది. ఇప్పటికే ఈ జిల్లాల్లో 4 ఎంపీ, 7 ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపొందిన కాషాయదళం.. ఇప్పుడు ఈ జిల్లాల్లోని రెండు ఎమ్మెల్సీ సీట్లనూ కైవసం చేసుకోవడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తమ పట్టును పూర్తిస్థాయిలో నిరూపించుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి పోలింగ్ ముగిసే వరకు కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంజయ్ వీరిద్దరి గెలుపుపైనే దృష్టి నిలిపారు. మంత్రిగా బిజీగా ఉన్నా 15 రోజులపాటు కరీంనగర్‌లోనే మకాం వేశారు. అదేవిధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎంపీ అరవింద్ ధర్మపురి, ఎమ్మెల్యేలు, మెదక్ జిల్లాలో ఎంపీ ఎం.రఘునందన్‌రావు, ఇతరనేతలు తమ ప్రాబల్యాన్ని చాటారు. ఇక మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలో జి.కిషన్‌రెడ్డి విస్తృతంగా పర్యటించడంతో పాటు టీచర్లు, గ్రాడ్యుయేట్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

బలమైన అభ్యర్థిని ఓడించి.. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్ని గెలిచి

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాలకు చెందిన బలమైన ప్రత్యర్థిని ఓడించడంతో పాటు, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన సిట్టింగ్ గ్రాడ్యుయేట్ స్థానాన్ని సైతం బీజేపీ చేజిక్కించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమౌతోంది. కొన్ని దశాబ్దాలుగా ఉపాధ్యాయ సంఘాలు నిలబెట్టిన అభ్యర్థులే గెలుస్తూ వస్తున్నారు. అదేవిధంగా ఈ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటివరకు బీజేపీ గెలవలేదు. ఉత్తర తెలంగాణలోని 42 అసెంబ్లీ స్థానాల పరిధిలో టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరగగా..వీటిలో అత్యధిక ఓట్లు సాధించి బీజేపీ అభ్యర్థులు నంబర్ వన్ స్థానానికి చేరుకున్నారు.

ఇప్పుడే ఎక్కువ మంది సభ్యులు

తెలంగాణ ఏర్పడ్డాక బీజేపీ తరఫున గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్.రామచంద్రరావు ఒక టర్మ్ ఉన్నారు. ఆ తర్వాత ఏవీఎస్‌రెడ్డి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక టర్మ్‌లో ఏడుగురు ఎమ్మెల్సీలు (వి.రామారావు, చలపతిరావు, డీఎస్‌రెడ్డి తదితరులు) గెలిచి చరిత్ర సృష్టించారు. 1984లో ఒక ఎమ్మెల్సీ ఉండగా, రాష్ట్ర విభజనకు ముందు (2014) ఉమ్మడి విశాఖ, తదితర జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా మాధవి, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా రామచంద్రరావు గెలుపొందారు. ఈ విధంగా చూస్తే దాదాపు 40 ఏళ్లలో బీజేపీకి తెలంగాణ శాసనమండలిలో ఇప్పుడే ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఉన్నట్టుగా భావించాల్సి ఉంటుందని పార్టీ నేత ఒకరు పేర్కొన్నారు.

సూపర్‌6కు గుండు సున్నా

బాబు సర్కారు మోసాలు, బడ్జెట్ కేటాయింపులపై వైఎస్ జగన్ ధ్వజం

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో.. అందరూ చూస్తుండగా బహిరంగ సభలో.. ''వైఎస్సార్‌సీపీ వాళ్లకు ఏ పథకాలూ ఇవ్వొద్దు.. ఏ పనులూ చేయొద్దు..'' అని చంద్రబాబు మాట్లాడారు. అసలు ఇవ్వడానికి... ఇవ్వకపోవడానికి ఇది బాబు గారి సొమ్మా? ప్రభుత్వానికి చంద్రబాబు కేవలం ధర్మకర్త (కస్టోడియన్) మాత్రమే. ప్రభుత్వం నడిచేది ప్రజల కోసం... ప్రజల సొమ్ముతో నడుస్తోంది. ఇదే పెద్దమనిషి.. ప్రమాణ స్వీకారం చేసినప్పుడు చేసిన ప్రమాణం ఏమిటి? పక్షపాతానికి, రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేశాడు. ఇప్పుడిలా బాహాటంగా, బహిరంగ సభలో మాట్లాడుతున్నాడు. చంద్రబాబు మాటలు, నా మాటలను వింటున్న జడ్జీలు, గవర్నర్ ఆలోచించాలి. ఇలాంటి వ్యక్తిని ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగించడం ధర్మమేనా? ఇలాంటి వ్యక్తులు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి పరిపాలన చేయడం ఏ రాష్ట్రానికైనా శ్రేయస్కరమా?

అదేమైనా బాబు సొమ్మా?

సాక్షి, అమరావతి

''**టీ**డీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశ పెట్టిన రెండు బడ్జెట్‌లను గమనిస్తే అన్ని వర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు అన్ని రకాలుగా చేసిన మోసం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ.. ఎన్నికల తర్వాత బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ.. అన్నది తేటతెల్లమవుతోంది'' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ''ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ హామీల అమలుకే ఏడాదికి రూ.79,867 కోట్లు అవసరం. కానీ నవంబర్‌లో ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల అమలుకు రూ.7,282 కోట్లే కేటాయించారు. అందులోనూ కేవలం రూ.865 కోట్లు మాత్రమే వ్యయం చేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు' అని మండిపడ్డారు. 2025–26 బడ్జెట్లో సూపర్ సిక్స్ హామీల అమలుకు రూ.17,179 కోట్లు మాత్రమే కేటాయించి ఎంతమందికి కోతలు విధిస్తారు? అని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ కాగ్ నివేదిక, బడ్జెట్ డాక్యుమెంట్లు, యూడీఐఎస్‌ఈ, పెట్రోలియం శాఖ నివేదికలు, సామాజిక ఆర్థిక సర్వే, గణాంకాలు, ఆధారాలతో చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎండగట్టారు. 'చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్ర సొంత ఆదాయం తగ్గింది. మూలధన వ్యయం కూడా దారుణంగా పడిపోయింది. కానీ.. జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) 12.94 శాతం నమోదు అయిందని చంద్రబాబు చెబుతున్నాడు. రాష్ట్ర సొంత ఆదాయం తగ్గితే జీఎస్‌డీపీ పెరగడం ఎలా సాధ్యం?' అని సూటిగా ప్రశ్నించారు. ఈ ఏడాది రూ.3,22,359 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ కాదా? అంటూ కడిగిపారేశారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఏమన్నారంటే..



ఇవ్వాల్సింది రూ.79,867 కోట్లు.. ఇచ్చింది రూ.865 కోట్లు

సూపర్ సిక్స్ హామీల అమలుకు మొత్తంగా ఎంత అవుతుందని లెక్కేసి చూస్తే.. ఏడాదికి రూ.79,867 కోట్లు కేటాయించాలి. కానీ గతేడాది బడ్జెట్‌లో రూ.7,282 కోట్లే కేటాయించారు. అందులోనూ కేవలం రూ.865 కోట్లు ఖర్చు పెట్టారు. ఇక ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.17,179 కోట్లే కేటాయించారు. అది కూడా ఎలాగూ మోసం చేయడం అనే పద్ధతిలో జరుగుతోంది. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనేందుకు ఇదే నిదర్శనం. – వైఎస్ జగన్

చెప్పేవన్నీ అబద్ధాలు.. చేసేదంతా మోసాలే

గవర్నర్ ప్రసంగం.. బడ్జెట్‌పై చర్చ.. ఏది చూసినా పరనింద, ఆత్మస్తుతి కనిపిస్తాయి. రెండో బడ్జెట్ ప్రవేశపెడుతున్నప్పుడు కూడా ఇంకా జగన్ ఇట్టా.. జగన్ అట్టా.. అంటూ విమర్శలే గానీ సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలో ఇచ్చిన 143 హామీల విషయం ఏమిటన్నది మాత్రం చెప్పరు. మొదటి ఏడాది బడ్జెట్‌లోనూ అరకొరే. కేటాయింపులకు పరిమితం. ఇచ్చిందెంత? అని చూస్తే బోడి సున్నా కనిపిస్తుంది. రెండో బడ్జెట్‌లోనూ అంతే. చెప్పేవన్నీ అబద్ధాలు.. చేసేదంతా మోసాలే.

హామీలకు చిల్లు

అడబిడ్డ నిధి: 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు.. ఈ లెక్కన 1.80 కోట్ల మందికి ఏడాదికి రూ.32,400 కోట్లు ఇవ్వాలి. మరి రెండు బడ్జెట్‌లలో ఎంత ఇచ్చావ్?.. బోడి సున్నా.

యువగళం: రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు నెలకు రూ.3 వేలు ఇస్తానన్నావ్. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.36 వేల చొప్పున రూ.7,200 కోట్లు ఇవ్వాలి? ఎప్పుడు ఇస్తావ్?

ఉచిత బస్సు: రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఏడాదికి రూ.3,500 కోట్లు అవసరం. దీనిపై ఇప్పటివరకు అతీగతీ లేదు.

50 ఏళ్లకే పింఛన్: నెలకు రూ.4,000 చొప్పున 20 లక్షల మందికి రూ.9,600 కోట్లు కావాలి. కానీ ఇచ్చింది గుండు సున్నా.

తల్లికి వందనం: ఏడాదికి రూ.15,000 చొప్పున 87,41,885 మంది పిల్లలకు రూ.13,112 కోట్లు ఇవ్వాలి. కానీ కేటాయించింది తొలి బడ్జెట్‌లో రూ.5,386 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.8,278 కోట్లే. ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వలేదు.

అన్నదాత సుఖీభవ: ఏడాదికి రూ.20 వేల చొప్పున 53.58 లక్షల మంది రైతులకు రూ.10,717 కోట్లు ఇవ్వాలి. కానీ తొలి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.6,300 కోట్లే కేటాయింపు. ఇప్పటివరకు అతీగతి లేదు.

దీపం: రాష్ట్రంలో 1.59 కోట్ల యాక్టివ్ డొమెస్టిక్ గ్యాస్ కనెక్షన్‌లకు మూడు గ్యాస్ సిలిండర్లు చొప్పున ఏడాదికి రూ.4 వేల కోట్లు అవసరం. కానీ తొలి బడ్జెట్‌లో రూ.865 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.2,600 కోట్లే కేటాయింపు. లక్షలాది మందికి ఎగనామం.

మరిన్ని వివరాలు, ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పలావ్ పోయింది.. బిర్యానీ ఓ మోసం!

చంద్రబాబు ఇచ్చిన మిగిలిన 143 హామీల పరిస్థితి చూస్తే.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకు పెన్షన్ కట్..! వలంటీర్లకు రూ.10 వేలు జీతం దేవుడెరుగు ఉద్యోగాలు కట్..! పది నెలలు గడిచినా పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు లేదు. చంద్రన్న బీమా గాలికి పోయింది. డ్వాక్రా సంఘాల సున్నా వడ్డీ రుణాలకు బోడి సున్నా..! ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ ఉన్న టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల సాయం హామీని ఎగ్గొట్టారు. జగన్ వాహన మిత్రకు పోటీగా ఈ హామీని ఇచ్చారు. ఇప్పుడు పలావు పోయింది.. బిర్యానీ ఓ మోసంగా తయారైంది! ముస్లింలకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేకుండా రూ.5 లక్షల రుణాలు ఒక్కరికీ ఇవ్వలేదు. ఇంకా ఎన్నో హామీలిచ్చాడు.

అప్పులపై అవే అబద్ధాలు..

మోసం చేయడంలో చంద్రబాబు పీహెచ్‌డీలు, రీసెర్చ్‌లు: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ''చంద్రబాబు మోసాలు ఏ స్థాయికి చేరుకున్నాయంటే.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు బహిరంగ సభలో రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లు అని అబద్ధాలు చెప్పాడు. ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్లన్నారు. ఆ తర్వాత రూ.12 లక్షల కోట్లన్నారు. గతేడాది బడ్జెట్‌లో గవర్నర్ ప్రసంగంలో రూ.10 లక్షల కోట్లని చెప్పించారు. రాష్ట్రానికి అప్పులు ఎంత ఉన్నాయన్నది కాగ్ రిపోర్టులో ఉంది. 2023–24లో కాగ్ అకౌంట్స్‌లో అప్పులు రూ.4,91,734.11 కోట్లు, ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పు రూ.1,54,797.11 కోట్లు. రెండు కలిపితే మొత్తం అప్పులు రూ.6,46,531 కోట్లు'' అని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. '2018–19 నాటికి అంటే.. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.2,57,509 కోట్లు. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన అప్పులు రూ.55,508 కోట్లు. రెండు కలిపి రూ.3.13 లక్షల కోట్ల అప్పులున్నాయని తన తొలి బడ్జెట్‌లోనే చంద్రబాబు ప్రకటించారు. ఆ అప్పులు మా ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.6.46 లక్షల కోట్లకు చేరాయి. వాస్తవాలు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా ఇంకా దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు' అని అన్నారు. అబద్ధాలు చెప్పడం, మళ్లీ మోసం చేయడంలో చంద్రబాబు పీహెచ్‌డీలు, రీసెర్చ్‌లు చేస్తున్నారని విమర్శించారు. 'మా ప్రభుత్వంతో పోలిస్తే.. చంద్రబాబు ఎడాపెడా అప్పులు చేస్తున్నారు. 2023–24లో రూ.62,207 కోట్లు అప్పు చేస్తే.. ఈ పెద్దమనిషి 2024–25లో రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో రూ.73,362 కోట్లు అప్పు చేసినట్లు చూపించారు. రూ.93 వేల కోట్లు అప్పులు చేసి, దాన్ని ఎడ్జస్ట్‌మెంట్ చేసి రివైజ్డ్ ఫైనల్ ఎస్టిమేట్స్‌లో రూ.73 వేల కోట్లుగా చూపించారు. అయినా సరే మా హయాంతో పోలిస్తే ఏ మేరకు ఎక్కువగా అప్పులు చేశారో కనిపిస్తోంది. ఈ అప్పులకు తోడు అమరావతి పేరుతో వరల్డ్ బ్యాంక్, ఏడీబీ రుణాలు రూ.15 వేలు, హడ్కో రుణం రూ.11 వేల కోట్లు, మార్క్‌ఫెడ్ ద్వారా రూ.8 వేల కోట్లు, సివిల్ సప్లయిస్ ద్వారా మరో రూ.5 వేల కోట్లు అప్పులు తెచ్చారు. కేఎఫ్‌డబ్ల్యూ రుణం మరో రూ.5 వేల కోట్లు ప్రాసెస్‌లో ఉంది. ఈ విధంగా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తున్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు చాలా సందర్భాల్లో చెప్పారు. కానీ బడ్జెట్ డాక్యుమెంట్‌లో ఒక మాదిరిగా, స్పీచ్‌లో మరో మాదిరిగా ఉంటుంది. అమరావతి కన్‌స్ట్రక్షన్స్ కింద రూ.6 వేల కోట్లు చూపించారు. అమరావతి పేరిట ఇంతింత అప్పులు చేస్తూ సెల్ఫ్ సస్టైనింగ్ ప్రాజెక్టు అని ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు?' అని ప్రశ్నించారు.

వ్యవస్థలు ధ్వంసం..

రైతుల నుంచి ఉద్యోగుల దాకా అందరికీ బాబు ధోకా: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ప్రతి వ్యవస్థను నీరుగార్చి పిల్లల నుంచి పెద్దల దాకా రైతుల నుంచి ఉద్యోగుల వరకు మోసగించిందని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. 'విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాడు–నేడు, కొత్త మెడికల్ కాలేజీలు, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా.. ఈ పథకాలన్నీ ధ్వంసం చేశారు. రూ.25 లక్షలున్న ఆరోగ్యశ్రీని రూ.2.5 లక్షలకు తగ్గిస్తున్నారు. నిజంగా వీరు మనుషులేనా? ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీరో వేకెన్సీ పాలసీలో భాగంగా నాడు విప్లవాత్మక చర్యలు తీసుకున్నాం. జాతీయ స్థాయిలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61% ఉంటే మన హయాంలో రాష్ట్రంలో 4% మాత్రమే ఉంది' అని పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

వ్యవసాయం నాశనం: వ్యవసాయాన్ని నాశనం చేశారు. రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్బీకేలు, ఈక్రాప్, దళారీలు లేకుండా పంటల కొనుగోలు, పాలవెల్లువ ద్వారా సహకార రంగంలో విప్లవం లాంటివన్నీ నీరుగార్చారు. నాడు అమూల్ రాకతో పాల సేకరణ రేట్లు ఏడుసార్లు పెరిగాయి. గేదె పాలు రూ.18.29 పెరిగితే, ఆవుపాలు రూ.9.49 పెరిగింది. ఇప్పుడు హెరిటేజ్ లాభాల కోసం అమూల్‌ను లేకుండా చేస్తున్నారు. పాడి రైతుల బతుకులను ఛిన్నాభిన్నం చేస్తున్నారు.

ఉద్యోగులకు తీవ్ర మోసం: ఉద్యోగులను చంద్రబాబు తీవ్రంగా మోసం చేశాడు. అధికారంలోకి రాగానే సీపీఎస్, జీపీ ఎస్ పునః సమీక్షిస్తామన్నారు. మెరుగైన పీఆర్సీ అన్నాడు. మా ప్రభుత్వం నియమించిన పీఆర్సీ చైర్మన్‌ను తొలగించాడు. కొత్త పీఆర్సీ వేయ లేదు. 10 నెలలు గడిచినా ఐఆర్ ప్రకటించ లేదు. 3 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటో తేదీన జీతాలు ఒకే ఒక్క నెల ఇచ్చారు. ఈరోజుకు కూడా జీతాల కోసం ఉద్యోగస్తుల ఎదురు చూపులే! ఉద్యోగుల జీపీఎఫ్, జీఎల్ఐ డబ్బులను వీళ్ల అవసరాల కోసం వాడుకుంటూనే ఉన్నారు. డీఏలు, జీపీఎఫ్‌లు, సరండర్ లీవ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఈహెచ్‌ఎస్ బకాయిలు వేల కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మా హయాంలో కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. 3 వేల మందిని రెగ్యులరైజ్ కూడా చేశాం. మిగిలిన 7 వేల మందికి డిపార్టుమెంటల్ రివ్యూ పూర్తయింది. ఎన్నికల కోడ్ కారణంగా పూర్తి చేయలేకపోయాం. రోస్టర్, రిజర్వేషన్, లెంత్ ఆఫ్ సర్వీస్ అన్నీ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం పూర్తి చేశాం. ఆ 7 వేల మందిని రెగ్యులరైజ్ చేస్తూ ఎందుకు ఆర్డర్స్ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం వాళ్ల జీవితాలతో ఆటలాడుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏమీ ఇవ్వకపోయినా కూడా ఏటా గవర్నమెంట్ ఉద్యోగస్తులకు 9–10% జీతాలు పెరుగుతాయి. రెండు డీఏలు, ఒక ఇంక్రిమెంట్ రూపేణా పెరుగుతాయి. కానీ.. జీతాలు పెరగని పరిస్థితి ఒక్క చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రమే నెలకొంది. పైగా బడ్జెట్‌లో దీనికి సంబంధించి కేటాయింపులు ఆశ్చర్యకరంగా తగ్గించారు.

12న ఫీజులపై కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా పిల్లలను చదువులకు దూరం చేస్తోంది. విద్యాదీవెన, వసతి దీవెన కోసం పిల్లలు, తల్లిదండ్రుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది. మార్చి 12న జిల్లా కేంద్రాల్లో పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు ఇచ్చే కార్యక్రమం చేపడతాం.

సచివాలయ సందర్శకుల కోసం గేట్-2 దగ్గర టెంట్

సాక్షి ఎఫెక్ట్..



సాక్షి, హైదరాబాద్: 'సచివాలయంలో నీడ కరువు'అంటూ ఫిబ్రవరి 4న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు సచివాలయం గేట్–2 దగ్గర టెంట్ ఏర్పాటు చేశారు. సచివాలయానికి వివిధ పనుల మీద వచ్చే సందర్శకులు, సచివాలయ పోలీసు సిబ్బంది ఎండలో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టెంట్ ఏర్పాటుపై సందర్శకులు, పోలీసు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులు, సచివాలయం గేట్ల దగ్గర విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని సాక్షిలో వచ్చిన కథనాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు టెంట్ వేయాలని నిర్ణయించామని సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేవీదాస్ పేర్కొన్నారు.

ఖతార్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

ప్రయాణికురాలికి అస్వస్థత..

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆస్పత్రికి తరలించినా దక్కని ప్రాణం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ప్రయాణికురాలు మృతిచెందింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆర్‌జీఐఏ పోలీస్ ఔట్‌పోస్టు సీఐ బాలరాజు కథనం ప్రకారం.. దోహా నుంచి బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు బయలుదేరిన ఖతార్ ఎయిర్‌లైన్స్–642 విమానంలో ఓ ప్రయాణికురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో వెంటనే పైలట్లు మెడికల్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం శంషాబాద్ విమానాశ్రయ ఏటీసీని సంప్రదించారు. ఏటీసీ ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనుమతినివ్వడంతో అర్ధరాత్రి 1.49 గంటలకు విమానం దిగింది. వెంటనే ఆ మహిళను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ చేసి, పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలిని ఢాకా నివాసి బేగం రౌష్నోరా (44)గా గుర్తించారు. ప్రయాణ సమయంలో ఆమె వెంట కుమారుడు కూడా ఉన్నాడు. కాగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. విమానం తిరిగి 3.42 గంటలకు ఢాకా బయలుదేరింది.

ఆ టీచర్ మాకొద్దు..

నిట్టూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆందోళన.. డీఈవో జోక్యంతో సద్దుమణిగిన వివాదం

సుల్తానాబాద్ (పెద్దపల్లి): 'ఆ టీచర్ మాకొద్దు.. ఆయన తీరుతో చదువు దెబ్బతింటోంది.. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు.. వారి స్వప్రయోజనాల కోసం మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి నెలకొంది.. అలాంటి సార్ మాకు వద్దు'అని విద్యార్థులు ఆందోళనకు దిగారు. పెద్దపల్లి మండలం నిట్టూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఘటన జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. ఉపాధ్యాయుడు శంకరయ్య విద్యార్థులను క్లాస్ రూంలో 'జై భీమ్'అని పలకాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విద్యార్థులు నిరసనకు దిగారు. సదరు ఉపాధ్యాయుడిపై చర్య తీసుకునే వరకూ పాఠశాలకు రాబోమని తేల్చిచెప్పారు. కొద్దిరోజులుగా ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం పీఎస్‌లో ఫిర్యాదు చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. సమస్యకు కారణమైన టీచర్ శంకరయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉపాధ్యాయుడు శంకరయ్యను వివరణ కోరగా టీచర్ల మధ్య గొడవలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై రుద్దుతున్నారని చెప్పారు. హెచ్ఎం సహకారంతోనే విద్యార్థులు ధర్నాకు దిగారని ఆయన ఆరోపించారు. కాగా, బుధవారం ఆందోళన తీవ్రతరం కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు.. వివరాలు సేకరించి జిల్లా విద్యాధికారికి సమాచారం చేరవేశారు. దీంతో డీఈవో మాధవి, ఎస్సై లక్ష్మణరావు పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.



బడికి తాళం వేసి నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

నిజామాబాద్, వరంగల్‌లకు ఎలక్ట్రిక్ సిటీ బస్సులు

- పీఎం ఈ–బస్ సేవా పథకం కింద కేంద్రం మంజూరు
- తొలిసారి హైదరాబాద్ వెలుపల సిటీ సర్వీసులుగా ఎలక్ట్రిక్ బస్సులు
- జీసీసీ పద్ధతిలో ఆర్టీసీకి అద్దెకివ్వనున్న ప్రైవేటు సంస్థ
- అద్దె చెల్లింపు పూచీకత్తుపై ఇంకా ఆమోదం తెలపని రాష్ట్ర ప్రభుత్వం
- ఓకే అంటే త్వరలోనే బస్సుల సరఫరా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో తొలిసారి సిటీ సర్వీసులుగా ఎలక్ట్రిక్ బస్సులు తిరగబోతున్నాయి. ఇప్పటివరకు హైదరాబాద్‌లో మాత్రమే ఎలక్ట్రిక్ బస్సులు సిటీ సర్వీసులుగా తిరుగుతున్నాయి. త్వరలో వరంగల్, నిజామాబాద్‌లో కూడా ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయి. కేంద్రం కొత్తగా ప్రారంభించిన 'పీఎం ఈ–బస్ సేవా'పథకం కింద ఇవి మంజూరయ్యాయి. ఈ బస్సులను నిర్వహించే సంస్థకు ఆర్టీసీ చెల్లించే అద్దెకు పూచీకత్తు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం సెక్యూరిటీ మెకానిజమ్ స్కీమ్‌కు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆ ఫైలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అక్కడి నుంచి ఆమోదం రాగానే కేంద్రానికి పంపనున్నారు. ఆ తర్వాత రెండు నగరాలకు ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా కానున్నాయి.

20 కి.మీ. పరిధిలో..

వరంగల్, నిజామాబాద్‌లో పరిమిత సంఖ్యలో సిటీ సర్వీసులుగా డీజిల్ బస్సులు తిరుగుతున్నాయి. ఇప్పుడు కొత్తగా 104ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. అయితే అక్కడ అంత డిమాండ్ ఉంటుందా అన్న సందేహాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పట్టణంలోపలే కాకుండా పట్టణం వెలుపల 20 కి.మీ. దూరం వరకు వాటిని తిప్పా లని ఆర్టీసీ భావిస్తోంది. అప్పటికీ వాటికి సరైన డిమాండ్ ఉండని పక్షంలో సమీపంలోని ఇతర పట్టణాలకు కూడా తిప్పేలా కేంద్రం నుంచి అను మతి పొందాలని యోచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే ఈ ఫైలు ముందుకు కదలనుంది.

వరంగల్‌కు 53, నిజామాబాద్‌కు 51

దేశవ్యాప్తంగా నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులు తిప్పాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 40 లక్షలు, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న తొమ్మిది నగరాలకు ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా చేసేందుకు పీఎం ఈ–డ్రైవ్ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో హైదరాబాద్‌కు 2,800 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైన విషయం తెలిసిందే. 40 లక్షల లోపు, మూడు లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలకు కోసం పీఎం ఈ–బస్ సేవా పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 చిన్న నగరాలకు 38 వేల ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.3,435 కోట్లు కేటాయించారు. ఇందులో తొలి విడతగా 49 నగరాలను ఎంపిక చేసి టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేశారు. వాటిల్లో తెలంగాణ నుంచి వరంగల్, నిజామాబాద్ ఎంపికయ్యాయి. వరంగల్‌కు 53, నిజామాబాద్‌కు 51 బస్సులు మంజూరయ్యాయి. ఈ బస్సుల సరఫరా టెండర్ దక్కించుకునే సంస్థ.. వాటిని గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో అద్దెకి తిప్పుతుంది. కిలోమీటర్‌కు నిర్ధారించే అద్దెను ప్రతినెలా ఆ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆర్టీసీ ఆ అద్దె మొత్తాన్ని చెల్లించని పక్షంలో, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా సెక్యూరిటీ మెకానిజమ్ స్కీమ్ కింద ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఒక నెలకు సంబంధించిన నిర్ధారిత మొత్తాన్ని కేంద్రం వద్ద డిపాజిట్ చేయాలి. ఆర్టీసీ చెల్లించని పక్షంలో అందులోని మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థకు బదలాయిస్తుంది. మూడు నెలల్లో తిరిగి ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. పీఎం ఈ–డ్రైవ్ కింద హైదరాబాద్‌కు సరఫరా అయ్యే బస్సులకు సంబంధించి ఇప్పటికే ఆమోదం తెలిపింది. నిజామాబాద్, వరంగల్ బస్సులకు ఆమోదం తెలపాల్సి ఉంది.

ఆత్మహత్యాయత్నం చేయలేదు..


- కూతురితో మనస్పర్థలతోనే అధిక మోతాదులో నిద్ర మాత్రలు వేసుకున్నా
- పోలీసులకు సింగర్ కల్పన వివరణ
- ట్యాబ్లెట్ల ఓవర్ డోస్‌తోనే తల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్న కుమార్తె



కేపీహెచ్‌బీ కాలనీ (హైదరాబాద్): మంగళవారం నిద్ర మాత్రలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్న గాయని కల్పన ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం పోలీసులు కల్పన నుంచి వివరాలు తీసుకున్నారు. చదువు విషయంలో తన కూతురుతో తలెత్తిన మనస్పర్థలతో తీవ్ర ఆందోళనకు లోనైనట్లుగా ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిద్ర పట్టకపోవడంతో నిద్ర మాత్రలను వేసుకోవడం, అవి ఓవర్ డోస్ కావడం వల్లనే తాను అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లుగా పోలీసులకు ఆమె వివరణ ఇచ్చారు. గాయని కల్పన ఇటీవల కేరళలోని ఎర్నాకుళం జిల్లాకు వెళ్లింది. ఈ నెల 3న అక్కడ ఉండే కుమార్తె దయాప్రసాద్‌కు, కల్పనకు మధ్య చదువు విషయంలో వాగ్వాదం నడిచింది. హైదరాబాద్‌లో చదువుకోవాలని కల్పన కోరగా కుమార్తె అందుకు నిరాకరించింది. దీంతో ఇద్దరిమధ్య మనస్పర్థలు వచ్చాయి. ఆ తర్వాత మరుసటిరోజు కల్పన హైదరాబాద్‌కు చేరుకుంది. ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం 1.40 అయ్యింది. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టకపోవడంతో 8 నిద్ర మాత్రలను వేసుకుంది. అయినప్పటికీ నిద్ర పట్టకపోవడంతో మళ్లీ మరికొన్ని మాత్రలు వేసుకోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అపస్మారక స్థితికి చేరుకుంటున్నానన్న విషయాన్ని భర్త ప్రసాద్‌కు ఫోన్ ద్వారా తెలియజేసింది. భర్త కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు ఫోన్ చేయడంతో వారు పోలీసుల సహాయంతో తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా కల్పన అపస్మారక స్థితిలో పడి ఉంది. సాయంత్రం 5 గంటల సమయంలో ఆమెను ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్సను అందించారు. బుధవారం కోలుకున్న ఆమె జరిగిన విషయాన్ని పోలీసులకు వివరించారు. కాగా, నిద్ర మాత్రలు ఓవర్‌డోస్ వేసుకోవడంతోనే తన తల్లి అపస్మారక స్థితిలోకి వెళ్లిందని, ఆమె ఎలాంటి ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని కల్పన కూతురు దయాప్రసాద్ మీడియాకు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్పనను గాయని సునీత, గీతామాధురి, కారుణ్యతో పాటు పలువురు పరామర్శించారు.

కమిషన్ నివేదిక ఎంత వరకు వచ్చింది?

'స్థానిక'రిజర్వేషన్లపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు కేటాయించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ విచారణ ఎంత వరకు వచ్చిందని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరాలు తెలియజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ హైకోర్టులో 2023, మార్చిలో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. మొత్తం 220 సర్పంచ్‌లు, 94 ఎంపీటీసీ, నాలుగు జెడ్పీటీసీ, 5,364 వార్డులు, 344 ఉపసర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పంచాయతీలు, వార్డులు.. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే నిధులను కోల్పోతాయన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం వివరాలు అందజేస్తే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈసీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సి ఉందని జీపీ షాజియా పర్వీన్ నివేదించారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో ధర్మాసనం జోక్యం చేసుకుని.. కమిషన్ నివేదిక అందజేసిందా? అని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలు తెలియజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

రంగుల కళ

ఇంటర్నేషనల్ విమెన్స్ డే సింబల్, పోస్టర్ డిజైన్‌లలో సాధారణంగా పింక్ కలర్‌లో కనిపిస్తుంటుంది. నిజానికి ఎన్నో ఏళ్లుగా ఇంటర్నేషనల్ విమెన్స్ డే అంటే ఊదా, ఆకుపచ్చ, తెలుపు రంగులు మాత్రమే ప్రాచుర్యం పొందాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వెబ్‌సైట్ ప్రకారం... ఊదా రంగు గౌరవానికి, న్యాయానికి, ఆకుపచ్చ ఆశకు, తెలుపు స్వచ్ఛతకు ప్రతీక. యూకేలోని ఉమెన్స్ సోషల్ అండ్ పొలిటికల్ యూనియన్ (డబ్ల్యూ ఎస్పీయూ-1908) ద్వారా ఈ రంగులు ప్రాచుర్యంలోకి వచ్చాయి.



డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ



డాక్టర్ రూప పుట్టా
డాక్టర్ గాయత్రి కామినేని



డాక్టర్ హరిణి చేబ్రోలు

వైద్యరంగ రథసారథులు

నిర్వహణలోనూ రాణిస్తాం!

ఒకరు వైద్యశాస్త్రం చదివాక... తన సేవలకు ఆ పరిధి సరిపోదేమోనని సివిల్ సర్వీసెస్ రాసి... ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి హెల్త్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. మరొకరు ఓ పెద్ద హాస్పిటల్‌కు వైస్ ప్రెసిడెంట్... ఇంకొకరు మరో పేరుమోసిన హాస్పిటల్‌కు సీవోవో... మరికొందరు హాస్పిటల్ డైరెక్టర్లు. వైద్యశాస్త్రం చదివి మహిళా వైద్యులుగా పేరుపొందినవాళ్లు చాలామందే ఉన్నారు. కానీ హాస్పిటల్ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్లుగా, ఆరోగ్యరంగ సారథులుగా ఉంటూ సారథ్యం వహిస్తున్న వారు కాస్త తక్కువే గానీ ఇప్పుడు వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఇలా వైస్ ప్రెసిడెంట్లుగా, సీవోవోలుగా, కీలకమైన స్థానాల్లో ఉండి రాష్ట్రానికీ, హాస్పిటళ్లకూ దిశానిర్దేశం చేస్తూ... వాటిని ముందుండి నడిపిస్తూ ప్రధాన బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్న మహిళా వైద్యుల స్ఫూర్తిమంతమైన మాటలివి.

పల్లెనాడి పట్టడానికి ఐఏఎస్‌గా...

- డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, సెక్రటరీ టు ద గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ

నా మీద చిన్నప్పట్నుంచీ మా నాన్నగారి ప్రభావం ఎంతో ఉంది. గతంలో ఆంధ్రప్రదేశ్, మిజోరా రాష్ట్రాల్లో అనేక శాఖల్లో పనిచేస్తూ సమాజానికి అంకితభావంతో సేవలందించిన మంచి ఉద్యోగి ఆయన. పల్లెప్రాంతల్లో పనిచేసే సమయంలో మా నాన్న ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని ఆయన పరిష్కరించిన తీరు... ఇవన్నీ చూస్తూ పెరిగాను నేను. ఆయన అనుభవాలన్నీ అటు తర్వాత నాకెంతో ఉపకరించాయి.

గ్రామీణ ప్రాంతాల్లో నాన్న ఎదుర్కొన్న సవాళ్లకు ఆరోగ్య సేవల ద్వారానే ఉత్తమమైన పరిష్కారం అందించవచ్చని అనిపించడంతో నేను ఎంబీబీఎస్ చేశా. నా ఇంటర్న్‌షిప్ సమయంలో మారుమూల పల్లెల్లో పనిచేస్తున్నప్పుడు నేను కనుగొన్న కొన్ని లోపాలను మంచి పాలనతోనే అధిగమించవచ్చని నాకు అనిపించింది. దాంతో సివిల్ సర్వీసెస్ రాశా. అలా నేను డాక్టర్ నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌గా మారాను.

ఎంత పెద్ద ప్రయాణమైనా... మొట్టమొదటి అడుగుతో మొదలవుతుందనే సూక్తిని నమ్మిన నేను ఈశాన్య రాష్ట్రాలకు సేవలందించాక ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో అందునా వైద్యశాఖ ద్వారానే నా సేవలందిస్తున్నా.

మన సమాజమే పితృస్వామ్య సమాజమైనప్పటికీ మహిళలు తమ సామర్థ్యాలు చూపుతూ చాలా రంగాల్లో తమ సత్తా చాటుతున్నారు. ఒక్కోసారి తమ పురుష ప్రత్యర్థుల కంటే మహిళల సామర్థ్యాలే మెరుగ్గా ఉంటున్నాయని చెప్పవచ్చు. ఒక్కోసారి మా నాన్నవాళ్ల తరం కంటే మా తరం బాగానే పురోగమిస్తోందనిపిస్తోంది. నిజానికి మా వైద్యశాఖలో పనిచేసే సిబ్బందిలో చాలామంది మహిళలే ఉన్నారు.

సమాజంలో ఈ వివక్ష ఉన్నప్పటికీ నా మట్టుకు నేను మంచి సామర్థ్యంతో, ప్రొఫెషనలిజమ్‌తో కష్టపడి పనిచేస్తే ఈ వివక్షనూ అధిగమించవచ్చనే ఉద్దేశంతో పనిచేస్తున్నాను. గత 24 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రానికంతటికీ నా సేవలందించేలా మనస్ఫూర్తిగా పనిచేయడం నాకు గుండెల నిండా ఆనందాన్ని, తృప్తిని ఇస్తోంది. హెల్త్ సెక్రటరీగా రాష్ట్రంలోని అట్టడుగు, బడుగువర్గాల వారందరికీ మా ప్రభుత్వ సేవలందాలనేదే నా మొట్టమొదటి లక్ష్యం. మేము అమలు చేసిన కార్యక్రమాలతో మెరుగైన స్క్రీనింగ్ పరీక్షలూ, వైద్యపరీక్షలతో ఎన్నో మాతృమరణాలూ, శిశుమరణాలూ... వీటన్నింటినీ గణనీయంగా తగ్గించగలిగాం. మారుమూల గిరిజనప్రాంతాల్లో వ్యాధినిర్ధారణ కేంద్రాలూ, ఐటీడీఏలకు అంబులెన్స్ సర్వీసులపై దృష్టి నిలిపాం. చిన్న పల్లెల్లో చదివే ప్రతిభావంతులైన పిల్లలకూ వైద్యవిద్య అందాలనే సదుద్దేశంతో ఎనిమిది కొత్త మెడికల్ కాలేజీలూ, 16 నర్సింగ్ కాలేజీలూ, 28 పారామెడికల్ కాలేజీలతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో... ఎంతో వివక్షకు లోనవుతున్న ట్రాన్స్‌జెండర్ వాళ్ల ఆరోగ్యం కోసం ఓ తొలి ప్రయత్నంగా 33 క్లినిక్‌లు ఏర్పాటు చేసే దిశగా పనిచేశాం. ఓ ప్రభుత్వ ఉద్యోగిగా సివిల్ సర్వీసెస్‌లో ఉంటూ నా పనుల ద్వారా సమాజంలో ఎంతో మార్పు తెచ్చామన్న తృప్తి ప్రతిరోజూ ప్రతిక్షణం ఉండటమే ఈ వృత్తిలో ఉన్నందుకు నాకు దక్కే సంతృప్తి.

సంకల్ప బలంతోనే సాధన సులభం

- డాక్టర్ రూప పుట్టా, సీనియర్ రేడియాలజిస్ట్, డైరెక్టర్ అండ్ కో ఫౌండర్ ఆఫ్ ప్రీతీ యూరాలజీ అండ్ కిడ్నీ హాస్పిటల్స్, హైదరాబాద్

ఒక హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా, మా టీమ్‌లోని ఉద్యోగులకు స్ఫూర్తిని అందించే మెంటార్‌గా, మా హెచ్‌ఆర్ టీమ్‌లకూ, పారా మెడికల్ స్టాఫ్‌కూ మార్గనిర్దేశనం చేస్తూ, వారికి నేతృత్వం వహించే పనిచేయడాని కంటే ముందు నేను మా తల్లిదండ్రులకు ఏకైక సంతానాన్ని. దాంతో నా తల్లిదండ్రుల బాధ్యతలూ నేనే నిర్వహించాలి. దాంతోపాటు నా భర్తకు అవసరమైన నైతిక స్థైర్యాన్ని, నా అత్తమామలకు అవసరమైన సేవలందిస్తూ ఇలా ఇంటిబాధ్యతలు చూస్తూనే... కెరియర్ పరంగా ఓ ఎంట్రప్రెన్యూర్‌గా హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు చేపట్టా. ఓవైపు ఇంటిబాధ్యతలూ, మరోవైపు కెరియర్ బాధ్యతలు... ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ మా సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా. సంకల్ప బలం ఉంటే కష్టసాధ్యమైన లక్ష్యాలనూ ఛేదించగలం అనేది నేను నమ్మే తారకమంత్రం. ఈ మాట ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... నేను రెండోసారి గర్భవతిగా ఉన్నప్పుడు నా రేడియాలజీ పీజీ పూర్తి చేశా. అటు తర్వాత ప్రతిష్ఠాత్మమైన 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'లో ఏఎమ్‌పీహెచ్ ప్రోగ్రామ్ పూర్తికావడంతోనే ప్రీతీ హాస్పిటల్స్ గ్రూపునకు ఆపరేషన్స్ అధినేతగా బాధ్యతలు తీసుకున్నా. ప్రస్తుతం నేను మా సంస్థలో వందల సంఖ్యలో పనిచేస్తున్న ఉద్యోగులకు నేతృత్వం వహిస్తున్నా. ఈ క్రమంలో మా సంస్థలో జెండర్ వివక్ష ఉండకూడదనే ఉద్దేశంతో వీలైనంత మేరకు మహిళా ఉద్యోగులనే నియమిస్తున్నాం. రోజు డ్యూటీ ముగిసి ఇంటికెళ్లే సమయానికి... మేం మా పేషెంట్ల పట్ల మాత్రమే కాకుండా... సమాజంలోని నిరుపేదల విషయంలోనూ సహానుభూతితో వ్యవహరిస్తున్నామన్న తృప్తే మమ్మల్ని ముందుకు నడిపించే మరో స్ఫూర్తిమంత్రమంటూ వినమ్రంగా చెబుతున్నాను.

సారథ్యం అంత కష్టమేమీ కాదు!

- డాక్టర్ గాయత్రి కామినేని, ఆర్థోపెడిక్ సర్జన్ అండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో), కామినేని హాస్పిటల్స్, హైదరాబాద్

ప్రస్తుతం నా వయసు 37 ఏళ్లైతే... మా హాస్పిటల్ వయసు 32 ఏళ్లు. అంటే నా ఊహ తెలిసినప్పటినుంచి మా అమ్మతో పాటు హాస్పిటల్, క్లినిక్... ఇలా నిత్యం వైద్యుల మధ్యనే మెలగుతున్నా. నా ఇంటర్మీడియట్ టైమ్‌లో బైపీసీ తీసుకుని వైద్యరంగం వైపునకు వెళ్లడం అనివార్యంగా జరిగిపోయింది. మాకు ఓ సొంత హాస్పిటల్ ఉండటం... అలాగే మేము నడుపుతున్న మెడికల్ కాలేజీలూ ఉండటం వల్ల అక్కడ హాస్పిటల్ సారథిగా కీలకమైన అడ్మినిస్ట్రేషన్ స్థానంలోకి నేను వెళ్లడం చాలా సులువు అని కొంతమందికి అనిపించవచ్చు. అయితే ఈ పురుషుల ప్రాధాన్య ప్రపంచంలో ప్రతి సవాలునూ, ప్రతి సమస్యనూ పరిష్కరించుకుంటూ రావడం, ఓ మహిళగా ప్రతి నిమిషం, ప్రతిక్షణం తనను తాను నిరూపించుకుంటూ ఉండటం, ఆ స్థానాన్ని పదిలంగా నిలబెట్టుకోవడం, అందులో పదికాలాలు నిలదొక్కుకోవడం చాలా కష్టమైన పని. ఇక్కడ మనం చేయాల్సిందొక్కటే... మన హద్దులను మనమే మరింతగా విస్తృత పరచుకుంటూ, మన పరిధిని మనమే మరింత విశాలం చేసుకుంటూ మన తోటివారినీ మనతోపాటు ముందుకు తీసుకెళ్తూ ఉండటమే. ఓ మహిళగా నా టీమ్‌ను ఈ దిశగా నడిపిస్తూ నా డాక్టర్లూ, నా సిబ్బందీ వీళ్లందరూ మంచి కౌన్సెలర్లుగా సహానుభూతితో పనిచేసేలా చేయగలగడం, మంచి ఆరోగ్యాన్ని అందించడం ప్రస్తుతం నేను చేస్తున్న పని. చాలాకాలం పాటు హాస్పిటళ్ల చుట్టూ తిరుగుతూ ఉండాల్సిన నిరుపేద పేషెంట్లకూ, గ్రామీణ ప్రాంతపు రోగులకూ ఈ సౌకర్యాలన్నీ ఇవ్వగలుగుతూ వస్తున్నామన్న ఓ అద్భుతమైన భావనే నాకు సంతృప్తినిస్తుంది.



ఎల్మిరా సిద్దీఖీ

మేనేజ్‌మెంట్‌లో మేమే బెస్ట్!

- డాక్టర్ హరిణి చేబ్రోలు, వైస్ ప్రెసిడెంట్ (రెవిన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్), కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

మొదట నేను ఓ డాక్టర్‌గానే సేవలందిస్తా అనుకున్నా. కానీ ఓ ఎంట్రప్రెన్యూర్‌గా, ఓ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయడం వల్ల చాలా విస్తృతస్థాయిలో సేవలందించడానికి మనకు సాధ్యమవుతుందని గ్రహించాను.

సరిగ్గా ఇదే సమయంలో విజయవాడలో డాక్టర్ భాస్కర్‌రావుగారు కిమ్స్ తమ హాస్పిటల్ శాఖను ప్రారంభించారు. ఆ టైమ్‌లో అసిస్టెంట్ మెడికల్ డైరెక్టర్‌గా కిమ్స్‌లో పనిచేయడం మొదలుపెట్టా. హాస్పిటల్ నడిపించడమెలాగో నేర్చుకోవడం కోసం ప్రతిరోజూ నేను గుంటూరు నుంచి విజయవాడకు వెళ్లి... అక్కడ ప్రతి విభాగంలో ఉండే కష్టనష్టాలూ, సాధక బాధకాలు బాధకాలూ తెలుసుకుంటుండేదాన్ని. ఆ రంగంలో నాకున్న ఆసక్తి కారణంగా ప్రతిరోజూ గుంటూరు నుంచి విజయవాడకు వస్తూ పోతూ ఉండటాన్ని కంటిన్యువస్‌గా నాలుగేళ్లపాటు కొనసాగించా. అటు తర్వాత హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ విభాగానికి మెడికల్ డైరెక్టర్‌గా, ఇప్పుడు కిమ్స్ హాస్పిటల్స్ తాలూకు వైస్‌ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాను.

పేదలూ, బడుగువర్గాల నుంచి ప్రతిభావంతులైన మహిళలను ఎంచుకుని వారు సమర్థంగా పనిచేయగల స్థానాల్లో వారి నియామకాలు జరిగేలా చూసినప్పుడు... సమాజానికి అవసరమైన పని చేశామన్న సంతృప్తి ఉంటుంది. రేపు ఇంత కంటే మెరుగ్గా చేయాలన్న సంకల్పమూ ఉంటుంది.

కెరియర్ మెట్లపై 'ఫెమ్'నిస్టులం!

- ఎల్మిరా సిద్దీఖీ, కౌ-ఫౌండర్ అండ్ డైరెక్టర్ (పబ్లిక్ రిలేషన్స్), ఫెమ్‌సిటీ హాస్పిటల్స్, హైదరాబాద్

అందరూ మహిళా డాక్టర్లే ఉంటూ, మహిళలతోనే నడిచే ఓ పూర్తిస్థాయి మహిళల హెల్త్‌కేర్ సెంటర్‌ను మేము ఏర్పాటు చేయడానికి వెనక ఓ చిన్న కథ ఉంది. చిన్నపిల్లల వైద్యుడూ, రోజుల పిల్లల స్పెషలిస్టూ (నియోనేటాలజిస్ట్) అయిన నా భర్త దగ్గరికి తమ పిల్లలను తీసుకొచ్చే తల్లులు తనను నిత్యం ఓ ప్రశ్న అడుగుతుండేవారు. 'ఏమండీ... ఎవరైనా మహిళా రేడియాలజిస్టు ఉన్నారా?... ఎక్కడైనా ఓ లేడీ బ్రెస్ట్ సర్జన్ దొరుకుతారా?'' అన్నదే చాలామంది ప్రశ్న.

దీంతో ఆ రంగాల్లో మహిళా వైద్యుల అవసరముందనే విషయం మా దృష్టికి వచ్చింది. దాంతోపాటు మరో అంశమేమిటంటే... మా అమ్మ గారు క్యాన్సర్ విజేత. ఆమెకు క్యాన్సర్ చికిత్స జరుగుతున్న సమయంలో నేను ఆమె వెంట వెళ్తూ ఉండేదాన్ని. ఎవరైనా మహిళా వైద్యురాలి దగ్గరికి వెళ్తున్నప్పుడు ఆమె చాలా సౌకర్యంగా ఫీలవుతుండటాన్ని గ్రహించా. అలాంటి అనుభవాల నుంచి పుట్టిందే మా ఫెమ్‌సిటీ హాస్పిటల్.

ఓ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలనుకునే మహిళకు జస్ట్ 9 టు 5 జాబ్ చేయడం కుదరని పని. మనం ఎంచుకునే కెరియర్ అంతకంటే ఎక్కువే డిమాండ్ చేస్తుంటుంది. ఉదాహరణకు... నా చిన్నారి బేబీకి జన్మనివ్వడానికి కేవలం నాలుగు గంటల ముందు కూడా నేను నా టీమ్‌తో పనిలో నిమగ్నమయ్యే ఉన్నాను. అంతేకాదు... నా టీమ్‌తో ఏదో చర్చిస్తూ, వాళ్లకు మార్గనిర్దేశనం చేసిన మరో నాలుగ్గంటల తర్వాతే నా బేబీని నా చేతుల్లోకి తీసుకున్నా.

నిజానికి మహిళలు తమ చుట్టూ ఉండేవాళ్ల ఆరోగ్యాన్నీ, సంక్షేమాన్నీ, భద్రతనూ ఎల్లప్పుడూ కోరుకుంటూ, వాళ్లకే ప్రాధాన్యమిస్తుంటారు. అందుకే ఈ సమాజానికి మరో తరాన్ని ఇస్తూ సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ముందుండే మహిళలతో సాటి మహిళగా కనెక్ట్ అవుతూ, ఆమెకు మానసిక, శారీరక ఆరోగ్యానందాలను ఇవ్వడం చాలా కీలకమైన అంశంగా ఫీలవుతుంటాను. ఫెమ్‌సిటీ కేర్స్ అనే ఫౌండేషన్ సహాయంతో ఖర్చులు భరించలేని, అఫర్డ్ చేయలేని అనేక మందికి శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ, నెలల పిల్లలకూ, చిన్న చిన్నపిల్లల వైద్యం, అనేక మందికి సర్జరీలూ ఉచితంగా అందిస్తున్నాం. ఇలాంటి సేవలెన్నో మా మహిళా, చిన్నపిల్లల హాస్పిటల్ ద్వారా నిరంతరం అందించగలుగుతున్నామన్నదే నాకు సంతృప్తినిచ్చే అంశం.

Impact

నాకు నచ్చిన పాత్ర రాధ

- మానస చామర్తి



అతి సామాన్యమైన అమ్మాయి తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని, మనుషులను, ఆలోచనలను గమనించడం ద్వారా, అర్థం చేసుకోవడం ద్వారా, దరిమిలా మార్చుకోవడం ద్వారా నిస్సారమైన తన జీవితంలోకి మెలమెల్లగా వెలుగునెలా పిలుచుకుంటుందో చెప్పే నవల– జలంధర గారు రాసిన 'పున్నాగపూలు'. ఆ నవలా నాయిక రాధ.

రాధ లాంటి అమ్మాయిలు మన చుట్టూ ఎందరో కనపడతారు. మంచి అమ్మాయి అనిపించుకోవడం కోసం జీవితంలో ఎన్ని కష్టనష్టాలనో భరిస్తూ– 'ఆలోచించడం' మర్చిపోయినందుకు ఏది నిజంగా మంచో, అవసరమో, ముఖ్యమో గమనించుకోలేక– మన మనసులోని బలమైన ఆలోచనలే, తీరని కోర్కెలే, అసంతృప్తులే మన శరీరం పైన చిత్రమైన ప్రభావాన్ని చూపుతాయని అర్థం చేసుకోలేక– భయపడుతూ, దుఃఖపడుతూ, అనుకోని ఇబ్బంది ఎదురైతే చెయ్యాల్సిన పని మానేసి జీవితాన్ని నిందిస్తూ కూర్చునే ఇట్లాంటి వాళ్ళందరినీ ప్రేమతో బుజ్జగిస్తూ, వాళ్ల లోపలి నిజమైన శక్తిని తట్టి లేపుతూ, వాళ్ళు చెయ్యగల అద్భుతాలను చూపిస్తూ నడిచే నవల ఇది.

నాయకుడి మాటల్లో చెప్పాలంటే మాణిక్యాల్లాంటి కళ్ళతో శోభాయమానంగా మెరిసే రూపం రాధది. ఆ కళ్ళ వెనుక ఉన్న భ్రమలను, భయాలను రాధ ఒక్కొక్కటిగా ఒలుచుకున్న తీరును చదివితే ఎలాంటి అమ్మాయికైనా జీవితాన్ని ఎదుర్కోగలమనే భరోసా వస్తుంది. పెద్ద జిగ్ సా పజిల్‌ను అంచుల దగ్గర నుండీ మొదలుపెట్టి పూర్తి చేసుకున్నట్టు, చేజారిపోయిందనిపించే జీవితాన్ని రాధ మళ్ళీ ఒడిసి పట్టుకుని తునకలు తునకలుగా దిద్దుకోవడాన్ని చూడటం ఒక ఉత్సాహం, ధైర్యం! అయాచితంగా వచ్చిపడ్డా సరే బంధాలకైనా, డబ్బులకైనా, ఆలోచనలకైనా ఆవరించుకున్న ఒక శక్తి ఉంటుందనీ, ఆ ఆవరణను గమనించుకోకుండా, జీవితంలోకి ఆహ్వానించి ఇబ్బంది పడకూడదనీ రాధని అడ్డుపెట్టుకుని నేర్చుకోవడం బాగుంటుంది. సహనం, ప్రేమ, సమర్థత మనిషికి స్వాభావికాలనీ, వాటిని కాపాడుకోవాలనీ; తల్లినైనా భర్తనైనా తనకు హాని చేసిన ఎవ్వరినైనా, భయంతోనో అభద్రతతోనో కాకుండా, తన లోపలి చైతన్యం ఇచ్చిన ధైర్యంతో క్షమించి జీవితంలో ముందుకు సాగాలనీ 'రాధ' ద్వారా పాఠకులు అనుకోవడం బతుకులకు చాలా మేలు చేస్తుంది. అహాన్ని వదులుకుంటూ అట్లాంటి చైతన్యాన్ని అంచెలంచలుగా సాధించుకున్న నాయిక రాధ. ప్రతి అసంతృప్తికీ ఇంకెవరో కారణమని నెపంగా చూపుకుంటూ, తన చేతిలో లేని సందర్భాన్ని అడ్డుంచుకుని దిగులుపడిపోయే మన స్తత్వాలను లోపలి నుండి నయం చేసే మందు రాధ దగ్గర ఉంది. నవలలో ఆమె ప్రయాణాన్ని చదవడంలో ఉంది. అందుకే రాధ పాత్ర నాకు నచ్చుతుంది.

Inspiration

నా ఇన్‌స్పిరేషన్ నా చుట్టూ ఉన్న ఆడవాళ్లే!

- రత్నా పాఠక్ షా, బాలీవుడ్ నటి



ఎలాగంటే...

'మా చెల్లెలు (సుప్రియా పాఠక్, నటి)తో పోల్చుకుంటే నేనంత అందంగా ఉండను. సందు పళ్లు, చిన్నకళ్లతో అస్సలు బాగోననే అనుకునేదాన్ని చిన్నప్పటి నుంచీ! అయితే అందంగా లేను అనే విషయాన్ని తలకెక్కించుకుని.. ఆత్మన్యూనతలోకి పోలేదెప్పుడూ. మన క్రియేటివిటీ, పని కన్నా ఫిజికల్ అపియరెన్సే ముఖ్యమనుకునే వాతావరణంలో లేనెప్పుడూ. మా అమ్మ ఫ్రెండ్స్ కానీ, నా చుట్టూ ఉన్న ఆడవాళ్లు కను ముక్కు తీరు, కట్టుబొట్టు స్టయిల్ గురించి ఆలోచించే ఆడవాళ్లు కారు. క్రియేటివ్ వర్క్.. అది చూపించే ఇంపాక్ట్ గురించే ఆలోచిస్తూ దాని గురించే మాట్లాడే మహిళల మధ్య పెరిగాను. మనం ఆకట్టుకోవాల్సింది అపియరెన్స్‌తో కాదు పర్సనాలిటీతో అని బలంగా నమ్మే ఆడవాళ్ల మధ్య మెదిలాను. కాబట్టి చూడ్డానికి బాగుండను అనేది నాకు పెద్ద విషయంగా అనిపించలేదు. నేనెంత క్రియేటివ్‌గా ఆలోచించగలను.. దాన్నెలా ప్రెజెంట్ చేయగలనే ఎక్సర్‌సైజే ఉండేది నా బ్రెయిన్‌కెప్పుడూ!

నా ఈ కాన్ఫిడెన్స్ ఆ స్త్రీలు ఇచ్చిందే! థాంక్స్ టు దెమ్.. నాకు ఆ స్ఫూర్తిని పంచినందుకు!'

ఒక ఆలోచన... విజేతను చేసింది



నళిని



పరిశ్రమలో పనిచేస్తూ...

నళిని ఓ ఫుడ్‌ప్రెన్యూర్. జంషెడ్‌పూర్, టాటానగర్‌లో పుట్టారు. ప్లస్ టూ వరకు అక్కడే చదివారు. ఆ తర్వాత ఒడిశా, భువనేశ్వర్‌లో డిగ్రీ, ఎంబీఏ చేశారు. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం చేశారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మీద కలిగిన ఆసక్తి ఆమెను మార్కెటింగ్ వైపు అడుగులు వేయించింది. పాలు, పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌లో సక్సెస్ అయ్యారు. కరోనా పాండమిక్ ఆమె కెరీర్‌ని మలుపు తిప్పింది. సొంతంగా ఏదైనా చేయాలనే ఆసక్తి ఆమెతో మిల్లెట్ మిరకిల్ చేయించింది. బ్రెడ్ తయారీలో ఉన్న ఆసక్తి కొద్దీ ఆ ఫార్ములాని మిల్లెట్స్ మీద ప్రయోగం చేశారు. అగ్రికల్చర్, ఫుడ్ సైంటిస్టుల పరీక్షలను నెగ్గిన నళిని విజయవంతమైన తన ప్రయోగానికి పేటెంట్ ఫైల్ చేశారు. మహిళాదినోత్సవం సందర్భంగా ఆమె 'సాక్షి'తో పంచుకున్న వివరాలివి.

మల్టీ టాస్కింగ్ మహిళలకు కొత్త కాదు!

మల్టీ టాస్కింగ్‌లో మహిళలు సిద్ధహస్తులు. ఇంటి బాధ్యతలను నిర్వహించడమే అందుకు నిదర్శనం. గృహిణి బాధ్యతలకే పరిమితం కాకుండా ఇంకా ఏదైనా చేయాలనే ఆసక్తి ఉన్న వాళ్లు చాలామంది ఉన్నారు. కానీ వాళ్లలో ఎక్కువ మంది అలా అనుకుంటూనే రోజులు గడిపేస్తుంటారు. ధైర్యం చేసి తొలి అడుగు వేస్తే నడక దానంతట అదే కొనసాగుతుంది. అయితే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో అడుగుపెట్టే ముందు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే... మరుసటి రోజు నుంచే లాభాల కోసం చూడరాదు. రాబడి పెరిగి ఆదాయం వచ్చే వరకు శ్రమించగలిగిన సహనం ఉండాలి. లాభాల బాట పట్టిన తర్వాత కూడా అలాగే శ్రమను కొనసాగించాలి.

- నళిని, ఫౌండర్, కిబేస్, హైదరాబాద్

ఇది నా పేటెంట్ ప్రొడక్ట్!

చపాతీ అంటే ప్రకటనలో చూపించినట్లు మూడువేళ్లతో తుంచేటంత మృదువుగా ఉండాలి. మిల్లెట్స్ ఆరోగ్యానికి మంచివని చపాతీ చేస్తే తినడం కష్టంగా ఉంటోంది. పరిష్కారం ఏమిటి? దీనిని ఛేదించగలిగితే సక్సెస్ చేతికందినట్లే. ఇందు కోసం నళిని తన ఆలోచనకు పదును పెట్టారు. తన సాధన ఫలించి ఆమె సాధన ఫలించి, ఇంట్లో వాళ్లు సంతృప్తిగా తిన్నారూ.. తిన్నారు. దీనినే తన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కి మార్గం చేసుకోవచ్చు కదా! అనుకోవడంతోనే సంబంధిత అనుమతుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆమె చేసిన రెడీ టూ కుక్, రెడీ టూ ఈట్ మిల్లెట్ చపాతీలు ఆ పరీక్షల్లో నెగ్గాయి. నిల్వ ఉండడానికి ఆర్టిఫిషియల్ ప్రిజర్వేటివ్స్ ఏమీ వాడడం లేదని, పోషకాల లభ్యత బాగుందని హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫుడ్ సైంటిస్టులు నిర్ధారించారు. పరీక్షలలో నెగ్గిన తర్వాత తన ఫార్ములాను పరిరక్షించుకోవడం కోసం పేటెంట్ ఫైల్ చేశారు నళిని.

అగ్రికల్చరల్ యూనివర్సిటీ... ఫుడ్ డెవలప్‌మెంట్ విభాగంలోని ఇన్‌క్యుబేటర్‌లో ప్రయోగదశలను నిర్వహించడానికి అవకాశం ఇవ్వడంతోపాటు అగ్-హబ్, నిధి ప్రయాస్ గ్రాంట్‌లు ఇచ్చి ప్రోత్సహించింది. తన ఆలోచన, ప్రభుత్వం నుంచి అందిన ప్రోత్సాహంతో పరిశ్రమ స్థాపించగలిగానని చెప్పారు నళిని. ''రెండు–మూడు సంవత్సరాల గ్రౌండ్ వర్క్ తర్వాత తెరమీదకు వచ్చాను. ప్రస్తుతం పరిమితంగానే ఉత్పత్తి చేస్తూ నగరంలోని క్యూ మార్ట్, స్టార్ హోటళ్లకు అందిస్తున్నాను. పేటెంట్ వచ్చిన తర్వాత మార్కెటింగ్ మీద దృష్టి పెడతాను. ఒక కొత్త ఉత్పత్తిని ఊహించుకుని, నా జ్ఞానాన్ని మేళవించి, నిరంతరాయంగా శ్రమించి సాధించుకున్న విజయం ఇది. నా ఆలోచన, ప్రయోగానికి పేటెంట్ సాధించుకోవడం అనే ఊహే ఆనందంగా ఉంది'' అన్నారు నళిని.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



భారత జట్టులో జిమ్నాస్ట్ నిష్కా

ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టులో తెలంగాణ అమ్మాయి నిష్కా అగర్వాల్ ఎంపికయింది. అజర్‌బైజాన్ రాజధాని బాకులో నేటి నుంచి నాలుగు రోజులపాటు ప్రపంచకప్ టోర్నీ జరగనుంది. మహిళల విభాగంలో టేబుల్ వాల్ట్, అన్‌ఈవెన్ బార్స్, బ్యాలెన్స్ బీమ్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్‌లో పోటీలుంటాయి. 16 ఏళ్ల నిష్కా ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో తెలంగాణకు రెండు పతకాలు అందించింది. టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గిన నిష్కా, ఆల్ అరౌండ్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని సాధించింది.

లెబ్రాన్ జేమ్స్ రికార్డు

అమెరికా దిగ్గజ బాస్కెట్‌బాల్ ప్లేయర్ లెబ్రాన్ జేమ్స్ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. విఖ్యాత నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్‌లో 50 వేల పాయింట్లు పూర్తి చేసుకున్న తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. న్యూ ఓర్లియాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా లెబ్రాన్ జేమ్స్ త్రీ పాయింటర్ షాట్‌తో 50 వేల మైలురాయిని దాటాడు. లెబ్రాన్‌ప్రాతినిధ్యం వహిస్తున్న లాస్ ఏంజెలిస్ లేకర్స్ జట్టు ఈ మ్యాచ్‌లో 136–115 పాయింట్ల తేడాతో గెలిచింది.



వన్డేలకు స్మిత్ గుడ్‌బై



- భారత్ చేతిలో పరాజయం అనంతరం నిర్ణయం
- టెస్టు, టి20ల్లో కొనసాగుతానన్న ఆస్ట్రేలియా స్టార్

దుబాయ్: ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ వన్డే క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఆసీస్ పరాజయం అనంతరం స్మిత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి తప్పుకున్నా... టెస్టులు, టి20ల్లో కొనసాగాలనుకుంటున్నట్లు 35 ఏళ్ల స్మిత్ వెల్లడించాడు. ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా అందుబాటులో లేకపోవడంతో... చాంపియన్స్ ట్రోఫీలో అతడి స్థానంలో స్మిత్ కంగారూ జట్టుకు సారథ్యం వహించాడు. 2010లో వెస్టిండీస్‌పై వన్డే అరంగేట్రం చేసిన స్మిత్... కెరీర్‌లో ఇప్పటి వరకు 170 మ్యాచ్‌లాడి 43.28 సగటుతో 5,800 పరుగులు చేశాడు. అందులో 12 సెంచరీలు, 35 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి. 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లు గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో కీలక సభ్యుడైన స్మిత్... బంతితో 28 వికెట్లు పడగొట్టాడు. లెగ్‌స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన స్టీవ్ స్మిత్... ఆ తర్వాత నెమ్మదిగా ఆల్‌రౌండర్‌గా... ఆపై టాపార్డర్ బ్యాటర్‌గా... అటు నుంచి స్టార్ ప్లేయర్‌గా ఎదిగాడు. 'ఇది చాలా గొప్ప ప్రయాణం. ప్రతి నిమిషాన్ని ఆస్వాదించా. ఈ ఫార్మాట్‌లో ఎన్నో అద్భుత జ్ఞాపకాలు ఉన్నాయి. రెండు ప్రపంచకప్‌లు గెలవడం ఎప్పటికీ మరవలేను. ఎంతో మంది గొప్ప ఆటగాళ్లతో కలిసి ఆడా' అని స్మిత్ పేర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌నకు జట్టును సిద్ధం చేసుకునేందుకు టీమ్ మేనేజ్‌మెంట్‌కు తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే వన్డేల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు. 'ఇంకా నాలో చాలా క్రికెట్ మిగిలే ఉంది. అయితే మరో రెండేళ్లలో వన్డే ప్రపంచ కప్ జరగనున్న నేపథ్యంలో జట్టును సిద్ధం చేసుకునేందుకు మేనేజ్‌మెంట్‌కు సమయం దక్కుతుంది. టెస్టులు, టి20ల్లో అవకాశం కల్పిస్తే తప్పక జట్టు విజయాల కోసం కృషి చేస్తా' అని స్మిత్ అన్నాడు.

టాప్ సీడ్‌పై సహజ సంచలన విజయం

గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నీ సింగిల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి సంచలనం సృష్టించింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో 301వ ర్యాంకర్ సహజ 6–4, 6–2తో టాప్ సీడ్, ప్రపంచ 229వ ర్యాంకర్ కార్లోటా మార్టినెజ్ సిరెజ్ (స్పెయిన్)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 1 గంట 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ప్లేయర్లు శ్రీవల్లి



రష్మిక 3–6, 6–1, 3–6తో దరియా కుదషోవా (రష్యా) చేతిలో, స్మృతి భాసిన్ 1–6, 3–6తో అంటోనియా ష్మిడిట్ (జర్మనీ) చేతిలో ఓడిపోయారు.

దుబాయ్‌కి న్యూజిలాండ్

9న చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌తో 'ఢీ'కి రెడీ

టోర్నీకి ముందు... మూడు దశాబ్దాల తర్వాత చాంపియన్స్ ట్రోఫీ రూపంలో ఓ ఐసీసీ టోర్నీ భాగ్యం దక్కించుకున్న పాకిస్తాన్... ఎంతో మురిపెంగా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలను పిలిచి కనుమరుగైన ముక్కోణపు టోర్నీతో సన్నాహక సమరంలో పాల్గొంది.

ఫైనల్‌కు ముందు... టైటిల్ పోరుకుముందే పాకిస్తాన్‌లో ఆతిథ్యం ముగిసింది. రెండో సెమీఫైనల్‌తోనే వారి ఐసీసీ ఈవెంట్ ముచ్చట తీరింది. ఇక ఓవర్ టు దుబాయ్! పాక్ సన్నాహక టోర్నీ పెడితే ట్రోఫీ గెలిచి మరీ సన్నద్ధమైన న్యూజిలాండ్ ఇప్పుడు ఏకంగా చాంపియన్స్ ట్రోఫీపైనే కన్నేసింది.

- రెండో సెమీఫైనల్లో 50 పరుగులతో దక్షిణాఫ్రికాపై జయభేరి
- 'శత'క్కొట్టిన రచిన్, విలియమ్సన్
- మిల్లర్ మెరుపు సెంచరీ వృథా



రచిన్



విలియమ్సన్



మిల్లర్

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ రెండో సెమీఫైనల్లో న్యూజిలాండ్ గర్జించింది. ముందు బ్యాటింగ్‌లో... తర్వాత బౌలింగ్‌లో దక్షిణాఫ్రికా జట్టును కుదేలు చేసింది. రెండు మాజీ చాంపియన్ జట్ల మధ్య బుధవారం జరిగిన సెమీఫైనల్లో 2000 టోర్నీ విజేత కివీస్ 50 పరుగుల తేడాతో 1998 చాంపియన్ దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 362 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (101 బంతుల్లో 108; 13 ఫోర్లు, 1 సిక్స్), కేన్ విలియమ్సన్ (94 బంతుల్లో 102; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కారు. ఫిలిప్స్ (27 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), మిచెల్ (37 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసి ఓడింది. మిల్లర్ (67 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) వీరోచిత సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓపెనర్, కెప్టెన్ బవుమా (71 బంతుల్లో 56; 4 ఫోర్లు, 1 సిక్స్), డసెన్ (66 బంతుల్లో 69; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. దుబాయ్‌లో ఈ నెల 9న ఆదివారం జరిగే 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ' ఫైనల్లో భారత్‌తో న్యూజిలాండ్ ఆడుతుంది.

ఇటు రచిన్, అటు విలియమ్సన్

టాప్–4 బ్యాటర్లు ఆడితే స్కోరు ఏ రకంగా జోరందుకుంటుందో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ చూస్తే అర్థమవుతుంది. మొదట ఓపెనర్లు విల్ యంగ్ (23 బంతుల్లో 21; 3 ఫోర్లు), రచిన్ రవీంద్ర 48 పరుగులతో మంచి ఆరంభమే ఇచ్చారు. యంగ్ అవుటయ్యాక వచ్చిన విలియమ్సన్‌తో రచిన్ సమన్వయం న్యూజిలాండ్ భారీస్కోరుకు బాట వేసింది. సఫారీలాంటి మేటి బౌలర్లపై ఇద్దరూ సులువుగా షాట్లు బాదారు. అలుపు లేకుండా పరుగులు రాబట్టారు. 47 బంతుల్లో రచిన్, 61 బంతుల్లో విలియమ్సన్ ఫిఫ్టీలు చేశారు. ఇద్దరి బ్యాటింగ్ ప్రతాపంతో స్కోరుబోర్డు పరుగు పెట్టింది. 93 బంతుల్లో రచిన్ శతకం పూర్తవగా, 32వ ఓవర్లో జట్టు 200 స్కోరు చేసింది. ఎట్టకేలకు రచిన్‌ను రబడ అవుట్ చేసి రెండో వికెట్‌కు 164 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. మిచెల్ కూడా ధాటిగా పరుగులు సాధించడంతో దక్షిణాఫ్రికాకు కష్టాలు తప్పలేదు. విలియమ్సన్ 91 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకొని కాసేపటికి నిష్క్రమించాడు. 40 ఓవర్లలో 250 పరుగులు చేసిన న్యూజిలాండ్ చివరి 10 ఓవర్లలో 112 పరుగుల్ని చకచకా జత చేసింది.

మిల్లర్ 100 నాటౌట్

ఓపెనర్ రికెల్టన్ (17) ఆరంభంలోనే అవుట్ కాగా... కెప్టెన్ బవుమా, డసెన్‌లు చక్కగా ఆడటంతో ఒకదశలో సఫారీ స్కోరు 125/1. లక్ష్యానికి సరైన దిశగా కనిపించింది. కానీ అదే స్కోరుపై బవుమా, కాసేపయ్యాక డసెన్, క్లాసెన్ (3), మార్క్‌రమ్ (29 బంతుల్లో 31; 3 ఫోర్లు)లు నిష్క్రమించడంతో 200 స్కోరు వద్ద ఆరో వికెట్ కోల్పోయి లక్ష్యానికి దూరమైంది. ఈ దశలో ఒకేఒక్కడు మిల్లర్ ఒంటరి పోరాటం చేశాడు. ముల్డర్ (8), యాన్సెన్ (3)ల అండలేక అతని పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది కానీ జట్టును గెలిపించలేకపోయింది. 46 ఓవర్లలో సఫారీ స్కోరు 259/9. అప్పటికి మిల్లర్ (47 నాటౌట్) ఫిఫ్టీ కూడా చేయలేదు. కానీ చివరి 4 ఓవర్లలో 53 పరుగులు చేస్తే ఆ పరుగులన్నీ అతనే బాదడం... 67 బంతుల్లోనే సెంచరీ సాధించడం విశేషం.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (సి) మార్క్‌రమ్ (బి) ఇన్‌గిడి 21; రచిన్ (సి) క్లాసెన్ (బి) రబడ 108; విలియమ్సన్ (సి) ఇన్‌గిడి (బి) ముల్డర్ 102; మిచెల్ (సి) రబడ (బి) ఇన్‌గిడి 49; లాథమ్ (బి) రబడ 4; ఫిలిప్స్ (నాటౌట్) 49; బ్రేస్‌వెల్ (సి) రికెల్టన్ (బి) ఇన్‌గిడి 16; సాంట్నర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు)** 362. **వికెట్ల పతనం:** 1–48, 2–212, 3–251, 4–257, 5–314, 6–360. **బౌలింగ్:** యాన్సెన్ 10–0–79–0, ఇన్‌గిడి 10–0–72–3, రబడ 10–1–70–2, ముల్డర్ 6–0–48–1, కేశవ్ మహరాజ్ 10–0–65–0, మార్క్‌రమ్ 4–0–23–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) బ్రేస్‌వెల్ (బి) హెన్రీ 17; బవుమా (సి) విలియమ్సన్ (బి) సాంట్నర్ 56; డసెన్ (బి) సాంట్నర్ 69; మార్క్‌రమ్ (సి అండ్ బి) రచిన్ 31; క్లాసెన్ (సి) హెన్రీ (బి) సాంట్నర్ 3; మిల్లర్ (నాటౌట్) 100; ముల్డర్ (సి) రచిన్ (బి) బ్రేస్‌వెల్ 8; యాన్సెన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫిలిప్స్ 3; కేశవ్ (సి) లాథమ్ (బి) ఫిలిప్స్ 1; రబడ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 16; ఇన్‌గిడి (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 312. **వికెట్ల పతనం:** 1–20, 2–125, 3–161, 4–167, 5–189, 6–200, 7–212, 8–218, 9–256. **బౌలింగ్:** హెన్రీ 7–0–43–2, జేమీసన్ 7–1–57–0, రూర్కే 8–0–69–0, బ్రేస్‌వెల్ 10–0–53–1, సాంట్నర్ 10–0–43–3, రచిన్ రవీంద్ర 5–0–20–1, ఫిలిప్స్ 3–0–27–2.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఆ విషయాన్ని రీ రిలీజ్‌లు నిరూపిస్తున్నాయి

– 'దిల్' రాజు



''సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాని ఈ నెల 7న రీ రిలీజ్ చేస్తున్నాం. అప్పుడే పది థియేటర్లు ఫుల్ అయ్యాయి. వెంకటేశ్, మహేశ్‌బాబుగార్ల ఫ్యాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్ మళ్లీ థియేటర్‌కి వచ్చి బ్రదర్స్ మధ్య ఉండే మూమెంట్స్‌ని ఎంజాయ్ చేద్దామనుకోవడం చాలా సంతోషంగా ఉంది. మంచి సినిమాలు తీస్తే థియేటర్స్‌కి జనాలు వస్తారనే విషయాన్ని రీ రిలీజ్‌లు నిరూపిస్తున్నాయి'' అని నిర్మాత 'దిల్' రాజు తెలిపారు. వెంకటేశ్, మహేశ్‌బాబు హీరోలుగా సమంత, అంజలి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 'దిల్' రాజు నిర్మించారు. 2013 సంక్రాంతి సందర్భంగా జనవరి 11న విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాని ఈ నెల 7న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''వెంకటేశ్, మహేశ్‌గార్లు ఈ సినిమా కోసం చాలా హోమ్‌వర్క్ చేశారు. అందుకే ఈ చిత్రం సహజంగా, అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమాకి సీక్వెల్ ఎలా చేయొచ్చు? అనే మంచి ఆలోచన ఎవరు చెప్పినా నేను తీసేందుకు సిద్ధం. 12 ఏళ్ల తర్వాత మా సినిమా (సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు) రీ రిలీజ్‌లోనూ థియేటర్‌లో హౌస్‌ఫుల్ చూసినప్పుడు ఒక నిర్మాతగా ఆ కిక్కే వేరు. మా బ్యానర్‌లో విజయ్ దేవరకొండతో 'రౌడీ జనార్దన', నితిన్‌తో 'ఎల్లమ్మ' సినిమాలు మే లోపు ప్రారంభిస్తాం'' అని తెలిపారు.

అనార్కలి ?



రవితేజ

హీరో రవితేజ–దర్శకుడు కిశోర్ తిరుమల కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ రానుందన్న టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'అనార్కలి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని, సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... ఈ చిత్రంలో కయాదు లోహర్, మమతా బైజు హీరోయిన్లుగా నటించనున్నారని, వచ్చే సంక్రాంతికి ఈ మూవీ రిలీజ్ అయ్యేలా టీమ్ ప్లాన్ చేస్తోందనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన తర్వాత 'అనార్కలి' సినిమా చిత్రీకరణలో రవితేజ పాల్గొంటారని ఊహించవచ్చు.

ఫారెస్ట్‌లో ఫైట్



మహేశ్‌బాబు

ఒడిశాలో ల్యాండ్ అయ్యారు మహేశ్‌బాబు. ఎందుకంటే సినిమా షూటింగ్ కోసం. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ పీరియాడికల్ ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో మొదలైంది. నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ ఒడిశాలోని కోరాపుట్ ప్రాంతానికి వెళ్లిందని తెలిసింది. దాదాపు ఇరవై రోజుల వరకు ఈ సినిమా చిత్రీకరణ అక్కడే జరుగుతుందని సమాచారం. గత ఏడాది డిసెంబరు నెల చివర్లో ఒడిశా వెళ్లి, అక్కడి ఫారెస్ట్ లొకేషన్స్‌ని రాజమౌళి పరిశీలించారు. బుధవారం ఒడిశా వెళ్లారు. దీంతో ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ కూడా జరుగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఇక ప్రముఖ నటి–నిర్మాత ప్రియాంకా చోప్రా, మలయాళ దర్శక–నిర్మాత–నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలిసింది. విజయేంద్రప్రసాద్ ఈ సినిమాకు కథ అందించగా, కీరవాణి సంగీతం అందిస్తున్నారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా రానుందని, తొలి భాగం 2027లో విడుదలయ్యే అవకాశం ఉందని భోగట్టా.

టీజర్ అద్భుతంగా ఉంది

– సందీప్ రెడ్డి వంగా



మధుర శ్రీధర్, విక్రాంత్, సందీప్ రెడ్డి, సంజీవ్ రెడ్డి

''సంతాన ప్రాప్తిరస్తు' సినిమా టీజర్ అద్భుతంగా ఉంది. సన్నివేశాలు చూస్తే మంచి ఎంటర్‌టైనింగ్ మూవీలా అనిపిస్తోంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అన్నారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా బుధవారం రిలీజ్ చేయించారు. ''వినోదం, భావోద్వేగాలతో పాటు నేటి తరం యువత ఎదుర్కొంటున్న కన్సీవ్ (ప్రెగ్నెంట్) సమస్యను అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేలా కన్విన్సింగ్‌గా ఈ మూవీలో చూపించాం'' అని చిత్రబృందం పేర్కొంది.

వెయ్యిమంది డ్యాన్సర్స్‌తో...



సాయిదుర్గా తేజ్

సాయిదుర్గా తేజ్ హీరోగా రోహిత్ కేపీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్నారు. రూ. 125 కోట్ల బడ్జెట్‌తో నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కోసం సాయిదుర్గా తేజ్ పాల్గొనగా ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ నేతృత్వంలో ఇటీవల ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. తాజాగా హీరో, వెయ్యిమంది డ్యాన్సర్స్‌తో కూడిన ఓ గ్రాండ్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ సాంగ్ ఆడియన్స్‌కు విజువల్ ఫీస్ట్‌లా ఉంటుందని చిత్రయూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని సెప్టెంబరు 25న రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమాకు సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమేరా: వెట్రివేల్ పళనిసామి.

ప్రేమకథ ఆరంభం



మిథున్ చక్రవర్తి

తెలుగు మూలాలు కలిగిన తమిళ యువకుడు మిథున్ చక్రవర్తి హీరోగా నటిస్తున్న చిత్రం 'లవ్ స్టోరీ బిగిన్స్'. మిథున్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో తమిళ, తెలుగు భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వర్ష, శ్వేత హీరోయిన్లు. అమర్ గీత్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వస్తావా..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. 'వస్తావా...' పాటకి శివమణి సాహిత్యం అందించగా, భవదాయిని నాగరాజ్, విద్యుత్ శ్రీనివాస్, థామస్ చిరమేల్ అలెగ్జాండర్ పాడారు. ''నా జీవితంలో జరిగిన వాస్తవ ఘటనలకి వినోదం, సందేశం జోడించి రూపొందిస్తున్న చిత్రం 'లవ్ స్టోరీ బిగిన్స్'. ప్రేమ కథా చిత్రాల్లో కొత్త ఒరవడిని సృష్టిస్తుంది'' అన్నారు మిథున్ చక్రవర్తి.

అమ్మాయిలకి అంకితం

– షెరాజ్ మెహ్ది

షెరాజ్, కనిక, సుమన్ తల్వార్, మేకా రామకృష్ణ, అశోక్ ఖుల్లార్, అనంత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పౌరుషం: ది మ్యాన్‌హుడ్'. అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఈ చిత్రం హీరో–దర్శకుడు–సంగీత దర్శకుడు షెరాజ్ మెహ్ది మాట్లాడుతూ– ''ప్రపంచంలో ఆడవాళ్లు లేకుండా మగవాళ్లు లేరు. వాళ్ల సపోర్ట్‌తో మనం ముందుకెళ్లాలి అనే మంచి కాన్సెప్ట్‌తో తీసిన చిత్రమే 'పౌరుషం'. మార్చి 8న ఉమెన్స్ డే. ఒక రోజు ముందుగా ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాం. యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, రొమాన్స్... ఇలాంటి కమర్షియల్ అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయి. ఇది నా కళ్లతో నేను చూసిన కథ. ఒకరి వల్ల మంచివాళ్లు ఎలా సఫర్ అవుతారనే విషయాన్ని కూడా ఈ సినిమాలో ప్రస్తావించడం జరిగింది. ఈ సినిమా ప్రతి అమ్మాయికి అంకితం'' అన్నారు. ''ఈ సినిమాను అందరూ థియేటర్స్‌లో చూడండి'' అని పేర్కొన్నారు అశోక్ ఖుల్లార్. నటీనటులు కనిక, ఖుష్బూ జైన్, గంగాధర్, మది మాట్లాడారు.



అశోక్ ఖుల్లార్, కనిక, షెరాజ్

థ్రిల్... కామెడీ



సంతోష్ కల్వచెర్ల, క్రిషేకా పటేల్

సంతోష్ కల్వచెర్ల, క్రిషేకా పటేల్ జంటగా రతన్ రిషి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్టిస్ట్'. జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించిన ఈ మూవీ ఈ నెల 21న రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో రతన్ రిషి మాట్లాడుతూ– ''సైకో థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆర్టిస్ట్'. ఇందులో సస్పెన్స్, భయం, కామెడీ, రొమాన్స్... వంటి అన్ని అంశాలు ఉన్నాయి'' అన్నారు. జేమ్స్ వాట్ కొమ్ము మాట్లాడుతూ– ''కొత్తవాళ్లకు అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలనే మా సంస్థలో న్యూ కమర్స్‌తో మూవీస్ చేస్తున్నాం. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా మా సినిమా రిలీజ్ అవుతోంది'' అని తెలిపారు. ''నేటి సమాజంలోని ఒక సమస్యను రతన్ రిషి చక్కగా చూపించారు. ఆ సమస్య పాతదే అయినా కథ, కథనాలు కొత్తగా ఉంటాయి'' అని పేర్కొన్నారు సంతోష్ కల్వచెర్ల. ''ఇలాంటి మంచి సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు క్రిషేకా పటేల్. ఈ వేడుకలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సురేష్ బసంత్, మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, లిరిసిస్ట్ రాంబాబు గోసాల, నటీనటులు స్నేహ మాధురీ శర్మ, వెంకీ, తాగుబోతు రమేశ్ మాట్లాడారు.

లుక్ ఓకే



శివ రాజ్‌కుమార్, బుచ్చిబాబు

రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్). బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయిక. ఇందులో ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. ఆయన పాత్ర కోసం లుక్ టెస్ట్ పూర్తి చేశారు. లుక్ ఓకే అయిన విషయాన్ని చిత్రబృందం తెలియజేసింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''గత ఏడాది నవంబరులో మైసూర్‌లో ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేశాం. ఇటీవలే హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్ పూర్తయింది. అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఉండే శివ రాజ్‌కుమార్ త్వరలోనే షూటింగ్‌లో జాయిన్ కానున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమేరా: రత్నవేలు.

సాక్షి **బిజినెస్**
గురువారం
6-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	740	73,730
నిఫ్టీ ▲	255	22,337

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	18,357	▲	72
డోజోన్స్	42,722	▲	201
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,756	▼	3
డాక్స్	23,081	▲	754
షాంఘై	3,342	▲	17
నికాయ్	37,418	▲	87

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	86,300
బంగారం (99.5 స్వచ్ఛత)	85,954
వెండి (కేజీ)	95,993

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.80	87.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.10	113.02
€	యూరో	ఎస్‌బీఐ	91.30	93.96
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.47	58.93
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.41	55.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.80	67.48
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.29	23.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.79	24.57
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93

సంపన్న భారతం!



- 2024లో 6 శాతం పెరిగిన మిలియనీర్లు; 85,698కి చేరిక
- 191 మంది బిలియనీర్లు
- నైట్ ఫ్రాంక్ 'వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడి

న్యూఢిల్లీ: సంపద సృష్టి దన్నుతో దేశీయంగా కుబేరుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2024లో 10 మిలియన్ డాలర్లకు పైగా సంపద ఉన్న వ్యక్తుల (హెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య 6 శాతం పెరిగి 85,698కి చేరింది. 2028 నాటికి ఇది 93,753కి చేరుతుందని అంచనా. ఇక అపర కుబేరుల్లాంటి బిలియనీర్ల సంఖ్య మరో 26 పెరిగి 191కి చేరింది. 2019లో బిలియనీర్ల సంఖ్య 7గా ఉండేది. నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన 'ది వెల్త్ రిపోర్ట్ 2025'లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. హెచ్‌ఎన్‌డబ్ల్యూఐల జనాభా పెరుగుతుండటమనేది దీర్ఘకాలికంగా పటిష్టమైన ఆర్థిక వృద్ధి, పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతుండటం, లగ్జరీ మార్కెట్ విస్తరిస్తుండటం తదితర అంశాలను సూచిస్తోందని నివేదిక పేర్కొంది. భారతీయ బిలియనీర్ల మొత్తం సంపద సుమారు 950 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనా. ఈ విషయంలో అమెరికా (5.7 ట్రిలియన్ డాలర్లు), చైనా (1.34 ట్రిలియన్ డాలర్లు) తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.

హెచ్‌ఎన్‌డబ్ల్యూఐల విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. అమెరికా (9,05,413 మంది) అగ్రస్థానంలో, చైనా (4,71,634 మంది), జపాన్ (1,22,119 మంది) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. అంతర్జాతీయంగా చూస్తే 3.7 శాతం మంది హెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు భారత్‌లో ఉన్నారు. 'ఎంట్రప్రెన్యూర్‌షిప్, కొత్త పరిశ్రమల దన్నుతో భారత్‌లో హెచ్‌ఎన్‌డబ్ల్యూఐల సంఖ్య అసాధారణంగా వృద్ధి చెందుతోంది. దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను, ఆర్థికంగా ఒడిదుడుకులను తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యాలను దేశీయంగా పెరుగుతున్న సంపద సూచిస్తోంది' అని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హ్యాండ్‌బ్యాగ్‌లపై మక్కువ ..

రియల్ ఎస్టేట్ నుంచి గ్లోబల్ ఈక్విటీల వరకు సంపన్నుల పెట్టుబడుల ధోరణులు కూడా మారుతున్నాయి. ఇందుకు సంబంధించిన నైట్ ఫ్రాంక్ లగ్జరీ ఇన్వెస్ట్‌మెంట్ ఇండెక్స్ (కేఎఫ్ఎల్ఐఐ) ప్రకారం గతేడాది అయిదు సాధనాలకు మాత్రమే డిమాండ్ నెలకొంది. అభిరుచులను బట్టి సంపన్నులు పెట్టుబడులు పెట్టే 10 సాధనాలను (లగ్జరీ కలెక్టబుల్స్) ఈ సూచీ మదింపు చేస్తుంది. దీని ప్రకారం లగ్జరీ హ్యాండ్ బ్యాగ్‌ల ధరలు 2.8 శాతం పెరగ్గా, ఆభరణాలు 2.3 శాతం, నాణేలు 2.1 శాతం, వాచీలు 1.7 శాతం, క్లాసిక్ కార్లు 1.2 శాతం పెరిగాయి. లగ్జరీ పెట్టుబడి సాధనంగా ఉండే ఆర్ట్ ధరలు అత్యధికంగా 18.3 శాతం పడిపోయాయి. 2023లో రెండంకెల స్థాయిలో వృద్ధి చెందిన ఈ విభాగంలో ధరలు, ప్రస్తుతం కోవిడ్–19 సంక్షోభ స్థాయి కన్నా దిగువకు తగ్గిపోయాయి. ఇక వైన్ రేట్లు 9.1 శాతం, ఫర్నిచర్ ధరలు 2.8 శాతం, రంగుల డైమండ్లు 2.2 శాతం తగ్గాయి. అరుదైన విస్కీ రేట్లు 9 శాతం క్షీణించాయి. 2022 వేసవి నాటి గరిష్ట స్థాయి నుంచి 19.3 శాతం పడిపోయాయి. లగ్జరీ కలెక్టబుల్స్ దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులు అందించినట్లు నైట్ ఫ్రాంక్ గ్లోబల్ హెడ్ (రీసెర్చ్) లియామ్ బెయిలీ తెలిపారు. 'వీటిలో 2005లో 1 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టి ఉంటే, కేఎఫ్ఎల్ఐఐ ప్రకారం వాటి విలువ ప్రస్తుతం 5.4 మిలియన్ డాలర్లుగా ఉండేది. అదే మొత్తాన్ని ఎస్అండ్‌పీ 500లో ఇన్వెస్ట్ చేసి ఉంటే 5 మిలియన్ డాలర్లే అయ్యేది' అని పేర్కొన్నారు.



దేశీయంగా లగ్జరీ ఇళ్లలో ఢిల్లీ టాప్..

లగ్జరీ హౌసింగ్ సెగ్మెంట్‌లో ఢిల్లీ, బెంగళూరులో రేట్లు గణనీయంగా పెరిగాయి. ఇందుకు సంబంధించిన ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్ (పీఐఆర్ఐ) 2023తో పోలిస్తే 2024లో 3.6 శాతం పెరిగింది. దీని ప్రకారం విలాసవంతమైన నివాస గృహాల ధరలు 6.7 శాతం పెరగడంతో అంతర్జాతీయంగా టాప్ 100 నగరాల్లో ఢిల్లీ 37వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎగబాకింది.



బెంగళూరు 59వ ర్యాంకు నుంచి 40వ ర్యాంకుకు పెరగ్గా, ముంబై మాత్రం 13 ర్యాంకులు తగ్గి 21 స్థానానికి పడిపోయింది. అంతర్జాతీయ స్థాయిలో 18.4 శాతం రేట్ల వృద్ధితో సియోల్ అగ్రస్థానంలోనూ, మనీలా (17.9 శాతం), దుబాయ్ (16.9 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లోనూ ఉన్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, లగ్జరీ ప్రాపర్టీలకు డిమాండ్ దన్నుతో హై–ఎండ్ రియల్ ఎస్టేట్ విభాగంలో ఈ నగరాలు ఆకర్షణీయంగా మారడాన్ని తాజా ర్యాంకులు సూచిస్తున్నట్లు బైజల్ తెలిపారు.

ఇక టాటా డిస్‌ప్లే చిప్స్...

- గుజరాత్ ప్రభుత్వంతో జత
- తైవాన్ కంపెనీతో ఒప్పందం



గాంధీనగర్: దేశీ కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్.. డిస్‌ప్లే చిప్స్ తయారీలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు వీలుగా గ్రూప్ కంపెనీ టాటా ఎలక్ట్రానిక్స్ తైవాన్ సంస్థ పీఎస్ఎంసీ, హైమాక్స్ టెక్నాలజీస్‌తో చేతులు కలిపింది. అంతేకాకుండా గుజరాత్ ప్రభుత్వంతోనూ జత కట్టింది. తద్వారా త్రైపాక్షిక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వెరసి గుజరాత్‌లో తైవాన్ కంపెనీ భాగస్వామ్యంతో డిస్‌ప్లే చిప్స్ తయారీకి తెరతీయనుంది. ఈ అంశాలను ఐఈఎస్ఏ విజన్ సదస్సులో టాటా ఎలక్ట్రానిక్స్ సీఈవో రణధీర్ ఠాకూర్ ప్రకటించారు. టాటా ఎలక్ట్రానిక్స్, పీఎస్ఎంసీ, హైమాక్స్ మధ్య అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదిరినట్లు వెల్లడించారు. పీఎస్ఎంసీ టెక్నాలజీ సహకారంతో గుజరాత్‌లోని ధోలెరాలో హైమాక్స్ కోసం డిస్‌ప్లే చిప్స్ తయారీని చేపట్టనున్నట్లు తెలియజేశారు.

3 విభాగాల్లోనూ..

డిస్‌ప్లే చిప్స్‌ను టీవీలతోపాటు, మొబైల్ ఫోన్ తెరలు, కెమెరాలలో ఇమేజ్ సెన్సార్లు, ఎల్ఈడీలు, ఓఎల్ఈడీలు తదితరాలలో వినియోగిస్తారు. తాజా ఒప్పందంతో టాటా ఎలక్ట్రానిక్స్ అన్ని(మూడు రకాల) సెమీకండక్టర్ తయారీ విభాగాల్లోనూ కార్యకలాపాలు విస్తరించనుంది. కంపెనీ ఇప్పటికే పీఎస్ఎంసీ సాంకేతిక భాగస్వామిగా గుజరాత్‌లో సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. ఇందుకు రూ. 91,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. అస్సామ్‌లోనూ రూ. 27,000 కోట్ల పెట్టుబడులతో చిప్ అసెంబ్లీ ప్లాంటును నెలకొల్పుతోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
కొత్త గరిష్టానికి చేరువలో పసిడి | భారీగా పుంజుకున్న సేవల రంగం

బుల్.. బౌన్స్‌బ్యాక్!

- సెన్సెక్స్ 740 పాయింట్లు అప్... 73,730 వద్ద క్లోజ్
- నిఫ్టీ 255 పాయింట్ల హైజంప్
- 10 రోజుల నష్టాలకు చెక్
- అన్ని రంగాలూ లాభాల్లోనే



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లలో ఇటీవల నెలకొన్న ట్రెండ్‌కు పూర్తి విరుద్ధంగా ఇన్వెస్టర్లు భారీ కొనుగోళ్లకు తెరతీశారు. దీంతో సెన్సెక్స్ 740 పాయింట్లు ఎగసింది. 3 రోజుల నష్టాలకు బ్రేక్ వేస్తూ 73,730 వద్ద ముగిసింది. అన్ని రంగాలలో పెట్టుబడులు పుంజుకోవడంతో నిఫ్టీ సైతం 10 రోజుల నష్టాలకు చెక్ పెడుతూ 255 పాయింట్లు జంప్‌చేసింది. 22,337 వద్ద నిలిచింది. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లపై వెనక్కి తగ్గవచ్చన్న అంచనాలు సెంటిమెంటుకు జోష్‌నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. వెరసి ఇంట్రాడేలో సెన్సెక్స్ 944 పాయింట్లు దూసుకెళ్లి 73,934కు చేరగా.. నిఫ్టీ 312 పాయింట్లు బలపడింది. గరిష్టంగా 22,395ను తాకింది. సానుకూల ప్రపంచ మార్కెట్లు, ఫిబ్రవరిలో పుంజుకున్న సేవల రంగం, షార్ట్ కవరింగ్ లావాదేవీలు ఇందుకు సహకరించినట్లు విశ్లేషకులు తెలియజేశారు.

బ్లూచిప్స్ స్పీడ్..: ఎన్ఎస్ఈలో మెటల్, పీఎస్‌యూ బ్యాంక్స్, ఆటో, ఐటీ, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, 4–2 శాతం మధ్య వృద్ధి చూపాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ద్వయం, టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఎంఅండ్ఎం, ఎన్‌టీపీసీ, ఐషర్, బీఈఎల్, ఐటీసీ, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ, టెక్‌మహీంద్రా, బ్రిటానియా, హిందాల్కో, నెస్లే, హెచ్‌సీఎల్ టెక్, బీపీసీఎల్ 5–3 శాతం మధ్య జంప్‌చేశాయి. ఇతర బ్లూచిప్స్‌లో కేవలం బజాజ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 3–1 శాతం మధ్య నష్టపోయాయి.

చిన్న షేర్ల దూకుడు

మార్కెట్లను మించుతూ చిన్న షేర్లు సైతం ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడంతో బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 2.7 శాతం ఎగశాయి. ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,97,248 కోట్లు పెరిగి 3,93,04,042 కోట్లకు చేరింది.

వారెవ్వా అదానీ గ్రూప్

తాజాగా అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అదానీ గ్రీన్ ఎనర్జీ 10.4 శాతం దూసుకెళ్లి రూ. 848ను అధిగమించగా.. ఎనర్జీ సొల్యూషన్స్ 10 శాతం జంప్‌చేసి రూ. 711కు చేరింది. అదానీ విల్మర్, టోటల్ గ్యాస్ 8 శాతం చొప్పున ఎగసి రూ. 258, రూ. 589 వద్ద ముగిశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్ 4.6% చొప్పున లాభపడి రూ. 2,245, రూ. 506ను తాకగా.. అదానీ పోర్ట్స్, ఎన్‌డీటీవీ 5 శాతంపైగా జంప్‌చేసి రూ. 1,113, రూ. 120 వద్ద స్థిరపడ్డాయి.

- స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపును గురువారం నుంచి సోమవారానికి మార్పు చేసిన నేపథ్యంలో బీఎస్ఈ షేరు ఇంట్రాడేలో 9.4 శాతం పతనమై రూ. 4,035 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 3.7 శాతం నష్టంతో రూ.4,290 వద్ద ముగిసింది.

రూపాయి.. జోరు!

13 పైసలు ప్లస్.. 87.06 వద్ద ముగింపు

మార్కెట్ల దన్నుతో దేశీ కరెన్సీ సైతం బలపడింది. డాలరుతో మారకంలో రూపాయి 13 పైసలు పుంజుకుంది. 87.06 వద్ద నిలిచింది. డాలరుతోపాటు ముడిచమురు ధరలు బలహీనపడటం రూపాయికి దన్నునిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా చైనా తదితర దేశాలు సైతం సుంకాల విధింపునకు తెరతీయడంతో డాలరు వెనకడుగు వేసినట్లు తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

ఎన్‌సీసీతో ఆర్మీ కొలువు

ఎన్‌సీసీలో చేరినవారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఇండియన్ ఆర్మీ స్పెషల్ ఎంట్రీ ద్వారా ఉద్యోగావకాశాలను అందిస్తోంది. ఎన్‌సీసీ సర్టిఫికేట్ ఉన్న యువతకు ఇది చక్కని అవకాశం. మహిళలు సహా అవివాహిత గ్రాడ్యుయేట్లు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూతో శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారిని షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఆకర్షణీయ వేతనం, ఇతర ప్రోత్సాహకాలుంటాయి. ఇటీవలే వెలువడిన ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీకి సంబంధించిన పూర్తి వివరాలు..



- » **మొత్తం ఖాళీలు:** 76
- » **అర్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అర్హులు. అలాగే ప్రస్తుతం కోర్సు ఫైనల్ ఇయర్ చదువుతున్నవారూ వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. అదేవిధంగా వీరు మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్‌లో కనీసం బి గ్రేడ్ పొందిన వారై ఉండాలి.
- » **వయసు:** జూలై 2, 2000 నుంచి జూలై 1, 2006 మధ్య జన్మించినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. అంటే జూలై 1, 2025 నాటికి 19 నుంచి 25 ఏళ్లలోపు వయసు వారై ఉండాలి.
- » **ఏడాదిలో రెండుసార్లు :** ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఏడాదికి రెండుసార్లు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. డిగ్రీతోపాటు ఎన్‌సీసీ అర్హత ఉన్నవారు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను అభ్యర్థుల అకడమిక్ మార్కులతో వడపోస్తారు. ఈ వడపోతలో నిలిచినవారికి సంబంధిత సెలక్షన్ కేంద్రాల్లో ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఏపీ, తెలంగాణ అభ్యర్థులకు బెంగళూరులో ఇంటర్వ్యూ ఉంటుంది.
- » **ఇంటర్వ్యూ :** ఈ ఇంటర్వ్యూలను సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో రెండు దశల్లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తారు. మొదటి రోజు స్టేజ్–1లో ఉత్తీర్ణులైనవారికే తర్వాతి 4 రోజులు నిర్వహించే స్టేజ్–2 ఇంటర్వ్యూకి అవకాశమిస్తారు. ఇందులో విజయవంతమైనవారికి మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.
- » **శిక్షణ ఇలా:** ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ విధానంలో ఎంపికైనవారికి 2025, అక్టోబరు నుంచి ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడెమీ, చెన్నైలో 49 వారాలు శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో ప్రతి నెల రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా చేరినవారు పదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. వ్యవధి పూర్తయిన తర్వాత సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల మేరకు కొందరిని శాశ్వత ఉద్యోగం(పర్మనెంట్ కమిషన్)లోకి తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్ల సర్వీస్ పొడిగిస్తారు. ఆ తర్వాత వీరు విధుల నుంచి వైదొలగాల్సి ఉంటుంది.
- » **పదోన్నతులు:** లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్లకు మేజర్, 13 ఏళ్ల సేవలతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు. మొదటి నెల నుంచే లెవెల్–10 రూ.56,100 మూల వేతనం తోపాటు మిలటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఎస్ఏ, పలు అలవెన్సులు అందుతాయి. ఏడాదికి సుమారు రూ.17–18 లక్షల సీటీసీ రూపంలో పొందుతారు.

ముఖ్యసమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- » దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 15, 2025
- » వెబ్‌సైట్ : https://indianarmy.nic.in/

ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా @ ఈఏపీసెట్!

ఈఏపీసెట్.. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పరిచయం అక్కర్లేని పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో విజయం సాధించి.. రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశం పొందాలని లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్యపరంగా ఈ పరీక్ష ఎంతో కీలకం. తెలంగాణలో ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మా స్ట్రీమ్, మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరుగనున్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2025కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..



- » టీఎస్ ఈఏపీసెట్ 2025 దరఖాస్తులు ప్రారంభం
- » ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్ స్ట్రీమ్ ఎంట్రన్స్
- » మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష
- » ప్రాక్టీస్, రివిజన్‌తో ఉత్తమ ర్యాంకు

కోర్సులు ఇవే

- ఈఏపీ సెట్ ద్వారా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.
- ఇంజనీరింగ్ కేటగిరీలో.. బీటెక్, బయో టెక్నాలజీ, బీటెక్(డైరీ టెక్నాలజీ), బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సులు ఉన్నాయి.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కేటగిరీలో.. బీఎస్సీ అగ్రి కల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ నర్సింగ్, బ్యాచిలర్ ఫిషరీస్ సైన్సు, బీఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. అదే విధంగా బీఎస్సీ (ఫారెస్ట్రీ) కోర్సుకు సైతం టీజీఈఏపీసెట్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు.

రెండు నెలల సమయం

టీఎస్ ఈఏపీసెట్–2025 ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలను మే 2 నుంచి 5 వరకు, అదే విధంగా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలను ఏప్రిల్ 29, 30 తేదీల్లో మొత్తం 6 రోజుల పాటు నిర్వహిస్తారు. అంటే.. ఇప్పటి నుంచి దాదాపు రెండున్నర నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ నెల(మార్చి) 5 నుంచి 24వ తేదీ వరకు బోర్డ్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల తర్వాత దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ ప్లాన్ రూపొందించుకోవాలి.

బోర్డ్ పరీక్షలకు ప్రాధాన్యమిస్తూ

ప్రస్తుత సమయంలో ద్వితీయ సంవత్సరం అభ్యర్థులు పూర్తిగా ఇంటర్మీడియెట్ పరీక్షలకే ప్రిపరేషన్ కొనసాగించాలి. ఈఏపీసెట్ గురించి ఆందోళన చెందకుండా బోర్డ్ పరీక్షల్లో మంచి మార్కులు పొందే విధంగా ప్రస్తుత సమయాన్ని కేటాయించాలి. బోర్డ్ పరీక్షలు పూర్తయ్యాక ఈఏపీసెట్ ప్రిపరేషన్ ప్రారంభించాలి. ముఖ్యంగా ప్రాక్టీస్‌తోపాటు రివిజన్‌పై ప్రధానంగా దృష్టిపెట్టాలి. ప్రిపరేషన్ సమయంలో తాము రాసుకున్న సొంత నోట్స్, షార్ట్‌కట్స్‌ను అనుసరిస్తూ రివిజన్ సాగించాలి. తద్వారా ఈ పరీక్ష సిలబస్‌లో పేర్కొన్న అంశాలను పూర్తి చేయడానికి అవకాశం లభిస్తుంది.

కాన్సెప్ట్యువల్ ఓరియెంటేషన్

ఇంజనీరింగ్ స్ట్రీమ్ అభ్యర్థులు ప్రధానంగా కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. గత రెండు, మూడేళ్ల ప్రశ్నల శైలిని గమనిస్తే.. అధిక శాతం ప్రశ్నలు అభ్యర్థుల అప్లికేషన్ అప్రోచ్‌ను పరిశీలించే విధంగా ఉంటున్నాయి. కాబట్టి ప్రిపరేషన్ దశ నుంచే కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి.

సమయ పాలన

ఈఏపీసెట్ అభ్యర్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత ప్రిపరేషన్ పరంగా ప్రతి సబ్జెక్ట్‌కు రోజూ మూడు గంటలు చొప్పున సమయం కేటాయించేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఇలా ఒక్కో సబ్జెక్ట్‌కు నిర్దేశించుకున్న వ్యవధిలో మొదటి పదిహేను నిమిషాల్లో అంతకుముందు రోజు చదివిన అంశాలను రివైజ్ చేసుకోవాలి. ప్రిపరేషన్ సాగిస్తున్నప్పుడు షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. దీనివల్ల పరీక్ష కు వారం ముందు క్విక్ రివిజన్‌కు ఉపయోగపడుతుంది.

మోడల్ టెస్ట్‌లకు హాజరు

ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. వీటి ద్వారా తమ సామర్థ్య స్థాయిని తెలుసుకుని.. ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలపై స్పష్టత తెచ్చుకోవాలి. ఒకవేళ ఆ అంశాలు క్లిష్టంగా ఉండి.. పట్టు సాధించలేమని భావిస్తే.. వాటి కనీస భావనల గురించి తెలుసుకోవాలి.

జేఈఈతో అనుసంధానం

ఈఏపీసెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల్లో అధిక శాతం.. జేఈఈ–మెయిన్, అడ్వాన్స్‌డ్‌లకు కూడా సన్నద్ధమవుతుంటారు. ఇలాంటి అభ్యర్థులు జేఈఈ–మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలతో ఈ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకుంటూ చదివితే ఒకే సమయంలో మూడు పరీక్షలకు సన్నద్ధత పొందొచ్చు. జేఈఈ–మెయిన్–2025 సెషన్–2 పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జరగనున్నాయి. ఈ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు జేఈఈ–మెయిన్‌కు సీరియస్ ప్రిపరేషన్ ద్వారా ఈఏపీసెట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచే ఆస్కారం ఉంటుంది.

160 మార్కులకు పరీక్ష

ఈఏపీసెట్ పరీక్ష మొత్తం 160 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. వీటిలో ఫిజిక్స్ నుంచి 40 ప్రశ్నలు, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు ఉంటాయి. అంటే మ్యాథమెటిక్స్‌కు ఎక్కువ వెయిటేజీ ఉంటుందని గుర్తించాలి. మ్యాథమెటిక్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలోని అన్ని టాపిక్స్‌ను పూర్తిగా అధ్యయనం చేయాలి. అగ్రికల్చర్ స్ట్రీమ్‌కు సంబంధించి బోటనీ (40 ప్రశ్నలు–40 మార్కులు), జువాలజీ (40 ప్రశ్నలు–40 మార్కులు), ఫిజిక్స్(40 ప్రశ్నలు–40 మార్కులు), కెమిస్ట్రీ (40 ప్రశ్నలు–40 మార్కులు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 160 ప్రశ్నలు–160 మార్కులకు పరీక్ష ఉంటుంది.

100కు పైగా మార్కులు సాధించేలా

టీజీఈఏపీసెట్ అభ్యర్థులు 100కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలి. ఇంజనీరింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే 70 మార్కులు సాధించినా సీటు పొందే అవకాశం ఉంది. కాని పేరున్న కళాశాలల్లో సీటు సొంతం చేసుకోవాలంటే 100కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలి. అదే విధంగా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్–10 కళాశాలల్లో సీటు పొందాలంటే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 140కు పైగా మార్కులు సాధించాల్సి ఉంటుంది.

పరీక్షలో రాణించేలా

మ్యాథమెటిక్స్: కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్‌పై దృష్టిపెట్టాలి. వీటితోపాటు 3–డి జామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్ అల్జీబ్రా, ఇంటిగ్రేషన్, కాంప్లెక్స్ నెంబర్స్, పారాబోలా, ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.

ఫిజిక్స్: ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్, సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై లోతైన అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సాధించే అవకాశాలు మెరుగవుతాయి.

కెమిస్ట్రీ: కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహారల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌడ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

బోటనీ: డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ (బ్యాక్టీరియా, వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయో టెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జువాలజీ: జువాలజీ నుంచి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటోజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీ అంశాలపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా..
- అలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది: 04.04.2025
- అగ్రికల్చర్ అండ్ ఫార్మా స్ట్రీమ్ పరీక్ష తేదీలు: 2025, ఏప్రిల్ 29, 30
- ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష తేదీలు: 2025, మే 2 నుంచి 5 వరకు
- వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

8న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎస్సైస్ యాక్ట్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోనియల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధి కార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఫిజికల్‌గా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని, సత్వర న్యాయం పొందాలని సూచించారు.

8న మహిళా శక్తి పాలసీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈనెల 8న పరేడ్‌గ్రౌండ్‌లో జరగనున్న మహిళా సదస్సులో మహిళా శక్తి పాలసీని విడుదల చేస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. మహిళా సమాఖ్యలకు అందజేయనున్న బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో ఆమె సమీక్షించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నెక్సాన్ పెయింట్స్ ట్రేడ్‌మార్క్ కాపీ

- నాగసాయి ఇండస్ట్రీస్‌పై లీగల్ టీమ్ ఆధ్వర్యంలో దాడి

సాక్షి, హైదరాబాద్: నెక్సాన్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లీగల్ టీమ్ దస్వానీ అండ్ దస్వానీ నేతృత్వంలో ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల, సంజీవరెడ్డి నగర్‌లో ఉన్న నాగసాయి ఇండస్ట్రీస్ మీద దాడి జరిపింది. నెక్సాన్ పెయింట్స్ లేబుల్, ట్రేడ్‌మార్క్‌తో నాగసాయి ఇండస్ట్రీస్ వస్తువులను పునరుత్పత్తి చేస్తోందని ఆరోపించింది. ఈమేరకు ఢిల్లీ హైకోర్టులో నెక్సాన్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ నాగ సాయి ఇండస్ట్రీస్ కేసు కొనసాగుతోందని తెలిపింది. ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన, కాపీరైట్ ఉల్లంఘన, పోటీ చట్టం ఉల్లంఘనలకు సంబంధించి నాగసాయి ఇండస్ట్రీస్ వస్తువుల విక్రయాలపై నెక్సాన్ పెయింట్స్ శాశ్వత నిషేధాన్ని కోరుతోంది. దాడిలో భాగంగా 180 బ్యాగుల నిషేధిత వస్తువులు, 2,000 నకిలీ ప్యాకేజింగ్ పదార్థాలను ఢిల్లీ హైకోర్టు నియమించిన స్థానిక కమిషనర్ స్వాధీనం చేసుకున్నారు.

ఏనుగు మళ్లీ జూలు విదిలిస్తుందా?



ఆ దిశగా ఏనుగుకు ఎలుక సాయం చేసిందా..

కొలోస్సల్ బయోసైన్సెస్ శాస్త్రవేత్తల రోమాంచితమైన పరిశోధన

వూలీ మమోత్.. భారీ ఆకారంతో, సింహం జూలును తలపించేలా తొండం నుంచి తోకదాకా దట్టమైన రోమాలతో భీకరంగా ఉండే ఏనుగు అది. అలాంటి ఏనుగును పునః సృష్టించేందుకు.. ఒక 'ఎలుకంత' ముందడుగు పడింది. తల నుంచి తోకదాకా నిండా దట్టమైన రోమాలతో కూడిన ఎలుక జీవం పోసుకుంది. అమెరికాకు చెందిన బయోటెక్నాలజీ సంస్థ 'కొలోస్సల్ బయోసైన్సెస్' శాస్త్రవేత్తలు చేసిన ఈ చిత్రమైన పరిశోధన ఏమిటో తెలుసుకుందామా...

-సాక్షి, సెంట్రల్‌డెస్క్



భూమ్మీద తిరుగాడి, కాలక్రమేణా అంతరించిపోయిన అరుదైన జీవులను పునః సృష్టి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అందులో భాగంగా 'కొలోస్సల్ బయోసైన్సెస్' శాస్త్రవేత్తలు వూలీ మమోత్ ఏనుగులకు తిరిగి ప్రాణం పోసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తర ధ్రువ ప్రాంతపు మంచులో దొరికిన వూలీ మమోత్ అవశేషాల్లోని

ధ్రువ ప్రాంత మంచులో దొరికిన ఆనవాళ్లతో..

జన్యువులను, ప్రస్తుతమున్న సాధారణ ఆసియన్ ఏనుగుల జన్యువులను పోల్చి చూశారు. మమోత్‌లలో దట్టమైన వెంట్రుకలకు కారణమైన జన్యువులను గుర్తించారు. దీనికి సంబంధించి తొలుత ఎలుకలపై ప్రయోగాలు చేపట్టారు. ''అంతరించిపోయిన ఒకనాటి జీవులను పునః సృష్టించగలం అనేందుకు ఈ ఎలుకలు సజీవ సాక్ష్యం. భవిష్యత్తులో ఈ టెక్నాలజీతో వూలీ మమోత్‌లను పుట్టించి, ప్రకృతిలోకి వదిలిపెట్టగలం..''అని కొలోస్సల్ సంస్థ చీఫ్ సైన్స్ ఆఫీసర్ బెత్ షాపిరో పేర్కొన్నారు.



చాలా బాగుంది.. ఎలా తయారు చేస్తారు?

'అగ్గిపెట్టెలో పట్టే చీర'ను చూస్తూ రాష్ట్రపతి ముర్ము ఆశ్చర్యం

- రాష్ట్రపతి భవన్‌లో 'వివిధతా కా అమృత్ మహోత్సవ్' ప్రారంభం

సాక్షి, న్యూఢిల్లీ/భద్రాచలం: 'యే క్యాహై?.. బహుత్ అచ్చా హై.. ఇస్‌కో కైసే బనాతే హో? (ఇదేంటి? చాలా బాగుంది..! ఎలా తయారు చేస్తారు?)'.. అంటూ అగ్గిపెట్టెలో పట్టేలా చేతితో నేసిన చీరను చూసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆశ్చర్యానికి గురయ్యారు. సిరిసిల్ల చేనేత కళాకారులపై ప్రశంసలు కురిపిస్తూ చీర తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యాన్‌లో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా 'వివిధతా కా అమృత్ మహోత్సవ్' సౌత్ ఎడిషన్ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందు తెలంగాణ పెవిలియన్‌ను సందర్శించిన రాష్ట్రపతిని.. గవర్నర్, ఉపముఖ్యమంత్రి సాదరంగా ఆహ్వానించి తెలంగాణ చేనేత కళాకారుల పనితనాన్ని, చేతివృత్తుల ప్రాముఖ్యతను వివరించారు. ఉత్సవ ప్రారంభంలో కళాకారులు ప్రదర్శించిన గుస్సాడీ నృత్యం ఆహూతులను అలరించింది. ఈనెల 9 వరకు ఉత్సవం కొనసాగనుంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెవిలియన్‌లో రాష్ట్రానికి చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీతలు గజం అంజయ్య, గజం గోవర్ధన్‌తో సహా 20 మంది పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ చేనేత కార్మికులు, 20 మంది నిపుణులతో స్టాళ్లు ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతి భవన్‌లో 'భద్రాద్రి' ఉత్పత్తులు

తెలంగాణ నుంచి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని మహిళలు రూపొందించిన పలు రకాల సబ్బులు, షాంపూలు, మిల్లెట్ బిస్కెట్లు, కరక్కాయ పౌడర్, తేనె, న్యూట్రీ మిక్స్ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచినట్లు పీఓ రాహుల్ తెలిపారు. ఆదివాసీ గిరిజన మహిళలు రూపొందించే ఉత్పత్తులు, వాటి వల్ల ప్రయోజనాలను ఇతర రాష్ట్రాల ప్రతినిధులు, ప్రజలకు తెలియజేసి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేలా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ సూచనలతో ఈ స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



రాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కన్నా.. నీకేం కాలేదు కదా?



కొణిజర్ల: అమ్మ ప్రేమకు మారు పేరు.. అమ్మమనసు పూల తేరు.. అన్నాడొక కవి.. పల్టీ కొట్టిన బస్సు చెట్టును ఢీకొన్నా.. ఆ ప్రమాదంలో రక్తమోడుతున్నా చలించలేదా తల్లి.. చేతిలో బిడ్డకేమైందోనని తల్లడిల్లిపోయింది. కన్నా నీకేం కాలేదు కదా? అని గుండెకు హత్తుకుంది. హైదరాబాద్ నుంచి సత్తుపల్లి వెళ్తున్న ఆర్టీసీ రాజధాని బస్సు.. బుధవారం తెల్లవారు జామున ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపాన పల్టీ కొట్టింది. రహదారిపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని తప్పించే క్రమంలో.. బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో పక్కకు ఒరిగి పల్టీ కొట్టి.. చెట్టును ఢీకొని ఆగడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన బీరెల్లి రాణికి తీవ్రగాయాలయ్యాయి. ఓ పక్క రక్తమోడుతున్నా ఆమె తేరుకుని.. తన కుమారుడికి ఏమైందోనని దగ్గరకు తీసుకుని.. ఒళ్లంతా తడుముతూ ఆరా తీయడం అందరినీ కదిలించింది. చిన్నారి ప్రమాదం బారి నుంచి సురక్షితంగా బయటపడటంతో తల్లితోపాటు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వీడియో రికార్డు చేశాం.. డబ్బులు పంపండి

- నకిరేకల్ ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ల బెదిరింపు కాల్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వేముల వీరేశం



నకిరేకల్: కాంగ్రెస్ పార్టీకి చెందిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీనిపై ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి 7.52 గంటల సమయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తన అనుచరులతో ఫోన్‌లో మాట్లాడుతుండగా అదే సమయంలో +91 8889022499 నంబర్ నుంచి ఎమ్మెల్యే ఫోన్‌కు వీడియో కాల్ వచ్చింది. వీడియోలో న్యూడ్‌గా ఉన్న మహిళ కనిపించింది. ఎమ్మెల్యేకు ఫోన్ చేస్తున్న వీడియోను వెంటనే రికార్డు చేసిన సైబర్ నేరగాళ్లు ఆ వీడియోను ఆయనకు పంపించి.. డబ్బులు పంపాలని డిమాండ్ చేశారు. డబ్బులు పంపకపోతే రికార్డు చేసిన వీడియోను మీ పార్టీ లీడర్లకు పంపిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే స్పందించకపోవడంతో సైబర్ నేరగాళ్లు వీడియో స్క్రీన్ షాట్ తీసి ఆయనతో పాటు అనుచరుల ఫోన్ నంబర్లకు పంపించారు. దీంతో కంగారుపడిన అనుచరులు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి జరిగిన విషయం తెలుసుకున్నారు. దీనిపై వెంటనే వీరేశం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నకిరేకల్ సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి సైబర్ క్రైం టీంకు సమాచారం ఇచ్చారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి..: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజలకు పిలుపునిచ్చారు. తనకు సైబర్ నేరగాళ్ల నుంచి మంగళవారం రాత్రి వీడియో ఫోన్ కాల్ వచ్చిందని, వెంటనే కట్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఈ కాల్ మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు పోలీసులు గుర్తించారని చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఈ 'సర్వీసెస్' మీ కోసమే...



ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ

న్యాయ సాయమే కాదు.. పథకాల అందజేతలోనూ చేయూత

జువెనైల్ జస్టిస్, డ్రగ్స్, కార్మిక చట్టాలపై అవగాహనకు చర్యలు

మానవ అక్రమ రవాణా, పోక్సో, సైబర్ నేరాలు, ప్రజల హక్కులపై కూడా

రియల్ స్టోరీల లఘు చిత్రాలతో ప్రజలను చైతన్యం చేసేలా ఏర్పాట్లు


పలు కేసుల్లో ఏటా కోట్లలో పరిహారం అందిస్తున్న న్యాయసేవాధికార సంస్థ

ఎలాంటి సాయం కోసమైనా భయం లేకుండా సంప్రదించాలని పిలుపు

సాక్షి, హైదరాబాద్: నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారిపై అత్యాచారం జరిగింది.. పోలీసులు కేసు నమోదు చేశారు.. న్యాయస్థానంలో విచారణ సాగుతోంది.. తీర్పు వచ్చే వరకు ఆమె భవిష్యత్ ఏంటి? కోర్టుటంటే ఏంటో తెలియని ఆ పేదలు ఎలా అక్కడికి వెళ్లగలరు? మానసికంగా కుంగిపోయిన ఆ చిన్నారికి ఎవరు ధైర్యం చెబుతారు? కౌన్సెలింగ్ ఎవరు ఇప్పిస్తారు?.. ఇలాంటి ప్రశ్నలకు జవాబే తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ). ఒకటి కాదు.. రెండు కాదు.. జువెనైల్ జస్టిస్, డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, కార్మిక చట్టాలు, సైబర్ నేరాలు, ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రభుత్వ పథకాలు.. ఇలా అనేక సేవలను న్యాయ సేవాధికార సంస్థ అందిస్తోంది. అయితే, ఈ సేవలు మారుమూల పల్లెలకు సరిగా చేరడం లేదన్న భావనతో సంస్థ కొత్త ఆలోచన చేసింది ఆయా అంశాలతో లీగల్ సర్వీసెస్ అథారిటీ, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డి.సాయిప్రసాద్ దర్శకత్వంలో ఈ 10 లఘు చిత్రాలు రూపొందించింది. వీటిని రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలు, న్యాయ సాయం సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరాలన్నదే లక్ష్యం. వీరందించే ఆర్థిక సాయం కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేదు. లఘు చిత్రాల ద్వారా ప్రజల్లో సంస్థ అందించే సేవలు, న్యాయ సాయం గురించి అవగాహన పెరుగుతోంది. నిజ జీవితంలో జరిగిన అంశాల ఆధారంగా రూపొందించిన ఈ లఘు చిత్రాలను చూస్తే.. తమ సమస్య ఏంటి? ఎవరిని, ఎలా ఆశ్రయించాలి? ఎలా సాయం పొందాలి? అనేది తెలిసిపోతుంది. ఆ చిత్రాలేంటి.. సాయం ఎలా చేస్తారో తెలుసుకుందాం...



తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ
ఫోన్: 040 - 23446723
E-mail : telenganaslsa@gmail.com



విడుదల...



కొత్తగా ఓ భార్యభర్తలు ఓ ఇంటిలో దిగారు. ఎప్పుడూ భార్య బయటికి వచ్చేది కాదు. భర్త ఆఫీస్‌కు వెళ్లేటప్పుడు రోజూ ఇంటికి తాళం వేసుకుని వెళ్లేవాడు. చుట్టుపక్కల వారికి ఎలాంటి అనుమానం రాకుండా ప్రవర్తించేవాడు. కానీ, ఇంటి పక్కనే ఉండే ఓ మహిళకు అతని ప్రవర్తనపై అనుమానం వచ్చింది. దీంతో న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్‌ను సమాచారం ఇచ్చింది. వారు పోలీసుల సహకారంతో తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. భార్యను చైన్‌తో కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి ఉండటాన్ని చూసి వారు షాకయ్యారు. వెంటనే వారు ఆ భార్యకు విముక్తి ప్రసాదించి సఖి కేంద్రంలో చేర్పించారు. వైద్య చికిత్స అందించడంతోపాటు జీవనోభృతి కల్పించారు. ఆ భర్తను అరెస్టు చేసి, శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారు. ఆమె ఆనందంగా జీవించేలా ఏర్పాట్లు చేశారు.

అంకురం..



పారా లీగల్ వలంటీర్ ఓ హోటల్‌లో చిన్నారి పని చేయడం చూసి యజమానిని హెచ్చరించాడు. పనిలో తీసేసిన ఆ చిన్నారిని వ్యభిచార గృహానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న వలంటీర్ పోలీసుల సహకారంతో ముఠా గుట్టు రట్టు చేశారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కటకటాల్లోకి పంపించారు. ఆ చిన్నారితోపాటు చాలామంది చిన్నారులకు జీవితాన్నిచ్చారు. వారంతా చదువుకునేలా న్యాయసేవాధికార సంస్థ ఏర్పాటు చేసింది.

గెలుపు..



మొబైల్‌కు వచ్చిన లింక్‌ను చదివిన మహిళ పార్ట్ టైమ్ జాబ్‌కు ఓకే కొట్టింది. వెయ్యి, రెండు వేల వరకు బాగానే వేసిన సైబర్ నేరగాళ్లు ఆదాయపు పన్ను అంటూ తొలుత లక్ష, తర్వాత మరో లక్ష చెల్లించాలన్నారు. వారి ఊబిలో ఇరుక్కుపోయిన మహిళ అడిగినప్పుడల్లా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆ నగదు తన అకౌంట్‌లోనే చూపిస్తుండటంతో అనుమానం రాలేదు. ఇలా వివాహం కోసం దాచిన రూ.50 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత కానీ మోసపోయానని ఆమె తెలుసుకోలేదు. ఆత్మహత్యకు యత్నించిన ఆ మహిళను తండ్రి కాపాడి సైబర్ పోలీసులను ఆశ్రయించారు. సరైన సమయంలో పోలీసులను సంప్రదించడంతో వారు ఆ డబ్బును రికవరీ చేయగలిగారు. గతంలో 2 శాతమే ఉన్న ఈ రికవరీ రేటు ప్రస్తుతం 20 శాతానికి పెరిగింది. వెంటనే సంప్రదిస్తే ఫలితం వచ్చే అవకాశమెక్కువ.

సంరక్షణ...



ఏకాంతంగా ఆడుకుంటున్న ఓ మగ, ఆడబిడ్డపై ఓ దుర్మార్గుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. కాస్త ఊహ తెలిసిన బాధిత చిన్నారి ఇచ్చిన సమాచారం మేరకు అతన్ని అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కటకటాల్లోకి పంపారు. చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించిన న్యాయ సేవాధికార సంస్థ కౌన్సెలింగ్ కూడా ఇప్పించింది. ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులో నేరుగా జడ్జి ఆ చిన్నారులతో మాట్లాడారు. ఏం జరిగిందో ఆ చిన్నారులు భయపడుతూనే వివరించారు. దుర్మార్గుడిని కూడా గుర్తించడంతో రెండు కేసుల్లో కఠిన శిక్షలు పడ్డాయి. న్యాయ సేవాధికార సంస్థ నుంచి బాధితులకు పరిహారం అందించారు. అందరిలా వారు జీవించేందుకు ఏర్పాట్లు చేశారు.

సీత కథ..



గిరిజన గ్రామం. చదువుకోవాలని ఎంతో ఆశపడిన బాలికకు 16 ఏళ్లకే తల్లిదండ్రులు వివాహం చేశారు. కాపురం అంటే ఏంటో తెలియని వయసులో అత్త మామలు, భర్త పెట్టే వేధింపులు భరించలేక ఇంట్లోంచి పారిపోయి నగరానికి వచ్చింది. పని ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి ఆమె వద్ద ఉన్న నగలు, డబ్బులు తీసుకుని ఉడాయించాడు. అయితే కట్టుబాట్లు అంటూ తిరిగి ఆ బాలికను గ్రామంలోకి అనుమతించలేదు. విషయం న్యాయసేవాధికార సంస్థకు తెలిసింది. తొలుత సఖి కేంద్రానికి తరలించి.. చదువుకునేందుకు చర్యలు చేపట్టింది. తర్వాత ఊరి పెద్దలతో మాట్లాడి బాలికను అనుమతించేలా చేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.

సంకల్పం...



తోపుడు బండ్లపై, గంపల్లో వ్యాపారం చేసుకునే వారి వద్ద బేరమాడి తక్కువ రేటుకు కొంటాం. రోజువారీ వడ్డీకి తెచ్చి ఎండనక, వాననక.. కష్టపడి వందో.. రెండు వందలో ఇంటికి తీసుకెళ్తే తప్ప పూట గడవదు. ఇలా ఓ మహిళ డబ్బు తీసుకుని ఓ రోజు డబ్బు చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారి ఆ వ్యాపారాన్ని నాశనం చేశాడు. న్యాయసేవాధికార సంస్థను సంప్రదించడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. మెప్మా ద్వారా రుణం ఇప్పించారు. స్టాల్ పెట్టించి సొంత వ్యాపారం పెట్టుకునే భరోసా కల్పించారు. ఇలా పథకాలతో నెలనెలా వేలల్లో సంపాదిస్తున్న వారెందరో ఉన్నారు..

ప్రేరణ...

పాఠశాలకు వెళ్లి అందరిలా చదువుకోవాలని ఉన్నా.. ఇళ్లలో పనిచేసేది ఓ బాలిక. పనికి వెళితేనే పైసలు వస్తయని, చదువుకుంటే డబ్బులేం రావని తల్లి చెబుతుండేది. పని చేసే చోట ఓ వృద్ధుడు చదివిస్తానని మాయమాటలు చెబుతూ గర్భవతిని చేశా డు. ఎవరికైనా విషయం చెబితే పుస్తకాలు కొనివ్వన ని బెదిరించాడు. ఎలా అయినా చదువుకోవా లని తపన పడిన చిన్నారి అతని బాధలన్నీ భరించింది. బాలిక గర్భిణి అని తెలుసుకున్న తల్లిదండ్రులు అల్లాడిపోయారు. న్యాయసేవాధికార సంస్థను సంప్రదించారు. అబార్షన్ చేసే అవకాశం కూడా లేకపోవడంతో బాలిక, పసికందు సంరక్షణ చర్యలు తీసుకున్నారు. పోక్సో చట్టం కింద జైలుకు పంపి నా... నిందితుడు కేసు విచారణలో ఉండగానే మృతి చెందాడు. ఆ బాలిక భవిష్యత్ అంధకారం కాకుండా న్యాయ సేవాధికార సంస్థ ఆర్థిక సాయం చేసింది.





వల...

ఓ యువతి.. తల్లి ప్రోత్సాహంతో రీల్స్, షార్ట్స్ అంటూ వీడియోలు పోస్టు చేసేది. ఆమె ఉత్సాహం, వ్యూస్ చూసిన సైబర్ నేరగాళ్లు ఆమె ఐడీని హ్యాండిల్ చేస్తామని చెప్పారు. మురిసిపోయిన ఆమె తన వ్యక్తిగత వివరాలన్నీ తెలియజేసింది. వాళ్లు ఏమీ చెబితే అది చేయడం ప్రారంభించింది. ఎంత డబ్బు అడిగినా ఇస్తారని తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు.. ఓ రోజు ఫేస్ మార్ఫింగ్ చేసి న్యూడ్ వీడియో, ఫొటోలను ఆమెకు పంపించారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించారు. తండ్రికి విషయం చెప్పడంతో న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించారు. తొలుత 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. న్యాయ సాయం అందించి, ఫేక్ ఏజెన్సీ వాళ్లను పట్టుకునేలా సంస్థ చర్యలు చేపట్టింది.

ముందడుగు...

కాలేజీకి వెళ్లే ఓ విద్యార్థి మాదక ద్రవ్యాలకు బానిసయ్యాడు. డ్రగ్స్ తీసుకుంటే బాగా చదువుకోవచ్చని స్నేహితులు చెప్పిన మాటలు నమ్మి ఊబిలో కూరుకుపోయాడు. చదువు సంగతి అటుంచితే.. ఆరోగ్యం పూర్తి దెబ్బతినే వరకు తెచ్చుకున్నాడు. ఓ రోజు పోలీసుల వలకు ముఠా చిక్కింది. పెడ్లర్లకు కోర్టు కఠిన శిక్ష విధించింది. న్యాయ సేవాధికార సంస్థ విద్యార్థులను డీఅడిక్షన్ సెంటర్‌కు పంపింది. ఇప్పుడు వారు డ్రగ్స్‌కు దూరంగా సాధారణ జీవనం సాగిస్తున్నారు.





నాంది...

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే భోజనం, సరుకులు తెచ్చే యాప్‌లు ఎన్నో ఉన్నాయి. మరి వాటిలో పని చేస్తున్న కార్మికుల పరిస్థితి ఏంటి? వారిని పనిలోంచి తీసేయడం, శ్రమ దోపిడీ జరిగితే ఎక్కడికి వెళ్లాలి.. ఎవరిని సంప్రదించాలి? కార్మిక చట్టం ప్రకారం యాప్ ఆధారిత కార్మికుల పరిస్థితిని సమర్థవంతంగా మెరుగుపర్చడానికి చట్టపరమైన చర్యల ప్రత్యేక బ్లూప్రింట్ అవసరమని న్యాయ సేవాధికార సంస్థ ప్రతిపాదించింది. అసంఘటితరంగ కార్మికుల హక్కుల రక్షణకు అండగా నిలుస్తోంది.



జోజో పాపాయి...

పురిటిలోనే తల్లిని కోల్పోయిన చిన్నారికి పాల కోసం రోజు కిలోమీటర్ల దూరం వెళ్లేవారు తాత. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా గేదెను కొనుక్కొనేందుకు ఆర్థికంగా సహకరించలేదు. న్యాయ సేవాధికార సంస్థకు విషయం తెలియడంతో ఆ తాతను అధికారుల వద్దకు తీసుకెళ్లారు. గిరిజన సంక్షేమ శాఖ సహాయ గిరిజన అభివృద్ధి అధికారి సహకారంతో ఆవును అందించారు. పసికందు ఆకలి తీర్చడానికి చర్యలు చేపట్టారు. టీకాలు, ఇతర పోషకాహారం కూడా ఇంటికే అందించే ఏర్పాటు చేశారు.

తస్మాత్ జాగ్రత్త..

ఉదయం లేచింది మొదలు ఫోన్‌తోనే గడిపేవారు ఎందరో. కొందరు ఆర్థిక అవసరాల కోసం లోన్ యాప్‌లను సంప్రదిస్తున్నారు. ఎలాంటి డాక్యుమెంట్లు అవసరం లేదని చెబుతూ బురిడీ కొట్టిస్తున్నారు. ఇష్టం వచ్చినట్లు వడ్డీ వసూలు చేస్తున్నారు. లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే 'ఓకే' కొట్టడంతో మన ఫోన్‌లో ఉన్న డేటా అంతా వారికి చేరుతుంది. మన ఫొటోలు, వీడియోలు కూడా.. తీసుకున్న లోన్ మొత్తం కట్టినా వేధింపులు ఆగలేదు. ఓ వ్యక్తి అక్క వివాహం కోసం లోన్ తీసుకున్నాడు. సైబర్ నేరగాళ్లు అక్క ఫొటోలను మార్ఫింగ్ చేసి పంపారు. దీంతో అతడు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించగా.. సైబర్ పోలీసులు అతని ఫోన్‌ను వాచ్ చేసి నేరగాళ్లను అరెస్టు చేశారు.



బంధ విముక్తులను చేసి...

ఇదే నాగర్‌కర్నూల్‌లో రూ.15 వేల అప్పు కట్టలేదని గిరిజన భార్యాభర్తలను నిర్బంధించి, పనిలో పెట్టుకున్నాడు ఓ వ్యక్తి. విషయం తెలుసుకున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్మికులకు అందిస్తున్న పథకం కింద ఇద్దరికీ రూ.30 వేల చొప్పున 2024, డిసెంబర్‌లో అందించింది. వారిని బంధవిముక్తులను చేసింది.

మానసిక వేదనకు పరిష్కారం



సాయిప్రసాద్

బాధితులకు న్యాయం చేయడం కోసం చివరి వరకు ప్రయత్నించాలన్నది సుప్రీం కోర్టు పిలుపు. లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలు దేశవ్యాప్తం కావాలని ఆకాంక్ష. అట్టడుగు వర్గాలకు న్యాయ సేవలు అందాలి. కులం, మతం లేదా ఆర్థిక స్తోమత లేని కారణంగా న్యాయం పొందలేకపోవడం సరికాదు. రూపాయి ఖర్చు లేకుండా లీగల్ సర్వీసెస్ అథారిటీ సేవలు అందిస్తుంది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయితోపాటు గ్రామాల్లో వలంటీర్లు అందుబాటులో ఉంటారు. న్యాయసాయమే కాదు.. పథకాల వర్తింపుపైనా సమాచారం ఇస్తారు. అంతేకాదు.. ఏదైనా ఆస్తిని కొనుగోలు చేయాలన్నా న్యాయ సాయం చేస్తారు. ఎలాంటి నేరం జరిగినా బాధితులను ఆర్థికంగా, మానసికంగా అండగా ఉంటారు. ఎలాంటి నేరం జరిగితే.. ఎలా సాయం పొందవచ్చు అని ప్రజలు తెలుసుకునేందుకే రియల్ స్టోరీల ఆధారంగా లఘు చిత్రాలను రూపొందించాం. గతంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శిగా పనిచేసిన (ప్రస్తుత ఎఫ్ఏసీ. రిజిస్ట్రార్ జనరల్) ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఈ చిత్రాల రూపకల్పనలో కీలక పాత్ర వహించారు. మార్ఫింగ్ వీడియోలు, అత్యాచారాల్లాంటి ఘటనల్లో ఆర్థిక సాయం అందించొచ్చు.. నేరగాళ్లకు శిక్ష పడొచ్చు.. కానీ, బాధితుల మానసిక వేదనను అర్థం చేసుకునేవారు ఉండరు. అలాంటి సమస్యలను పరిష్కరించడంలో అథారిటీ కీలక పాత్ర పోషిస్తోంది. చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు ప్రభుత్వం మరింత ముందుకొచ్చి చర్యలు చేపట్టాలి.

– డి.సాయిప్రసాద్, లఘు చిత్రాల దర్శకుడు

బాధితుల సంక్షేమానికి చర్యలు



న్యాయసేవాధికార సంస్థ అంటే.. న్యాయ సేవలు ఒకటే కాదు. సంక్షేమ ఫలాలు బాధితులకు అందేలా చర్యలు తీసుకున్నాం. నేరం జరిగినప్పుడు బాధితుల వేదనను గుర్తించి నష్ట పరిహారం అందిస్తున్నాం. ప్రభుత్వం ద్వారా వారికి లబ్ధి చేకూరుస్తున్నాం. కేసు విచారణకు న్యాయ సాయంతోపాటు తీర్పు వచ్చే వరకు అండగా నిలుస్తున్నాం. రాష్ట్రస్థాయిలో టీఎస్ఎల్ఎస్ఏను, జిల్లాల్లో డీఎల్ఎస్ఏను, మండలాల్లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదించి సాయం పొందవచ్చు. బాధితులు ఈ కేంద్రాలకు వెళ్లి న్యాయపరమైన సలహాలు కోరవచ్చు. ప్రతీచోట పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులుంటారు. రాలేని పరిస్థితి ఉంటే నేరుగా మేమే వారి దగ్గరికి వెళ్లి సాయం అందిస్తున్నాం. బాధితులే కాదు.. వారు సాయం అర్థించే పరిస్థితిలో లేకుంటే, వారి తరఫున ఎవరు సమాచారం ఇచ్చినా చేయూత అందించేందుకు కృషి చేస్తాం. మీకు వచ్చిన భాషలో దరఖాస్తుతో వలంటీర్లను లేదా అధికారులను ఆశ్రయించవచ్చు. న్యాయ సాయం తప్ప ఇతర సేవలను వినియోగించుకునే వారు చాలా తక్కువ. ఎక్కడ, ఎలా వాటిని పొందాలో చాలా మందికి తెలియదు. సంస్థ సేవలు అట్టడుగు ప్రజానీకానికి, మారుమూల గ్రామాలకు చేరాల్సిన అవసరం ఉంది. అవసరం ఉన్న వారిలో ఎక్కువ మంది ఆ సేవలు పొందగలిగినప్పుడే నిజమైన సార్థకత చేకూరుతుంది.

– సీహెచ్. పంచాక్షరి, సభ్య కార్యదర్శి, టీఎస్ఎల్ఎస్ఏ

గిజిగాడి పొదరిల్లు



తేలిక గడ్డిపోచలతో తూగుటుయ్యాల గృహాన్ని నిర్మించుకునే గిజిగాడి నైపుణ్యానికి ఎవరైనా అబ్బుర పడాల్సిందే. గుప్పెడంత కూడా లేని ఈ పక్షి చిటారు కొమ్మన అంతస్తులతో కూడిన ఓ అందమైన సౌధాన్ని నిర్మించుకుంటుంది. గాలి, వాన, శత్రువుల బారి నుంచి తన పిల్లలను రక్షించుకోవడానికి ఇందులో అన్ని ఏర్పాట్లూ చేసుకుంటుంది. అనంతపురం జిల్లా సోమలదొడ్డిలో ఒకే చెట్టుకు పదుల సంఖ్యలో వేలాడుతున్న ఈ గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి, అనంతపురం

పంచవన్నెల 'చిలక'



రంగురంగుల రెక్కలతో రివ్వురివ్వున ఎగిరే సీతాకోకచిలుకల గుంపును చూస్తే ఎవరికైనా మనసుకు హాయిగా అనిపిస్తుంది. తిరుపతి కరకంబాడి రోడ్డులో ఒకే చోట గుంపుగా చేరిన ఈ సీతాకోకచిలుకలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బతుకుతెరువును బతికించుకోవాలిగా..



ఎండలు మండిపోతున్నాయి. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో పట్నంలో నాటు కోళ్లకు డిమాండ్ పెరగడంతో ఓ మహిళ రోజూ ఊరి నుంచి కోళ్లను పట్నం తీసుకొచ్చి అమ్ముకుంటోంది. ఎండ వేడికి కోళ్లు ఇబ్బంది పడుతుండటంతో వాటికి ఇలా నీళ్లు తాగిస్తోంది. నెల్లూరులోని ముత్తుకూరు గేటువద్ద ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

ఎస్సీఈఆర్టీ రాత పరీక్ష నేడు

సాక్షి, అమరావతి: స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎస్సీఈఆర్టీ)లో అసెస్‌మెంట్ సెల్ సబ్జెక్ట్ నిపుణుల ఖాళీల భర్తీ కోసం గురువారం రాత పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల నుంచి 148 మంది ఉపాధ్యాయులను పరీక్షకు ఎంపిక చేసినట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. వీరికి విజయవాడలోని స్టెల్లా కాలేజీలో గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఉంటుంది.

డైట్ బకాయిల చెల్లింపునకు రూ.5.50కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన పెండింగ్ డైట్ బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5.50 కోట్లు విడుదల చేసిందని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

త్వరలో చేనేత సహకార సంఘ ఎన్నికలు: మంత్రి సవిత

సాక్షి, అమరావతి: త్వరలోనే చేనేత సహకార సంఘాల (ఆప్కో) ఎన్నికలు నిర్వహించనున్నట్టు మంత్రి సవిత బుధవారం తెలిపారు. శాసనసభా ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రారంభించామని చెప్పారు.

ఆప్కో ఎండీగా ఎం.విశ్వ

సాక్షి, అమరావతి: ప్రస్తుతం ఆప్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీగా ఉన్న ఆర్.పవన మూర్తి డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ మాతృ సంస్థ మినిస్ట్రి ఆఫ్ కమ్యూనికేషన్‌కు బదిలీ చేసింది.ఎంఎస్ఎంఈడీసీ వీసీ ఎండీగా ఉన్న ఎం.విశ్వకు ఆప్కో వీసీఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చినట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్ .యువరాజ్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

కేపీఎంజీ కన్సల్టెన్సీకి రూ.5.12 కోట్లు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) ప్రోగ్రామ్‌కు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా కేపీఎంజీ సంస్థను ప్రభుత్వం నియమించింది. ఇందుకుగాను రూ.5,12,36,498 నిధులను సమగ్ర శిక్ష నుంచి చెల్లించాలని ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులిచ్చారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థను నిర్మించేందుకు ఏడాది పాటు సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

సాక్షి, అమరావతి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 18, 19, 20 తేదీల్లో ఎమ్మెల్యేల కోసం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో వాటి నిర్వహణపై క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవి నాయుడు, ఎండీ గిరీషాతో సమీక్షించారు.

విశిష్ట సంఖ్య నమోదును వేగవంతం చేయండి

సాక్షి, అమరావతి : ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ)ను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ 60 లక్షల రైతుల నమోదు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 35.71 లక్షల మంది రైతుల నమోదు ప్రక్రియ (60శాతం) పూర్తయిందన్నారు.

సీఎం అధ్యక్షతన రాష్ట్ర ప్రాజెక్టుల పర్యవేక్షణ గ్రూప్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ తరహాలో రాష్ట్రంలో సీఎం అధ్యక్షతన రాష్ట్ర ప్రాజెక్టుల పర్యవేక్షణ గ్రూప్‌ను ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



సముద్రంలోకి వెళ్తున్న తాబేలు పిల్లలు

ఆలివ్ రిడ్లే.. బతకాలిలే..


సాగర గర్భంలో తల్లులు, ఎక్కడో దూరంగా తీరంలో పిల్లలు.. ఆ తల్లీపిల్లలు కలుసుకోవడానికి సవాలక్ష ఆటంకాలు. ప్రకృతి వైపరీత్యాలు, జంతువుల దాడులు, ఆకతాయిల వికృత చేష్టలు అన్నీ తట్టుకుని నిలబడితేనే ఆ పిల్లలు కడలి గర్భంలోకి వెళ్లగలవు. లేదంటే అండంలో ఉన్నప్పుడే ఆయుష్షు తీరిపోతుంది. ఇలాంటి ఆపత్కాలంలో ఉన్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లల ఆయుష్షుకు అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు అండగా నిలబడుతున్నారు. తీరంలో గుడ్లను సంరక్షించి అవి పొదిగి పిల్లలు బయటకు వచ్చే వరకు జాగ్రత్తగా చూసి.. బుల్లి బుల్లి తాబేలు పిల్లలు ఆనందంగా సముద్రంలోకి వెళ్లడాన్ని మురిపెంగా చూస్తున్నారు.

- తాబేళ్లకు రక్షణగా ట్రీ ఫౌండేషన్, అటవీశాఖ
- సాగర తీరంలో సంరక్షణ కేంద్రాలు
- తాబేలు గుడ్లకు రక్షణ
- పొదిగిన తర్వాత తీరంలోకి పిల్లలను వదిలిపెడుతున్న సభ్యులు

సోంపేట:

సముద్రంలో లక్షలాది జీవులు నివాసం ఉంటాయి. అందులో సముద్రానికి మేలు చేసే జాతుల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఒక జాతి. ఆ రకం తాబేళ్లు గుడ్లు పెట్టుకునేందుకు మన తీరాలను అనువుగా ఎంచుకున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత సముద్ర తీరానికి వచ్చి తీరంలో గొయ్యి తవ్వి గుడ్లు పెడతాయి. అనంతరం వాటిని కప్పేసి సముద్రంలోకి వెళ్లిపోతాయి. తీరంలో గుడ్లు పెట్టడానికి అనువైన స్థలం చూసుకుని గుడ్లు పెడుతుంటాయి. అలా వచ్చినప్పుడు బోట్లు తగిలి కొన్ని తాబేళ్లు చనిపోతుంటాయి. ప్రస్తుతం ఆలివ్‌రిడ్లే తాబేళ్లు అంతరించి పోయే ప్రమాదంలో ఉండడంతో అటవీశాఖ పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో తాబేళ్ల సంరక్షణకు నడుం బిగించింది.

50 నుంచి 150 గుడ్లు



తీరంలో గుడ్లు పెడుతున్న ఆలివ్‌రిడ్లే తాబేలు



తీర ప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

సాధారణంగా ఈ జాతి తాబేళ్లు 50 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 5 గంటల లోపు తీరానికి చేరుకుని ఇసుకలో గోతులు తవ్వి వాటిలో గుడ్లు పెట్టి, తిరిగి వాటిపై ఇసుక కప్పి తల్లి తాబేళ్లు సముద్రంలోకి వెళ్లిపోతాయి.

ప్రత్యేక జీవులు

ఆలివ్ రిడ్లే తాబేళ్లు చాలా ప్రత్యేకమైనవి. వీటికి స్థిర నివాసం ఉండదు. రెండు అడుగుల పొడవు, సుమారు 150 కిలోలు పైన బరువు ఉండే తాబేళ్లు ఆహార అన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం సుమారు 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. డిసెంబర్ నుంచి మార్చి రెండో వారం వరకు ఎక్కువగా గుడ్లు పెడుతుంటాయి.

● గుడ్లకు సంరక్షణ..

తీరంలో తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాక శ్రీకాకుళం జిల్లాలో అటవీ శాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సౌజన్యంతో గుడ్లను సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నారు. జిల్లాలో మొత్తం మూడు డివిజన్ల పరిధిలో 16 సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇచ్ఛాపురం నియోజక వర్గంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజక వర్గంలోని సోంపేట మండలం బట్టిగళ్లూరు, బారువ పేట, ఇస్కలపాలేం, కవిటి మండలం కళింగపట్నం, బట్టివాని పాలేం, సీహెచ్ కపాసుకుద్ది, ఇచ్ఛాపురం మండలం డొంకూరులో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం జిల్లాలో 1,59,403 గుడ్లు సేకరించి 1,44,981 పిల్లలుగా తయారు చేసి సముద్రంలోకి విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది గత ఏడాది కంటే ఎక్కువ పిల్లలను తయారు చేసి సముద్రంలోకి విడిచి పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ డివిజన్‌ల పరిధిలో 452 నెట్లు ఏర్పాటు చేసి 53,400 గుడ్లు సేకరించారు. సుమారు 40 రోజుల పాటు రక్షణ వలయంలో ఉంచి గుడ్లు పిల్లలుగా మారిన తర్వాత వాటిని సురక్షితంగా సముద్రంలోకి విడిచిపెడతారు.



కేంద్రంలో ఏర్పాటు చేసిన నెట్స్

మత్స్యకారులు సహకరించాలి

తాబేలు గుడ్లను సంరక్షించడానికి అటవీ శాఖాధికారులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులకు మత్స్యకారులు సహకరించాలి. అంతరించే స్థితిలో ఉన్న ఆలివ్‌రిడ్లే తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గుడ్లను సంరక్షించే బాధ్యత అటవీ శాఖ తీసుకుంటుంది. గత ఏడాది సుమారు లక్షా యాభై వేల పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టాం. ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు.

– నాగరాజు, జిల్లా అటవీ శాఖాధికారి

గుడ్లను సంరక్షించడం ఆనందం



గత కొన్నేళ్లుగా అటవీ శాఖాధికారుల సౌజన్యంతో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్లు సేకరించి, వాటిని పిల్లలుగా తయారు చేసి సముద్రంలోకి విడిచి పెట్టడం ఆనందంగా ఉంది. జిల్లాలో మత్స్యకారులు సహాయ సహకారాలు అందించడంతో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుంది.

– కె.సోమేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్

ఐపీ పెట్టిన ధాన్యం వ్యాపారి!

రైతులకు రూ.2 కోట్ల పైచిలుకు టోపీ

నరసరావుపేట టౌన్: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ఓ వ్యాపారి రాత్రికి రాత్రే కోట్ల రూపాయలకు ఐపీ పెట్టిన వైనం పల్నాడు జిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు పాతూరులో స్థిరపడ్డాడు. మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో దుకాణం అద్దెకు తీసుకుని గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకంగా ధాన్యం, మొక్కజొన్న వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి వాటిని విక్రయించి ఆ తరువాత డబ్బులు ఇస్తుండేవాడు. ఈ క్రమంలోనే గత నాలుగు నెలలుగా రైతుల వద్ద నుంచి ధాన్యం, మొక్కజొన్న లారీలకు లోడ్‌లు ఎత్తుకున్నాడు. నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదు. ఈ మధ్య కాలంలో రైతులు అతని దుకాణం వద్దకు వచ్చి డబ్బుల కోసం నిలదీశారు. దీంతో 20 రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన శ్రీనివాసరావు ఐపీ నోటీసులు పంపించాడు. సుమారు 80 మంది రైతులకు రూ.2 కోట్ల పైచిలుకు బాకీ ఉన్నట్లు సమాచారం. ధాన్యం వ్యాపారి ఐపీ ఇటు రైతుల్లో, అటు వ్యాపార వర్గాల్లో కలవరపాటుకు గురిచేసింది.

అటల్ ల్యాబ్స్‌తో విద్యార్థులకు ఎంతో మేలు

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్)ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యాసంస్థలు, యునిసెఫ్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు చెప్పారు. ఢిల్లీలో బుధవారం జరిగిన అటల్ టింకరింగ్ ల్యాబ్ పోస్ట్ బడ్జెట్ వెబినార్‌లో ఆయన ప్యానల్ మెంబర్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ అమలు తీరును వివరించారు. పాఠశాల విద్యను నూతన సాంకేతికతలతో అనుసంధానించేందుకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు అటల్ ల్యాబ్స్ ఉపయోగపడతాయన్నారు. ఉన్నత విద్యామండలి ద్వారా 8–10 వారాల ఇంటర్న్‌షిప్, విద్యార్థులకు ల్యాబ్ ఉపకరణాలు, టెక్నాలజీ వినియోగంపై శిక్షణ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. అటల్ మెంటార్‌షిప్, బూట్ క్యాంప్‌లు, మేక్ ఏ థాన్, ఇన్నోవేషన్ చాలెంజ్‌లు నిర్వహించి పాఠశాల విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల దస్సాల్ట్ సిస్టమ్స్ నిర్వహించిన 'సీడ్ ది ఫ్యూచర్' ప్రాజెక్టుకి ఆంధ్రప్రదేశ్ నుంచి 5 ప్రాజెక్టులు జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. స్థానిక పారిశ్రామికవేత్తలు, చేతివృత్తుల వారు, చిన్నతరహా పరిశ్రమల ప్రతినిధులను పాఠశాలలకు ఆహ్వానిస్తే.. వారి సహకారంతో విద్యార్థులు ప్రామాణిక సమస్యలను గుర్తించి పరిష్కారాలను ఆవిష్కరించే అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ వెబినార్‌లో కేంద్ర విద్యాశాఖ, పాఠశాల విద్య–అక్షరాస్యత విభాగం కార్యదర్శి సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి సంస్థలు గ్యారెంటీ ఇవ్వాలి

- విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు స్థాపించాలంటే బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి
- సామర్థ్యంలో 50 శాతం కంటే ఎక్కువ మార్పు చేయాలంటే నోడల్ ఏజెన్సీ నుంచి ముందస్తు ఆమోదం పొందాలి
- ఇంటర్–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ నాలుగో సవరణ నిబంధనల్లో కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు స్థాపించాలంటే ఇకపై బ్యాంకు గ్యారెంటీలు తప్పనిసరని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) స్పష్టం చేసింది. ఇంటర్–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) నాలుగో సవరణ (కనెక్టివిటీ అండ్ జనరల్ నెట్‌వర్క్ యాక్సెస్ టు ది ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్) నిబంధనలు 2025ను సీఈఆర్సీ బుధవారం వెల్లడించింది. ప్రాజెక్టు నిర్మాణం కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, చెప్పిన సమయానికి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలని కమిషన్ ఆదేశించింది. ఒకసారి ప్రాజెక్టుకు అన్ని అనుమతులు ఇచ్చిన తరువాత, సామర్థ్యంలో 50 శాతం కంటే ఎక్కువ మార్పు చేయాలంటే అందుకు నోడల్ ఏజెన్సీ నుంచి ముందస్తు ఆమోదం పొందాలని తెలిపింది. పునరుత్పాదక (సౌర) విద్యుత్‌ను డిస్కంలు వినియోగించుకోవడంపైనా కమిషన్ పలు మార్గదర్శకాలను సూచించింది.

ఉపాధ్యాయుల బదిలీ సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: త్వరలో చేపట్టే ఉపాధ్యాయ బదిలీల్లో తలెత్తిన సమస్యలు పరిష్కరించిన అనంతరం ప్రక్రియ ప్రారంభించాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కేటగిరి–1లో 8 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి 2023లో జరిగిన బదిలీల్లో కేటగిరి–3 పాఠశాలకు బదిలీ అయిన వారంరోజుల్లోనే ప్రభుత్వ జీవో ద్వారా తిరిగి కేటగిరి–1కి వచ్చిన ఉపాధ్యాయులను కూడా ప్రస్తుత బదిలీల్లో చేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి, సుధీర్ డిమాండ్ చేశారు. భార్య చనిపోయిన ఒంటరి ఉపాధ్యాయుడికి పెళ్లిగాని పిల్లలుంటే ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద పాయింట్లు వర్తింపజేయాలని పేర్కొన్నారు. పాఠశాలల పునర్ నిర్మాణంలో హేతుబద్ధీకరణకు గురైన సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు పాయింట్లు ఇచ్చి బదిలీల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరారు. 40 మంది విద్యార్థులు దాటిన పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా గుర్తించాలని, కి.మీ పరిధి దాటిన స్కూళ్లల్లో 3–5 తరగతుల విలీనం నిలిపివేయాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,861 మంది స్వామివారిని దర్శించుకోగా 19,639 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.65 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటి నుంచి అన్న ప్రసాదంలో మసాలా వడలు

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తులకు అన్నప్రసాద కేంద్రంలో గురువారం నుంచి మసాలా వడలను భక్తులకు వడ్డించనున్నారు. గురువారం ఉదయం పదిన్నర గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన భవనంలో టీటీడీ చైర్మన్ ప్రారంభించనున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహ హోమం

మండపేట: కోనసీమ జిల్లా అర్తమూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనరసింహ హోమం నిర్వహించారు. గొలుగూరి శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కొండూరి వెంకటరమణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం జరిపారు. భక్తులకు లక్ష్మీ వస్త్రాలను పంపిణీ చేశారు.

శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొత్తపేట: కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఆలయ నిర్మాణ దాత పాతపాటి రమణరాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. స్వామి వారిని శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

పెద్దింట్లమ్మకు ప్రత్యేక పూజలు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర బుధవారానికి 5వ రోజుకు చేరుకుంది. అమ్మకు అర్చన, ధూపసేవ, బాలభోగం, ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యా సమాచారం

7 నుంచి డీడీఈ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఈ నెల 7వ తేదీ నుంచి ఎస్వీయూ డీడీఈ పీజీ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ ఊక రమేష్ బాబు పేర్కొన్నారు. ఎస్వీయూ దూర విద్య కేంద్రంలో బుధవారం నూతన డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ దూర విద్యా కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి పీజీ అడ్మిషన్లు ప్రారంభించామని నోటిఫికేషన్ గురువారం విడుదల చేస్తామన్నారు.

శ్రీలంక పర్యటనకు మహిళా వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకులు ఈ నెల 8వ తేదీ నుంచి రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించనున్నారు. స్టడీ ఇన్ ఇండియా ఎక్స్‌పో ఇన్ శ్రీలంక వారి ఆహ్వానం మేరకు కొలంబోలోని కింగ్స్‌బరి హోటల్‌లో నిర్వహించే ఎక్స్‌పో ప్రోగ్రామ్‌లో పాల్గొననున్నారు. బృందంలో రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డీన్ ఉష ఉన్నారు.

17 నుంచి దూరవిద్య పరీక్షలు?

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ నెల 17 నుంచి దూరవిద్య పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం వర్సిటీకి ఆదేశాల అందినట్టు సమాచారం. దీంతో అప్రమత్తమైన అధికారులు పరీక్షలు నిర్వహణకు సంబంధించి షెడ్యూల్డ్ రూపకల్పనపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు

తిరుపతి అర్బన్ : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాల మైదానంలో ఆటల పోటీలు చేపట్టనున్న నేపథ్యంలో మహిళా ఉద్యోగులకు కలెక్టర్ ప్రత్యేక సెలవు మంజూరు చేసినట్లు ఏపీ జేఏసీ తిరుపతి చైర్మన్ ఎస్. సురేష్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆటల పోటీల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు మాత్రమే ప్రత్యేక సెలవు వర్తిస్తుందని వెల్లడించారు.

ఎస్వీయూలో పీజీ సెట్ కార్యాలయం

తిరుపతి సిటీ: ఎస్వీయూనివర్సిటీలోని ప్రాచ్య పరిశోధన సంస్థలో బుధవారం ఏపీ పీజీ సెట్–2025 కేంద్ర కార్యాలయం ప్రారంభించారు. ఎస్వీయూకి పీజీ సెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదుగా కార్యాలయం ప్రారంభించారు.

- పచ్చని పంట పొలాల నడుమ కొలువై ఉన్న అంజనీ పుత్రుడు
- భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయుడు
- పరిటాలలో 150 అడుగుల ఎత్తయిన ఆంజనేయస్వామి విగ్రహం
- తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- ప్రతిరోజూ ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

అభయమిచ్చే వీర హనుమానుడు



ఆలయ ప్రాంగణంలో భక్తుల ఇలవేల్పుగా కొలిచే చిన్న ఆంజనేయస్వామి విగ్రహం



ఆసియా ఖండంలో అతి ఎత్తయిన ఆంజనేయ స్వామి విగ్రహం 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన కొలువై ఉంది. ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అంజనీపుత్రుడిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల 65వ నంబర్ జాతీయ రహదారి సమీపంలో పచ్చని పంట పొలాలు, ఆహ్లాదకరమైన ప్రకృతి నడుమ అభయాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తున్నాడు. స్వామి వారిని విశాలమైన ప్రాంగణంలో జాతీయ రహదారి పక్కన 2003వ సంవత్సరంలో ప్రతిష్ఠించారు. వర్షాకాల నేపథ్యంలో చుట్టూ పచ్చని పొలాల మధ్య అభయమిచ్చే వాయుపుత్రుని చూసేందుకు నిత్యం భక్తులు వచ్చి వెళ్లుతుంటారు.

జాతీయ రహదారి పక్కన పరిటాల సమీపంలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ధర్మకర్త బోడేపూడి వెంకటేశ్వరరావు 28 ఏప్రిల్ 2001లో శంకుస్థాపన చేశారు. నాలుగున్నర ఎకరాల్లో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంజినీ పుత్రుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. విగ్రహం ఏర్పాటు చేసే నాటికి 1.35 లక్షల సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది.



పరిటాల ఆంజనేయస్వామి ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ రామ పాద క్షేత్ర ఆలయం

అతి ఎత్తయిన విగ్రహం...

ఆసియా ఖండంలో అతి ఎత్తయిన ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం పరిటాల గ్రామ సమీపంలో పాదపీఠంతో కలుపుకుని 150 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అతిపెద్ద నగరమైన విజయవాడకు 28 కిలోమీటర్ల దూరంలో ఈ విగ్రహం వుంది. ప్రతి ఏటా నిత్యం ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడుతుండేది. ఆలయంలో ఒకపక్క స్వామి వారికి భక్తి పారవశ్యంతో భజన కీర్తనలు, మరో పక్క హనుమాన్ చాలీసా, ఇంకోపక్క అన్నసమారాధనతో ఆలయ ప్రాంగణం భక్తులతో విరాజిల్లుతుంటుంది.



హనుమాన్ జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి విశేష పూజలు చేస్తుంటారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్వరరావు భారీగా అన్న సమారాధన చేస్తుంటారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో బాలాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో రామాలయం, క్షేత్ర పాలకురాలయిన రేణుకాంబ అమ్మవారి ఆలయం కూడా ఉన్నాయి. ఆలయంలో నిత్యం హనుమాన్ చాలీసా మహన్యాస పూర్వక నీరాజన, అష్టోత్తర పూజలు జరుగుతుంటాయి. నిత్యం భక్తులచే ప్రత్యేక పూజలందుకుంటున్న అభయాంజనేయ స్వామిని ప్రజలు చూసి తరించాల్సిందే.

– శ్రీనివాస శర్మ, ప్రధాన అర్చకులు, పరిటాల

పర్యాటక కేంద్రంగా పరిటాల ఆలయం...

కంచికచర్ల మండలంలోని పరిటాల జాతీయ రహదారి పక్కన కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. అభయాంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేసేందుకు భక్తులు బస్సులు, కార్లు ఇతర వాహనాల ద్వారా వస్తుంటారు. తమిళనాడు, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుంటారు.

– బొక్కా ప్రభాకర్, సాక్షి, కంచకచర్ల (ఎన్టీఆర్ జిల్లా)



ఆ పరీక్షే నాకు ఆనందాన్నిస్తోంది

ప్రవచనాలు చెప్పడం మామూలు విషయం కాదు. ఎందుకంటే పాఠశాలలో లేదా కళాశాలలో ఏమీ తెలియని వారికి, చిన్న వాళ్లకీ పాఠాలు బోధించడం చాలా సులువు. కానీ అన్నీ తెలిసిన వారికి, పెద్దవారికి ప్రవచనాలు చెప్పడం అంటే కత్తిమీద సామే. అది మహిళా ప్రవచనకారులకు మరీ పరీక్ష. అయినా సరే, ఆ పరీక్షే తనకు ఆనందాన్నిస్తోందంటున్నారు దుర్భాకుల హేమ... అది ఆమె మాటల్లోనే...

అది 2000 సం. ఆగస్టు నెల. మొదటిసారిగా శ్రీశ్రీశ్రీ శృంగేరీ శారదా పీఠం నల్లకుంటలో శ్రీవిష్ణు సహస్రనామ వైభవాన్ని గురించి ప్రవచించే అదృష్టం కలిగింది! అది ఒక గొప్ప సదవకాశమే అయినా అంతరంతరాలలో ఏదో తెలియని భయం! అది ఒక దుస్సాహసం అవుతుందేమో! నేను చెప్పగలనా లేదా అన్న సంశయం!

నాకు లభించింది గొప్ప వేదిక. ఒకవైపు శారదాంబిక, మరొకవైపు పరమేశ్వరుడు, ఎదురుగా నేను చెప్పే అంశాన్ని జాగ్రత్తగా వినాలని తరలి వచ్చిన శ్రోతల సమూహం, అన్నిటి మధ్యా నేను నా ప్రవచనాన్ని కొనసాగించాను. ఎందరో విజ్ఞులు సర్వజ్ఞులు, అనుభవజ్ఞులు ఆ కార్యక్రమానికి వచ్చి నన్ను ఆశీర్వదించారు. అద్భుతమైనవి ఆ క్షణాలు. ఆ తరువాత ఆ క్రమంగా నాకు వివిధ ఆధ్యాత్మిక సంస్థలలో, దేవాలయ ప్రాంగణాలలో వివిధ భక్తి సంబంధమైన అంశాల మీద ప్రవచనం చెప్పే అదృష్టం కలిగింది.



ఇదందా అటు ఆంగ్ల విద్యలోనూ ఇటు వైదిక జ్ఞానంలోనూ గొప్ప పట్టు సాధించిన మా నాన్నగారు బ్ర. వే.. చెరుకుపల్లి కాశీనాథశాస్త్రి, అమ్మ బాలా త్రిపుర సుందరిల కృప వల్లే సాధ్యమైంది. మా నాన్నగారు విజ్ఞులు. కుమార్తెగా నాకు విద్యాభిక్ష పెట్టి నన్ను తీర్చిదిద్దిన సహృదయులు ! నేను తెలుగులో ఎం. ఫిల్, పీహెచ్‌డీ పట్టాలు పొందాను! హైదరాబాదు తార్నాక, జీయం, సంఘీ కాలేజీ ఆఫ్ కామర్సులో తెలుగు భాషా బోధనాధ్యాపకురాలిగా నా ఉద్యోగ పర్వం ప్రారంభం అయ్యింది! అలా 2009 వ సంవత్సరం వరకు విద్యా బోధనలోని ఆనందాన్ని ఆస్వాదించాను.

ఇక ఇల్లాలుగా నా ప్రయాణం కొంచం కఠినతరంగానే ఉండేది. మూడు పడవల మీది ప్రయాణం నాది. ఒకవైపు ఉద్యోగ బాధ్యత. మరొకవైపు ఇంటిని, ఇంటి యజమానిని, (మావారిని) పిల్లలను సక్రమంగా చూసుకోవలసిన బాధ్యత. మూడవది నేను ఇష్టంగా స్వీకరించిన ప్రవచనమార్గాన్ని విజయవంతం చేసే బాధ్యత. బహుశా ఆధ్యాత్మిక ప్రవచనా మార్గాన్ని ఎన్నుకుని ముందుకు సాగిపోతున్న మహిళా మూర్తుల స్థితి, పరిస్థితీ అంతేనేమో. మావారు నాకు పూర్తిగా సహకరించడం వల్ల చిన్నవాళ్ళయినా నా పిల్లలు నన్ను అర్థం చేసుకుని సర్దుకుపోవడం వల్ల నేనీ రంగంలో ముందుకు సాగగలిగాను.

విస్తృతంగా గ్రంథ పఠనం చేయడం, విషయ పరిజ్ఞానాన్ని

నా పూర్వజన్మ సుకృతం

ప్రతిసారీ ప్రవచనం చెప్పడం నాకొక గొప్ప పరీక్ష. ఆ పరీక్షే నాకు చాలా ఆనందాన్నిచ్చేది. విస్తృతంగా గ్రంథ పఠనం చేయడం, విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, ఆవళింపు చేసుకున్న విషయాన్ని సభాముఖంగా సుస్పష్టంగా వివరిస్తూ శ్రోతలకు ఆనందం కలిగించడం ప్రవచనకారిణిగా నా ప్రథమ కర్తవ్యంగా భావించాను. ఎంతోమంది ప్రఖ్యాత ప్రవచనకారుల ఉపన్యాస వైదుద్యాన్ని తెలుసుకోవడం కోసం వీలున్నప్పుడల్లా వారి ఉపన్యాసాలు వినేదాన్ని . ఇంకొక విషయం, నా పూర్వజన్మ సుకృతం వల్ల నాకు లభించిన ప్రవచన వేదికలన్నీ చాలా శక్తివంతమైనవి. ఎన్నో దేవాలయ ప్రాంగణాలు, ఎన్నో ధార్మిక సంస్థల వారి వేదికలు, మరెన్నో ప్రాచుర్యం వహించిన ఆధ్యాత్మిక స్థలాలు నాకు చేయూతనిచ్చాయి.

కాలం మారింది. నేడు ఎందరో యువతీయువకులు ఆధ్యాత్మిక రంగం పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారు. నా ప్రవచనం పూర్తయ్యాక నా దగ్గరకు వచ్చి " అమ్మా! మీరు చెబుతున్న విషయాలు బాగున్నాయి. ఇంకా కొత్త విషయాలు తెలుసుకోవాలంటే ఏ ఏ పుస్తకాలు చదవాలి ? ఏ ఏ గ్రంథాలయాలలో పుస్తకాలు కోసం వెదకాలి. అని అడుగుతుంటే మనసు సంతోషంతో ఉప్పొంగుతుంది. నాకు సాధ్యమైనంతవరకు వారికి తగిన మార్గాన్ని సూచిస్తుంటాను.

– డాక్టర్ దుర్భాకుల హేమ

పెంచుకోవడం, ఆకళింపు చేసుకున్న విషయాన్ని సభాముఖంగా సుస్పష్టంగా వివరిస్తూ శ్రోతలకు ఆనందం కలిగించడం ప్రవచనకారిణిగా నా ప్రథమ కర్తవ్యంగా భావించాను. ఎంతోమంది ప్రఖ్యాత ప్రవచనకారుల ఉపన్యాస వైవిధ్యాన్ని తెలుసుకోవడం కోసం వీలున్నప్పుడల్లా వారి ఉపన్యాసాలు వినేదాన్ని. ఇంకొక విషయం, నా పూర్వజన్మ సుకృతం వల్ల నాకు లభించిన ప్రవచన వేదికలన్నీ చాలా శక్తిమంతమైనవి. ఎన్నో దేవాలయ ప్రాంగణాలు, ఎన్నో ధార్మిక సంస్థల వారి వేదికలు, మరెన్నో ప్రాచుర్యం వహించిన ఆధ్యాత్మిక స్థలాలు నాకు చేయూతనిచ్చాయి.

● ఇస్లాం వెలుగు

గృహ సామ్రాజ్యానికి మహారాణి

ఒక ఉత్తమ సమాజ స్థాపనకు వెన్నెముక కుటుంబం కనుక పురుషుడు బయటి సామ్రాజ్యానికి అధిపతి అయితే స్త్రీని ఆ గృహ సామ్రాజ్యానికి మహారాణిగా చేసింది ఇస్లాం. పిల్లల ఆలన భర్త పాలన చేస్తూ, ఎలాంటి ఆర్థిక బాధ్యతలు లేకుండా స్త్రీని మినహాయించింది. ఏ విషయంలోనూ ఆడపిల్లను తక్కువగా చూడరాదని, మగపిల్ల వాడిని అధికుడిగా చూడరాదనీ, ఇద్దరిపట్ల సమానమైన ప్రేమను చూపించాలనీ, భ్రూణ హత్యలను నిషేధిస్తూ ఆడపిల్లను అన్యాయంగా హతమార్చితే కఠిన శిక్షకు గురవుతారని హెచ్చరించింది. తల్లి పాదాల చెంత స్వర్గం ఉందని ప్రకటించి స్త్రీ జాతి ఔన్నత్యాన్ని పతాక స్థాయికి చేర్చిన ఘనత ఇస్లాం ధర్మానికే దక్కుతుంది.

1400 సంవత్సరాలకు పూర్వమే స్త్రీలకు ఓటు హక్కును కల్పించి, తన తండ్రి, భర్త, పిల్లల ఆస్తిలో వాటాను కల్పిస్తూ, ఆమె కు ఆస్తిహక్కును ప్రకటించింది. వివాహ విషయంలో తనకిష్టమైన వరుడిని ఎంపిక చేసుకునే విషయమై ఆమె సమ్మతి తీసుకోవాలనీ, దుర్మార్గుడైన భర్త నుండి 'ఖులా' అనే ప్రక్రియ ద్వారా విడిపోయి తనకు తానుగా జీవించే హక్కును కలిగి ఉండడమే కాక పునర్వివాహం చేసుకునే హక్కునూ ప్రసాదించింది. కనుకనే తన కన్నా వయసులో 15 ఏళ్ల పెద్దదైన హజరత్ ఖదీజా అనే వితంతువును పాతికేళ్ల నిండు యవ్వనంలో వివాహమాడి స్త్రీ జాతి కీర్తిని సమున్నత స్థాయికి చేర్చారు ప్రవక్త ముహమ్మద్ (సం). స్త్రీ సహ ధర్మచారిణి అంటూ మీరు తిన్నదే ఆమెకు తినిపించండని సమాజానికి హితవు పలికారు.

విద్యనభ్యసించడం స్త్రీ పురుషుల విధి అని విద్యనభ్యసించడాన్ని ప్రోత్సహించడమే కాక, సమాజానికి స్ఫూర్తిదాయకమైన స్త్రీ మూర్తులను అందించింది ఇస్లాం. ఇస్లామీయ చరిత్ర లో హజరత్ ఆయిషా (ర) ప్రముఖ విద్వాంసురాలిగా, హజరత్ షిఫా (ర) ప్రముఖ గైనకాలజిస్టు గా, హజరత్ ఖదీజా(ర)అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారవేత్తగా సమాజానికి అమూల్యమైన సేవలందించారు. ప్రముఖ మేధావి ఫాతిమా అల్ ఫహ్రీ మురాకోలో స్థాపించిన 'అల్ ఖరావీన్' యూనివర్సిటీ ప్రపంచంలోనే అతి పురాతన విశ్వవిద్యాలయంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ లో నమోదయ్యింది. హదీసు విద్యావేత్తలలో మహిళా ఉపాధ్యాయులుగా పేరుగాంచి ఇస్లామీయ చరిత్రకు వన్నెతెచ్చిన వనితలు కోకొల్లలు. మహిళలు తమ కార్య పరిధిలో ఉంటూనే మౌలికమైన బాధ్యతలతో పాటు సమాజంతో చక్కటి బాంధవ్యాన్ని ఏర్పరచుకోగలరనే స్ఫూర్తినిచ్చింది ఇస్లాం ధర్మం..

– బతూల్ హుమైర్వీ (మహిళా దినోత్సవం సందర్భంగా)

● నిర్మల వాణి

శివతత్త్వాన్ని పొందాలంటే...

మన హృదయంలో ఉండేది శ్రీ మహాదేవుని ప్రతిబింబం. ఇది శ్రీ శివుని నివాసం. ఇది అన్నింటినీ మించినది. మన మనస్సుకు, ఆలోచనలకు అన్నింటికీ అతీతమైనది. ఈ శివ తత్త్వాన్ని పొందాలంటే, ముందుగా మనం శ్రద్ధ వహించి మన హృదయం ఎంత స్వచ్ఛంగా ఉందో మన లోపలికి మనం చూసుకోవాలి.

మన హృదయం లోపల, మనం చాలా మురికిని పెంచుకుంటాము.



ఉదాహరణకు, మనం ఎవరినైనా చూసి అసూయపడతాం. ఎవరో మనకు చెడు చేసినట్టు అసూయ పడుతుంటాము. వారు మనకు నిజంగా హాని చేసినా కూడా, ఇబ్బంది కలిగించినా కూడా వారి పట్ల అసూయపడి ప్రయోజనం లేదు. మన హృదయం శుభ్రంగా ఉంటే, మన హృదయమనే అద్దంలో గల సర్వ శక్తిమంతుడైన భగవంతుని ప్రతిబింబం స్పష్టంగా ఉంటుంది. కానీ మనం మన లోపల అసూయను కలిగి ఉంటే, అప్పుడు ఆ అద్దం శుభ్రంగా ఉండదు. అందులో భగవంతుని ప్రతిబింబం కూడా పరిపూర్ణంగా ఉండదు. ఎవరితోనైనా శత్రుత్వం కలిగి ఉండటం, ఎవరి పట్లనైనా హృదయంలో కోపం లేదా చెడు భావాలను కలిగి ఉండటం చాలా తప్పు. దాని వలన శ్రీ శివతత్త్వాన్ని కలిగి ఉండలేము. అందుకే మనం అందరినీ ప్రేమించడం, క్షమించడం చాలా ముఖ్యం.

మనం రోజూ శివునికి పూజలు, అభిషేకాదులు చేస్తూ మన లోపల గల అరిషడ్వర్గాలను విడిచి పెట్టలేక పోతే శ్రీ శివ తత్త్వాన్ని పొందలేం. శ్రీ శివ తత్త్వాన్ని పొందాలంటే మన హృదయం నిర్మలంగా ఉండాలి. ఎటువంటి అలజడులు లేని స్వచ్ఛమైన నీటిని కలిగి ఉన్న సరస్సు మాత్రమే ఆకాశంలో ఉన్న సూర్యుని చక్కగా ప్రతిబింబించ గలుగుతుంది. అదే విధంగా మన హృదయం కూడా ఎటువంటి ఆలోచనలు లేని నిర్విచార స్థితిలో, ఇతరుల పట్ల ఏ విధమైన ద్వేషం, కోపం లేకుండా ఉన్నప్పుడు మాత్రమే భగవంతుని నిజమైన స్వరూపాన్ని ప్రతిబింబించ గలుగుతాము. అనగా శ్రీ శివ తత్త్వాన్ని పొందగలుగుతాం.

శ్రీ శివుని సచ్చిదానంద స్వరూపుడు అని వర్ణిస్తారు. అనగా సత్ + చిత్ + ఆనంద స్వరూపుడు. సత్యము, చిత్తము మరియు ఆనందమును స్వరూపముగా కలిగిన వాడు శ్రీ శివుడు. ఏ విషయం గురించైనా సత్యము ఏమిటి అనేది మనకు సహస్రారములో ఉండే శ్రీ సదాశివుని పాదాల వద్దనే తెలుస్తుంది. మన చిత్తం ఆత్మ ప్రకాశంతో నిండినప్పుడే మనకు ఆత్మ సాక్షాత్కారం లభిస్తుంది. నిరంతరం నిర్మలమైన ఆనందంతో ఉండే వ్యక్తే భగవంతుని పరిపూర్ణంగా ప్రతిబింబించ గలుగుతాడు. ఈ సచ్చిదానంద స్వరూపమయిన శ్రీ శివ తత్త్వాన్ని పొందగలిగిన వారి జన్మ ధన్యం.



● పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి

మన లోపల ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలు మన హృదయంలో ఉండే శ్రీ శివుని ప్రకాశానికి అడ్డు పొరలుగా ఏర్పడతాయి. మనం సహజ యోగంలో కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందినప్పుడు ఈ ఆత్మ ఉనికిని మన చేతి వేళ్ళపై అనుభూతి చెందడం ప్రారంభిస్తాం. అప్పుడు ఆత్మ పరిశీలన ద్వారా ఈ అరిషడ్వర్గాలను క్రమంగా తొలగించుకొన్నప్పుడు, పరిపూర్ణంగా ఆత్మ స్వరూపులమయ్యి భగవంతుని ప్రతిబింబాన్ని స్పష్టంగా మన హృదయంలో ప్రతిబింబించ గలుగుతాం. అటువంటి వ్యక్తులలో దైవికమైన సుగుణాలన్నీ స్పష్టంగా ప్రస్ఫుటమవుతూ ఉంటాయి. అటువంటి వ్యక్తులు నిత్య నిరామయమైన శ్రీ శివ తత్త్వాన్ని పొంది, సదా శివసాన్నిధ్యంలో ఉంటారు.


– డా. పి. రాకేష్ (పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● సువార్త

పై నుండి సహాయం

'గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను' – యోహాను 10:10. ఇక్కడ నిశ్చయముగా చెప్పుట అనే దాన్ని గూర్చి చాలా నిశితంగా గమనిస్తూ మనస్సు పెట్టి లోతుగా ఆలోచన చేయాలి.

ఒక గొఱ్ఱెల కాపరికి నూరు గొఱ్ఱెలు ఉన్నాయి. అందులో ఒకటి తప్పిపోయింది. మిగతా తొంభై తొమ్మిది గొఱ్ఱెలను దొడ్డిలో విడిచిపెట్టిన ఆ కాపరి తప్పిపోయిన ఆ ఒక్క గొఱ్ఱెపై తన దృష్టి నంతా పెట్టి అంతటా శ్రద్ధతో వెదుకుతాడు. తన సమయాన్ని అంతా దాని కొరకై వెచ్చించి దాని విషయమై తన ప్రాణాలు పెట్టేంతగా శ్రమించి చివరకు దాన్ని కనుగొంటాడు. ఎంతో సంతోషంతో దానిని వెంటనే తన భుజములపై వేసికొని ఇంటికి తీసుకొని వస్తాడు. 'మీరు నాతో కూడా సంతోషించండి. తప్పిపోయిన నా గొఱ్ఱె దొరికింది' అంటూ తన స్నేహితులు, ఇరుగు పొరుగు వారి మధ్య గొప్ప పండుగ వాతావరణం సృష్టిస్తాడు. (లూకా 15:3–7, యోహాను 10:11–16,కీర్తన 100:3).



ఈ ఉపమానం క్రీస్తే బోధించినా ఈ ఉపమానంలోని కాపరి పాత్ర క్రీస్తునే చాటుతుంది. ఇక్కడ గొఱ్ఱెలు అనగా దేవుని ప్రజలు అనే సర్వ మానవాళి. క్రీస్తును మించిన గొఱ్ఱెల కాపరి మరొకడు లేడు. గొఱ్ఱెలను కాయుటలో మోషే, దావీదులను మించిన వాడు క్రీస్తు. ఇశ్రాయేలు ఇంటివారై నశించిన గొఱ్ఱెల వద్దకే గాని మరి ఎవరి వద్దకు నేను పంపబడలేదు అంటూ క్రీస్తు అన్యురాలైన కనాను స్త్రీతో చెప్పినా కూడా ఇది క్రీస్తు మరణానికి ముందు చెప్పబడిన మాట (మత్త 15 :21–28, యోహాను 11:49–52).

ప్రేమను బట్టి ఒక గొప్ప లక్ష్యం గల తన ఘోర మరణంతో క్రీస్తు అన్య జనాంగాన్ని ఆకట్టుకున్నాడు. పరిశుద్ధ పరచి వారికి దేవునితో సహవాస బాంధవ్యం ఏర్పరచడమే ఆయన ఏకైక లక్ష్యం. యేసు చెప్పిన తప్పిపోయిన కుమారుడు అను ఉపమానంలో ఇందులోని అన్నదమ్ములు యూదులకు, అన్యజనులకు ప్రతినిధులుగా పోలికగా ఉన్నారు. ఈ కథలో తప్పిపోయింది చిన్న కుమారుడు అనుకుంటే విచిత్రంగా పెద్ద కుమారుడు అనే యూదులు తప్పిపోయారని తెలుసుకొని యేసు బోధకు ఆశ్చర్యపోతాము. గొఱ్ఱె వలె తప్పిపోయి నశించిపోతున్న అన్యజనుల పట్ల క్రీస్తు కుమ్మరించిన ఆయనదైన ప్రత్యేక వైవిధ్యభరిత సాహసోపేత ప్రేమను మించిన ప్రేమ ఎక్కడా కానరాదు.

పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈ లోకమునకు వచ్చెనను నది నమ్మదగినది. ' ఆయన ఆ జన సమూహములను చూచి, వారు కాపరి లేని గొఱ్ఱెల వలె విసికి చెదరి యున్నందున వారి మీద కనికరపడ్డాడు' అంటూ గ్రంథం చెబుతుంది (మత్త 9:36). గొఱ్ఱెల గొప్ప కాపరి, మంచి కాపరి, ప్రధాన కాపరియైన క్రీస్తు గూర్చి ఎంత చెప్పుకోన్ననూ అది తక్కువే. మిమ్మును మనుష్యులను పట్టే జాలరులుగా చేస్తాను అని పేతురుతో చెప్పిన యేసు తన మరణానంతరం అదే పేతురుతో నా గొఱ్ఱెలను మేపుము కాయుము అంటూ అజ్ఞాపిస్తూ పరమునకు వెళ్ళిపోయాడు. ఆనాడు నమ్మకమైన అపొస్తలులకు యేసు తన గొఱ్ఱెలను అప్పగించడం విశేషం. పరలోక దేవుని అపొస్తలుడైన క్రీస్తు బోధలను తప్పిస్తూ మనుష్యుల కట్టడలు, ఉపదేశాలు సంఘాలలో రోజు రోజుకు ఎక్కువవుతున్నాయి. దేవుని నిత్య రాజ్య ప్రవేశం సమృద్ధిగా కలుగుట విషయమై లోతుగా ఆలోచన చేస్తే, ఆత్మ సంబంధ సహజాహారంగా చెప్పబడే అపొస్తలుల బోధ అనే పచ్చని సేంద్రియ పచ్చిక వైపు భక్త జన గొఱ్ఱెలను నడిపిస్తూ పోషిస్తూ సేదతీర్చే మంచి మాదిరి గల నాయకులు నేటి సంఘాలకు తక్షణావసరం.

తండ్రియైన అద్వితీయ సత్య దేవుడు ఆత్మ స్వరూపి. ఆయన వల్ల కాని పని నేరుగా రంగంలోకి దిగి ప్రత్యక్షంగా ప్రేమించడం. ఆయన సొంత కుమారునిగా ఆయన తరపు ప్రత్యేక అధికారిగా క్రీస్తు రాక నాడు అనివార్యమైంది. అదే నశించిన దానిని వెదకి రక్షించే కార్యక్రమం (లూకా 19 :10). దేవుని రక్షణ కార్యంలో మనస్సు పెట్టి సాహసోపేతంగా ప్రతిభావంతంగా పాల్గొన్న కారణంగా యేసు జీవితం సంపూర్ణం అయ్యింది. ప్రమాదాలకు ఎదురువెళ్ళే, ఎదురీదే తెగువ గల ఈ సాహసోపేత జీవితమే అనేకులకు మార్గదర్శకంగా నిలిచి ఎందరినో చరిత్రకెక్కించి అలరించింది. ఇంకనూ, నేడు ఎందరెందరి జీవితాలనో ప్రభావితం చేస్తూ ఉంది కూడానూ.

– జేతమ్

బిజినెస్ రీల్

'జెమ్' సీఈవోగా అజయ్ భదూ



న్యూఢిల్లీ: వాణిజ్యయ శాఖ అదనపు సెక్రటరీగా ఉన్న అజయ్ భదూని ప్రభుత్వ కొనుగోళ్ల ప్లాట్‌ఫామ్ (గవర్నమెంట్ ఈ–మార్కెట్/జెమ్) సీఈవోగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రస్తుత బాధ్యతలకు అదనంగా కొత్త బాధ్యతలు చేపడతారని తెలిపింది. జెమ్ పోర్టల్‌ను ప్రభుత్వం 2016 ఆగస్ట్ 9న ప్రారంభించడం గమనార్హం. అన్ని కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు తమకు కావాల్సిన వస్తువుల కొనుగోళ్లకు వీలుగా దీన్ని అభివృద్ధి చేసింది. 1999 గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన భదూ వివిధ రంగాల్లో విధానాల రూపకల్పన, అమలులో కీలక పాత్ర పోషించారు.

ఆర్‌బీఐ ఈడీగా అజిత్ రత్నాకర్



ముంబై: గణాంకాలు, సమాచార నిర్వహణ, ఆర్థిక సుస్థిరత శాఖలో ప్రధాన సలహాదారుగా సేవలందిస్తున్న అజిత్ రత్నాకర్ జోషి ఇకపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ శాఖతో పాటు సైబర్ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన జోషీకి ఆర్‌బీఐ తాజాగా పదవోన్నతి కల్పించింది. జోషి హైదరాబాద్‌లోని బ్యాంకింగ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీ సభ్యులుగా సైతం పనిచేశారు.అంతేకాకుండా స్థూల ఆర్థిక గణాంకాలు, విధాన సవాళ్లకు సంబంధించిన సంకలనాలపై ఏర్పాటైన వర్కింగ్ గ్రూప్‌లు, కమిటీలలోనూ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించారు. నాగ్‌పూర్ యూనివర్సిటీ నుంచి స్టాటిస్టిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఐఐటీ మద్రాస్ నుంచి మానిటరీ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు.

మార్కెట్లోకి వివో టీ4ఎక్స్ 5జీ స్మార్ట్‌ఫోన్



న్యూఢిల్లీ: హ్యాండ్‌సెట్స్ దిగ్గజం వివో తాజాగా టీ4 సిరీస్‌లో తొలి స్మార్ట్‌ఫోన్ – టీ4ఎక్స్ 5జీని ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 13,999 నుంచి రూ. 16,999 వరకు ఉంటుంది. మార్చ్ 12 నుంచి ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఈ–స్టోర్, ఇతర రిటైల్ స్టోర్స్‌లో లభిస్తుందని కంపెనీ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్‌ల కస్టమర్లు రూ. 1,000 డిస్కౌంట్ పొందవచ్చని పేర్కొంది. ఇందులో 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫన్‌టచ్ ఓఎస్ 15, మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రాసెసర్, 50 ఎంపీ ఏఐ కెమెరా, మిలిటరీ గ్రేడ్ ప్రమాణాలు మొదలైన ప్రత్యేకతలు ఉన్నట్లు కంపెనీ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

6-3-2025

విశాఖ	435-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	430-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,112.45	5.15
TATASTEE	145.68	4.55
ADANIENT	2,242.00	4.53
POWERGRID	264.80	4.25

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJFINANCE	8,297.00	-3.37
INDUSINDBK	973.00	-1.48
HDFCBANK	1,692.10	-1.05
SHRIRAMFIN	632.00	-0.14

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,210
ఎన్ఎస్ఈ	96,043
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,67,314
ఎఫ్ఐఐ	- 2,895
డీఐఐ	+ 3,370

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.73	$ 68.26
బ్రెంట్	68.91	$ 71.04

నాన్‌స్టాప్ గోల్డ్ ర్యాలీ

- ఈ ఏడాది 12 శాతం పెరుగుదల
- గతేడాది 27 శాతం లాభం
- ట్రంప్ టారిఫ్‌లు, ద్రవ్యోల్బణ భయాలు
- ఇన్వెస్టర్ల నుంచి బలమైన డిమాండ్
- సెంట్రల్ బ్యాంక్‌లు జోరుగా షాపింగ్



న్యూఢిల్లీ: బంగారం మురిపిస్తోంది. సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి సామాన్య ఇన్వెస్టర్ల వరకు అందరికీ పసిడిపై పెట్టుబడి కనక వర్షం కురిపిస్తోంది. 2024లో 27 శాతం రాబడితో ఇతర అన్ని సాధనాల కంటే మెరుగైన స్థానంలో నిలిచిన బంగారం.. ఈ ఏడాదీ తన జోరును కొనసాగిస్తోంది. రెండు నెలల్లోనే 12 శాతం ర్యాలీ చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 2,900 డాలర్లను దాటిపోయింది. దేశీయంగా 10 గ్రాముల ధర రూ.89,000 మార్క్‌పైకి చేరుకుంది. జనవరి 1న రూ.79,000 స్థాయిలో ఉంది. అక్కడి నుంచి చూస్తే రూపాయి మారకంలోనూ 13 శాతం పెరిగింది. ఈ ఏడాది తొలి రెండు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా రాబడుల్లో బంగారమే ముందుంది. టారిఫ్‌ల విషయంలో ఏ దేశాన్ని విడిచి పెట్టేది లేదంటూ అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనలు, వాణిజ్య యుద్ధంతో ద్రవ్యోల్బణం పెరిగిపోతుందన్న భయాలు, సెంట్రల్ బ్యాంకుల రెండు చేతులా కొనుగోళ్లు.. వెరసి బంగారం ధరలు ఇప్పట్లో శాంతించేలా కనిపించడం లేదు.

ఎన్నో అంశాలు..

ఎక్కడైనా ధరలను నిర్ణయించేది డిమాండ్–సరఫరా అన్న విషయం తెలిసిందే. బంగారం ఉత్పత్తి గడిచిన కొన్నేళ్లలో ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉంది. కానీ, అదే సమయంలో డిమాండ్ మాత్రం అనూహ్యంగా పెరిగింది. ఆభరణాలు, పెట్టుబడులు, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల రూపంలో పసిడికి బలమైన డిమాండ్ కొనసాగుతోంది. 2024లో ప్రపంచవ్యాప్త డిమాండ్‌లో 50 శాతం ఆభరణాల రూపంలోనే ఉంది. టెక్నాలజీ, పారిశ్రామిక రంగం వినియోగం 5 శాతంగా ఉంది. 25 శాతం పెట్టుబడుల రూపంలో, మరో 20 శాతం సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్ల రూపంలో డిమాండ్ నెలకొంది. కొన్ని సందర్భాల్లో ఆభరణాల డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పెట్టుబడులకు డిమాండ్ పెరుగుతుంది. ఆభరణాల డిమాండ్‌లో చైనా, భారత్ బలమైన పాత్ర పోషిస్తున్నాయి.

ఎందుకంత డిమాండ్?

కాలం గడిచేకొద్దీ బంగారం విలువ పెరిగేదే కానీ (స్టోర్ ఆఫ్ వ్యాల్యూ) తరిగేది కాదు. ద్రవ్యోల్బణ ప్రభావానికి మించి దీర్ఘకాలంలో తన విలువను పెంచుకుంటుందని చరిత్ర చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంక్‌లు తమ విదేశీ మారకం ఆస్తుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారానికి ప్రాతినిధ్యాన్ని పెంచడం ఇందు వల్లే. 20 ఏళ్ల క్రితం ఔన్స్ బంగారంతో కొనుగోలు చేసుకోతగిన వస్తువులను.. నేడు కూడా ఔన్స్ బంగారంతో కొనుగోలు చేసుకోవచ్చు. కరెన్సీ విషయంలో అది అసాధ్యం. ద్రవ్యోల్బణం కారణంగా కాలక్రమంలో కరెన్సీ విలువ తగ్గుతుంటుంది. దీనికి విరుద్ధంగా పసిడి విలువ పెరుగుతుంది. అందుకే దీన్ని హెడ్జింగ్ సాధనంగా, ఆర్థిక అనిశ్చితుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగా పరిగణిస్తుంటారు. 2001 సెప్టెంబర్ 11 ఉగ్రదాడి, 2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం, 2020 కరోనా విపత్తు సమయాల్లో ఇన్వెస్టర్లు స్టాక్స్, ఇతర సాధనాల కంటే బంగారంలో పెట్టుబడులకే మొగ్గు చూపించారు. కానీ, ఇలాంటి అనిశ్చితుల్లో బంగారం ధరలు తాత్కాలికంగా ర్యాలీ చేసి, పరిస్థితులు కుదుటపడుతున్నాయన్న సంకేతాలు కనిపించగానే మళ్లీ చల్లబడుతుంటాయి.

ఈ విడత పరిస్థితులు భిన్నం..

కానీ, కరోనా విపత్తు తర్వాత నుంచి చూస్తే.. పసిడి ధరలు పెద్దగా పడిపోకుండా స్వల్ప విరామంతో ర్యాలీ చేస్తుండడాన్ని గమనించొచ్చు. కరోనా సమసిపోయిందనుకుంటున్న తరుణంలో.. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగడం పరిస్థితులను మార్చేసింది. రష్యా చర్యను వ్యతిరేకిస్తూ విదేశాల్లో రష్యాకు ఉన్న ఫారీన్ గవర్నమెంట్ బాండ్ హోల్డింగ్స్‌ను పాశ్చాత్య దేశాలు స్తంభింపజేశాయి. అంటే రష్యా సెంట్రల్ బ్యాంక్ విదేశీ మారకం ఆస్తుల్లో ఈ మేరకు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది భారత్, చైనా సహా పలు సెంట్రల్ బ్యాంక్‌లకు కనువిప్పు కలిగించింది. దీంతో బంగారం నిల్వలను పెద్ద ఎత్తున పెంచుకోవడం మొదలుపెట్టాయి. ఫలితంగా 2022లో 1,082 టన్నుల బంగారాన్ని సెంట్రల్ బ్యాంక్‌లు కొనుగోలు చేశాయి. అంతటితో ఆగలేదు. 2023లోనూ మరో 1,051 టన్నులు, 2024లో 1,041 టన్నుల చొప్పున బంగారాన్ని సెంట్రల్ బ్యాంక్‌లు అదనంగా సమకూర్చుకున్నాయి. యూఎస్ డాలర్లకు ఇంతకాలం అధిక ప్రాధాన్యం ఇచ్చిన సెంట్రల్ బ్యాంక్‌లు, ప్రస్తుతం బంగారానికి ఎక్కువ మొగ్గు చూపిస్తున్నాయి. ఇంతకుముందుతో పోల్చితే కరెన్సీ విలువల్లో ఆటుపోట్లు పెరిగాయి. కరెన్సీ అస్థిరతలకు హెడ్జింగ్‌గా బంగారాన్ని పరిగణిస్తుంటారు. ఈ పరిణామాలన్నీ సెంట్రల్ బ్యాంకులు బంగారానికి వెయిటేజీ పెంచడానికి దారితీసినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

కొత్త గరిష్టానికి చేరువలో పసిడి

- 10 గ్రాములపై రూ.300 పెరుగుదల
- రూ.89,300మార్క్‌కు చేరిక

న్యూఢిల్లీ: బంగారం ధరలు వరుసగా మూడో రోజూ బలపడ్డాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూలతలు కొనుగోళ్లకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.300 ఎగసి రూ.89,300కు చేరుకుంది. ఫిబ్రవరి 20న రూ.89,450 జీవిత కాల గరిష్టం సమీపానికి చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.300 గ్రాములు పెరిగి రూ.88,900కు చేరింది. వెండికి సైతం కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో కిలోకి రూ.1,000 పెరగడంతో రూ.99,000కు చేరుకుంది. ఎంసీఎక్స్ మార్కెట్లో ఏప్రిల్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్టు రూ.38 లాభపడి రూ.86,064గా ఉంది. ''బుధవారం సైతం బంగారం ధరల్లో అప్‌ట్రెండ్ కొనసాగింది. వరుసగా మూడో రోజూ ర్యాలీ చేసింది. యూఎస్ డాలర్ బలహీనపడడానికితోడు సురక్షిత సాధనంగా నెలకొన్న డిమాండ్ పసిడి ధరల పెరుగుదలకు మద్దతునిచ్చింది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 12 డాలర్లు పెరిగి 2,932 డాలర్లకు సమీపించింది. ''కెనడా, మెక్సికోలకు టారిఫ్ ఉపశమనం ఉండొచ్చంటూ యూఎస్ వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ సంకేతం ఇచ్చిన నేపథ్యంలో బంగారం ధరల్లో మరింత ర్యాలీ ఉండకపోవచ్చు. ఒకవేళ టారిఫ్‌లపై అంగీకారం కుదిరి, సుంకాల భారం తగ్గితే బంగారంలో అమ్మకాల ఒత్తిడి ఉండొచ్చు''అని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు.

ఇంజనీరింగ్ ఎగుమతుల జోరు

జనవరిలో 7 శాతం వృద్ధి

- యూఎస్‌కు 18 శాతం అధికం
- ఎగుమతుల ప్రోత్సాహక మండలి ప్రకటన



కోల్‌కతా: జనవరి నెలలో ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 7 శాతం పెరిగి 9.42 బిలియన్ డాలర్లుగా (రూ.82వేల కోట్లు) ఉన్నట్టు 'ఇంజనీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి' (ఈఈపీసీ) ప్రకటించింది. ముఖ్యంగా అమెరికాకు 18 శాతం అధికంగా 1.62 బిలియన్ డాలర్ల (రూ.14వేల కోట్లు) విలువైన ఇంజనీరింగ్ ఎగుమతులు జరిగినట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి మధ్య కాలంలో మొత్తం ఇంజనీరింగ్ ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 10 శాతం ఎగసి 97 బిలియన్ డాలర్లకు (రూ.8.43 లక్షల కోట్లు) చేరినట్టు ఈఈపీసీ వెల్లడించింది. ఈ కాలంలో యూఎస్‌కు ఇంజనీరింగ్ ఎగుమతులు 9 శాతం పెరిగి 15.60 బిలియన్ డాలర్లుగా (రూ.1.37 లక్షల కోట్లు) ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా యూఏఈకి ఎగుమతుల్లో పటిష్ట వృద్ధి నమోదైంది. జనవరిలో 56 శాతం పెరిగి 610 మిలియన్ డాలర్లకు చేరగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జనవరి మధ్యకాలంలో చూసినా 45 శాతం ఎగసి 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఈఈపీసీ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జర్మనీ, మెక్సికో, టర్కీ, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, జపాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు జనవరి నెలలో ఇంజనీరింగ్ ఎగుమతులు పెరిగాయి. అదే సమయంలో యూకే, సౌదీ అరేబియా, మలేషియా, చైనా, ఇటలీ, స్పెయిన్‌లకు తగ్గాయి. జనవరి నెలకు దేశ మొత్తం వస్తు ఎగుమతుల్లో ఇంజనీరింగ్ ఉత్పత్తుల వాటా 25.86 శాతంగా ఉంది.

సవాళ్ల మధ్య రాణించిన ఎగుమతులు..

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకుతోడు వాణిజ్య రక్షణాత్మక ధోరణులు కొనసాగుతున్న తరుణంలోనూ దేశ ఇంజనీరింగ్ రంగం ఎగుమతుల పరంగా బలమైన వృద్ధిని చూపించినట్టు ఈఈపీసీ పేర్కొంది. అయితే, అంతర్జాతీయ వాణిజ్య విధానాల్లో వస్తున్న మార్పులు దేశ వ్యాపార సంస్థలపై అసాధారణ స్థాయిలో ఒత్తిళ్లను పెంచే ప్రమాదం లేకపోలేదని ఈఈపీసీ ఇండియా చైర్మన్ పంకజ్ చద్దా పేర్కొన్నారు. కార్మిక శాఖ పరిధిలో పనిచేసే ఈఈపీసీ ఇండియా.. ఎగుమతులను సులభతరం చేయడంతోపాటు, ఎంఎస్ఎంఈలు ప్రమాణాలను పెంచుకోవడానికి, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో అనుసంధానం కావడానికి సేవలు అందిస్తుంటుంది. యూఎస్ తాజా టారిఫ్‌లు రానున్న రోజుల్లో ఎగుమతిదారులు ఎదుర్కోనున్న సవాళ్లను తెలియజేస్తున్నట్టు ఈఈపీసీ చైర్మన్ చద్దా పేర్కొన్నారు. ఎగుమతిదారులు పోటీతత్వాన్ని కొనసాగించేందుకు రుణ సాయం, టెక్నాలజీ పరంగా ప్రభుత్వం నుంచి మద్దతు కొనసాగాల్సి ఉందన్నారు.

ఈ ఏడాదే వోల్వో చిన్న ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈఎక్స్30

- దేశీ మార్కెట్లోకి ఏటా ఒక ఎలక్ట్రిక్ కారు ఎంట్రీ
- కంపెనీ ఎండీ జ్యోతి మల్హోత్రా



న్యూఢిల్లీ: స్వీడిష్ లగ్జరీ కార్ల దిగ్గజం వోల్వో తమ చిన్న ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈఎక్స్30ని ఈ ఏడాదే భారత మార్కెట్లో ప్రవేశపెట్టే యోచనలో ఉంది. దేశీయంగా ఏటా ఒక ఎలక్ట్రిక్ కారును ప్రవేశపెట్టాలనే వ్యూహానికి అనుగుణంగా దీన్ని తీసుకురానున్నట్లు సంస్థ ఎండీ జ్యోతి మల్హోత్రా తెలిపారు. మిగతా కార్లలాగానే ఈ వాహనాన్ని బెంగళూరు ప్లాంటులో అసెంబుల్ చేసి విక్రయించాలని భావిస్తున్నామని, ప్రస్తుతం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఓ కొత్త సెగ్మెంట్ సృష్టించడం ద్వారా ఇది దేశీయంగా ఈవీల వినియోగం మరింతగా పెరిగేందుకు ఉపయోగపడగలదని మల్హోత్రా చెప్పారు. గతేడాది తాము భారత్‌లో విక్రయించిన ప్రతి నాలుగు కార్లలో ఒకటి ఎలక్ట్రిక్‌దని ఆయన వివరించారు. ఈ విభాగంలో ఎక్స్‌సీ40, సీ40 అని తమకు రెండే కార్లు ఉన్నప్పటికీ వీటి అమ్మకాలు తమ మొత్తం కార్ల విక్రయాల్లో దాదాపు పాతిక శాతానికి చేరినట్లు మల్హోత్రా చెప్పారు. ప్రస్తుతం మాస్ మార్కెట్ విభాగంలో ఎలక్ట్రిక్ కార్ల వినియోగం రెండు శాతంగానే ఉన్నప్పటికీ లగ్జరీ సెగ్మెంట్లో 6–7 శాతంగా ఉన్నట్లు వివరించారు. 2030 నాటికి అంతర్జాతీయంగా 90–100 శాతం ఆదాయాలను ఎలక్ట్రిక్ కార్ల నుంచే ఆర్జించాలనే లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు.



ముంబై బీకేసీలో టెస్లా తొలి షోరూమ్

ముంబై: ఎలక్ట్రిక్ కార్ల యూఎస్ దిగ్గజం టెస్లా దేశీయంగా తొలి షోరూమ్‌ను ముంబైలో ఏర్పాటు చేయనుంది. ఇందుకు వీలుగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్(బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్పేస్‌ను లీజుకి తీసుకుంది. సీఆర్ఈ మ్యాట్రిక్స్ వివరాల ప్రకారం పార్కింగ్ సౌకర్యాలుగల షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ. 35 లక్షల అద్దె చెల్లించనున్నారు. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనిమ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ. 2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా టెస్లా జమ చేసింది.

లక్ష మంది పిల్లలకు ఎన్‌పీఎస్ వాత్సల్య



న్యూఢిల్లీ: ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని లక్ష మంది పిల్లల పేరిట తెరిచినట్టు పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి మండలి (పీఎఫ్ఆర్‌డీఏ) వెల్లడించింది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దేశంలో పింఛను సదుపాయం ఉన్నవారు తక్కువగా ఉండడంతో ఈ పథకాన్ని మరింత మందికి చేరువ చేసేందుకు ఎన్నో చర్యలను అమలు చేస్తున్నట్టు పీఎఫ్ఆర్‌డీఏ చైర్‌పర్సన్ దీపక్ మహంతి తెలిపారు. ''అప్పుడే పుట్టిన శిశువులు సైతం ఎన్‌పీఎస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఆర్థిక మంత్రి గత సెప్టెంబర్‌లో ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి లక్ష మందికి పైగా శిశువులు ఎంపిక చేసుకున్నందుకు సంతోషంగా ఉంది''అని చెప్పారు. ఎన్‌పీఎస్ వాత్సల్యలో 18 ఏళ్లు నిండని వారంతా చేరొచ్చు. పీఎఫ్ఆర్‌డీఏ నిర్వహించే అన్ని పింఛను పథకాల కింద (ఎన్‌పీఎస్, ఏపీఎస్) 7 కోట్ల మంది చందాదారులు ఉన్నట్టు మహంతి తెలిపారు.

కార్మిక శక్తిలో 70 శాతం మహిళలే

- 2047 నాటికి వికసిత్ భారత్ సాధిస్తాం
- కేంద్ర కార్మిక శాఖ సెక్రటరీ సుమిత



న్యూఢిల్లీ: 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి సుమితా దావ్రా ప్రకటించారు. అప్పటికి శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని 70 శాతానికి పెంచనున్నట్టు చెప్పారు. సేవల రంగంలో మహిళల ప్రాతినిధ్యంపై సీఐఐ నిర్వహించిన సదస్సులో భాగంగా ఆమె మాట్లాడారు. కొన్ని రంగాల్లో మహిళలు మరింత పెద్ద ఎత్తున పాలుపంచుకునేందుకు గొప్ప అవకాశాలున్నట్టు చెప్పారు. జాతీయ విద్యా విధానం కింద మహిళల విద్యార్హతల పెంపుపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. మహిళల ఆధ్వర్యంలోని స్టార్టప్‌లు, సంస్థలకు వెంచర్ క్యాపిటల్ మద్దతుకు పిలుపునిచ్చారు. ''మహిళా వ్యాపారవేత్తలకు వెంచర్ క్యాపిటల్ మద్దతు ఎంతో కీలకం. వారు నాయకులుగా మారేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు మార్గదర్శకం అవసరం''అని సుమిత దావ్రా పేర్కొన్నారు.

వివక్ష ..

శ్రామికశక్తిలో మరింత మంది మహిళలు భాగస్వాములు కాకుండా వివక్ష వారిని అడ్డుకుంటున్నట్టు సుమితా దావ్రా పేర్కొన్నారు. వేతనం, నాయకత్వ బాధ్యతల్లో, ఉద్యోగ భద్రతలో అసమానతలు ఉన్నట్టు చెప్పారు. అయితే గడిచిన ఆరేళ్లలో ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల పాత్ర పెరిగినట్టు చెప్పారు. అలాగే, విద్యావంతులైన మహిళలు ఉద్యోగాల్లో చేరడంలో, స్థిరమైన ఆర్జనలోనూ పురోగతి ఉన్నట్టు వివరించారు. ''టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాలతోపాటు తయారీలోనూ మహిళలు రాణిస్తుండడాన్ని చూస్తున్నాం. మహిళలకు సంబంధించి వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యూపీఆర్) గత ఆరేళ్లలో రెట్టింపైనట్టు డేటా తెలియజేస్తోంది''అని సుమితా దావ్రా చెప్పారు.

హిందుస్థాన్ జింక్‌లో 30 శాతం మహిళలే

2030 నాటికి తమ కంపెనీ ఉద్యోగుల్లో 30 శాతం మహిళలే ఉండాలన్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఉన్నట్టు వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్ (హెచ్‌జెడ్ఎల్) ప్రకటించింది. ప్రస్తుతం హిందుస్థాన్ జింక్ ఉద్యోగుల్లో మహిళలు 25% ఉన్నారు.

భారీగా పుంజుకున్న సేవల రంగం

- ఫిబ్రవరిలో 59కి పీఎంఐ
- దేశ, విదేశీ క్లయింట్ల నుంచి ఆర్డర్లు
- గణనీయంగా పెరిగిన ఉపాధి కల్పన
- హెచ్ఎస్‌బీసీ పీఎంఐ గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: దేశ, విదేశీ డిమాండ్ మద్దతుతో సేవల రంగం ఫిబ్రవరి నెలలో బలమైన పనితీరు చూపించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల రంగం పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ జనవరి నెలలో 26 నెలల కనిష్ట స్థాయి 56.5 శాతానికి పడిపోగా.. ఫిబ్రవరిలో తిరిగి 59 శాతానికి పుంజుకుంది. ప్రస్తుత వ్యాపారానికి తోడు కొత్త ఆర్డర్ల రాకతో సేవల రంగం కార్యకలాపాలు విస్తరణకు నోచుకున్నాయి. ఈ మేరకు ఉపాధి కల్పనను తాజా గణాంకాలు తెలియజేస్తున్నాయి. సాధారణంగా ఈ సూచీ 50 శాతానికి పైన ఉంటే సేవల రంగం విస్తరణగాను, ఆ లోపు ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. అంతర్జాతీయ డిమాండ్ ఆరు నెలల్లో అత్యధిక వేగంతో వృద్ధి చెందినట్టు, ఇది సేవల రంగం మెరుగైన పనితీరు చూపించేందుకు దారితీసినట్టు హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రాంజుల్ భండారీ తెలిపారు. ఆఫ్రికా, ఆసియా, యూరప్, అమెరికా, మధ్యప్రాచ్యం క్లయింట్ల నుంచి మెరుగైన డిమాండ్ నెలకొందని హెచ్ఎస్‌బీసీ పీఎంఐ సర్వే తెలిపింది. కొత్త ఆర్డర్ల రాకతో, సామర్థ్య ఒత్తిళ్లను అధిగమించేందుకు భారత సేవల కంపెనీలు నియామకాలపై దృష్టి సారించినట్టు పేర్కొంది.

రానున్న రోజుల్లోనూ బలంగా ఉండొచ్చు..

ఈ ఏడాదికి మిగిలిన కాలంలోనూ సేవల రంగం పనితీరు సానుకూలంగా ఉండొచ్చని భండారీ అభిప్రాయం వ్యక్తం చేశారు. మెరుగైన కస్టమర్ సంబంధాలు, బలమైన డిమాండ్ పరిస్థితులు ఈ ఏడాది మిగిలిన కాలానికి అంచనాలను పెంచుతున్నట్టు చెప్పారు. మూడింట రెండొంతుల సంస్థలు ఈ ఏడాదికి వృద్ధిపై అంచనాలతో ఉంటే, కేవలం 2 శాతంలోపు నిరాశావహ అంచనాలతో ఉన్నాయి. మరోవైపు హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ 57.7 నుంచి ఫిబ్రవరిలో 58.8 శాతానికి విస్తరించింది. తయారీ, సేవల పీఎంఐ సూచీల సగటును కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ సూచిస్తుంది. తయారీ, సేవల రంగాల్లో జనవరి నెలతో పోల్చిచూస్తే ఫిబ్రవరిలో ఉద్యోగులు పెరిగారు. గతేడాది అక్టోబర్ నుంచి చూస్తే ధరల ఒత్తిళ్లు తక్కువగా నమోదయ్యాయి. ఎస్అండ్‌పీ గ్లోబల్ సుమారు 400 సేవల రంగ కంపెనీల అభిప్రాయాలను సమీకరించి.. హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల రంగ పీఎంఐ గణాంకాలను విడుదల చేస్తుంటుంది.

శరత్ శకం ముగిసే!



- కెరీర్‌కు వీడ్కోలు పలకనున్న భారత టేబుల్ టెన్నిస్ దిగ్గజం
- చెన్నై డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీయే చివరిది

కామన్వెల్త్ గేమ్స్‌లో 7 పసిడి పతకాలు... మరో 3 రజతాలు, 3 కాంస్యాలు...
ఆసియా క్రీడల్లో 2 కాంస్య పతకాలు..ఆసియా చాంపియన్‌షిప్‌లో 4 కాంస్యాలు...
ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 30వ స్థానం...
10 సార్లు జాతీయ సీనియర్ చాంపియన్‌గా ఘనత...
ఐదుసార్లు ఒలింపిక్స్ క్రీడల్లో దేశానికి ప్రాతినిధ్యం...
అర్జున, ఖేల్‌రత్నతో పాటు పద్మశ్రీ పురస్కారం కైవసం...
2024 పారిస్ ఒలింపిక్స్‌లో త్రివర్ణ పతాకధారిగా
భారత బృందానికి నాయకత్వం వహించడం...

ఒక క్రీడాకారుడి కెరీర్‌లో ఇంతకుమించి ఏం కావాలి! భారత టేబుల్ టెన్నిస్ (టీటీ)కు వన్నెతెచ్చిన ఆచంట శరత్ కమల్ ఇవన్నీ సాకారం చేసుకున్నాడు. రెండు దశాబ్దాలుగా భారత టీటీ ముఖచిత్రంగా ఉన్న శరత్ కమల్ ఆట ముగించాలని నిర్ణయం తీసుకున్నాడు. స్వస్థలం చెన్నైలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ టోర్నీలో చివరిసారి బరిలోకి దిగుతానని శరత్ బుధవారం ప్రకటించాడు. 22 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో లెక్కకు మిక్కిలి పతకాలు నెగ్గిన శరత్ ఘనతలను ఒకసారి గుర్తుచేసుకుంటే...

సాక్షి క్రీడావిభాగం

భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజం ఆచంట శరత్ కమల్ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. మార్చి 25 నుంచి 30 వరకు చెన్నై వేదికగా జరగనున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీ అనంతరం ఆట నుంచి రిటైర్మెంట్ తీసుకోనున్నట్లు వెల్లడించాడు. రెండు దశాబ్దాలకు పైగా దేశ అత్యుత్తమ ప్యాడ్లర్‌గా కొనసాగిన 42 ఏళ్ల శరత్ కమల్... కామన్వెల్త్ క్రీడల్లో 7 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. ఆసియా క్రీడల్లోనూ అదరగొట్టిన శరత్ కమల్... 2018 జకార్తా గేమ్స్‌లో పురుషుల టీమ్ విభాగంతో పాటు... మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఆసియా చాంపియన్‌షిప్‌లో 4 కాంస్య పతకాలు సాధించిన శరత్ కమల్... ఐదుసార్లు ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. విశ్వక్రీడల్లో శరత్ పతకం సాధించనప్పటికీ అతడి ఘనతలను పతకాలతో కొలవలేం. సుదీర్ఘ కాలంగా అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ... కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ 30వ ర్యాంక్‌కు చేరుకున్న శరత్ కమల్... దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న'తో పాటు నాలుగో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' కూడా దక్కించుకున్నాడు. శరత్ స్ఫూర్తితోనే టేబుల్ టెన్నిస్ వైపు అడుగులు వేసిన మనిక బత్రా, ఆకుల శ్రీజ అంతర్జాతీయ స్థాయిలో చక్కటి ప్రదర్శనతో దూసుకెళ్తున్నారు. 'ఆట నుంచి పూర్తిగా తప్పుకుంటానని చెప్పడం లేదు కానీ, ఇకపై పెద్ద టోర్నీలు, జనసమూహాల ముందు జరిగే మ్యాచ్‌ల్లో ఆడను. నా రాకెట్‌కు కొంత విశ్రాంతి ఇవ్వాలనుకుంటున్నా. టేబుల్ టెన్నిస్ నాకు ఇచ్చిన ఆనందం, అభిమానం వెలకట్టలేనిది. దాన్ని మాటల్లో వర్ణించలేను' అని శరత్ పేర్కొన్నాడు. '1998లో చెన్నై వేదికగానే ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌తో నా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభమైంది. 2025లో చెన్నై వేదికగానే డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీ ద్వారా నా కెరీర్‌ను ముగించాలని నిర్ణయం తీసుకున్నాను. నా ఆఖరి ఆట తిలకించేందుకు నా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, చిన్ననాటి స్నేహితులు, శ్రేయోభిలాషులు వస్తారు. అత్యుత్తమ ఆటతీరుతో సగర్వంగా కెరీర్‌కు ముగింపు పలకాలని భావిస్తున్నాను' అని శరత్ కమల్ వివరించాడు.



2024 పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో...



జాతీయ చాంపియన్‌షిప్ ట్రోఫీతో...

- సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో 10 సార్లు విజేతగా నిలిచిన శరత్ కమల్... అంతకుముందు కమలేశ్ మెహతా నెలకొల్పిన రికార్డును (8 సార్లు) బద్దలు కొట్టాడు. 'గత 20 ఏళ్లలో ఆటలో ఎన్నో మార్పులు సంభవించాయి. అప్పట్లో ఇలాంటి కొత్త తరహా షాట్లు ఏమీ లేవు. కానీ ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని మెరుగు పర్చుకుంటూ కొత్త ఒరవడి సృష్టించుకుంటూ వెళ్లడంతోనే శరత్ ఇంత సుదీర్ఘ కాలం రాణించగలిగాడు' అని కమలేశ్ పేర్కొన్నాడు.
- 2015 ప్రపంచ చాంపియన్‌షిప్ సమయంలో గాయపడిన శరత్ తిరిగి కోలుకుంటాడని ఎవరూ ఊహించి ఉండరు. కండరాల సమస్య నుంచి పూర్తిగా కోలుకున్న శరత్... ఆ తర్వాత కెరీర్‌లో ఎన్నో అద్వితీయ విజయాలు సాధించాడు.
- టేబుల్ టెన్నిస్‌లో చైనా, జపాన్, దక్షిణ కొరియా ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో చైనీయులను ఓడించగలమని నిరూపించిన తొలి భారత ప్లేయర్‌గా శరత్ నిలిచాడు.
- 2018 ఆసియా క్రీడల్లో చెన్నైకే చెందిన సత్యన్‌తో కలిసి శరత్... జపాన్ ద్వయంపై విజయం సాధించి కాంస్యం గెలుచుకోవడం ఎప్పటికీ మరిచిపోలేనిది.
- జకార్తా వేదికగా జరిగిన ఆ క్రీడల్లో మనిక బత్రాతో కలిసి శరత్ మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ కాంస్యం నెగ్గాడు. అప్పటి వరకు ఏమాత్రం అంచనాలు లేకుండానే బరిలోకి దిగిన శరత్ జంట... ఆ తర్వాత విజృంభించింది.
- 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో నాలుగు పదులు వయసు దాటిన తర్వాత కూడా శరత్ చెలరేగిపోయాడు. ఫిట్‌నెస్ రక్షించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించి పోటీల్లో దిగిన శరత్ కమల్... మూడు స్వర్ణాలతో అదరగొట్టాడు. తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజతో కలిసి శరత్ కమల్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు.
- పెద్ద టోర్నమెంట్‌లో బరిలోకి దిగే ముందు బాగా ప్రాక్టీస్ చేసి కొత్త షాట్లను తన అమ్ములపొదిలో చేర్చుకోవడం శరత్‌కు అలవాటు. ఈ వయసులో ఇవన్నీ ఎలా సాధ్యం అనే ప్రశ్నకు చిరునవ్వే కమల్ సమాధానం.
- అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) అథ్లెట్స్ కమిషన్‌కు ఎంపికైన తొలి భారత అథ్లెట్‌గా శరత్ ఘనత సాధించాడు.
- ప్రస్తుతం భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లో సభ్యుడిగా ఉన్న శరత్ కమల్... అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లోనూ చోటు దక్కించుకోవాలని భావిస్తున్నాడు.
- ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ తమిళనాడు (ఎస్‌డీఏటీ) సహకారంతో మెలకొట్టాయుర్‌లోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శరత్ సొంతంగా హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌ను నెలకొల్పనున్నాడు.



కుటుంబసభ్యులతో కలిసి 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో తాను నెగ్గిన పతకాలు చూపిస్తూ...



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'ఖేల్ రత్న' పురస్కారం అందుకుంటూ...

నాలుగో ర్యాంక్‌లో విరాట్ కోహ్లి

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటుతున్న భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో 84 పరుగులు చేసి టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన విరాట్... ఒక స్థానం మెరుగు పర్చుకున్నాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో కోహ్లి 747 రేటింగ్ పాయింట్లతో నాలుగో ర్యాంక్‌కు చేరాడు. భారత యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (791 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... బాబర్ ఆజమ్ (770 పాయింట్లు; పాకిస్తాన్), క్లాసెన్ (760 పాయింట్లు; దక్షిణాఫ్రికా) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ (745 పాయింట్లు) ఒక స్థానం కోల్పోయి ఐదో ర్యాంక్‌కు చేరాడు. భారత్ నుంచి శ్రేయస్ అయ్యర్ (8వ ర్యాంక్) కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ షమీ మూడు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరగా... ఆల్‌రౌండర్ల విభాగంలో అక్షర్ పటేల్ ఏకంగా 17 స్థానాలు మెరుగు పరుచుకొని 13వ 'ప్లేస్'లో నిలిచాడు.



హిమాన్షు ఓటమి



ముంబై: క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) స్నూకర్ క్లాసిక్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ హిమాన్షు జైన్ పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన రౌండ్ 32 మ్యాచ్‌లో హిమాన్షు 1-4 ఫ్రేమ్‌ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్, భారత దిగ్గజం పంకజ్ అద్వానీ చేతిలో ఓడిపోయాడు. తొలి ఫ్రేమ్‌ను 77-43 పాయింట్లతో తేడాతో నెగ్గిన హిమాన్షు ఆ తర్వాత వరుసగా నాలుగు ఫ్రేమ్‌లను కోల్పోయాడు. పంకజ్ అద్వానీ 72-56, 80-33, 64-51, 80-6తో హిమాన్షుపై గెలిచి ముందంజ వేశాడు. కర్ణాటకకు చెందిన పంకజ్ అద్వానీ ఈ టోర్నీలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ) తరఫున పోటీ పడుతున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో ఆదిత్య మెహతా (పీఎస్‌పీబీ) 4-3 (42-77, 53-86, 57-41, 60-49, 87-10, 24-68, 115-8) ఫ్రేమ్‌ల తేడాతో యోగేశ్ కుమార్ (కర్ణాటక)పై; ఇష్‌ప్రీత్ సింగ్ చద్దా 4-1 (81-9, 84-1, 115-4, 44-95, 84-25) ఫ్రేమ్‌ల తేడాతో ఈ.పాండురంగయ్య (రైల్వేస్)పై విజయం సాధించారు.

రుత్విక-రోహన్ జోడీ శుభారంభం

పారిస్: ఓర్లియాన్స్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 20-22, 24-22, 21-16తో యె హాంగ్ వె-నికోల్ గొంజాలెజ్ చాన్ (చైనీస్ తైపీ) జోడీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి గేమ్ కోల్పోయిన రుత్విక-రోహన్ రెండో గేమ్‌లో రెండుసార్లు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని గట్టెక్కారు. నిర్ణాయక మూడో గేమ్‌లో ఆరంభంలోనే 5-1తో ఆధిక్యంలోకి వెళ్లిన రుత్విక-రోహన్ చివరివరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకున్నారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రణయ్

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ఆయుశ్ షెట్టి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్, సతీశ్ కుమార్ కరుణాకరన్ తొలి రౌండ్‌లో ఓడిపోయారు. శ్రీకాంత్ 21-19, 21-14తో కూ తకహాషి (జపాన్)పై, ప్రణయ్ 21-11, 20-22, 21-9తో జు వె వాంగ్ (చైనీస్ తైపీ)పై, ఆయుశ్ 21-17, 21-9తో ప్రపంచ మాజీ చాంపియన్ కీ యె లో (సింగపూర్)పై గెలిచారు. కిరణ్ జార్జి 21-15, 16-21, 10-21తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్) చేతిలో, ప్రియాన్షు 17-21, 7-21తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత ప్లేయర్లు ఉన్నతి హుడా 9-21, 15-21తో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) చేతిలో... ఇషారాణి బారువా 13-21, 13-21తో అసుక తకహాషి (జపాన్) చేతిలో ఓడిపోయారు.



న్యూఢిల్లీలో చెస్ వరల్డ్‌కప్!

న్యూఢిల్లీ: రెండు దశాబ్దాల అనంతరం భారతదేశంలో జరగనున్న చెస్ ప్రపంచకప్‌నకు న్యూఢిల్లీ ఆతిథ్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వేదిక అంశంపై 'ఫిడే', అఖిల భారత చెస్ సమాఖ్య సంయుక్తంగా ప్రకటన విడుదల చేయనున్నాయి. 2002లో చివరిసారిగా భారత్ వేదికగా జరిగిన చెస్ ప్రపంచకప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించగా... విశ్వనాథన్ ఆనంద్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచాడు. మళ్లీ 23 ఏళ్ల తర్వాత భారత్‌లో ప్రపంచకప్ పోటీలు జరగనున్నాయి. సుమారు 200 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొననున్న ఈ టోర్నీ... ప్రపంచ చాంపియన్‌షిప్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌గానూ ఉండనుంది. 2000లో న్యూఢిల్లీ వేదికగా వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఆ టోర్నీలో సెమీఫైనల్ వరకు మ్యాచ్‌లను భారత్‌లో నిర్వహించగా... టెహ్రాన్‌లో జరిగిన ఫైనల్లో గెలిచిన ఆనంద్ ప్రపంచ చాంపియన్ హోదా దక్కించుకున్న తొలి ఆసియా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచాడు. భారత్‌లో చివరగా 2022లో చెన్నై వేదికగా చెస్ ఒలింపియాడ్ జరిగింది.





లారెల్ హబ్బర్డ్

ట్రాన్స్‌జెండర్లపై ఐఓసీ ఓ నిర్ణయానికి రావాలి

ఐఓసీ ఉపాధ్యక్షుడు సమరాంచ్ అభిప్రాయం

బెర్లిన్: లింగమార్పిడి చేసుకున్న క్రీడాకారుల్ని విశ్వక్రీడల్లో అనుమతించే విషయమై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని ఐఓసీ ఉపాధ్యక్షుడు యువాన్ ఆంటోని సమరాంచ్ సూచించారు. 'ఈ విషయంలో యావత్ ప్రపంచం ఐఓసీ నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. మహిళా అథ్లెట్లు నష్టపోకుండా అంతర్జాతీయ క్రీడా సమాఖ్యలకు దిక్సూచిలా వ్యవహరించే నిర్ణయాన్ని ఐఓసీ తీసుకోవాలి. దీనిపై తాత్సారం చేయకుండా శాస్త్రీయమైన కారణాలను పరిశీలించి వెంటనే ఓ నిర్ణయానికి రావాలి' అని 65 ఏళ్ల సమరాంచ్ పేర్కొన్నారు. లింగమార్పిడితో అమ్మాయిలుగా మారిన ట్రాన్స్‌జెండర్లతో నిజమైన మహిళా అథ్లెట్ల ప్రయోజనాలకు నష్టం కలుగకుండా ఐఓసీ నిర్ణయం ఉండాలన్నారు. గతేడాది రెండోసారి అమెరికా అధ్యక్ష పీఠానికి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్లను అనుమతించబోమనే ప్రెసిడెన్షియల్ రూల్ కూడా ఉంది. ఇప్పటికే అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో స్కూల్, కాలేజ్, యూనివర్సిటీ క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లను మహిళల కేటగిరీలో పోటీపడకుండా నిక్కచ్చిగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ఎందుకంటే 2028లో లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో ట్రంప్ ఆదేశాలు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో సమరాంచ్ కూడా ఐఓసీ ఉన్నతస్థాయి మండలి తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. స్పెయిన్‌కు చెందిన ఈ సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఉన్నారు. పదవీకాలం ముగిసిన ప్రస్తుత అధ్యక్షుడు థామస్ బాచ్ వారసుడి ఎన్నిక కోసం మొత్తం ఏడుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఈ నెల 20న ఐఓసీ ఎన్నికలు జరుగనున్నాయి. సమరాంచ్‌తో పాటు ప్రపంచ అథ్లెటిక్స్ చీఫ్ సెబాస్టియన్ కో, పలు ఒలింపిక్స్‌లలో స్విమ్మింగ్ చాంపియన్ క్రిస్టీ కొవెంట్రీ, అంతర్జాతీయ సైక్లింగ్ చీఫ్ డేవిడ్ లాపర్టియెంట్, జోర్డాన్ చక్రవర్తి ఫైజల్ అల్ హుస్సేన్, ప్రపంచ జిమ్నాస్టిక్స్ హెడ్ మోరినరి వతనబె, కొత్తగా ఐఓసీలోకి వచ్చిన మల్టీ మిలియనీర్ జోహన్ ఎలియస్చ్ (ప్రపంచ స్కీయింగ్ చీఫ్)లు ఐఓసీ అధ్యక్ష పీఠంపై కన్నేశారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో లింగమార్పిడి చేసుకున్న న్యూజిలాండ్ వెయిట్‌లిఫ్టర్ లారెల్ హబర్డ్ మహిళల ప్లస్ 87 కేజీ విభాగంలో పోటీ పడింది. అయితే ఆమె చివరిదైన 14వ స్థానంతో సరిపెట్టుకుంది. ఈ క్రమంలో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ తొలి ట్రాన్స్‌జెండర్ అథ్లెట్‌గా ఆమె గుర్తింపు పొందింది.



సమరాంచ్

ట్రంప్ ఎత్తుకు అరబ్ దేశాల పైఎత్తు

గాజా పునర్నిర్మాణానికి 53 బిలియన్ డాలర్ల ప్రణాళిక

అరబ్ దేశాధినేతల ఆమోదం • హమాస్ మద్దతు

కైరో: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గాజా స్వాధీనం ప్రతిపాదనకు అరబ్ దేశాలు చెక్ పెట్టాయి. 'మిడిల్ ఈస్ట్ రివేరా' విజన్‌కు భిన్నంగా గాజా పునర్నిర్మాణ ప్రణాళికను విడుదల చేశాయి. 53 బిలియన్ డాలర్ల వ్యయంతో రూపొందించిన ఈ ప్రతిపాదనను అరబ్‌నాయకులు ఆమోదించారు. యుద్ధానంతర ప్రణాళికను ఈజిప్టు ప్రతిపాదించింది, దీని ప్రకారం పాలస్తీనా అథారిటీ (పీఏ) పరిపాలన కింద గాజా పునర్నిర్మాణం జరుగుతుంది. గాజాను అమెరికా అధీన ప్రాంతంగా మార్చేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికకు ఇది కౌంటర్. ట్రంప్ గాజా స్వాధీన ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి మద్దతు తెలిపిన మరుసటి రోజే కైరోలో అరబ్ లీగ్ సదస్సు జరిగింది. ముగింపు సమావేశంలో ఈ గాజా పునర్నిర్మాణం కోసం 'సమగ్ర అరబ్ ప్రణాళిక'ను ఆయా దేశాల నేతలు ప్రకటించారు. అంతేకాదు ఈ ప్రణాళికకు అంతర్జాతీయ మద్దతుకు పిలుపునిచ్చారు. భూభాగ పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చడానికి ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రాజెక్టు కోసం అన్ని దేశాలు, ఆర్థిక సంస్థల నుంచి సహకారాన్ని స్వీకరిస్తామని పేర్కొన్నారు.

112 పేజీల డాక్యుమెంట్

పాలస్తీనియన్ల తరలింపు, గాజాను అమెరికా పునర్నిర్మించాలన్న ట్రంప్ ఆకాంక్షకు ప్రత్యామ్నాయంగా ఈజిప్టు, జోర్డాన్, గల్ఫ్ అరబ్ దేశాలు దాదాపు నెల రోజులుగా సంప్రదింపులు జరుపుతున్నాయి. గాజా నుంచి పాలస్తీనియన్లను సామూహికంగా తరలించడాన్ని అరబ్ దేశాలు తిరస్కరించాయి. తామే ఆ బాధ్యతలు తీసుకున్నాయి. 'గాజా పునర్నిర్మాణ ప్రణాళిక' పేరుతో 112 పేజీల డాక్యుమెంట్‌ను రూపొందించాయి. గాజాను తిరిగి ఎలా అభివృద్ధి చేయనున్నారనే మ్యాప్‌లు, ఇల్లు, ఉద్యానవనాలు, కమ్యూనిటీ సెంటర్లకు సంబంధించిన ఏఐ జనరేటెడ్ చిత్రాలతో తయారు చేశారు. అలాగే వాణిజ్య నౌకాశ్రయం, టెక్నాలజీ హబ్, బీచ్ హోటళ్లు, విమానాశ్రయం కూడా ఉన్నాయి.

తోసిపుచ్చిన ఇజ్రాయెల్..

ఈజిప్టు ప్రణాళికను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. కాలం చెల్లిన దృక్పథాలతో ఉందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది. పీఏపై ఆధారపడటాన్ని తిరస్కరించింది. ప్రణాళిక హమాస్‌కు అధికారాలిచ్చేదిగా ఉందని ఆరోపించింది. హమాస్ సైనిక, పాలనా సామర్థ్యాలను నాశనం చేయడమే తమ లక్ష్యమని, ముందు హమాస్ సైనిక ఉపసంహరణకు అంగీకరించేలా చేయాలని డిమాండ్ చేసింది. అది తప్ప మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని వెల్లడించింది.

స్వాగతించిన హమాస్..

శిఖరాగ్ర సమావేశం ప్రణాళికను, సహాయక చర్యలు, పునర్నిర్మాణం, పాలనను పర్యవేక్షించడానికి తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు హమాస్ తెలిపింది. అంతేకాదు.. కమిటీలో తమ అభ్యర్థులను ఉంచబోమని ప్రకటించింది. అయితే పీఏ పర్యవేక్షణలో పనిచేసే కమిటీ విధులు, సభ్యులు, ఎజెండాకు తన సమ్మతిని తెలియజేయాల్సి ఉంటుంది. కమిటీలో ఉండబోయే వ్యక్తుల పేర్లను నిర్ణయించినట్లు ఈజిప్టు విదేశాంగ మంత్రి బదర్ అబ్దెలాటీ మంగళవారం రాత్రి తెలిపారు. పీఏకు నాయకత్వం వహిస్తున్న పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ మాట్లాడుతూ ఈజిప్టు ఆలోచనను తాను స్వాగతిస్తున్నానని, పాలస్తీనా నివాసితులను తరలించని ఇలాంటి ప్రణాళికకు మద్దతు ఇవ్వాలని ఆయన ట్రంప్‌ను కోరారు. పరిస్థితులు అనుకూలిస్తే అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఎన్నికల ప్రణాళికను సైతం హమాస్ స్వాగతించింది.

తిరస్కరించిన అమెరికా..

అరబ్ నాయకులు ఆమోదించిన గాజా పునర్నిర్మాణ ప్రణాళికను ట్రంప్ ప్రభుత్వం తిరస్కరించింది, ఈ భూభాగంలోని పాలస్తీనా నివాసితులను పునరావాసం కల్పించి, అమెరికా యాజమాన్యంలోని 'రివేరా'గా మార్చే తన పాత విజన్‌కే అమెరికా అధ్యక్షుడు కట్టుబడి ఉన్నారని తెలిపింది. గాజా ప్రస్తుతం నివాసయోగ్యంగా లేదని, శిథిలాలు, పేలని ఆయుధాలతో కప్పబడిన భూభాగంలో నివాసితులు జీవించలేరని జాతీయ భద్రతా మండలి ప్రతినిధి బ్రియాన్ హ్యూస్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సును తీసుకురావడానికి మరిన్ని చర్చల కోసం తాము ఎదురు చూస్తున్నామన్నారు.



ఈజిప్టు ప్రతిపాదించిన భవిష్యత్ గాజా ఊహాచిత్రాలు

రెండుసార్లు ఫెయిలైన వ్యక్తి ప్రధానమంత్రా?

దివంగత ప్రధాని రాజీవ్ గాంధీపై మణి శంకర్ అయ్యర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ మరోసారి ఆ పార్టీని ఇరుకునపెట్టారు. చదువులో ప్రతిభ చూపలేని వ్యక్తి ప్రధానమంత్రి స్థాయికి ఎలా ఎదిగారంటూ దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీని ఉద్దేశిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ పరీక్షల్లో రెండుసార్లు ఫెయిలయ్యారని చెప్పారు. 'నేను, రాజీవ్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కలిసి చదువుకున్నాం. ఫైనల్ పరీక్షల్లో ఆయన ఫెయిలయ్యారు. ఆ వర్సిటీ ప్రతి ఒక్క విద్యార్థి కనీసం పాసయ్యేందుకు కృషి చేస్తుంది. అయిన ప్పటికీ రాజీవ్ ఫెయిలయ్యారు. ఆ తర్వాత లండన్ ఇంపీరియల్ కాలేజీ లోనూ రాజీవ్ పాస్ కాలేకపోయారు. పరీక్షల్లో నెగ్గేందుకు ఎంతగా ప్రయత్నించినా ఆయన సక్సెస్ కాలేకపోయారు. రెండుసార్లు విఫలమై, పైలట్‌గా పనిచేసిన వ్యక్తి దేశ ప్రధానిగా ఎన్నికవడం ఎలా సాధ్యం? నేనసలు ఇది ఊహించలేదు' అని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అయ్యర్ వ్యాఖ్యానించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మణి శంకర్ అయ్యర్ ఒక విఫల నేత అని పేర్కొంది. అయ్యర్ వ్యాఖ్యలపై బీజేపీ స్పందిస్తూ 'కాంగ్రెస్ ముసుగును తొలగించనివ్వండి' అంటూ వ్యాఖ్యానించింది. కాగా, అయ్యర్ గతంలోనూ కాంగ్రెస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితం ఎదుగుదలకు, పతనానికి గాంధీల కుటుంబమే కారణమన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ పదేళ్లలో ఒక్కసారి కూడా తనతో సమావేశమయ్యేందుకు అవకాశమివ్వలేదని ఆరోపించారు.

త్వరలో జార్ఖండ్ శాసన సభాపక్ష నేత ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ: జార్ఖండ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠకు బీజేపీ అధిష్టానం త్వరలో తెరదించనుంది. బీజేఎల్పీ నేతను ఎంపిక బాధ్యతలను ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు ఇద్దరు నేతలకు అప్పగించింది. బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ, కె.లక్ష్మణ్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల మంత్రి భూపేంద్ర యాదవ్‌లను పరిశీలకులుగా నియమించింది. ఈ మేరకు బుధవారం జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటన విడుదల చేశారు. త్వరలో ఈ ఇద్దరు నేతలు జార్ఖండ్‌లో పర్యటించనున్నారు. శాసన సభాపక్ష నేత పేరును అధిష్టానానికి సూచించనున్నారు.

అంతరిక్షంలో ఉండటం కష్టం కాదు..

ఎప్పుడొస్తామో తెలియకపోవడమే అసలైన కష్టం

వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ మనసులోని మాట

వాషింగ్టన్: అంతరిక్షంలో ఉండటం కష్టం కాదు, కానీ ఎప్పుడు భూమి మీదకు చేరుకుంటామో నాసా అధికారులకు కూడా తెలియకపోవడమే అసలైన కష్టమని వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ అన్నారు. రాజకీయాలు జీవితంలో ఒక భాగమైనప్పటికీ... తను, విలియమ్స్ తిరిగి భూమిపైకి వెంటనే రాకపోవడానికి అవి కారణం కాదని విలియమ్స్ చెప్పారు. తన లాబ్రడార్ రిట్రీవర్స్‌తో తిరిగి ఆడుకోవడానికి వేచి చూస్తున్నానని తెలిపారు. స్పేస్ఎక్స్ క్యాప్సూల్స్‌లో మార్పు కారణంగా ఇప్పుడు మరో రెండు వారాలు అంతరిక్షంలో ఉండాల్సి వస్తోందని వెల్లడించారు. సహ వ్యోమగామి విల్‌మోర్‌తో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని 2030 చివరిలో కాకుండా ముందుగానే రిటైర్ చేయాలని మస్క్ ఇటీవల చేసిన సూచనను విలియమ్స్ తోసిపుచ్చారు. 'ఇప్పుడు కీలకమైన సమయంలో ఉన్నాం. ఐఎస్ఎస్ నిష్క్రమణకు ఇది సరైన సమయం కాదని నేను అనుకుంటున్నాను.' అని విలియమ్స్ అన్నారు. ఇక ఇన్నాళ్లు అంతరిక్ష కేంద్రంలో ఉండటం కొంత ఆందోళన కలిగించినా.. తాము తిరిగి భూమిమీదకు ఎప్పుడు చేరుకుంటామో నాసా అధికారులకు కూడా తెలియకపోవడమే అసలైన కష్టమని ఆమె వ్యాఖ్యానించారు.

గతేడాది జూన్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన విల్‌మోర్, విలియమ్స్ వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉంది. కానీ.. స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. గతేడాది క్రిస్మస్ వేడుకల ఫొటోలను విల్‌మోర్, విలియమ్స్ పంచుకోవడం, అందులో నీరసంగా కనిపించడంతో వారి ఆరోగ్యంపై ఆందోళనలు తలెత్తిన విషయం తెలిసిందే. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైతం ఆందోళన వ్యక్తంచేశారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వం వారిని వదిలేసిందని ఆయన ఆరోపించారు. అంతేకాదు.. తొందరగా తీసుకురావాలంటూ స్పేస్ఎక్స్ చీఫ్ మస్క్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మస్క్ వీలైనంత తొందరగా తీసుకొస్తానని తెలిపారు. అయితే మస్క్ నుంచి ఎలాంటి ఆఫర్ రాలేదని నాసా ఉన్నతాధికారులు చెప్పారని బిడెన్ హయాంలోని నాసా మాజీ డిప్యూటీ అడ్మినిస్ట్రేటర్ పామ్ మెల్రాయ్ ఫిబ్రవరిలో వెల్లడించారు. దీనిపై స్పందించిన విల్‌మోర్ ఆ విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, టెక్ దిగ్గజం మస్క్‌పై తమకు గౌరవం, అభిమానం ఉన్నాయన్నారు. 'మేం దేశానికి మద్దతునిస్తాం. దేశాధినేతలకు మద్దతునిస్తాం. వారికి కృతజ్ఞతలు' అని ప్రకటించారు. జనవరిలో ఇద్దరూ కలిసి స్పేస్ వాక్ చేశారు.



సునీత

మీ వ్యాఖ్యలు నిజమే.. తాకట్టులో మహిళల మంగళసూత్రాలు

ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పాలనలో మహిళలు తమ బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. అధికారమిస్తే కాంగ్రెస్ మహిళల మంగళసూత్రాలను లాగేసుకుంటుందంటూ గతేడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఖర్గే..'మీ వ్యాఖ్యలు మీ హయాంలోనే నిజమవుతున్నాయి. మహిళలు తమ బంగారు నగలను తాకట్టుపెట్టు కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి' అని పేర్కొన్నారు. 2019-2024 సంవత్సరాల మధ్యలో దేశంలోని నాలుగు కోట్ల మంది మహిళలు బంగారం తాకట్టు పెట్టి రూ.4.7 లక్షల కోట్ల రుణాలు తీసుకున్నారంటూ తెలిపే కథనాన్ని జత చేశారు. 2024లో తీసుకున్న మొత్తం రుణాల్లో ఇలాంటివి 38 శాతం వరకు ఉన్నాయన్నారు. ఈ ఏడాది బంగారం రుణాలు ఏకంగా 71.3 శాతం మేర పెరిగాయంటూ 2025 ఫిబ్రవరిలో ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాలను కూడా ఆయన ఉటంకించారు. 'నోట్ల రద్దుతో మహిళల ఆస్తులు కరిగిపోయాయి. ఇప్పుడు ద్రవ్యోల్బణం, కుటుంబ నిర్వహణ వ్యయం పెరిగిపోవడంతో మహిళలు అమూల్యంగా భావించుకునే నగలను సైతం తాకట్టుపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని బుధవారం ఎక్స్‌లో ఖర్గే వ్యాఖ్యానించారు. ఆర్థిక పరిస్థితి దిగజారడంతో ద్విచక్ర వాహనాలకు కిస్తీలను సైతం చెల్లించలేని స్థితిలో మధ్య తరగతి కుటుంబాలున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో 2019 తర్వాత ద్విచక్ర వాహనాల విక్రయాలు సైతం తగ్గాయని వివరించారు. టూ వీలర్ రుణాలు 2024 సెప్టెంబర్ వరకు రూ.2 లక్షల కోట్లుండగా, 2025లో ఇది మరో రూ.40 వేల కోట్లు పెరిగిందని చెప్పారు.

హసీనా అప్పగింతపై భారత్ స్పందించలేదు: యూనుస్

ఢాకా: పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని రాసిన లేఖలపై భారత్ నుంచి ఎటువంటి అధికారిక స్పందన అందలేదని ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ చెప్పారు. జన హనన నేరాలకు పాల్పడిన హసీనాతోపాటు ఆమె కుటుంబీకులు, సన్నిహితులు సైతం కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉందని స్పష్టం చేశారు. హసీనా హయాంలో 'హౌస్ ఆఫ్ మిర్రర్స్' అనే కోడ్‌తో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన రహస్య జైళ్లలో చోటుచేసుకున్న దారుణాలు అన్నీఇన్నీ కావని యూనుస్ వ్యాఖ్యానించారు.

రూ.17.29 కోట్ల విలువైన బంగారం, నగదు సీజ్

నటి రన్యా రావు కేసులో పురోగతి

బెంగళూరు: తరచూ గల్ఫ్ దేశాలకు వెళ్తొస్తూ బంగారాన్ని అక్రమంగా భారత్‌కు తీసుకొస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కన్నడ నటి రన్యా రావు కేసులో పోలీసులు దూకుడు పెంచారు. మార్చి మూడో తేదీన బెంగళూరు కెంపె గౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయటికొస్తూ 14.2 కేజీల బంగారంతో పట్టుబడిన రన్యారావును డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) పోలీసులు అదుపులోకి తీసుకోవడం తెల్సిందే. ఆ తర్వాత బెంగళూరులోని విలాసవంత లావెల్లే రోడ్‌లోని రన్యా రావు ఇంట్లో డీఆర్ఐ అధికారులు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో మరో రూ.2.06 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను, రూ.2.67 కోట్ల విలువైన భారతీయ కరెన్సీని స్వాధీ నంచేసుకున్నారు. సోమవారం రాత్రి ఎయిర్‌పోర్ట్ వద్ద స్వాధీనంచేసుకున్న రూ.12.56 కోట్ల విలువైన బంగారంతో కలుపుకుంటే ఈ కేసులో ఇప్పటిదాకా డీఆర్ఐ వర్గాలు రూ.17.29 కోట్ల విలువైన బంగారం, నగదును స్వాధీనంచేసుకున్నాయని డీఆర్ఐ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎయిర్‌పోర్ట్‌లో అతిపెద్ద పట్టివేత

ఇటీవలి కాలంలో బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో 14 కేజీలకుపైబడి ఒకే ఉదంతంలో బంగారాన్ని పట్టుకోవడం ఇదే తొలిసారి అని డీఆర్ఐ వర్గాలు వెల్లడించాయి. ''ఎమిరేట్స్ ఫ్లైట్ దిగొస్తూ బంగారు కడ్డీలను తన దుస్తుల్లో దాచుకుని వాహనంలో వెళ్లిపోతున్న 33 ఏళ్ల మహిళను అరెస్ట్‌చేశాం'' అని ఆర్థిక శాఖ సైతం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఏడాదికాలంలో 30 సార్లు దుబాయ్‌కు..

రన్యా రావు విదేశీ పర్యటనలపై డీఆర్ఐకు ఇటీవల అనుమానాలు పెరిగాయి. తరచూ దుబాయ్‌కు వెళ్తొస్తున్నట్లు వీళ్లకు సమాచారం అందింది. గత ఏడాదికాలంలో రన్యారావు ఒక్క దుబాయ్‌కే 30 సార్లు వెళ్లినట్లు తెలుస్తోంది. గత 15 రోజుల్లో నాలుగుసార్లు వెళ్లి రావడంతో ఆమెపై అనుమానాలు బలపడ్డాయి. విదేశాలకు వెళ్లి తిరిగొచ్చి సమయంలో ఎక్కువసార్లు ఒకే విధమైన దుస్తులను ధరిస్తున్నట్లు డీఆర్ఐ పరిశీలనలో వెల్లడైంది. దీంతో ఆమెపై నిఘా పెట్టిన డీఆర్ఐ పోలీసులు ఎట్టకేలకు ఆమెను పట్టుకున్నారని సంబంధిత అధికారి ఒకరు చెప్పారు. ఘటనాస్థలిలో స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీల్లో చాలా వాటిని ఆమె తాను వేసుకున్న డ్రెస్‌లోపల దాచుకుందని ఒక అధికారి పేర్కొన్నారు.

ప్రత్యేక కేసులా చూడబోం: ప్రభుత్వం

ఘటనపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. '' డీజీపీ కూతురైనా, సీఎం, పీఎం కూతురైనా సరే ఒకేలా కేసు దర్యాప్తు ఉంటుంది. ఈ కేసును ప్రత్యేకంగా చూడబోం'' అని ముఖ్యమంత్రికి న్యాయ సలహాదారు, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏఎస్ పొన్నణ్ణ చెప్పారు. అరెస్ట్ తర్వాత రన్యారావును ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా మార్చి 18వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఆదేశించారు. డీజీపీ కూతురు అనే పరపతిని ఉపయోగించి ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీల నుంచి సులభంగా తరచూ తప్పించుకుంటోందని వార్తలొచ్చాయి.

ఔరంగజేబ్‌ను పొగిడిన ఎస్పీ ఎమ్మెల్యే సస్పెన్షన్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్‌పై పొగడ్తలు కురిపించిన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అబూ ఆసిమ్ అజ్మీపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగే ప్రస్తుత బడ్జెట్ సమావేశాల నుంచి ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం స్పీకర్ ప్రకటించారు. ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన అజ్మీ మంగళవారం..'ఔరంగజేబ్ హయాంలో భారతదేశ సరిహద్దులు అఫ్గానిస్తాన్, మయన్మార్ వరకు విస్తరించాయి. అప్పట్లో ప్రపంచ జీడీపీలో మన జీడీపీ వాటా 24 శాతం వరకు ఉంది. అది భారత్‌కు స్వర్ణయుగమైంది' అని పేర్కొన్నారు. ఔరంగజేబ్, ఛత్రపతి శంభాజీ మహారాజ్ మధ్య జరిగిన యుద్ధాన్ని ఆయన రాజకీయ పోరాటంగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలపై ఉభయసభలు దద్దరిల్లాయి. డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా స్పందించారు. 'అజ్మీ ఉద్దేశ పూర్వకంగానే శివాజీని, శంభాజీని అవమానించారు. ఔరంగజేబ్‌ను పొగిడారు. అటువంటి అజ్మీ ద్రోహి, అసెంబ్లీలో కూర్చునే అర్హత ఆయనకు లేదు' అని నిప్పులు చెరిగారు. 'ఔరంగజేబ్ క్రూరమైన చర్యలను ఎదుర్కొంటూ సంభాజీ ప్రదర్శించిన ధైర్యసాహసాలను వింటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. మతం మార్చుకోవాలంటూ సంభాజీని ఔరంగజేబ్ 40 రోజుల పాటు చిత్రహింసలకు గురిచేశాడు. అతడు హిందువులను మాత్రమే కాదు, ఇతర మతస్తులను సైతం చంపించాడు' అని చెప్పారు. ఔరంగజేబ్‌ను పొగడటం అంటే ఛత్రపతి శివాజీని, ఆయన కుమారుడు సంభాజీని అవమానించడమేనని సభ్యులు ఆరోపించారు. అజ్మీని సస్పెండ్ చేసి, దేశ ద్రోహం కింద కేసు నమోదు చేయాలని అధికార పక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అజ్మీని మిగతా కాలం సమావేశాల నుంచి సస్పెండ్ చేయాలంటూ బుధవారం మంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.



నా వ్యాఖ్యలను వక్రీకరించారు: అజ్మీ

'ఔరంగజేబ్‌ను గురించి నేను చెప్పిన విషయాలన్నీ చరిత్రకారులు, వివిధ రచయితలు పేర్కొన్నవే. శివాజీ, సంభాజీకి ఇతర మహనీయులకు వ్యతిరేకంగా నేనెలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. అయినప్ప టికీ, నా వ్యాఖ్యలు ఎవరికైనా మనస్తాపం కలిగించి ఉంటే వాటిని వెనక్కి తీసుకుంటాను' అని పేర్కొంటూ అజ్మీ ఓ వీడియో విడుదల చేశారు. తను పేర్కొన్న విషయాల్లో ఎలాంటి తప్పు లేకున్నా వాటిని వక్రీకరించారని ఆరోపించారు. 'సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించరాదనే ఉద్దేశంతో అసెంబ్లీ వెలుపల మాట్లాడానని, అయినప్ప టికీ తనను సస్పెండ్ చేశారు' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అజ్మీని మా దగ్గరికి పంపించండి: యూపీ సీఎం యోగి

'ఔరంగజేబ్‌ను ప్రశంసించిన ఎస్పీ ఎమ్మెల్యే అజ్మీని ఉత్తరప్రదేశ్‌కు పంపించండి. ఇటువంటి వాళ్లని ఏం చేయాలో మా రాష్ట్ర ప్రజలకు తెలుసు' అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. ఔరంగజేబ్‌ని హీరో అంటూ పొగిడిన అజ్మీకి దేశంలో ఉండే అర్హతుందా అని ప్రశ్నించారు. అజ్మీ వ్యాఖ్య లపై వైఖరిని వెల్లడించాలని ఎస్పీని డిమాండ్ చేశారు. అజ్మీని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు.

మరో 80 వేల ఉద్యోగాలకు కోత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం వివిధ విభాగాల పునర్వ్యవస్థీకరణ పనుల్లో దూకుడు కొనసాగిస్తోంది. తాజాగా, మాజీ సైనికులకు ఆరోగ్య సేవలను అందించే 'వెటరన్స్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్'పై కన్నేసింది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ శాఖలో పనిచేసే కనీసం 80 వేల ఉద్యోగాలపై కోత వేసేందుకు నిర్ణయించింది. సిబ్బందిలో కనీసం 25 శాతం మంది మాజీ సైనికులే కావడం గమనార్హం. ఇందుకు సంబంధించిన అంతర్గత నివేదిక ఒకటి బయటకు పొక్కింది. 2019 నాటి స్థాయికి అంటే 4 లక్షలకు సిబ్బందిని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెటరన్స్ అఫైర్స్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ క్రిస్టఫర్ సిరెక్ చెప్పారు. వచ్చే ఆగస్ట్ నుంచి సిబ్బంది సంఖ్య తగ్గింపుపై చర్యలు మొదలవుతాయన్నారు.

మస్క్ దోచుకుంటున్నాడు

ట్రంప్ ప్రసంగం సమయంలో డెమొక్రాట్ల ప్లకార్డుల ప్రదర్శన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ తొలిసారిగా కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తుండగా డెమొక్రాట్లు నిరసన తెలిపారు. 'సేవ్ మెడికేడ్', 'వెటరన్స్‌ను రక్షించండి', 'మస్క్ దోచుకుంటున్నా డు' నినాదాలతో ఉన్న నల్ల ప్లకార్డులను ప్రదర్శించారు. గత ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన దానికంటే ఎక్కువ పనులు తమ ప్రభుత్వం 43 రోజుల్లో చేసిందంటూ ట్రంప్ చెబుతుండగా.. ఆ వ్యాఖ్యలు తప్పుడువంటూ 'ఫాల్స్' ప్లకార్డులను ప్రదర్శించారు. డెమొక్రటిక్ సభ్యులు పలువురు నల్ల టీషర్టులు ధరించి సభ నుంచి వాకౌట్ చేశారు. ఇదిలావుండగా, ట్రంప్ ప్రసంగానికి అంతరాయం కలిగించిన టెక్సాస్‌కు చెందిన డెమొక్రాట్ ప్రతినిధి అల్ గ్రీన్‌ను హౌస్ చాంబర్ నుంచి బయటకు తీసుకెళ్లారు.



'వైట్ వాషింగ్' ఇతివృత్తంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రపంచ కుబేరుడు మస్క్, ఇటలీ ప్రధాని మెలానియా తదితర ప్రపంచ నేతల ఫొటోలున్న ప్లేట్లివి. వీటిని యూజీనియో మెరియోన్ రూపొందించారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో బుధవారం అర్కో ఇంటర్నేషనల్ ఆర్ట్ ఫెయిర్‌లో ప్రదర్శనకు ఉంచారు.

యూపీ అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా, పాన్ మసాలాపై నిషేధం

లక్నో: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో గుట్కా, పాన్ మసాలా వాడకాన్ని నిషేధిస్తున్నట్లు స్పీకర్ సతీశ్ మహానా బుధవారం ప్రకటించారు. అతిక్రమించిన వారికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలోనే మంగళవారం ఉదయం ఓ ఎమ్మెల్యే అసెంబ్లీ లోపల పాన్ మసాలాను ఉమ్మి వేస్తున్న దృశ్యం బయటకు వచ్చిన నేపథ్యంలో తీవ్ర అసహనానికి గురైన స్పీకర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఎమ్మెల్యే ఎవరో తనకు తెలుసునని చెప్పిన ఆయన పేరు మాత్రం వెల్లడించలేదు. వెంటనే ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజాప్రతినిధులుగా శుభ్రత పాటించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. బుధవారం ప్రశ్నోత్తరాల అనంతరం ఈ మేరకు స్పీకర్ సతీశ్ ఒక ప్రకటన చేశారు.

సాక్షి ప్లస్
గురువారం। 6-3-2025

24వ రాజ్యాంగ సవరణ ఎప్పుడు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటిసారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది.

ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.



- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 – అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 - వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 - బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/ విచక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ వివక్షలను ఎవరూ పాటించకూడదు.

ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14–18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19–22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25–28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి.

ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం - మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13 – చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు – న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి.

ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

'రతనం' పదానికి ప్రకృతి రూపం?

వ్యాకరణాంశాలు- భాషాంశాలు

మాదిరి ప్రశ్నలు

1. 'అవ్వారల'- పదంలో ఉన్న సంధి?
 1) అత్వసంధి 2) త్రికసంధి
 3) గుణసంధి 4) వృద్ధిసంధి
2. 'పుస్తకాలు' పదాన్ని విడదీసి రాస్తే?
 1) పుస్తకా+లు 2) పుస్తకామ్+లు
 3) పుస్తకము + లు 4) పుస్తక +ఆలు
3. 'రాజ్మహేంద్రవరం' పదంలో ఉన్న సంధి?
 1) జశ్త్వసంధి 2) విసర్గసంధి
 3) అనునాసిక సంధి 4) శ్చుత్వసంధి
4. 'భక్షురాలు' పదాన్ని విడదీసి రాస్తే?
 1) భక్తి + ఆలు 2) భక్త + ఆలు
 3) భక్త+ రాలు 4) భక్షు+ రాలు
5. 'తన్మయం' పదంలో ఉన్న సంధి?
 1) జశ్త్వసంధి 2) అనునాసిక సంధి
 3) విసర్గసంధి 4) వృద్ధిసంధి
6. 'నమోనమః' పదాన్ని విడదీసి రాస్తే?
 1) నమ + నమః 2) నమో+ నమః
 3) నమః + నమః 4) నమోః + నమః
7. 'పయః + నిధి' - కలిపి రాస్తే?
 1) పయన్నిధి 2) పయోనిధి
 3) పయాన్నిధి 4) పయోన్నిధి
8. మీగడ పదాన్ని విడదీసి రాస్తే?
 1) మీ+ కడ 2) మీ + గడ
 3) మీదు + కడ 4) మీదు + గడ
9. 'దొంగభయం' ఏ సమాసం?
 1) షష్ఠీ తత్పురుష 2) పంచమీ తత్పురుష
 3) సప్తమీ తత్పురుష
 4) ద్వితీయ తత్పురుష
10. 'విధాతృనానతి' ఏ సమాసం?
 1) బహువ్రీహి 2) ద్వంద్వసమాసం
 3) షష్ఠీ తత్పురుష 4) ప్రథమాతత్పురుష
11. భారతదేశం, గంగానది- పదాల్లో ఉన్న సమాసం?
 1) ద్వంద్వ సమాసం
 2) సంభావన పూర్వపద కర్మధారయం
 3) షష్ఠీ తత్పురుష
 4) అవ్యయీభావ సమాసం
12. 'ప్రతిదినం, యథాశక్తి' పదాలు ఏ సమాసాలు?
 1) ద్వంద్వ సమాసం
 2) ప్రథమాతత్పురుష
 3) అవ్యయీభావ సమాసం
 4) చతుర్థీ తత్పురుష
13. 'చిగురుకేలు' ఏ సమాసం?
 1) ఉపమాన ఉత్తరపద కర్మధారయం
 2) బహువ్రీహి సమాసం
 3) విశేషణ ఉత్తరపద కర్మధారయం
 4) ఉపమాన పూర్వపద కర్మధారయం
14. 'లేమా! దనుజుల గెలువగలేమా' లోని అలంకారం?
 1) లాటానుప్రాసం 2) ఛేకానుప్రాసం
 3) యమకం 4) ముక్తపదగ్రస్తం
15. 'చుక్కలు తలపూవులుగా అక్కజముగ మేను పెంచియంబర వీధిన్' పాదాల్లో ఉన్న అలంకారం?
 1) ఉత్ప్రేక్ష 2) అతిశయోక్తి
 3) స్వభావోక్తి 4) దృష్టాంతం
16. 'అజ్ఞానాంధకారంలో కూర్చోకుండా, విజ్ఞాన వీధుల్లో విహరించాలి' ఇందులో అలంకారం
 1) రూపకాలంకారం 2) ఉపమాలంకారం
 3) దృష్టాంతం 4) సమాసోక్తి
17. యతిమైత్రి 14వ అక్షరంగా ఉన్న పద్యం ఏది?
 1) శార్దూలం 2) మత్తేభం
 3) ఉత్పలమాల 4) మత్తకోకిల
18. 'భ-జ-స-నల-గగ' అనే గణాలుండే పద్యం
 1) కందం 2) ద్విపద
 3) తేటగీతి 4) ఉత్సాహం
19. 'జీతాలు చాలక ఎన్జీవోలు సమ్మెచేశారు' అనే వాక్యంలో అసమాపక క్రియ
 1) వ్యతిరేక అనంతర్యార్థకం
 2) వ్యతిరేక శత్రర్థకం 3) వ్యతిరేక్త్వార్థకం
 4) వ్యతిరేక తుమున్నర్థకం
20. 'రామకృష్ణారావు ఆమోదముద్ర వేశారు' అనే వాక్యం?
 1) సంయుక్త వాక్యం 2) కర్తరీ వాక్యం
 3) ప్రత్యక్ష వాక్యం 4) అనుకరణ వాక్యం
21. 'రామకృష్ణుడు గురువు, వివేకానందుడు శిష్యుడు' అనే వాక్యాలు?
 1) సంశ్లిష్ట వాక్యాలు 2) సామాన్య వాక్యాలు
 3) క్రియారహిత వాక్యాలు
 4) సందేశ వాక్యాలు
22. 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' అనేది?
 1) సామెత 2) జాతీయం
 3) నానుడి 4) సూక్తి
23. 'మీరు రావచ్చు', 'అతడు పోవచ్చు' అనే వాక్యాలు?
 1) అప్యర్థక వాక్యాలు
 2) వికల్పార్థక వాక్యాలు
 3) అనుమత్యర్థక వాక్యాలు
 4) సందేహాత్మక వాక్యాలు
24. 'గొడ్డలిపెట్టు' అనే జాతీయానికి అర్థం?
 1) బలమైన కోరిక 2) విఘాతం
 3) ఆధారం 4) ఆటంకం
25. 'మిరుమిట్లు గొలుపు' అనేది?
 1) పదబంధం 2) పొడుపు కథ
 3) జాతీయం 4) నానుడి
26. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అనేది?
 1) జాతీయం 2) సామెత
 3) పద బంధం 4) నానుడి
27. 'రికామి' అనే పదానికి అర్థం?
 1) తెలివైన వాడు 2) సోమరిపోతు
 3) అజ్ఞాని 4) మందబుద్ధి



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

28. 'అయుతం' పదానికి అర్థం?
 1) వేయి 2) నూరు
 3) పది వేలు 4) ఆయుధం
29. 'ఇనుడు' పదానికి అర్థం?
 1) ఇంద్రుడు 2) సూర్యుడు
 3) చంద్రుడు 4) బ్రహ్మ
30. 'ఉపద్రవం' అంటే అర్థం?
 1) ఉప్పునీరు 2) ద్రావకం
 3) ఆపద 4) కల్తీ ద్రవం
31. 'కైరవం' పదానికి అర్థం?
 1) కడియం 2) పెద్దధ్వని
 3) తెల్ల కలువ 4) ప్రదక్షిణ
32. 'సుడిగములు' పదానికి అర్థం?
 1) మెట్టెలు 2) అందెలు
 3) పూలు 4) గాజులు
33. 'అనృతం' పదానికి నానార్థం కానిది?
 1) అసత్యం 2) స్వచ్ఛత
 3) వాణిజ్యం 4) సేద్యం
34. కాలం పదానికి నానార్థం?
 1) చావు 2) నలుపు
 3) సమయం 4) పైవన్నీ
35. 'గుణం' పదానికి నానార్థం?
 1) బాణం 2) విల్లు
 3) వింటినారి 4) దూది
36. 'ఫలం' పదానికి నానార్థం కానిది?
 1) పండు 2) పుష్పం
 3) ప్రయోజనం 4) సుఖం
37. 'ఉపాధ్యాయుడు' పదానికి వికృతి రూపం?
 1) పంతులు 2) గురువు
 3) ఒజ్జ 4) మార్గదర్శి
38. 'కైత' పదానికి ప్రకృతి రూపం?
 1) కయిత 2) కేత
 3) కవిత 4) కవనం
39. 'జాతర' పదానికి ప్రకృతి రూపం?
 1) యాతర 2) జాత్ర
 3) యాత్రా 4) యాత్ర
40. 'రాజ్ఞి' పదానికి వికృతి రూపం?
 1) రాజి 2) రాణి
 3) రాగిణి 4) రాగి
41. 'రతనం' పదానికి ప్రకృతి రూపం?
 1) రత్నం 2) జత్నం
 3) వజ్రం 4) రమ్యం
42. 'విజ్ఞానం' పదానికి వికృతి రూపం?
 1) విగ్గేనం 2) విన్నేణం
 3) విన్నాణం 4) విన్యాణం
43. 'అన్నం' పదానికి పర్యాయ పదం?
 1) బోనం 2) కూడు
 3) బువ్వ 4) పైవన్నీ
44. 'కప్ప' పదానికి పర్యాయపదం?
 1) మండుకం 2) భేకం
 3) దర్దురం 4) పైవన్నీ
45. 'వాంఛ, తృష్ణ, ఈప్సితం' పదాలకు పర్యాయపదాలు?
 1) అయిష్టం 2) దాహం
 3) కోరిక 4) చిరాకు
46. 'వనిత, మహిళ, స్త్రీ', పదాలకు పర్యాయ పదం?
 1) సహనం 2) కనికరం
 3) వలువ 4) పడతి
47. 'గృహం' పదానికి పర్యాయ పదం?
 1) ఇల్లు 2) గేహం
 3) నికేతనం 4) పైవన్నీ
48. 'చీకటి' పదానికి పర్యాయ పదం?
 1) తమం 2) అంధకారం
 3) ఇరులు 4) పైవన్నీ
49. 'భవుని భార్య'అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
 1) లక్ష్మీ 2) సరస్వతి
 3) భవాని(పార్వతి) 4) గౌరి
50. 'హరి' పదానికి పర్యాయ పదం?
 1) విష్ణువు 2) కోతి
 3) సింహం 4) పైవన్నీ
51. 'ముత్యపు చిప్ప' పదానికి పర్యాయ పదం?
 1) శంఖం 2) శుక్తి
 3) గుర్రపు సుడి 4) పైవన్నీ
52. 'నాశనం లేనిది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
 1) నశ్వరం 2) అక్షరం
 3) శాశ్వతం 4) ఆకాశం
53. 'తిథి, వార నియమాలు లేక ఇంటికి, భోజనానికి వచ్చేవాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
 1) అతిథి 2) యాచకుడు
 3) భిక్షకుడు 4) బంధువు
54. 'వెడల్పైన ముఖం గలది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
 1) పులి 2) సింహం
 3) ఎలుగుబంటి 4) ఏనుగు
55. 'ఉంగరం' పదానికి ప్రకృతి రూపం?
 1) అంగుష్ఠం 2) కంకణం
 3) అంగుళీయకం 4) ఆభరణం
56. ప్రతి పాదంలో ఆరు ఇంద్ర గణాలు తర్వాత రెండు సూర్య గణాలు ఉండే పద్యం?
 1) తేటగీతి 2) ఆటవెలది
 3) ద్విపద 4) సీసం
57. 'య-వ-ర-ల'ను ఏమంటారు?
 1) వృద్ధులు 2) యణ్ణులు
 3) గుణాలు 4) వక్రతమాలు
58. వాడుగొట్టె, నీవు డక్కరి, నిజం దెలిపి పదాల్లోని సంధి?
 1) నుగాగమ సంధి 2) సరళాదేశ సంధి
 3) గసడదవాదేశ సంధి
 4) ప్రాతాది సంధి
59. 'బంగారం, హొన్ను, కాంచనం, కనకం' పర్యాయ పదాలు ఉన్న పదం?
 1) సింగారం 2) సువర్ణం
 3) రజితం 4) అయం
60. 'బండ జింకలు' పదానికి అర్థం?
 1) తుమ్మెదలు 2) కందిరీగలు
 3) గబ్బిలాలు 4) అడవి జింకలు

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 2	5) 2
6) 3	7) 2	8) 3	9) 2	10) 3
11) 2	12) 3	13) 4	14) 3	15) 2
16) 1	17) 2	18) 1	19) 3	20) 2
21) 3	22) 2	23) 3	24) 2	25) 3
26) 2	27) 2	28) 3	29) 2	30) 3
31) 3	32) 4	33) 2	34) 4	35) 3
36) 2	37) 3	38) 3	39) 4	40) 2
41) 1	42) 3	43) 4	44) 4	45) 3
46) 4	47) 4	48) 4	49) 3	50) 4
51) 4	52) 2	53) 1	54) 2	55) 3
56) 4	57) 2	58) 3	59) 2	60) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ బీసీ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా పులే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో బీసీ బాలబాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీడబ్ల్యూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 ద్వారా ఎంపికచేస్తారు.

- మొత్తం సీట్ల సంఖ్య: 6,600.
- అర్హత: విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి 2024-25 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లాల్లోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
- వయసు: ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 12 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక విధానం: అర్హులైన అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ(అనాథ/మత్స్యకార) ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా..
- దరఖాస్తులకు చివరితేది: 15.03.2025.
- వెబ్‌సైట్: ttps://mjpapbcwreis.apcfss.in/

సీఎస్ఐఆర్-సీఎల్ఆర్ఐ, చెన్నైలో స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టులు

చెన్నైలోని సీఎస్ఐఆర్–సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్–సీఎల్ఆర్ఐ) స్టాఫ్ కార్ డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 03.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మోటార్ మెకానిజంలో అనుభవంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- వయసు: 27 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా..
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.03.2025.
- వెబ్‌సైట్: http://clri.org/

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com


సైన్య సహకార పద్ధతిని మొదటగా అంగీకరించిన నిజాం రాజు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ





హైదరాబాద్ రాజ్యంలో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి దేశవ్యాప్తంగా సుమారు 560 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. వాటిలో హైదరాబాద్ సంస్థానం అతిపెద్దది, ముఖ్యమైంది. ఇది దక్కన్ పీఠభూమి మధ్యన, సుమారు 8300 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉండేది. మొగల్ సామ్రాజ్య పాలనా కాలంలో దక్కన్ సుబేదార్‌గా పనిచేసిన అసఫ్ జా నిజాం ఉల్‌ముల్క్ క్రీ.శ. 1724లో స్వతంత్రంగా హైదరాబాద్ రాజ్య పాలన ప్రారంభించాడు. నిజాం రాజులు 224 ఏళ్ల పాటు హైదరాబాద్‌ను పాలించారు.

అసఫ్‌జాహీ రాజుల నిరంకుశాధికారం వల్ల ప్రజలు అనేక రకాలుగా దోపిడీకి గురయ్యారు. పాలనా బలహీనతలు, వారసత్వ తగాదాల వల్ల వీరు ఆంగ్లేయులకు లోబడి పాలన సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. క్రీ.శ.1800లో బ్రిటిష్ గవర్నర్ జనరల్ వెల్లస్లీ 'సైన్య సహకార పద్ధతి'ని ప్రకటించాడు. దీనికి మొట్టమొదటగా హైదరాబాద్ రాజు నిజాం అలీఖాన్ అంగీకారం తెలిపాడు. దీంతో నిజాం రాజులపై ఆంగ్లేయుల పెత్తనం విపరీతంగా పెరిగిపోయింది. అంతేకాకుండా నిజాం సంస్థానానికి చెందిన ప్రజల్లో జాతీయోద్యమ భావాలు ఆలస్యంగా బీజం పోసుకున్నాయి. దీనికి ప్రజల నిరక్షరాస్యత, ఆంగ్లేయ రెసిడెంట్, నిజాంల అణిచివేత ధోరణి, నిజాం తాబేదారులైన దొరల భయానక ఆధిపత్యం ప్రధాన కారణం.

1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావం - పరిణామాలు

భారతదేశ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందిన 1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావం హైదరాబాద్ సంస్థానంపై కూడా పడింది. 1857 మే 10న ఢిల్లీ సమీపంలోని మీరట్‌లో ప్రారంభమైన సిపాయిల తిరుగుబాటు అనతికాలంలోనే దేశమంతా విస్తరించింది. ఉత్తర భారతదేశంలో సిపాయిల తిరుగుబాటు ఫలితాలు హైదరాబాద్ సంస్థానంలోని బ్రిటిష్ వ్యతిరేకులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. భారతదేశంలో మొగల్ సామ్రాజ్య పాలన పునఃస్థాపన కోసం కృషి చేయాలని ఉద్బోధిస్తూ ప్రధానంగా మసీదుల్లో సాగిన ఉద్రేకపూరిత ప్రసంగాలు సంస్థానంలోని ముస్లింలను బాగా ఆకర్షించాయి. మౌల్వీ ఇబ్రహీం, మౌల్వీ అల్లా ఉద్దీన్ ఈ విధమైన ప్రచారంతో ప్రజలను ముందుకు నడిపారు. ఈ పవిత్ర యుద్ధం (సిపాయిల తిరుగుబాటు) పేరును 'జిహాద్'గా ప్రకటించి, ఇందులో పాల్గొనని వారిని ముస్లిం, హిందూ వ్యతిరేకులుగా పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానంలో బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న డేవిడ్‌సన్ సిపాయిల తిరుగుబాటుకు మద్దతిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని నిజాంను ఆదేశించాడు. హైదరాబాద్ రాజ్య దివాన్ (ప్రధానమంత్రి) అయిన మొదటి సాలార్‌జంగ్ బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లను తీవ్రంగా అణచివేశాడు. హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న ఔరంగాబాద్‌లో ఈ తిరుగుబాటు ప్రభావం ఎక్కువగా ఉండేది. 1857 జూన్‌లో ఇక్కడి తిరుగుబాటుదారులను నిజాం సైన్యం నిర్బంధించింది. జూలై నాటికి సికింద్రాబాద్‌లో ఈ తిరుగుబాటు తీవ్రమైంది. శివచరణ్, మాధవదాస్, అనూప్‌సింగ్, కృష్ణదాస్, లాల్‌ఖాన్, ఖాదర్‌ఖాన్ లాంటి పదకొండు మంది తిరుగుబాటుదారులను సాలార్‌జంగ్ పట్టుకొని శిక్షించాడు. మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి వచ్చి హైదరాబాద్‌లో అల్లర్లు సృష్టిస్తున్నారనే నెపంతో జమేదార్ చిడ్డాఖాన్, అతడి అనుచరులను (బుల్దానా నుంచి తప్పించుకొని వచ్చిన సైనికులు) సాలార్‌జంగ్ నిర్బంధించాడు. వారిని బ్రిటిష్ రెసిడెంట్ వద్దకు పంపాడు. 1857 జూలై 17న ప్రజలు అధిక సంఖ్యలో మక్కామసీద్ వద్ద గుమిగూడి బంధించిన వారిని విడుదల చేయాలని, లేకపోతే రెసిడెన్సీపై దాడిచేసి వారిని విడిపిస్తామని హెచ్చరించారు. కోపగించిన సాలార్‌జంగ్ అంగ్ల సైన్యాన్ని రెసిడెన్సీకి కాపలాగా పెట్టి, అరబ్బు సైనికుల సహాయంతో మక్కామసీద్ ప్రాంతంలోని ప్రజలను చెదరగొట్టించాడు. అయినప్పటికీ అదే రోజు రాత్రి అయిదు వందల మంది రోహిల్లా ముస్లింలు తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్ నాయకత్వంలో రెసిడెన్సీపై దాడికి ప్రయత్నించారు. రెసిడెన్సీ సమీపంలోనే స్వగృహాలు కలిగి ఉన్న అబ్బాన్ డబ్బా సాహెబ్, షావుకారు జై గోపాల్‌దాస్ వీరికి సహకరించారు. ఆంగ్లేయ సైన్యం తుపాకీ గుళ్లకు రోహిల్లాలు అనేక మంది మరణించారు. ఈ విధంగా తిరుగుబాటును అణచివేశారు. తప్పించుకుపోయిన తుర్రేబాజ్‌ఖాన్‌ను 'కుర్బాన్ అలీ' సహాయంతో సాలార్‌జంగ్ 'తుప్రాన్' గ్రామం వద్ద పట్టుకున్నాడు. తర్వాత అతడిని బ్రిటిషర్ల తుపాకీకి బలిచేశాడు. మౌల్వీ అల్లా ఉద్దీన్‌కు ద్వీపాంత వాస శిక్ష వేసి అండమాన్‌కు పంపించారు. ఆయన 1884లో అక్కడే మరణించారు.

ఆంగ్లేయాధికారులు ప్రథమ స్వాతంత్ర్య సమరంలో నిజాంతో పాటు ప్రధానంగా అతడి దివాన్ సాలార్‌జంగ్ పాత్రను మెచ్చుకొని 1860 జూలైలో షోలాపూర్ సంస్థానాన్ని బహుమతిగా ఇచ్చారు. అంతకుముందు నిజాం రాజు నుంచి స్వాధీనం చేసుకున్న రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను తిరిగి ఇచ్చేశారు. దీంతోపాటు నైజాం తీర్చాల్సిన 50 లక్షల రూపాయల రుణాన్ని కూడా రద్దు చేశారు. బ్రిటిష్ రాణి 'స్టార్ ఆఫ్ ఇండియా' అనే పేరుతో ఒక కొత్త బిరుదును సృష్టించి నిజాం రాజు అఫ్జల్ ఉద్దౌలాకు బహూకరించారు. రెసిడెంట్ డేవిడ్‌సన్ ఈ బిరుదు జ్ఞాపికను 1861 నవంబరు 25న నిజాంకు అందించాడు. ఈ చర్య నైజాంను కించపరిచేదేగానీ, గౌరవించేది కాదని హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. 1857 సిపాయిల తిరుగుబాటు విఫలమవడం వల్ల భారతదేశంలో ఆంగ్లేయులకు, హైదరాబాద్‌లో వారి అనుచరులుగా సాలార్‌జంగ్, నిజాం రాజులకు తిరుగులేని ఆధిపత్యం దక్కింది.

బేగం బజార్ కుట్ర కేసు-1862

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ తిరుగుబాటుదారుల్లో పీష్వా నానా సాహెబ్ (దొండెపంత్) ప్రముఖులు. కాన్పూర్‌లో జరిగిన తిరుగుబాటులో నానా సాహెబ్, ఆయన స్నేహితుడు తాంతియా తోపే (రామచంద్ర పాండురంగ్) ప్రధాన పాత్ర పోషించారు. పీష్వా నానా సాహెబ్‌కు సన్నిహిత బంధువుగా చెప్పుకున్న రావ్ సాహెబ్ (రామారావు) 1862 మార్చిలో బేగం బజార్ (హైదరాబాద్)లో షావుకారు కిషన్‌లాల్‌కు చెందిన బాలముకుంద్ బాగ్‌లో ఆశ్రయం పొందారు. రావ్ సాహెబ్ బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటుకు పథకం రచించి మోర్తాడ్ (ఆర్మూర్ తాలుకా, నిజామాబాద్) జమీందార్లయిన రుక్మారెడ్డి, రాజారెడ్డితో పాటు అమృతలాల్ (కంటోన్మెంట్ రాజు) సోదరుడైన తుల్జారామ్, షావుకారు పురాణ్‌మల్, రామ్‌రతన్‌జీ మద్దతును సంపాదించారు. సాలార్‌జంగ్ దీన్ని గమనించి పీష్వా రావ్ షాహెబ్, ఆయన దివాన్ కిషన్ రావ్, మద్దతుదార్లపై బేగం బజార్ కుట్ర కేసు పెట్టాడు. వారిపై రకరకాల శిక్షలు, జరిమానాలు విధించి వారి పథకాన్ని భగ్నం చేశాడు. ఈ పరిణామం 1857 తిరుగుబాటుకు కొనసాగింపుగా హైదరాబాద్ సంస్థానంలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటుగా ప్రసిద్ధి చెందింది.

ఇతర తిరుగుబాట్లు

బ్రిటిషర్ల పాలనపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేక ప్రభావం, తదనంతర పరిణామాల ఫలితాలు హైదరాబాదీ సంస్థాన ప్రాంతాలపై పడ్డాయి. దీని వల్ల చిన్న చిన్న తిరుగుబాట్లు జరిగాయి. వాటిలో ముఖ్యమైనవి.

- రాజా వెంకటప్ప నాయక్ తిరుగుబాటు (షోలాపూర్)
- రంగారావు పట్వారీ తిరుగుబాటు (కొలాస్)
- గోండుల తిరుగుబాటు (ఆదిలాబాద్, రామ్‌జీ గోండ్ నాయకత్వంలో)
- రోహిల్లాల పితూరీ (నిర్మల్, ఆదిలాబాద్)
- భిల్లుల తిరుగుబాటు (అజంతా, ఔరంగాబాద్)
- చింతా భూపతి, సన్యాసి భూపతి తిరుగుబాటు (గోల్కొండ ప్రాంతం)

మాదిరి ప్రశ్నలు

1. 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు ఉన్న నిజాం రాజు ఎవరు?
   ఎ) మీర్ ఉస్మాన్ అలీఖాన్
   బి) సాలార్‌జంగ్
   సి) నిజాం అలీఖాన్
   డి) అఫ్జల్ ఉద్దౌలా
2. మొదటి సాలార్‌జంగ్ అసలు పేరేమిటి?
   ఎ) తురాబ్ అలీఖాన్ బి) లాయక్ అలీ
   సి) మీర్ మహమ్మద్ అలీ
   డి) నవాబ్ నిజాం అలీఖాన్
3. హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్‌పై జరిగిన దాడికి నాయకత్వం వహించిందెవరు?
   ఎ) తుర్రేబాజ్ ఖాన్ బి) మౌల్వీ ఇబ్రహీం
   సి) రావ్ సాహెబ్ పీష్వా
   డి) జమేదార్ చిడ్డాఖాన్
4. 1857 సిపాయిల తిరుగుబాటు సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న అధికారి ఎవరు?
   ఎ) జనరల్ పాట్రిక్ బి) కల్నల్ డేవిడ్‌సన్
   సి) కల్నల్ కింగ్స్ ఫోర్డ్
   డి) జనరల్ మెట్‌కాఫ్
5. అసఫ్‌జాహీ వంశస్థుల పూర్వీకులు ఏ దేశానికి చెందినవారు?
   ఎ) అఫ్ఘానిస్తాన్ బి) మంగోలియా
   సి) టర్కీ డి) ఏదీకాదు
6. బేగంబజార్ కుట్ర కేసు(1862)లో ప్రధాన నిందితుడిగా ఎవరిని పేర్కొన్నారు?
   ఎ) పీష్వా నానాసాహెబ్
   బి) షావుకారు కిషన్ లాల్
   సి) రామారావ్
   డి) జమిందార్ రుక్మారెడ్డి
7. బుల్దానా నుంచి వచ్చిన తిరుగుబాటుదారులకు నాయకత్వం వహించినవారెవరు?
   ఎ) తుర్రేబాజ్‌ఖాన్
   బి) మౌల్వా అల్లా ఉద్దీన్
   సి) చిడ్డాఖాన్ డి) అబ్దుల్ ఖయ్యూం
8. హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెంట్‌పై ఏ రోజున దాడి జరిగింది?
   ఎ) 1857 జూలై 17 బి) 1857 మే 10
   సి) 1857 జూన్ 29
   డి) 1857 ఏప్రిల్ 13
9. 1857 భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ పరిణామాల వల్ల హైదరాబాద్ సంస్థానంలో ప్రధానంగా కలిగిన మార్పు ఏది?
   ఎ) నిజాం రాజు నిరంకుశత్వం పెరిగింది
   బి) పాలనలో సాలార్‌జంగ్ ప్రభావం విపరీతంగా పెరిగింది
   సి) బ్రిటిష్ రెసిడెంట్ ఆధిపత్యం పెరిగింది
   డి) సంస్థానంపై బ్రిటిష్ రాణి ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది
10. హైదరాబాద్ సంస్థానంలో 1857 సిపాయిల తిరుగుబాటు ప్రభావాలను అణచివేసిన ఘనత ఎవరికి దక్కింది?
   ఎ) నిజాం రాజు అఫ్జల్ ఉద్దౌలా
   బి) కల్నల్ డేవిడ్‌సన్
   సి) మొదటి సాలార్‌జంగ్
   డి) ఆర్మీ జనరల్ లాయక్ అలీ
11. నానా సాహెబ్ ఎక్కడ జరిగిన తిరుగుబాటుకు నాయకత్వం వహించారు?
   ఎ) హైదరాబాద్ బి) ఔరంగాబాద్
   సి) లక్నో డి) కాన్పూర్
12. రోహిల్లా ముస్లింల పితూరీ ఎక్కడ జరిగింది?
   ఎ) షోలాపూర్ బి) ఉస్మానాబాద్
   సి) నిర్మల్ డి) గోల్కొండ
13. ఆదిలాబాద్‌లో జరిగిన గోండుల తిరుగుబాటుకు నాయకత్వం వహించినవారెవరు?
   ఎ) రామ్‌జీ గోండ్
   బి) తుల్జారామ్ గోండ్
   సి) వెంకటప్ప నాయక్
   డి) పట్వారీ రంగారావ్
14. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించింది ఎవరు?
   ఎ) మహాత్మా గాంధీ బి) అంబేద్కర్
   సి) అబ్రహాం లింకన్ డి) కారల్ మార్క్స్
15. ఔరంగాబాద్‌లో అశ్వికదళాల సైనిక తిరుగుబాటును నిర్వహించినవారు?
   ఎ) మౌల్వీ ఇబ్రహీం, మౌల్వీ అల్లా ఉద్దీన్
   బి) జమేదార్ అమీర్‌ఖాన్, డఫేదార్ ఫిదా అలీ
   సి) తుర్రేబాజ్ ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్
   డి) జమేదార్ చిడ్డాఖాన్, అబ్బాన్ డబ్బా సాహెబ్

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) బి; 5) సి; 6) సి; 7) సి; 8) ఎ; 9) బి; 10) సి; 11) డి; 12) సి; 13) ఎ; 14) డి; 15) బి.

When does a person become insolvent?

BANK EXAMS

BANKING AWARENESS



1. A draft issued by the bank has been lost by the payee. He sends a letter to the issuing bank to stop payment. Bank will:
   a) Note caution and will advice the payee to contact purchaser of the draft
   b) Not act on the request
   c) Stop payment
   d) Performs no action
   e) None of the above
2. Mutual funds are required to be registered with:
   a) AMFI b) SEBI
   c) IBA d) RBI
   e) NABARD
3. What is Yield Curve Risk?
   a) It is a line of graph plotting the yield of all maturities of a particular instrument
   b) Yield curve changes its slope and shape from time to time
   c) Yield curve can be twisted to the desired direction through the intervention of RBI
   d) All of the above
   e) None of the above
4. The biggest international financial centre in the world:
   a) Frankfurt b) Geneva
   c) London d) New York
   e) Paris
5. The expansion of BIFR, in the context of the Indian Industry is:
   a) Board for Industrial and Financial Reconstruction
   b) Bureau for Industrial and Financial Reconstruction
   c) Board for Investment and Financial Reconstruction
   d) Bureau for Investment and Financial Reconstruction
   e) None of these
6. The largest financial conglomerate of India is:
   a) HDFC Bank
   b) ICICI Bank
   c) IFCI d) SBI
   e) None of these
7. Under which of the following methods of depreciation, amount of depreciation varies every year?
   a) Written Down Value Method
   b) Straight Line Method
   c) Amount of depreciation does not vary on year to year basis
   d) Either a or b
   e) None of these
8. Usually, the validity period of an Income Tax Refund Order is:
   a) 1 month b) 2 months
   c) 3 months d) 6 months
   e) 4 months
9. Which of the following is true about "White Card"?
   a) It is related to companies producing milk products
   b) It does not carry on its face, the brand of the issuer
   c) It is meant to covert blank money into the economy
   d) It is a card that provides white money
   e) None of these
10. First bank in India to launch its interactive banking service through Dish TV:
   a) HSBC b) ICICI Bank
   c) HDFC Bank d) Axis Bank
   e) None of these
11. First Indian Governor of the RBI:
   a) C.D. Deshmukh
   b) Sachindra Ray
   c) S. Mukherjee
   d) D.I.G. Patel
   e) None of the above
12. CGTMSE (Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises) has been set up on the recommendations of:
   a) Narashimham Committee
   b) Ghosh Committee
   c) Chore Committee
   d) Kapoor Committee
   e) Krishna Committee
13. The primary relationship between the banker and the customer is that of:
   a) Trustee and beneficiary
   b) Debtor and Creditor
   c) Principal and agent
   d) Lesser and lessee
   e) None of these
14. A debt becomes time-barred after:
   a) One year
   b) Two and a half year
   c) Three years
   d) Five years
   e) Six years
15. In the matter of handling bills of exchange for collection, the relationship between customer and the bank is:
   a) Trustee and the beneficiary
   b) Principal and agent
   c) Bailor and bailee
   d) All of the above
   e) None of the above
16. Hypothecation is:
   a) A transaction of conditional sale
   b) A legal transaction whereby goods may be made available as security for a debt
   c) Transfer of ownership by the borrower to the lender
   d) Either a or b
   e) None of the above
17. Payment of a cheque may be countermanded by the ___
   a) Payee b) Drawer
   c) True owner d) Drawee
   e) None of these
18. J.S. Verma Committee Report relates to:
   a) Strengthening of weak banks
   b) Corporate Governance
   c) Bank Mechanization
   d) All of the above
   e) None of the above
19. A Usance Bill when presented for acceptance has to be accepted/ dishonoured within:
   a) 24 hours b) 36 hours
   c) 48 hours d) 60 hours
   e) 26 hours
20. Invoice is a:
   a) Accounting document
   b) Legal document
   c) Commercial document
   d) All of the above
   e) None of the above
21. When does a person become insolvent?
   a) When he left with no property of his own
   b) When he declares an insolvent by the Court
   c) When he terminates from a job he was holding
   d) When he declares himself to be an insolvent
   e) None of the above
22. When two parties make an arrangement to exchange future cash flows, it is called:
   a) Options b) Arbitrage
   c) Swap d) Futures
   e) None of the above
23. Which of the following banks enjoys the reputation of being at the top in market capitalization among all the private banks?
   a) ICICI Bank
   b) HDFC Bank
   c) Axis Bank d) Yes Bank
   e) IDBI Bank
24. "Claused Bill of Landing" is one which indicates:
   a) Remaining constant in project cost
   b) Escalation in Project Cost
   c) Decrease in Project Cost
   d) All of the above
   e) None of the above

KEY

1) a	2) b	3) d	4) c
5) a	6) d	7) a	8) c
9) b	10) c	11) a	12) d
13) b	14) c	15) b	16) b
17) b	18) a	19) c	20) c
21) b	22) c	23) b	24) b

విద్య, ఉద్యోగ సమాచారం

టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్‌లో వివిధ ఉద్యోగాలు

తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా(టీహెచ్‌డీసీ) జనరల్ మేనేజర్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్-01, మేనేజర్-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** గరిష్ఠ వయోపరిమితి జనరల్ మేనేజర్‌కు 55 ఏళ్లు, మేనేజర్‌కు 45 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.1,20,000 నుంచి రూ.2,80,000. మేనేజర్ పోస్టుకు రూ.80,000 నుంచి రూ.2,20,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.03.2025.
- **వెబ్‌సైట్:** https://thdc.co.in/

ఎన్‌ఎస్‌ఐసీఎల్, ఢిల్లీలో 29 మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని ది నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎస్‌ఐసీఎల్).. వివిధ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 29.
- **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్-04, డిప్యూటీ జనరల్ మేనేజర్-04, చీఫ్ మేనేజర్-03, డిప్యూటీ మేనేజర్-18.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఈ/బీటెక్, సీఏ/సీఎంఏ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాలు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, చీఫ్ మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- **వయసు:** జనరల్ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 41 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 38 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 31 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
- **దరఖాస్తులకు చివరితేది:** 07.03.2025.
- **వెబ్‌సైట్:** https://www.nsic.co.in/

నిట్ మిజోరాంలో 13 నాన్ టీచింగ్ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) మిజోరాంలోని వివిధ విభాగాల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 13.
- **పోస్టుల వివరాలు:** సూపరింటెండెంట్-01, జూనియర్ ఇంజనీర్-02, టెక్నికల్ అసిస్టెంట్-02, టెక్నీషియన్-05, జూనియర్ అసిస్టెంట్-02, ఆఫీస్ అటెండెంట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఈ, బీటెక్, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు సూపరింటెండెంట్, జూనియర్ ఇంజనీర్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.35,400, టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.21,700, ఆఫీస్ అటెండెంట్‌కు రూ.18,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా..
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025.
- **వెబ్‌సైట్:** www.nitmz.ac.in/

సీఈఆర్‌సీ, న్యూఢిల్లీలో వివిధ ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(సీఈఆర్‌సీ) వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్(ఇంజనీర్)-01, రీసెర్చ్ ఆఫీసర్(ఇంజనీర్)-05, రీసెర్చ్ అసోసియేట్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్, ఎనిమిదో అంతస్తు, టవర్-బి, వరల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజి నగర్, న్యూఢిల్లీ-110029 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.03.2025.
- **వెబ్‌సైట్:** www.cercind.gov.in/